క్రాంతి

లోపలి పేజీల్లో...

తెలంగాణ మార్చ్ ...... 7
బొగ్గు కుంభకోణం ...... 12
జీవ వైవిధ్య సదస్సు ...... 16
కామ్రేడ్ కిరణ్ ఇంటర్వ్యూ ...... 21
స్టోలీపిన్ నిర్బంధం ......మధ్య పేజీ
కా. విజయ్ చరిత్ర ...... 36
రోహిణీ ప్రసాద్‌కు నివాళి ...... 39
చైనాలో స్త్రీ విముక్తి ...... 40
'సంక్షేమ' పథకాలు ...... 44
ఎన్‌కౌంటర్లన్నీ బూటకమే ...... 48
పోరాటాలు, సభలు ...... 49
వేణుగోపాల్‌రావుకు నివాళి ...... 51

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 36 సంచిక: 3 నవంబర్ - డిసెంబర్ 2012 వెల: పది రూపాయలు

# చిల్లర వర్తకాన్ని కాపాడుకుందాం

# ఎఫ్.డి.ఐ.లకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఇక ఇప్పుడు బహుళ బ్రాండ్ల చిల్లర వర్తకంలో 51 శాతం, బ్రాడ్‌కాస్టింగ్‌లో 74 శాతం, విద్యుత్తు, విమానయాన రంగాల్లో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐలు) ప్రవేశించి ప్రజల జీవితాలను శాసిస్తాయి, ఇక్కడ ఇప్పుడు గుత్త పెట్టుబడులు రాజ్యం చేస్తాయి!

దేశ సార్వభౌమాధికారాన్ని, దేశ భద్రతను గాలికి వదిలేసి సంస్కరణల పేరుతో దేశాన్ని సామ్రాజ్యవాదులకు తెగనమ్ముతున్న ప్రభుత్వ దళారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం వచ్చింది.

ఒకవైపు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరవడం, లాభాలొచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా అమ్మివేయడం, అవినీతితో ప్రభుత్వ ఖజానా కొల్లగొట్టడం మరోవైపు ప్రజలపై గ్రీన్‌హంట్ దాడులు చేయడం. ఇదీ పాలకుల విధానం. ఒక్కో విషయాన్ని చూద్దాం.

సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం బహుళ బ్రాండ్ల చిల్లర వర్తకంలో 51 శాతం ఎఫ్‌డిఐ వాటాకు అనుమతి ఇస్తూ కీలక ఆర్థిక సంస్కరణలను ప్రకటించింది. విమానయానం, ప్రసారాలు, విద్యుత్తు రంగంలో కూడా ఎఫ్‌డిఐ వాటాలు పెంచింది. అలాగే లాభాలతో నడుస్తున్న నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలు నాల్కో, హిందూస్తాన్ కాపర్, ఆయిలిండియా, ఎంఎంటిసిలలో వాటాల అమ్మకానికి ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల సంఘం అనుమతించిన ఈ సంస్కరణల వలన ఆర్థిక రాజకీయ రంగాలలో దేశ భవిష్యత్తు ఏ విపరిణామాలకు దారితీస్తుందో ఆందోళన కలిగిస్తోంది.

2009లో అమెరికాలో వచ్చిన సామ్రాజ్యవాద సబ్‌ప్రైమ్ సంక్షోభంతో మహామాంద్యం తీవ్రమై, కొనసాగుతుండడం వలన నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి కూరుకొనిపోయింది. ఎన్ని చిట్కా వైద్యాలు చేసినా, ఎక్కడెక్కడి ద్రవ్యం తెచ్చిపోసినా ఆ సంక్షోభ గుండం నిండడం లేదు. అన్ని వనరులు, సంపదలు ఆ గుండంలో పడి మాడిమసైపోతున్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో మన దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా భారీయెత్తున విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచి ఆహ్వానించడం వలన అసలే తగ్గిన మన దేశ ఆర్థికాభివృద్ధి రేటు మరింతగా దిగజారిపోయే ప్రమాదంలో పడుతుంది.

రెండవసారి అధికారంలోకి వచ్చిన యుపిఏ ప్రభుత్వం వరుసగా అనేక పెద్ద పెద్ద కుంభకోణాల్లో లక్షల కోట్ల రూపాయల ఖజానాను కొల్లగొట్టింది. రెండవ తరం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయడంలో భాగంగా విదేశీ మదుపుకు (ఎఫ్‌డిఐకు) అనుమతించడం ద్వారా మన దేశ సంపదనంతా విదేశాలకు దోచిపెట్టడానికి చూస్తున్నది. దీని వలన ధరలు మరింతగా పెరిగిపోతాయి. కనీసావసరాలు పూర్తిగా ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి. ద్రవ్యోల్బణం మరింతగా పెరిగి సామాన్య ప్రజల జీవితం అగాధాల్లోకి జారిపోతుంది. 1991లో ఎల్‌పిజి

విధానాలను భారతదేశంలో అమలులోకి తెచ్చిన నాటి పరిస్థితులతో పోల్చి ఈ సంస్కరణలను పాలకులు సమర్థించుకుంటున్నారు. గత 22 సంవత్సరాలుగా ప్రపంచ బ్యాంకు సంస్కరణలు ప్రజల రక్తాన్ని పీల్చుకుతింటున్న విషయం ప్రజలకు ప్రత్యక్ష అనుభవమే.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవేశించడం వలన భారత ఆర్థిక రంగంలో అద్భుతాలు జరుగుతాయని పాలకులు అవాస్తవాలను, అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఇప్పటి వరకు దేశీయ పెట్టుబడుల ప్రాజెక్టులు ప్రజల జీవితాలను మంచిగా ప్రభావితం చేశాయి. విదేశీ పెట్టుబడులు మాత్రం అన్ని దేశాల్లోను వ్యతిరేక ప్రభావాన్నే వేశాయి.

ఎఫ్‌డీఐ వచ్చిన ప్రతి దేశాన్ని పరిశీలిస్తే (అవి ఆర్థికాభివృద్ధి జరిగిన చోటికే వచ్చాయి.) స్థిరమైన అభివృద్ధి, అధిక సంఖ్యలో వినియోగదారులు, ఆ గుత్త సంస్థలకు సేవ చేసే దళారీలు వున్నప్పుడే అవి ప్రవేశించాయి. ఆయా దేశాల సంపదలను కొల్లగొట్టి, ఖాళీ చేసి వెళ్ళాయి. లాటిన్ అమెరికా, ఆగ్నేయ ఆసియా దేశాల అనుభవాలు, గుణపాఠాలు మనకు తెలిసినవే. మనకు విదేశీ మారక ద్రవ్యం అవసరం. అందుకే ఎఫ్‌డీఐలను ఆహ్వానిస్తున్నాం అని పాలకులు అంటున్నారు. మనకు విదేశీ మారక ద్రవ్యం ఎంత అవసరం? మనకు దిగుమతులు ఎంత అవసరమో ఆ మేరకు విదేశీ మారక ద్రవ్యం ఉంటే సరిపోతుంది. మన ఉత్పత్తులను పెంచి, ఎగుమతి చేయడం ద్వారా దానిని సంపాదించవచ్చు. అంతేగాని దేశ ఆర్థిక వ్యవస్థ జవజీవాలకు, రాజకీయంగా సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేలా ఎఫ్‌డీఐలను అనుమతించనక్కర లేదు.

ఇప్పటికే మన దేశంలో ఉన్న బహుళ జాతి సంస్థల పని తీరును, వివరాలను పరిశీలిస్తే ఎఫ్‌డీఐ మోసకారీ విధానాలు బయటపడుతాయి. విలీనాలు, టేకోవర్లు కూడా ఎఫ్‌డీఐ లెక్కల్లోనే చూపిస్తుంది మన ప్రభుత్వం. ఉదాహరణకు రిలయన్స్ బేసిన్‌లో 30శాతం వాటా-720 కోట్ల డాలర్లకు అంటే దాదాపు 40 వేల కోట్ల రూపాయలకు విక్రయిస్తే అది ఎఫ్‌డీఐ ఖాతాలో పడింది. అలాగే కెర్రీఫోర్ సంస్థ వాటాలను వేదాంత కంపెనీకి విక్రయించిన మొత్తం, తన టెలిఫోన్ వ్యాపారాన్ని ఓడాఫోన్ సంస్థకు విక్రయించిన మొత్తం కూడా ఎఫ్‌డీఐ గానే లెక్కల్లోకి చేరింది. దీనివల్ల సర్కార్‌కు పైసా పన్ను రాదు. దేశానికి రవ్వంత కూడా ప్రయోజనం లేదు. ఆ బడా కంపెనీలకు మాత్రం పన్నుల నుండి మినహాయింపు వచ్చింది. ఎఫ్‌డీఐకి కొత్తగా అనుమతినిచ్చిన నెల రోజుల్లోనే 90 వేల కోట్ల రూపాయలు ఎఫ్‌డీఐ జాబితాలో చేరి పోయినట్లు చెప్పే ఈ లెక్కలు చూస్తే ఎఫ్‌డీఐ వల్ల విదేశీ మారక ద్రవ్యం వస్తుందని చెప్పడం మాయ చేయడం తప్ప మరొకటి కాదు. విదేశీ మారక ద్రవ్యం రావడానికి ఎఫ్‌డీఐలు గ్యారెంటీ కాదు. పైగా ఆ సంస్థలు పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువగానే సంపదను లాభాలు, డివిడెంట్లు, ఇతర పద్దుల రూపంలో తరలించుకు పోతున్నాయి. వాస్తవంగా ప్రపంచ జీడీపీలో ఎఫ్‌డీఐల వాటా రెండు శాతం మాత్రమే. మరో పక్క విదేశీ బడా సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో స్థానిక సంస్థలకు పరపతి సమస్యలు తలెత్తుతున్నాయి.

లాభాలు వచ్చినంత కాలం ప్రజల రక్త మాంసాలు పిండుకు తిన్న బహుళ జాతి సంస్థలు, నష్టాలు మొదలు కాగానే చడీచప్పుడు కాకుండా పెట్టుబడులను ఉపసంహరించుకుని వెనక్కి పోతాయి. ప్రపంచ బ్యాంకు, గుత్త సంస్థలు కలిసి ప్రపంచంలో అనేక వెనుకబడిన దేశాలను కొల్లగొట్టి, ఆకలి చావులతో అల్లాడే (సోమాలియా లాంటి) వాటిని సృష్టించాయి. మల్టీబ్రాండ్ రీటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులకు అనుమతినిచ్చేందుకు గత సం॥రం నవంబరులోనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పుడు పెద్ద ఎత్తున నిరసన ఆందోళనలు వెల్లువలా దేశమంతా వ్యాపించాయి. ఇది రీటైల్ వర్తకుల సమస్య మాత్రమే కాదు. దేశ ప్రజలందరి సమస్య. ప్రజల నిత్యావసరాల మార్కెట్ సమస్య. ఈ దేశపు స్వావలంబనతో కూడిన సమస్య. ముఖ్యంగా భారతదేశ గ్రామీణ ఆర్థిక రంగంతో ముడిపడిన సంస్కృతి, సంప్రదాయ సంబంధాల మనుగడ సమస్య. ఇది డబ్బు సంబంధ విషయం మాత్రమే కాదు. పట్టణపేద, గ్రామీణ బడుగు బతుకుల, చిన్న సన్నకారు రైతుల నిత్య జీవిత సంబంధంలోని అంశం. అందుకే దేశం నలుమూలలా ప్రజలు సంఘటితమై ప్రతిఘటించారు. ఆ వ్యతిరేకతకు భయపడి కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆ నిర్ణయాన్ని నిలిపివేసింది. మరల ఇప్పుడు కొత్త సంస్థలతో పాలక వర్గాలు కుమ్మక్కై కూడబలుక్కుని ఒక కోటి ఇరవై లక్షల చిల్లర దుకాణాల్లో ఉపాధి పొందుతున్న నాలుగు కోట్ల కుటుంబాలకు ఉపాధి లేకుండా చేయడానికి బరితెగించాయి. రక్తమాంసాలు ధారపోసి, ప్రజలు సృష్టిస్తున్న శ్రమ సంపదను వస్తు రూపేణా, ధన రూపేణా పంచుకు తినేందుకు దళారీ పాలకులు విదేశీ గుత్త సంస్థలతో కలిసి సిద్ధమయ్యారు. మరోసారి ప్రజలు తీవ్ర నిరసన, ఆందోళన చేపట్టాల్సిన అవసరం ఉంది.

దేశంలో ప్రతి సం॥ 25 లక్షల కోట్ల రూపాయలపైగా చిల్లర వర్తకంలో వ్యాపారం జరుగుతోంది. ఇది త్వరలోనే (6 సం॥లలో) 69 లక్షల కోట్ల రూపాయలవ్యాపారంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఇంత పెద్ద మార్కెట్‌ను కైవసం చేసుకోవడానికి వాల్‌మార్ట్, టెస్కో, కెర్రీఫోర్, ఐకియా వంటి విదేశీ ప్రైవేటు బహుళ జాతి సంస్థలు ఒత్తిడి తెచ్చాయి. మలి విడత సంస్కరణల వేగాన్ని పెంచడం కోసం ఒబామాతో సహ అందరూ ప్రయత్నించి సఫలం అయ్యారు. మన పాలకులు వారి ప్రభావానికి, ప్రలోభాలకు తలొగ్గారు.

భారతదేశం చిల్లర వర్తకంలో ఎఫ్‌డిఐకి అనుమతించడం వలన అమెరికా ఎన్నికల్లో ఒబామాకు వచ్చే ఓట్ల రేటింగ్ గణనీయంగా పెరిగిందని విశ్లేషకులు తేల్చిచెప్పారు. ఒబామా ముంబాయి పర్యటనకు తెరవెనుక రాజకీయం ఇదేనన్నారు.

ఇప్పటి మన అనుభవాలను పరిశీలిస్తే, 2010లో అమెరికా 2,700 కోట్ల డాలర్లను భారత్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇందులో వాల్‌మార్ట్, టిస్కో, కెర్రీఫోర్ లాంటి అమెరికన్ బహుళ జాతి సంస్థలు ప్రధానం. ప్రపంచంలో అత్యధిక దుకాణాలు ఉన్నది మన

దేశంలోనే. ఒక కోటీ ఇరవై లక్షల దుకాణాలు నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అందుకే అందరి దృష్టి భారత్ చిల్లర వ్యాపారం మీద పడింది.

బహుళ జాతి సంస్థలు నాణ్యత సరిగా లేదని గిట్టుబాటు ధరను చెల్లించవు. ఒచ్చిన కాడికే పంటను తెగనమ్ముకొని రైతులు దివాళా తీయాల్సిందే. ఆహార పంటలను నిరుత్సాహ పరిచి వ్యాపార పంటలను ప్రోత్సహించడంతో ఆహార భద్రత లేకుండా పోతుంది. నిత్యావసర సరుకులపై గుత్తాధిపత్యం కొనసాగడంతో విదేశీ వస్తువులు చొరబడి స్వదేశీ ఉత్పత్తులు, వృత్తులు, జీవనం నాశనమవుతాయి. ఎన్నో సామాజిక సమస్యలు తలెత్తుతాయి.

విజయవాడ వాల్‌మార్ట్ కారణంగా 200 మందికి మాత్రమే ఉపాధి లభించి వేలాది మందికి ఉపాధి లేకుండా పోయింది. ఎఫ్‌డీఐ వస్తే ఉద్యోగాలు కుప్పలు తెప్పలుగా వస్తాయనేది బూటకమని తేలిపోయింది. వాల్‌మార్ట్ లాంటి బహుళ జాతి సంస్థల ప్రవేశంతో చిల్లర వ్యాపారాలు దెబ్బతిన్నాయి. హాకర్లు జీవనం కోల్పోయారు. బ్రాండ్ సరుకు వచ్చి దేశీయ సరుకుల్ని పక్కకు నెట్టివేసింది. మొత్తం మార్కెట్‌ను చేజిక్కించుకుని గుత్తాధిపత్యంతో ధరలు పెంచి అధిక లాభాలు కాజేయాలన్న వాల్‌మార్ట్ వ్యూహం ఫలించింది.

ఈ సంస్కరణలు గత 22 సం॥రాలుగా మన దేశంలో అమలవుతున్నాయి. విత్తన రంగంలో 80 శాతం పెట్టుబడులు మోన్‌శాంటో, సిన్‌జెంట, టుఫాంట్, కార్గిల్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళి విత్తనాల ధరలు పది రెట్లు పెరిగాయి. ఎరువులు, క్రిమి సంహారక మందులు కూడా వీరి నియంత్రణలోకే వెళ్ళి పోయాయి. ఫ్యూచర్ ట్రేడింగ్, ఫార్వర్డ్ ట్రేడింగ్ జరిపి (2011లో 95 లక్షల కోట్ల రూ॥ల వ్యాపారం చేశారు.) పెద్ద ఎత్తున లాభాలు గడిస్తున్నారు.

ధనిక దేశాల్లో రైతులు ఒకటి, రెండు శాతం మాత్రమే వుంటారు. మన దేశంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారు 69శాతం మంది ఉన్నారు. ఇందులో 86శాతం సన్న, చిన్నకారు రైతులు. నాలుగు కోట్ల మంది చిల్లర వ్యాపారులతో పాటు వీరంతా జీవన భద్రతను కోల్పోతారు. పేద రైతులు వ్యవసాయం నుండి నెట్టివేయబడి ఉపాధి కోల్పోతారు. పెద్ద ఎత్తున నిరుద్యోగ సైన్యం పెరుగుతుంది. రూపాయి విలువ తగ్గి, ధరలు పెరిగి బతుకు భారమై పోతుంది. మన దేశ ఆర్థిక పరిస్థితి గుత్త పెట్టుబడిదారుల నియంత్రణలోకి వెళ్ళి పోతుంది భారతదేశం రాజకీయంగా సంక్షుభిత పరిస్థితుల్లోకి జారిపోతుంది.

చిల్లర వ్యాపారానికి సంబంధించి 'ఆయా రాష్ట్రాలు ఇష్టం వుంటే అనుమతించవచ్చు. వద్దనుకుంటే నిరాకరించవచ్చు' అని కేంద్రం మాట్లాడడంతో రాష్ట్రాల హక్కులను కాపాడినట్లు కనబడుతోంది. కాని వాస్తవంలో కాంగ్రెస్‌కు బలమైన, అనుకూలమైన రాష్ట్రాల్లో ముందుగా అమలుచేసి మిగిలిన రాష్ట్రాల్లో నయానా భయానా ఒక క్రమంలో అమలు చేసే పథకం ఉంది. ప్రతిపక్షాల నుండి తీవ్ర వ్యతిరేకత రాకుండా చీలదీసే ఎత్తుగడ ఇది. ప్రస్తుతం తమిళనాడు, పశ్చిమ బెంగాల్, గుజరాత్ లాంటి రాష్ట్రాలు కొన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నాయి.

చిల్లర వ్యాపారాల విషయంలో విదేశీ బహుళ జాతి సంస్థలకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది. 1) పది కోట్ల రూపాయలపెట్టుబడి పెట్టాలి. 2) మూడు సంవత్సరాల లోపల మౌలిక సదుపాయాలు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కల్పించి అభివృద్ధి చేయాలి. 3) పది లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లోనే సెంటర్ ఉండాలి. 4) ముప్పయి శాతం స్థానిక చిన్న, మధ్య రకపు ఉత్పత్తులు కొనాలి 5) రైతాంగానికి సహకరించే విధంగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి 6) పెట్టుబడిలో 50 శాతం గ్రామీణ రంగంలో పెట్టాలి అనే కొన్ని ఆంక్షలు పెట్టినా అవి అమలుకావడం ఆచరణ సాధ్యమా? ప్రజలకు లాభాలుంటాయని, ఉద్యోగాలు వస్తాయని గిట్టుబాటు ధర వస్తుందని, మార్కెట్ అనుకూలత పెరుగుతుందని చెప్పడానికి స్వదేశీ పాలకులకు సిగ్గనిపించడం లేదు. ఈ దేశ పాలకులకు ఇక్కడి ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల లేని శ్రద్ధ, బాధ్యత విదేశీయులకు అదీ ప్రపంచాన్ని పీల్చుకుతింటున్న బహుళ జాతి సంస్థలైన రాబందులకు వుంటుందని విజ్ఞత ఉన్నవాళ్లెవరైనా విశ్వసిస్తారా? ఈ పాలకులు కనీసం ఈ ఆంక్షల్ని అమలు చేయగలరా? మన న్యాయస్థానాలకు ఆ సత్తా ఉందా? లేదని, సాధ్యం కాదని (భోపాల్, సెజ్ ల్లాంటి) గత చరిత్ర చెబుతూన్న సత్యం. సామ్రాజ్యవాదుల పాద సేవలో తలమునకలైన మన పాలకులు ఆ పని చేయరు. చేయలేరు. చేయడం వారి అభిమతం కూడా కాదు.

చిల్లర వ్యాపారం (మల్టీ బ్రాండ్ రిటైల్) రంగంలో 51 శాతం వాటాకు అనుమతినిచ్చిన కేంద్ర ప్రభుత్వం బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో కూడా విదేశీ సంస్థలకు గతంలో ఉన్న వాటాలను పెంచింది. టివి ఛానెళ్లు, ఎఫ్ఎం రేడియో సర్వీసులు గతంలో ఉన్న 26 శాతం వాటాను అలానే కొనసాగిస్తున్నా గతంలో 49 శాతం వాటా ఉన్న నాలుగు రంగాల్లో 1) డైరెక్టు టు హోమ్ (డిటిహెచ్) 2) మల్టీ సర్వీసు ఆపరేషన్లు (ఎంఎస్ఓ) 3) హెడ్స్ అండ్ ఇన్ ది స్కై (హెచ్ఐటిఎస్) 4) కేబుల్ టివి సర్వీసులలో ఏకత్వం పేరిట 74 శాతం వాటా అమ్మివేశారు.

## బ్రాడ్ కాస్టింగ్

బ్రాడ్ కాస్టింగ్‌లో విదేశీ ప్రైవేటు గుత్త సంస్థల ప్రవేశం భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలకు విఘాతం కల్గిస్తుంది. ఇప్పటికే సామ్రాజ్యవాద విష సంస్కృతి ప్రజల మెదళ్ళను మొద్దు బార్చి స్వార్థ సంకుచిత అరాచక ప్రవృత్తిని ప్రేరేపిస్తుంది. ఇప్పుడు 74 శాతం వాటాలు వారికి అమ్మడం ద్వారా పూర్తి నియంత్రణ వారి చేతిల్లోకే పోతుంది. భారత దేశపు సుసంపన్నమైన సంస్కృతి, నీతి వర్తన, విలువలు చరిత్ర అట్టడుగు పొరల్లోకి చేరిపోతాయి. పశ్చిమ దేశాల విశృంఖలత అవినీతి, విష సంస్కృతి రాజ్యమేలుతాయి. మన పాలకుల దళారీ సంస్కృతికి గోరీ కట్టక

పోతే దేశానికి తీవ్ర నష్టం కలుగుతుంది. భూస్వామ్య, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజా సంస్కృతి పరిరక్షణకు పూనుకోవాలి. మన బ్రాడ్ కాస్టింగ్ సంస్థల్లోకి విదేశీ చొరబాటును అడ్డుకోవాలి. ఇది నాలుగు వర్గాల ప్రజల తక్షణ కర్తవ్యం.

## పవర్ ట్రేడింగ్

పవర్ ట్రేడింగ్ (విద్యుత్తు) రంగంలోకి 49 శాతం ఎఫ్‌డిఐకి అనుమతి ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే విద్యుత్తు సామాన్యుడికి అందుబాటులో లేని స్థితి. విద్యుత్తు కొరత, అధిక చార్జీలు రైతాంగాన్ని దెబ్బతీస్తున్న పరిస్థితుల్లో ప్రైవేటీకరణ మరిన్ని కష్టాల్లోకి గెంటివేయడం తప్ప మరొకటి కాదు. విద్యుత్ ధరలు అధికంగా పెరగడంతో సామాన్య ప్రజలకు 'మార్కెట్ కరెంట్' అందుబాటులోకి రావడం దుర్లభమే. విద్యుత్ పంపుసెట్లపై ఆధారపడిన మధ్య తరగతి రైతుల వ్యవసాయ పరిస్థితి దినదిన గండమే. రైతుల ఆత్మహత్యలు మరింతగా పెరుగుతాయి. విద్యుత్ ఉత్పత్తిలో అవకతవకలతో పాటు, అణు విద్యుత్ ప్రమాదాలకు, విద్యుత్ సంక్షోభానికి దారితీసే పరిస్థితులు నెలకొంటున్నాయి.

## ఏవియేషన్

గతం నుండి విమానయాన రంగంలో 49 శాతం ఎఫ్‌డిఐకి అనుమతినిస్తున్నారు. కాని విదేశీ విమానయాన సంస్థలకు అనుమతించలేదు. ఇప్పుడు తాజా నిర్ణయాల్లో వాటికి కూడా 49 శాతం వాటాకు కేంద్రం అనుమతించింది. ఈ మధ్య భారత విమానయాన రంగంలో తీవ్రమైన ద్రవ్య సంక్షోభం, అక్కడి పరిణామాలు అందరికీ తెలిసినవే. ఇప్పుడు పూర్తిగా ప్రైవేటు, విదేశీ సంస్థల చేతుల్లోకి చేర్చి అక్కడి ఉద్యోగుల సంక్షేమానికి, దేశ భద్రతకు ప్రమాదం తెచ్చి పెడుతున్నారు మన పాలకులు.

గతంలో విదేశీ విమానయాన సంస్థలకు అనుమతినివ్వకుండా దేశ భద్రతకు ప్రాధాన్యతనిచ్చారు. ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాలు నాటో కూటమిగా ప్రపంచ దేశాల మీద దురాక్రమణ దాడులు చేస్తున్న నేపథ్యంలో, టెర్రరిస్ట్ వ్యతిరేక దాడుల పేరుతో డ్రోన్ దాడుల పరంపర కొనసాగిస్తున్న పరిస్థితులలో, 21వ శతాబ్దపు వైమానిక యుద్ధ తంత్రాన్ని పరిశీలించకుండా భారత పాలకులు, దళారీతనంతో విదేశీ విమానయాన సంస్థలకు అనుమతినివ్వడం ఇప్పుడు ఎంత ప్రమాదాన్ని తెస్తుందో దేశ భద్రతకు, ప్రజల జీవనానికి ఎంత ప్రమాదం కానుందో అర్థమవుతుంది. భారత దేశ అంతర్గత విషయాలు సామ్రాజ్యవాద శక్తులకు అర్థం కాకుండా జాగ్రత్త పడాలి. కీలక రంగాల్లోకి విదేశీ బహుళజాతి సంస్థలను అనుమతించకూడదు. ఆకాశ మార్గాన్ని, వాయు మండలాన్ని సామ్రాజ్యవాదులకు పూర్తిగా అప్పగించి, దేశ భద్రతకు ముప్పు తెస్తున్న మన పాలకుల దళారీ దోపిడీ వర్గ స్వభావాన్ని దేశ భక్త ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో ఖండించాలి.

## నాలుగు పిఎస్‌యులలో వాటాల అమ్మకం

వీటికి తోడు లాభాలు తెచ్చిపెడుతున్న మన పబ్లిక్ రంగం సంస్థలను కూడా క్రమంగా ప్రైవేటుపరం చేసేందుకు దారిని సుగమం చేస్తూ వాటిలో నుండి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని చూస్తున్నది. వేల కోట్ల రూ॥ల వాటాలను ప్రైవేటు సంస్థలకు, అమ్మకానికి ప్రకటనలిచ్చారు. ఈ సం॥ ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను 30 వేల కోట్ల రూపాయల మేరకు అమ్మివేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. గత సం॥ 40 వేల కోట్ల రూ॥లు టార్గెట్ పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వివరాలు ఇలా ఉన్నాయి : హిందూస్తాన్ కాపర్‌లో 9.59 శాతం అమ్మివేయదల్చుకున్నారు. ఆయిల్ ఇండియాలో 2010లో 8.38 శాతం అమ్మారు. ఇప్పుడు 10 శాతం అమ్మాలనుకుంటున్నారు. ఎన్ఎంటిసిలో గతంలో 90 శాతం అమ్మారు. ఇప్పుడు మిగిలిన 9.33 శాతం అమ్మదల్చుకున్నారు. నాల్కోలో గతంలో 87.15 శాతం అమ్మారు ఇప్పుడు మిగిలిన 12.13 అమ్మివేస్తున్నారు. నైవేలి లిగ్నైట్స్, రైట్స్ కంపెనీలలో వాటాలను కూడా విక్రయించేందుకు పథకాలు వేస్తున్నారు. ఆ కంపెనీలు స్టాక్ మార్కెట్‌లోకి వెళ్లే పనిని వేగిరపరచాలని చిదంబరం (ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి) అధికారులకు సూచనలిచ్చాడు. మన భూమిలో దొరికే రాగి, చమురు, అల్యూమినియం ఇతర ఖనిజ సంపదలు ఇక విదేశీ బహుళజాతి సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంటాయి.

ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల ఫలితంగా ద్రవ్యోల్బణం క్రమంగా ఊపందుకుని, ఆర్థికాభివృద్ధి రేటు సుడిగుండంలో పడుతోంది. జిడిపి క్రమంగా క్షీణించిపోతోంది. రీటైల్ మార్కెట్ ధరలు మంటలు పుట్టిస్తున్నాయి. ఇప్పుడే సామాన్యుడికి తిండి దొరకని పరిస్థితి. బడాపెట్టుబడిదారుల ఆస్తులు పెరిగే ఆర్థికాభివృద్ధి రేటును పక్కనబెట్టి అసలు లెక్కలు తీస్తే ప్రభుత్వ లెక్కల బండారం బయటపడుతుంది. ఇప్పుడింకా బంగారం ధరలు, డాలర్ విలువ, సెన్సెక్సు సూచి విపరీతంగా పెరగవచ్చు. అంటే రూపాయి విలువ మరింత పతనమవుతుందన్న మాట. ఇక జిడిపి విషయానికి వస్తే 2002-03 ఆర్థిక సం॥లో 5.2 శాతం ఉంది. పది సం॥ల తర్వాత ఇప్పుడు 2012లో ఆ స్థితికి దిగజారింది. భవిష్యత్తు ఇంకా కునారిల్లవచ్చుంటున్నారు. ఇప్పటికే ఒక లక్ష 40 వేల కంపెనీలు మూలపడ్డాయి. అటువంటివి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 23 వేల 284 ఉన్నట్లు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో కూడా మన దేశ రాజకీయ పార్టీల ఎన్నికల ఎజెండాలో సీట్ల రాజకీయాలు, స్వార్థ లాభాపేక్ష తప్ప మరేమీ లేదు. దేశ భద్రత, అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఖజానా నుండి ఎంత కొల్లగొట్టినా, ఎంత అవినీతి జరిగినా, అధికార దుర్వినియోగం చేసినా ఫరవాలేదు. ఎందుకంటే, కుంభకోణాల్లో ఉన్న పాలకులకు ఈ న్యాయస్థానాల విచారణ తంతు గట్టి విశ్వాసాన్ని ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వంతో ఉంటే మాత్రం ఏమీ శిక్ష పడదు. ఒకవేళ అన్నీ వికటించినా కేసు విచారణ జరిగి శిక్షపడడానికి సుదీర్ఘ కాలం

పడుతుంది. ఇదీ మన న్యాయ వ్యవస్థ దుస్థితి.

కేంద్రంలో కాంగ్రెస్ గద్దె దిగాలి అనేది బిజెపి ఏకైక నినాదం, అనుసరిస్తున్న ఒకే ఒక విధానం కూడా. మధ్యంతరానికి సిద్ధమేనని సుష్మా స్వరాజ్ ప్రకటించింది కూడా. దేశ భద్రతకు మన్‌మోహన్ సింగ్ ప్రమాదకరం అని యశ్వంత్‌సింగ్ ఒక్కడే తేల్చి వ్యాఖ్యానించాడు. అవినీతి విషయాల్లో సిబిఐ విచారణ వలన ఫలితం లేదని చెప్పారు. బిజెపి, వామపక్షాలు, జెడి (యు), బిజెడి, టిడిపిలతో పాటు సంకీర్ణంలో ఉన్న డిఎంకె, టిఎంసి, ఏఐడిఎంకెలు కూడా నిరసన వ్యక్తం చేసి సెప్టెంబర్ 20న దేశవ్యాపిత బంద్‌ను విజయవంతం చేశాయి. ప్రజలు విస్తృతంగా సహకరించారు. అయితే జెడి (యు) బీహార్‌ను ప్రత్యేకతగా గుర్తిస్తే మద్దతునిస్తానని ప్రకటించింది. మాయావతి (బిఎస్‌పి), ములాయం సింగ్ (ఎస్‌పి)లు కాంగ్రెస్‌ను సమర్థించే విషయంలో ముందే ఉన్నాయి. మమతా బెనర్జీ కేంద్రం నుండి మంత్రుల్ని ఉపసంహరించుకుంది. డిఎంకె, ఏఐడిఎంకెలు నువ్వా నేనా అనే స్థితి ప్రధానం తప్ప దేశ భవిష్యత్తు వారి లక్ష్యం కాదు. మూడవ ఫ్రంట్‌కు ఆధారం కనబడడం లేదు. ఇవన్నీ ఎన్నికల లెక్కలు, సీట్ల లెక్కలు. ప్రజా రాజకీయాలు కాదు. ఈ పరిస్థితుల్లో ప్రజల విప్లవ రాజకీయాలు అన్నింటినీ శాసించాల్సి ఉంది.

'దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆర్థిక వృద్ధి ఉరకలు వేయడానికి చేసిన కీలక నిర్ణయం ఎఫ్‌డిఐకి అనుమతి. కొత్త ఉద్యోగాలు కుప్పలు తెప్పలుగా వస్తాయి. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రజలంతా మద్దతు నివ్వాలి' అని ప్రధాని మన్మోహన్ సింగ్ సెప్టెంబర్ 9న ఒక ప్రకటన విడుదల చేశాడు. ప్రజల కష్టాలు పెరిగినా, రైతులపై అదనపు భారం పడినా, వ్యవసాయ ఉత్పాదక వ్యయం పెరిగినా గాని కంపెనీలకు మాత్రం నష్టాలు తగ్గుతాయన్నాడు. బడా పెట్టుబడిదారులు లాభపడుతారు. ప్రజల సమస్యలు అంటే పెట్టుబడిదారుల సమస్యలేనని ప్రధాని మన్మోహన్‌సింగ్ ఉవాచ.

ఈ భారీ సంస్కరణలకు ప్రజలు వ్యతిరేకంగా స్పందించారు. పారిశ్రామిక వర్గాలు గొప్పగా కీర్తించాయి. డీజిల్ ధర పెంచి, వంట గ్యాస్‌కు పరిమితి విధిస్తూ ప్రకటన చేసిన 24 గంటల తర్వాత ఎఫ్‌డిఐకి అనుమతిస్తూ నిర్ణయించడం సాహసమే. అందుకే ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి, దేశం సాధించిన పది సం॥ల సంస్కరణల ఫలితాన్ని, భవిష్యత్తులో రాగల ఆర్థికాభివృద్ధిని ప్రజల మెదళ్లలోకి చొప్పించడానికి వంద కోట్ల రూ॥లు ఖర్చు చేసి అబద్ధాల ప్రచార పథకాన్ని అమలు చేస్తున్నారు. పిఎంఓ విడుదల చేసిన 10 సం॥లలో ప్రభుత్వ ఆర్థిక సంస్కరణల ఫలితాలు ఇలా వున్నాయి: 1) 7.7 కోట్ల మంది బ్యాంకు అకౌంట్లు తెరిచారు 2) 3.4 కోట్ల మంది కాంక్రీట్ స్లాబ్‌లు వేసుకున్నారు. 3) 6 కోట్ల మంది విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. 4) 3.7 కోట్ల మంది ఎల్‌పిజి కనెక్షన్లు తీసుకున్నారు. 5) 13.7 కోట్ల మంది టెలిఫోన్ కనెక్షన్లు తీసుకున్నారు. ఆహా! ఏమి లెక్కలు! ఇదా అభివృద్ధి! ఇవా సంస్కరణల ఫలితాలు! ఏ ప్రజల అభివృద్ధి లెక్కలు చెబుతున్నారు మన పాలకులు. ఎగువ మధ్య తరగతి, ధనిక వర్గాల ప్రజలకు ఏవో కొన్ని అవకాశాలు పెరిగినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందినట్లేనా?

ఈ పది సం॥లలో ఆకలి, దారిద్ర్యం పెరిగి ఆకలి చావులు, అనారోగ్య మరణాలు, రైతుల ఆత్మహత్యలు, ధరలు, అరాచకం పెరిగాయి. అవినీతి పెరిగింది. నిర్బంధ విధానాలు, నల్ల చట్టాలు వచ్చాయి. స్కూళ్లు హాస్టళ్లు మూసివేశారు. విద్య, వైద్యం ప్రైవేటుపరం చేశారు. నిరసన ప్రదర్శనల మధ్యనే భూకబ్జాలు, రాజకీయ హత్యలు చేసిన పాలకవర్గ నిర్వాకాలను ప్రచార లెక్కల్లో చెబితే వంద కోట్ల మంది ప్రజలు ఎంత పీడన, వేదన అనుభవించారో స్పష్టమవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్ ధరలు పెంచి, నాలుగు కోట్ల చిల్లర వర్తకుల ఉపాధిని దెబ్బతీసి, లక్షల కోట్ల రూ॥ల ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి, లాభాలొచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి దేశాన్ని వల్లకాడుగా మార్చివేస్తున్నందుకు, పాలకులు బడా వ్యాపారుల విదేశీ బహుళ జాతి సంస్థల కోసం దేశాన్ని బలిపెడుతున్నందుకు ప్రజలు ఈ సర్కార్‌కు మద్దతు ఇవ్వాలని మన్మోహన్ సింగ్ కోరుతున్నాడు. 2008లో అణు ఒప్పందం సమయంలో అనుసరించిన ఎత్తుగడలతోనే పాలకవర్గాల మధ్య చీలికలను తెచ్చి ములాయం సింగ్, శిబూసోరేన్ లాంటి పచ్చి అవకాశవాదులను తయారుచేసుకుని తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోవాలని కుట్రలు చేస్తున్నారు.

2012 డిసెంబర్ శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో ఓటింగ్‌కు వీలు కల్పించే నిబంధన కింద జరిగిన చర్చలో ఎఫ్‌డిఐకి అనుమతిపై విస్తృత చర్చ జరిగింది. చర్చల అనంతరం జరిగిన ఓటింగ్‌లో పీడిత ప్రజలకు, దేశ ప్రయోజనాలకు భిన్నంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎలా సాధికారత సాధించగలదో, సామ్రాజ్యవాదానికి, దోపిడీవర్గాలకు ఎలా సేవ చేయగలదో నిరూపించుకుంది.

ఎఫ్‌డిఐకి అనుమతినివ్వాలనే ప్రజా వ్యతిరేక విధానానికే 30 ఓట్లు అధికంగా వచ్చాయి. సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్‌వాది పార్టీలు కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యాయి.

మన దేశ అంతరంగిక భద్రతకు మావోయిస్టులు/వామపక్ష తీవ్రవాదం ప్రధాన ప్రమాదం అన్నాడు మన్‌మోహన్ సింగ్. దేశాన్ని సామ్రాజ్యవాద దేశాల బహుళ జాతి సంస్థలకు తెగనమ్మి, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి, కోట్ల మంది ఉపాధిని దెబ్బతీసింది ఎవరు? ప్రజల కోసం ప్రాణాలిచ్చిన మావోయిస్టులు ప్రమాదకారులా? భారత దేశ అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాదం ప్రధాన ప్రమాదం అని, వామపక్ష తీవ్రవాదం కేన్సర్ లాంటిదని, దానిని నిర్మూలించాలని 'నీతులు' చెప్పిన ప్రధాని, పాలకపక్షాలు, 'దేశాన్ని కొల్లగొడుతున్నవారిని' ఏమంటారో చెప్పాలి. గ్రామీణ పునాది నుండి దేశాన్ని ఆర్థికంగా రాజకీయంగా చైతన్యవంతం చేస్తూ దేశ సంక్షేమం కోసం, సార్వభౌమత్వం కోసం, సాధికారత సాధించేందుకు విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టు పార్టీని అభివృద్ధికి

ఆటంకం అని ప్రవచించారు నేతలు. 'అభివృద్ధి' పేరుతో దేశ సంపదను కొల్లగొట్టి, భవిష్యత్తు విధ్వంసానికి ఎవరు ఒడిగడుతున్నారో చెప్పాలి. నక్సలిజం నిర్మూలనకు బడ్జెట్లు, బలగాలు, దుష్ప్రచారాలు, సమన్వయాలు, నిషేధాలు, నిర్బంధాలు అమలు చేస్తూ అమాయకుల మానప్రాణాలను బలితీసుకుంటూ గ్రీన్‌హంట్ దాడులను చేస్తున్న పాలకవర్గాల నీతి, అభివృద్ధి ఎటువంటిదో, వారి ప్రభుత్వ విధానాలు ఎవరి పరిరక్షణకో తెలియజేయాలి. ఎవరు దేశ భద్రతకు ప్రమాదమో తేల్చాలి.

65 సం॥ల 'స్వాతంత్ర్య' పండుగ చేసుకుంటూ 'బడా పెట్టుబడిదారుల సమస్యలు కూడా ప్రజల సమస్యలేనంటూ వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని, ప్రజల విద్యా వైద్య సదుపాయాల కోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాని బుకాయిస్తున్నాడు.' ఈ 'ప్రజాస్వామిక' చట్టపరిధిలోనే నిరసనలు జరగాలి తప్ప 'నిరసనలు జాడ్యంగా' మారకూడదని, నేటి సంక్షుభిత ఆర్థిక పరిస్థితుల్లో శాంతి అత్యంత అవసరం అని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ హెచ్చరించాడు. ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి శాంతి కోసం పాలకులు ప్రజల్ని హెచ్చరిస్తున్నారో స్పష్టమే. ఇది దోపిడి రాజ్యం, దొంగల రాజ్యం, ఫాసిస్టు రాజ్యం.

1990ల నుండి నూతన ఆర్థిక విధానాలు (ఎల్‌పిజి విధానాలు), అణు ఒప్పందం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా విదేశీ బహుళజాతి సంస్థలకు అమ్మడం, ఎస్‌ఈజెడ్‌లకు అనుమతి, భూములు, ఖనిజ సంపదలు, ప్రభుత్వ ఖజానా కొల్లగొట్టడం ఇవన్నీ అమలు చేసిన పాలకవర్గాలు రెండు దశాబ్దాలుగా సాధించిన ప్రగతి శూన్యం. దోపిడీ వర్గాల ఆస్తులు పెరిగాయి. దేశంలో పేదల సంఖ్య పెరిగింది. ఆకలి చావులు, నిరుద్యోగం, నిరక్షరాస్యత, బతుకు చీకటి, పాలకుల నిర్లక్ష్యం పెరిగిపోయాయి. దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టి, దేశం స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ఒప్పందాలతో సామ్రాజ్యవాదుల రాజకీయ, మిలటరీ యుద్ధ రథచక్రాలకు, బహుళ జాతి సంస్థల ప్రయోజనాలకు ఊడిగం చేసే భారత దోపిడీ పీడక పాలకవర్గాలకు గోరీ కట్టాల్సిన సమయం వచ్చింది.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరచి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతూ ప్రజలపై పాశవిక దాడులు చేస్తున్న అవినీతి పాలకులు, అమెరికన్ సామ్రాజ్యవాదుల ఎల్‌ఐసీ విధానాల మార్గదర్శకత్వంలో విప్లవ ప్రజలపై గ్రీన్‌హంట్ దాడులు జరుపుతున్న విషయం స్పష్టమే.

దేశాన్ని కొల్లగొట్టడాన్ని, దేశ భద్రతకు కలిగిన ప్రమాదాన్ని గుర్తించి దేశ భక్తులు, ప్రజాస్వామికవాదులు, విప్లవ ప్రజలు కార్మిక వర్గ నాయకత్వంలో నాలుగు వర్గాల ఐక్యతతో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను వారి దళారీ దుష్ట పాలనను ఓడించి నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని నిర్మించాలి.

★

## విజ్ఞప్తి

*ప్రియమైన కామ్రేడ్స్,*

*'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూసమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.*

*కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళం ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యనూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.*

*నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.*

# తెలంగాణ ఆకాంక్షను మరోసారి ఎత్తిపట్టిన 'సాగరహారం'

సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డుపై 'సాగర హారం' పేరుతో జరిపిన కవాతు ద్వారా తెలంగాణ ప్రజలు తమ బలమైన ఆకాంక్షను మరోసారి ప్రపంచానికి చాటారు. సకల జనుల సమ్మె తర్వాత ప్రజలు వుద్యమాలంటే విసిగిపోయారని సీమాంధ్ర నేతలు చేస్తున్న వాదనలను తీవ్ర నిర్బంధం నడుమనే లక్షలాది మంది భాగస్వామ్యంతో విజయవంతమైన తెలంగాణ మార్చ్ తిప్పికొట్టింది. తమ ఆకాంక్ష నెరవేర్చుకొనేంత వరకూ ప్రజలు విసుగూ, అలుపూ లేకుండా వుద్యమిస్తూనే వుంటారని మరోసారి నిరూపితం అయింది.

ఇదే సందర్భంగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల తెలంగాణ వ్యతిరేకత, ఈ పార్టీల్లోని తెలంగాణ నాయకుల అవకాశవాద రాజకీయాలు కూడా మరోసారి బట్టబయలైనాయి. మరోవైపు ఇప్పటికీ టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పట్ల, లాబీయింగ్ పట్ల ఎంత బలమైన భ్రమలు వున్నాయో కూడా తెలిసివచ్చింది.

గత సంవత్సరం జరిగిన సకల జనుల సమ్మె తర్వాత మరొక భారీ ప్రజా వెల్లువ చోటు చేసుకున్న సందర్భమిదే. తెలంగాణ మార్చ్‌ను జరుపుతామనే పిలుపును తెలంగాణా జేఏసీ మూడు నెలల ముందుగానే ప్రకటించింది. అంటే ఒకరకంగా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేయడానికి ఈ కాలాన్ని గడువుగా విధించిందని కూడా అనుకోవచ్చు. కానీ ఆ పార్టీ నుండి సహజంగానే ఎటువంటి సానుకూల స్పందన కానరాలేదు.

గత కొన్నాళ్లుగా కొంత మంది రాజకీయ నాయకులు తెలంగాణ ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది అని ఊరిస్తున్నారు. రాష్ట్రపతి ఎన్నికల తర్వాత అని కొన్నాళ్లు, సోనియా గాంధీ అమెరికా దవాఖానా నుంచి తిరిగి రాగానే అని కొన్నాళ్లు ప్రజలను జోకొట్టడానికి ప్రయత్నించారు. తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్ జరుగుతుందని ప్రకటించిన తర్వాత కూడా ఈలోగానే తెలంగాణ వస్తుందని, కేంద్రం నుంచి తనకు సంకేతాలున్నాయని కేసీఆర్ చెబుతూనే వచ్చాడు. ఆయనకు ఏ రహస్య సంకేతాలున్నాయో కాని బహిరంగంగా మాత్రం ప్రధానమంత్రి సహా కాంగ్రెస్ నాయకులు తెలంగాణకు ప్రతికూలంగానే మాట్లాడుతూ వచ్చారు.

సీపీఐ అగస్ట్ 25 నుండి సెప్టెంబర్ 3 వరకూ తెలంగాణలో 'పోరుబాట' జరిపింది. ఆ తర్వాత సీపీఐ నేతలు సెప్టెంబర్ 6న ప్రధాన మంత్రిని కల్సి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరగా 'ఏకాభిప్రాయం లేదు కదా' అన్నాడాయన. తెలంగాణకు అనుకూలంగా సెప్టెంబర్ 4న ప్రధాని ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు అణచివేతకు పాల్పడడం వలన దాదాపు 30 మంది గాయపడ్డారు. తెలంగాణ పట్ల సానుకూలంగా వుంటే ఈ అణచివేత చర్యలు ఎందుకు వుంటాయి? ఇక సెప్టెంబర్ 10న హోం మంత్రి షిండే తెలంగాణ సమస్యపై తనకు అవగాహన లేదంటూనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నక్సల్స్ సమస్య పెరుగుతుందన్నాడు. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల పరిశీలకుడు వయలార్ రవి 'తెలంగాణా అదెక్కడుంది?' అన్నాడు. ఇక సోనియా తెలంగాణ విషయాన్ని ప్రస్తావించిన తన పార్టీ నేతలతో 'తెలంగాణ గురించి అంతా నాకు తెలుసు' అని తప్ప, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సానుకూలంగా ఒక్కమాట కాదు గదా, చిన్నసైగ కూడా చేయలేదు. తెలంగాణ సమస్య పరిష్కరించేందుకు ఆర్థిక ప్యాకేజీలు, రాజకీయ సర్దుబాట్లు చేసే ప్రయత్నాల్లో కేంద్ర ప్రభుత్వం వున్నట్లు తమకు సమాచారం అందిందని, దీనికి తాము ఆందోళన చెందుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి జానారెడ్డి సహా పదమూడు మంది మంత్రులు సెప్టెంబర్ 17న అధిష్టానానికి లేఖ రాశారు. వీటన్నింటినీ బట్టి కేంద్రం తెలంగాణ పట్ల ఏమాత్రం సానుకూలంగా లేదని ప్రపంచమంతటికీ స్పష్టమవుతుంటే కేసీఆర్ మాత్రం సెప్టెంబర్ 30 లోగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వస్తుందనే చెబుతూ వచ్చాడు.

చివరికి సెప్టెంబర్ 26న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి గులాంనబీ ఆజాద్, వయలార్ రవిలు తెలంగాణపై కాంగ్రెస్ వైఖరిని తేల్చిచెప్పారు. 'మూడు ప్రాంతాల మధ్య ఏకాభిప్రాయం వచ్చేదాకా తెలంగాణపై కేంద్రం ప్రకటన చేయబోదు' అని ఆజాద్ స్పష్టం చేశాడు. ఢిల్లీలో తెలంగాణపై ఏదో జరిగిపోతున్నట్టుగా కేసీఆర్‌తో పాటు కాంగ్రెస్ నేతలు, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి కల్పిస్తున్న భ్రమలను వయలార్ రవి 'తెలంగాణ సమస్య పరిష్కారం కోసం ప్రస్తుతం ఢిల్లీలో ఏమీ జరగడం లేదు' అంటూ పటాపంచలు చేశాడు. అంతేకాదు యూపీఏ ప్రభుత్వానికి మమతా బెనర్జీ మద్దతు ఉపసంహరించుకున్న నేపథ్యంలో కేంద్రంకు తెలంగాణ గురించి ఆలోచించే తీరిక కూడా లేదని చాలా బాధ్యతారహితంగా మాట్లాడాడు. తెలంగాణ అస్తిత్వ పోరాటం ఈనాటిది కాదు. ఎంతమందినో ఈ పోరులో తెలంగాణ కోల్పోయింది. 1952 సెప్టెంబర్‌లో జరిగిన ముల్కీ ఆందోళనలో ఏడుగురు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. 1969లో ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఆందోళనలో 369 మంది పోలీసు కాల్పుల్లో చనిపోయారు. ఇక మూడేళ్ల కాలంలో దాదాపు 900 మంది తెలంగాణ ప్రజలు ముఖ్యంగా యువత ఆత్మబలిదానాలు చేసుకున్నారు. ఇంత మంది ప్రాణాలు పోతున్నా ఢిల్లీ పెద్దలకు ఇది త్వరగా పరిష్కరించాల్సినంత పెద్ద సమస్యగా కనిపించడం లేదు. ఉప ఎన్నికలు, రాష్ట్రపతి ఎన్నికలు, సోనియా అనారోగ్యం, మమత తెచ్చిన తలనొప్పి... ఇలా రకరకాల కారణాలతో తెలంగాణ సమస్యను వాయిదా వేసుకొమ్మని చెబుతున్నారు. సెప్టెంబర్ 26న గులాంనబీ ఆజాద్, వయలార్ రవిలు ఇంత నిర్మొహమాటంగా

## పోలీసు జులుంకు రాజిరెడ్డి బలి

*తెలంగాణ కవాతు సందర్భంగా పోలీసులు సాగించిన జులుంకు ఒక నిండు ప్రాణం బలయింది. ప్రస్తుత తెలంగాణ వుద్యమంలో ఇప్పటికే వందల ప్రాణాలు పోయినప్పటికీ పోలీసు అణచివేతకు బలయిన మొదటి వ్యక్తి రాజిరెడ్డి. నెక్లెస్ రోడ్డులోని వేదికపైకి నేరుగా గురిపెట్టి ప్రయోగించిన బాష్పవాయు గోళం కారణంగా రాజిరెడ్డి అస్వస్థతకు గురై 25 రోజులు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి అక్టోబర్ 25న కన్నుమూశాడు.*

*రాజిరెడ్డి (42) కరీంనగర్ జిల్లా రామగుండం మండలంలోని పెద్దంపేట గ్రామస్తుడు. కొన్నాళ్లుగా భార్యా, ఇద్దరు పిల్లలతో సహా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివసిస్తూ, బతుకుదెరువు కోసం చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. మొదటి నుండి తెలంగాణ వుద్యమంలో చురుగ్గా వుండే ఇతను కూకట్‌పల్లి హౌజింగ్‌బోర్డు కాలనీ జేఏసీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. నెక్లెస్ రోడ్డులో జరిగే కవాతులో పాల్గొనేందుకు కూకట్‌పల్లి హౌజింగ్‌బోర్డు పోలీసుల వలయాలను ఛేదించుకొని వచ్చి, కవాతును విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించి రాజ్యహింసకు బలయ్యాడు.*

*పోరులో ఒరిగిన రాజిరెడ్డిని తెలంగాణ ప్రజానీకం వీరుడిగా కీర్తిస్తున్నది. అమరుడిగా స్మరించుకుంటున్నది. అతని కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకూ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.*

*నిజానికి బాష్పవాయువు కారణంగా ప్రాణాలు పోవడమనేది జరగదు. కాబట్టి పోలీసులు బాష్ప వాయువే ప్రయోగించారా? లేదా తెలంగాణ వుద్యమ అణచివేతే ప్రధాన లక్ష్యంగా చేసుకున్న ప్రభుత్వం మరేదైనా కొత్త ప్రయోగం చేసిందా? అనే అనుమానాలు కూడా రాజిరెడ్డి మరణం నేపథ్యంలో వ్యక్తమయ్యాయి.*

తేల్చి చెప్పినప్పటికీ కేసీఆర్ మాత్రం ఆ తర్వాత కూడా ఢిల్లీని పట్టుకునే వేళ్లాడాడు. తెలంగాణ మార్చ్‌కు ఒక్కరోజు ముందు అంటే సెప్టెంబర్ 29న కూడా గులాంనబీ ఆజాద్‌తో భేటీ అయ్యాడు. భేటీ అనంతరం 'తెలంగాణపై నిర్ణయం జరిగిపోయింది. ప్రకటనే మిగిలింది' అని వ్యాఖ్యానించాడు. మార్చ్ జరుగుతున్న సమయంలోనూ ఢిల్లీలోనే వున్న కేసీఆర్ అక్టోబర్ 3న హైదరాబాద్‌కు తిరిగివచ్చి చర్చలు ఫలప్రదమయ్యాయని, తెలంగాణ పట్ల సానుకూల నిర్ణయం వెలువడనుందని ప్రకటించాడు. తెలంగాణ మార్చ్ పట్ల టీఆర్ఎస్ మొదట మౌనమే వహించింది. కొద్ది రోజుల తర్వాతనే తాము కూడా పాల్గొంటామని ప్రకటించింది.

ఇదీ టీఆర్ఎస్, కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల తీరు! ఇక రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ నేతల తీరు చూస్తే, కావూరి సాంబశివరావు, కేవీపీ రామచందర్‌రావు తదితర సీమాంధ్ర నేతలు ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని కల్సి తెలంగాణకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని వత్తిడి చేశారు. సమైక్యాంధ్రను నినదిస్తూ కొన్ని చోట్ల ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, గవర్నర్ నరసింహన్‌లు మార్చ్‌కు అనుమతినిచ్చేది లేదన్నారు. గణేష్ నిమజ్జనం, జీవ వైవిధ్య సదస్సుల సాకు చూపి మార్చ్‌ను వాయిదా వేయించాలనైనా చూశారు. ఇలా వాయిదా వేయించే బాధ్యతను ముఖ్యమంత్రి తెలంగాణ మంత్రుల మీదే పెట్టాడు. అందుకే హోం మంత్రి సబిత వాయిదా వేయించడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కాని జేఏసీ నేతలు అంగీకరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు తెలంగాణ మార్చ్‌ను స్వాగతిస్తున్నాం అని ప్రకటించారు. మార్చ్‌కు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు, పట్టుపట్టారు కూడా. ఒక దశలో ముఖ్యమంత్రితో దామోదర నర్సింహ, జానారెడ్డి తదితరులు తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి కూడా దిగారు. దీనిని తెలంగాణ మీద ప్రేమ అనో, లేదా తెలంగాణ వాళ్లుగా తమ ఆత్మాభిమానాన్ని కాపాడుకోవడమనో అనుకోలేం. ఆ ప్రేమా, ఆత్మాభిమానం వుంటే, తెలంగాణకు పచ్చి వ్యతిరేకి అయిన కాంగ్రెస్ పార్టీకి వాళ్లెప్పుడో రాజీనామా చేసుండేవాళ్లు. తెలంగాణలో తమ రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకొనే తాపత్రయం తప్ప మరేమీ కాదిది. ఒక వైపు ప్రభుత్వం మార్చ్‌ను విరమింపజేయడానికి, కనీసం వాయిదా వేయించడానికి వివిధ స్థాయిల్లో చర్చలు, ప్రకటనలు, విజ్ఞప్తులు, హెచ్చరికలు, బెదిరింపులతో ప్రయత్నిస్తూనే మరోవైపు తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్బంధం పెంచింది. మార్చ్‌ను విఫలం చేసే బాధ్యతను పోలీసులూ, ప్రభుత్వ సాయుధ బలగాల చేతుల్లో పెట్టింది. కేంద్ర రిజర్వ్ పోలీసు, సరిహద్దు భద్రతా దళం, భారత్-టిబెట్ సరిహద్దు పోలీసు బలగాలతో పాటు దాదాపు 40 వేల మంది పోలీసులను హైదరాబాద్‌లో మోహరించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా రెండు రోజులు -సెప్టెంబర్ 29, 30 తారీఖుల్లో - సచివాలయానికి సెలవులు ప్రకటించింది. సచివాలయ చరిత్రలో తొలిసారి సచివాలయ ప్రాంగణంలో 144 సెక్షన్ విధించింది. జిల్లాల నుండి హైదరాబాద్‌కు వచ్చే అనేక బస్సులను, రైళ్లను రద్దు చేసింది.

ఇక తెలుగు దేశం పార్టీ కూడా తెలంగాణ వ్యతిరేకతను మరోసారి నగ్నంగా బయట పెట్టుకుంది. రెండు కండ్ల సిద్ధాంతవేత్తగా పేరుమోసిన చంద్రబాబుకు రెండు ప్రాంతాల పట్ల ఎన్నడూ సమదృష్టి లేదని, సీమాంధ్రనే ఆయన రెండు కండ్లూ అని ఎప్పుడో అర్థమయిన విషయమే. తన రాజకీయ ప్రయోజనాలరీత్యా ఆ విషయాన్ని ఎంతగా దాచాలని ప్రయత్నించినా దాగడంలేదు. 2004లో అధికారాన్ని కోల్పోయిన చంద్రబాబు ప్రత్యేక తెలంగాణకు మద్దతు ప్రకటించడం ద్వారానైనా దాన్ని తిరిగి పొందగలనేమో అనే ఆశతో 2008లో తెలంగాణకు అనుకూలంగా తన పార్టీలో తీర్మానం చేయించాడు.

2009లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్‌తో పొత్తు పెట్టుకుని తెలంగాణవాదిగా పోజు పెడుతూ ప్రజల ముందుకు వచ్చాడు. అయితే డిసెంబర్ 9న చిదంబరం ప్రకటన చేయగానే చంద్రబాబు తెలంగాణవాది పోజు మారిపోయి ఆయనలోని పక్కా సీమాంధ్రవాది బయటకు వచ్చాడు. తెలంగాణ ఏర్పాటుకు తీవ్రంగా అభ్యంతరం చెప్పాడు. ఆ తర్వాత జరిగిన అఖిల పక్ష సమావేశంలో రెండు కండ్ల సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. అయితే తెలంగాణను సూటిగా వ్యతిరేకిస్తే అక్కడ తనకు పుట్టగతులుండవని స్పష్టంగానే తెలుసు కనుక, ఇప్పటికీ తెలంగాణకు నేను వ్యతిరేకం కాదని మాట్లాడుతున్నాడు.

తెలంగాణ మార్చ్ సందర్భంగా మరోసారి అన్ని పార్టీలు తమ వైఖరి ప్రకటించాల్సి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సమస్యపై కేంద్రానికి వుత్తరం రాస్తానని ఊరిస్తూ వచ్చాడు. తెలంగాణపై తెలుగుజాతి గర్వించేలా నిర్ణయం తీసుకుంటానన్నాడు. ఎట్టకేలకు సెప్టెంబర్ 26న ప్రధానికి లేఖ రాశాడు. ఆ లేఖలో తమ పార్టీ వైఖరి చెబుతాడని ఎవరైనా ఆశించి వుంటే కనుక వాళ్లు నిర్ఘాంతపోయేలా వుందా లేఖ. తెలంగాణ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయకుండా, అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అందులో తమ వైఖరి ప్రకటిస్తామని రాశాడందులో. అలా చంద్రబాబు తన అవకాశవాద రాజకీయాలను మరోసారి సమర్థవంతంగా చాటుకున్నాడు. తెలుగుదేశం పార్టీకి చెందిన కింది స్థాయి కార్యకర్తలు తెలంగాణ ఎమ్మెల్యేలపై ఈ సందర్భంగా మరోసారి తీవ్ర వత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు అనుకూలంగా తమ పార్టీ వైఖరిని తెలియజేయాలని చంద్రబాబుపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు వత్తిడి చేశారు. అయినప్పటికీ తన సీమాంధ్ర పక్షపాత వైఖరిని ఆయన బలంగా అంటిపెట్టుకొనే వున్నాడు.

తెలంగాణ మార్చ్‌ను విఫలం చేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు కూడా అన్నీ ఇన్నీ కావు. తామే పాలకులం అన్నట్టుగా ప్రవర్తించడం ఆంధ్రప్రదేశ్ పోలీసులకు కొత్త కాదు. సీమాంధ్రవాదులుగానే వ్యవహరించడం కూడా కొత్తకాదు. అయితే తెలంగాణ ప్రజలకు ఇదంతా మరోసారి అనుభవంలోకి వచ్చిందంతే. తెలంగాణ మార్చ్ ముసుగులో అసాంఘిక శక్తులు, లంపెన్‌శక్తులు విధ్వంసానికి పాల్పడే అవకాశం వుందని, మతపరమైన కలహాలు కూడా చోటు చేసుకోవచ్చని డీజీపీ దినేష్ రెడ్డికి వచ్చిన అనుమానాలు నిరాధారమైనవి. తెలంగాణ వుద్యమంలో ఎన్నడూ చోటుచేసుకోని విషయాలివి. ఇది వుద్యమంపై దుష్ప్రచారం తప్ప మరొకటి కాదు. ఒకవైపు తెలంగాణ మంత్రులు మార్చ్‌కు అనుమతి కోసం ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్న సమయంలోనే మరోవైపు అదనపు డీజీపీ, డీజీపీలు ఒకరి తర్వాత మరొకరు పత్రికా సమావేశాలు జరిపి, మార్చ్‌కు అనుమతి ఇవ్వబోమని ప్రకటించారు. ప్రభుత్వ ఆహ్వానం మేరకే ఎమ్మెల్యేతో కలిసి అసెంబ్లీకి చర్చల కోసం వెళ్లిన జేఏసీ ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు.

ఇక ఎన్నో రోజుల ముందు నుంచే తెలంగాణ మొత్తంగా ఇంటెలిజెన్స్ నిఘాను పెంచారు. మార్చ్‌కు సన్నద్ధమవుతున్న ప్రజలపై అన్ని జిల్లాల్లోనూ నిర్బంధం పెంచారు. ఎక్కడికక్కడ జిల్లాల నుండి నగరానికి వచ్చే దారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు ప్రారంభించారు. జిల్లాల్లో పోలీసు కవాతులు నిర్వహించారు. కౌన్సిలింగ్‌ల పేరుతో బెదిరింపులకు పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌లు చేశారు. వివిధ స్థాయిల తెలంగాణ వుద్యమ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి, బైండోవర్ కేసులు పెట్టారు. బైండోవర్, జామీన్

## ఆగని బలిదానాలు

*తెలంగాణ వుద్యమం ఎంతో మందికి ఒక వుత్సాహం, ఒక వుత్తేజం, ఒక ప్రేరణగా వుంది. అదే సమయంలో ఈ వుద్యమంలో భాగంగా జరుగుతున్న ఆత్మబలిదానాలు ప్రాణం విలువ తెలిసిన ప్రతి ఒక్కరినీ కలతపెడుతున్నాయి. వుద్యమం పట్ల పాలకులు అనుసరిస్తున్న వైఖరి రేపుతున్న అశాంతి వల్ల కావొచ్చు, ఇంత పోరాడి కూడా తెలంగాణను సాధించుకోలేమేమో అనే ఆవేదన, నిస్పృహ, నిరాశల వల్ల కావొచ్చు యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీన్నొక నిరసన రూపంగా ఎంచుకుంటున్నారు. తమ మరణమైనా పాలకుల కఠిన వైఖరిని కరిగిస్తుందేమో అనే ఆశ కూడా ఈ ఆత్మహత్యల వెనుక వుండొచ్చు.*

*తెలంగాణ మార్చ్‌కు ప్రజలంతా సమరోత్సాహంతో సన్నద్ధం అవుతున్న సమయంలో సెప్టెంబర్ 26న నల్లగొండ జిల్లాలో బోయ శ్రీధర్ అనే డిగ్రీ చదువుతున్న విద్యార్థి వంటికి నిప్పంటించుకొని చనిపోయాడు. సెప్టెంబర్ 27న కరీంనగర్ జిల్లాలో జగన్ రెడ్డి అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మార్చ్ విజయవంతం అయిన తర్వాత కూడా ఈ ఆత్మహత్యల పరంపర ఆగలేదు. కవాతుపై పోలీసులు ప్రయోగిస్తున్న హింసా దృశ్యాలను టీవీలో చూసి ఆవేదన చెందిన సతీష్ రెడ్డి అనే కరీంనగర్ విద్యార్థి అక్టోబర్ 1న ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే జిల్లాకు చెందిన సదానందరెడ్డి అక్టోబర్ 3న ఆత్మహత్య చేసుకున్నాడు.*

*తెలంగాణ సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ జరిపిన ఒక అధ్యయనం ప్రకారం 2009 నవంబర్ 29 నుండి 2012 సెప్టెంబర్ 27 వరకు మూడు సంవత్సరాల కాలంలో, తెలంగాణ ఉద్యమంలో భాగంగా 875 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 301 మంది ఇలా చనిపోతే, కరీంనగర్ జిల్లాలో 213 మంది చనిపోయారు. ఇంకా ఆదిలాబాద్ జిల్లాలో 59 మంది, హైదరాబాద్‌లో 18 మంది, ఖమ్మంలో అయిదుగురు, మహబూబ్‌నగర్‌లో 27 మంది, మెదక్‌లో 85 మంది, నల్లగొండ జిల్లాలో 74 మంది, నిజామాబాద్ జిల్లాలో 66 మంది, రంగారెడ్డి జిల్లాలో 27 మంది చనిపోయారు.*

*తెలంగాణది పోరాట వారసత్వం. ఆత్మహత్యలు ఆ వారసత్వానికి ఎంత మాత్రమూ పొసగనివి. ఆత్మహత్యలకు పాల్పడడం కాదు తెగించి పోరాడడమే తెలంగాణ వారసత్వాన్ని సగర్వంగా కొనసాగించడమని యువత గుర్తించాలి.*

## వెయ్యి రోజులు దాటిన పోరుదీక్ష

*తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక పోరాట రూపాలను ప్రజలు ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా అనేక గ్రామాల్లో నిరవధికంగా నిరాహార దీక్షా శిబిరాలు కొనసాగుతున్నాయి. సిద్ధిపేటలోని అటువంటి ఒక నిరాహార దీక్షా శిబిరానికి వెయ్యిరోజులు నిండాయి.*

*2009 డిసెంబర్ 24న జేఏసీ నేతృత్వంలో ప్రారంభమైన ఈ రిలే నిరాహార దీక్షా శిబిరం నేటికీ కొనసాగుతున్నది. ఇప్పటికి ఈ శిబిరంలో 30 వేల మందికి పైగా నిరాహారదీక్ష చేశారు. ఒక్కరోజు కూడా ఆపకూడదనే దీక్షతో బడిపిల్లలు సహా అన్ని సెక్షన్ల ప్రజలు నిరాహార దీక్షలో కూర్చుంటున్నారు. ఈ శిబిరం నిరవధికంగా కొనసాగడంలో మహిళలు ప్రధాన పాత్ర వహిస్తున్నారు.*

*మరెంతో మంది ఇది కొనసాగడానికి అవసరమైన ఎన్నో సేవలను వుచితంగా అందజేస్తున్నారు. అందులో గాల్‌రెడ్డి అనే 86 సంవత్సరాల వృద్ధుడి పాత్ర ఎంతో ప్రేరణనిస్తుంది. ఈయన పూర్తి కాలం కార్యకర్తగా ఈ శిబిరం నిర్వహణ బాధ్యతను చేపట్టాడు. స్వాతంత్రోద్యమంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, 1969 ప్రత్యేక తెలంగాణ వుద్యమంలోనూ పాల్గొన్న ఈ సమర యోధుడు తన జీవిత చరమాంకంలోనూ ఎంతో పట్టుదలగా పోరాట దీక్షను కొనసాగిస్తూ తెలంగాణ వుద్యమకారులకు వుత్తేజాన్నిస్తున్నాడు.*

*ఒక్క సిద్ధిపేటలోనే కాదు సుల్తానాబాద్, బోడుప్పల్, బోధన్ తదితర చోట్ల కూడా దీక్షలు వేయి రోజులకు చేరుకున్నాయి. ఇంకా మరెన్నో చోట్ల కూడా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి.*

*నిరాహార దీక్ష అనేది శాంతియుత పోరాట రూపం. నిరాహార దీక్షతో పాటు అన్ని రకాల శాంతియుత పోరాట రూపాలను పాలకులు అగ్ని పరీక్షకు గురిచేస్తున్న నేపథ్యంలో, ఈ పోరాట రూపాలు ఎప్పటికీ శాంతియుతంగానే కొనసాగడం సాధ్యమేనా?*

నిబంధనలను కూడా కఠినతరం చేశారు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో అరెస్టు చేసిన వాళ్లను గతంలో వలె కాకుండా ఈసారి సబ్ కలెక్టర్ ముందు హాజరుపరచడంతో పాటు ఇద్దరు వ్యక్తుల జామీన్‌పై విడుదల చేశారు. బైండోవర్ అయిన వాళ్లుసెప్టెంబర్ 29న మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ పోలీసు స్టేషన్‌కు రావాలని నిబంధనలు పెట్టారు. రాకపోతే లక్ష రూపాయలు జరిమాన విధిస్తామని, జామీనుగా వున్న ఇద్దరు వ్యక్తుల నుండి 20 వేల రూపాయలు వసూలు చేస్తామని హెచ్చరించారు. మొత్తంగా తెలంగాణ వ్యాప్తంగా మార్చ్‌కు ముందే దాదాపు ఏడు వేల మందిని అరెస్టు చేశారు.

ఇక రాజధానిని అష్ట దిగ్బంధం చేశారు. హైదరాబాద్‌లోకి ప్రవేశించే 17 ప్రధాన మార్గాలతో పాటు 75 ప్రత్యామ్నాయ దారుల్లో నిఘాపెట్టారు. అనేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, విస్తృతమైన తనిఖీలు చేపట్టారు. తెలంగాణ మార్చ్ సన్నాహకాల్లో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సెప్టెంబర్ 27న తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 28న తలపెట్టిన బైక్ యాత్రను తీవ్ర అణచివేతతో అడ్డుకొన్నారు. ఈ అణచివేతలో భాగంగా పోలీసులు విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. చివరకు మార్చ్‌కు అనుమతి ఇచ్చిన తర్వాత కూడా ఈ నిర్బంధకాండను ఇలాగే కొనసాగించారు. "పోలీసులు వంగి నడవమంటే పాకుతూ సీమాంధ్ర పెట్టుబడిదారులకు తమ విధేయత చాటుకుంటున్నార"ని ఏ వుద్యమకారులో, హక్కుల కార్యకర్తలో కాదు మాజీ డీజీపీ పేర్వారం రాములు వాఖ్యానించాడంటే పోలీసులు తెలంగాణ మార్చ్‌ను విఫలం చేయడానికి ఎంతగా ప్రయత్నించారో అర్థం చేసుకోవచ్చు.

రాజకీయ పార్టీల డ్రామాలు, పోలీసుల ఓవర్ యాక్షన్ ఎలా వున్నా తెలంగాణ ప్రజలు మాత్రం తమ బలమైన ఆకాంక్షను మరోసారి వ్యక్తీకరించడానికే సన్నద్ధం అయ్యారు. అందుకు ఎంతటి నిర్బంధాన్నయినా ఎదిరించడానికే సిద్ధపడ్డారు. మార్చ్ సన్నాహకాల్లో భాగంగా అనేక జిల్లాల్లో మినీ మార్చ్‌లు, ర్యాలీలు, సమావేశాలు, మానవహారాలు, ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణలోనే కాదు ఇతర దేశాల్లోనూ మార్చ్‌కు సంఘీభావంగా కార్యక్రమాలు జరిగాయి. అమెరికాలోని న్యూయార్క్ నగర నడిబొడ్డున తెలంగాణా మార్చ్‌కు సంఘీభావంగా ఒక మార్చ్ జరిగింది. అలాగే తెలంగాణ ఎన్నారై ఫోరం నేతృత్వంలో లండన్‌లోనూ మార్చ్ జరిగింది.

*అనేక మంది ఆంధ్ర ప్రాంత ప్రజానీకం కూడా మార్చ్‌కు సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రాంతం నుండి వచ్చి తెలంగాణలో స్థిరపడిన వారితో ఏర్పడిన సెటిలర్స్ ఫోరమ్ సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో ఒక సమావేశం జరిపి మార్చ్‌కు సంఘీభావం తెలిపింది. ఆంధ్ర ప్రాంతంలో అన్యాయానికి గురై వచ్చిన తమను తెలంగాణ ప్రజలు గుండెకు హత్తుకుని కాపాడారని, తామంతా తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడారు. సీమాంధ్రకు చెందిన ఎందరో ప్రముఖ రచయితలు, జై ఆంధ్ర వుద్యమకారులు మార్చ్‌కు సంఘీభావం తెలిపారు. వీరంతా తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షకు సంపూర్ణ మద్దతునిస్తూ నిజమైన సమైక్యతా భావాన్ని చాటుకున్నారు.*

ఇలా తెలంగాణ ఆకాంక్షకు, దాని ఒకానొక వ్యక్తీకరణ రూపమయిన తెలంగాణ మార్చ్‌కు లభిస్తున్న మద్దతు, ముఖ్యంగా నిర్బంధానికి సడలని తెలంగాణ ప్రజల సంసిద్ధత, తమ సొంత పార్టీలో సైతం తెలంగాణ వారి నుండి వస్తున్న వత్తిడి కారణంగా మార్చ్‌కు అనుమతి ఇవ్వక కిరణ్ కుమార్ రెడ్డికి తప్పలేదు.

అయితే అనుమతి ఇచ్చినప్పటికీ పోలీసు నిర్బంధం మాత్రం ఆగిపోలేదు. అరెస్టులు, బైండోవర్ కేసులు, తనిఖీలు, బస్సులు, రైళ్ల నిలుపుదలలు అన్నీ కొనసాగాయి. అయినప్పటికీ నిర్బంధాలనూ, నిషేధాలనూ తుత్తునియలు చేస్తూ సెప్టెంబర్ 30న నెక్లెస్ రోడ్డుకు దాదాపు అయిదు లక్షల మంది ప్రజలు తరలివచ్చారు. అలా తరలివస్తున్న ప్రజలకు ఆటంకాలు కల్పించడానికి పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ నుండి నెక్లెస్ రోడ్డుకు తరలివస్తున్న విద్యార్థులను, అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. తిరగబడ్డ విద్యార్థులపై విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. దాదాపు 140 రౌండ్ల బాష్ప వాయు గోళాలను ప్రయోగించారు. నెక్లెస్ రోడ్డులో కూడా పోలీసు జులుం కొనసాగింది. అక్కడ వేదిక సమీపంలోనే దాదాపు 40 రౌండ్ల బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. నేరుగా వేదిక పైకి సైతం వీటిని ప్రయోగించారంటే అణచివేత తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. లాఠీచార్జి చేశారు. జల ఫిరంగులు, రబ్బరుతూటాలు ప్రయోగించారు. అనేక చోట్ల ఇనుప తీగల ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. ఆకాశమార్గం గుండా డీజీపీ హెలికాప్టర్లలో చెక్కర్లు కొడుతూ పోలీసులకు ఉత్సాహాన్నిచ్చాడు. మొత్తంగా ఆ రోజున ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. అయినప్పటికీ ప్రజలు భయపడలేదు. ఎక్కడికక్కడ పోలీసుల అణచివేతను రాళ్లు విసురుతూనో, వట్టి చేతులతోనో తిప్పికొడుతూనే తమ కవాతును కొనసాగించారు. సాయంత్రం ఏడు గంటలకే ముగించాలని సర్కారు ఇచ్చిన అనుమతిని ధిక్కరించి అర్ధరాత్రి వరకూ కొనసాగించారు. నిజానికి తెలంగాణ ప్రకటన చేసేవరకూ నెక్లెస్ రోడ్డుపైనే బైఠాయించి వుంటామని జేఏసీ ప్రకటించింది కాని విపరీతమైన వర్షం రావడం వల్ల విరమిస్తున్నట్లుగా అర్ధరాత్రి ప్రకటించింది. కొంతమంది ప్రజలు మాత్రం కొనసాగించాలనే పట్టుపట్టారు. అయినప్పటికీ జేఏసీ విరమించింది. దుబాయ్‌లో స్థిరపడిన పదిమంది తెలంగాణ ప్రజల బృందం మార్చ్‌లో పాల్గొనడం అందరినీ వుత్సాహపరిచింది. ఎంతో వుత్తేజభరితంగా జరిగిన ఆ జన కవాతు గురించి, జన సాగర హారం గురించి ఎన్నో కలాలు గొప్పగా రాశాయి.

మార్చ్ సందర్భంగా పోలీసు దాడులకు నిరసనగా మరుసటి రోజు తెలంగాణ విద్యార్థి జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపు కూడా విజయవంతమైంది. అక్టోబర్ 2న జేఏసీ నేతలు నిరాహార దీక్షలు చేశారు.

పోలీసుల బీభత్సాన్ని ప్రతిఘటించడం తప్ప ఆందోళనకారుల నుండి ముందస్తుగా చెప్పుకోతగిన విధ్వంసచర్యలేమీ జరగలేదు. మీడియా మీద కొన్ని దాడులు జరిగినట్టు వార్తలు వచ్చాయి. కేంద్ర హోం మంత్రి షిండే కూడా మార్చ్ శాంతియుతంగా జరిగిందనే పేర్కొన్నాడు. కానీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అనురాగ శర్మ మాత్రం మార్చ్‌లో వామపక్ష తీవ్రవాదులు జొరబడ్డారని పేర్కొన్నాడు. పోలీసులు అనేక మందిపై కేసులు కూడా పెట్టారు. ఇప్పటికే అనేక మంది తెలంగాణ వాదులపై 2009 నుంచి లెక్కలేనన్ని కేసులు పెండింగ్‌లో వున్నాయి. తాజాగా ఇప్పుడు మరి కొన్ని కేసులు తోడయ్యాయి.

కాంగ్రెస్ ఎంపీలు ర్యాలీలో ముందుంటామని ప్రకటించారు. అయితే తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాతనే మార్చ్‌లో పాల్గొనాలనీ, లేకపోతే భౌతిక దాడులు వుంటాయనీ, తెలంగాణ విద్యార్థులు హెచ్చరిక చేయడంతో వాళ్లు ర్యాలీకి దూరంగానే వుండిపోయారు. ఇలా దూరంగా వుండాల్సి రావడం అనేది వారికి తీవ్రంగా ఆందోళన కలిగించే విషయం. మొత్తంగా సాగరహారం నేపథ్యంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల ద్వారా తమ వునికికి ఏర్పడుతున్న ప్రమాదం తెలంగాణ కాంగ్రెస్ నేతలకు మరోసారి అర్థమయింది. ఈ కారణంగా రాష్ట్ర కాంగ్రెస్‌లో అనేక వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి. తెలంగాణ విషయంలో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తమతో అనుసరిస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తూ రాష్ట్ర ఎంపీలు స్పీకర్‌కు లేఖ రాశారు. ఒక ముఖ్యమంత్రిపై సొంత పార్టీ వారే స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం బహుశా దేశంలో మొదటిది కావచ్చు. మార్చ్ అనంతరం పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అధిష్టానాన్ని కలిసి వచ్చారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో డిసెంబర్ 28న అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది.

సమస్య పరిష్కారానికి ఏవో చర్యలు చేపడుతున్నట్టు చెప్పుకోవడానికి అఖిల పక్ష సమావేశం ఉపకరిస్తుందేమో కాని సమస్యనైతే అది పరిష్కరించలేదని గతంలో జరిగిన అఖిల పక్ష సమావేశాలు నిరూపించే వున్నాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను ఇంత బలంగా చాటుకున్నప్పటికీ, తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నప్పటికీ, అక్టోబర్ 12న హైదరాబాద్‌కు వచ్చిన గులాంనబీ ఆజాద్ అరిగిపోయిన రికార్డులా మళ్లీ ఏకాభిప్రాయం పాట పాడాడు. (సెప్టెంబర్ 29న గులాంనబీ ఆజాద్‌తో భేటీ అనంతరం 'తెలంగాణపై నిర్ణయం జరిగిపోయింది. ప్రకటనే మిగిలింది' అని కేసీఆర్ ప్రకటించడాన్ని ఇక్కడ మరోసారి గుర్తు చేసుకుందాం.) ఆజాదైనా మరెవరైనా ప్రవచిస్తున్న ఏకాభిప్రాయం ప్రజల మధ్య కాదు, రాజకీయ నాయకుల మధ్య. తెలంగాణలో తమ స్వార్థ ప్రయోజనాలు వేళ్లూనుకొని వున్న సీమాంధ్ర భూస్వాములు, పెట్టుబడిదారులు, పాలకులు ఎప్పటికీ తెలంగాణా ప్రజల ఆకాంక్షకు మద్దతు ఇవ్వలేరు. అఖిల పక్షంలో పాల్గొనబోయే మెజారిటీ పార్టీలు – కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ (ఎం), లోక్‌సత్తా – సీమాంధ్ర ప్రయోజనాలకే కట్టుబడి వున్నందున రేపటి అఖిల పక్ష సమావేశంలో కూడా ఏకాభిప్రాయం సాధ్యం కాకపోవచ్చు. కనుక ఏకాభిప్రాయాన్నే గీటురాయిగా తీసుకుంటామని చెప్పడమంటే తెలంగాణ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడమే. ఇది తెలంగాణ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని తిరస్కరించడమే.

పాలకుల ఈ వైఖరిని తీవ్రంగా ఎండగట్టాల్సి వుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజలందరి ఆకాంక్ష, తక్షణావసరం. దీనికి మరెవ్వరి ఆమోదం అవసరం లేదని చాటి సీమాంధ్ర దోపిడీ వర్గాల కొమ్ముకాసే పాలకుల మెడలు వంచాల్సి వుంది. అందుకు పోరాటాలను మరింత మిలిటెంట్‌గా కొనసాగించాల్సి వుంది.

★

# దేశంలో పెరిగిపోయిన అవినీతికి తాజా ఉదాహరణ

# భారీ బొగ్గు కుంభకోణం

గతంలో 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో ఒక లక్షా డెబ్భై ఆరు వేల కోట్ల రూపాయలు తిన్న మన పాలకులు తాజాగా మరో మూడు లక్షల ఆరువేల కోట్ల రూపాయలు భోంచేశారు. భారత పాలకవర్గాల అవినీతి చరిత్రకు 'వన్నె' తెచ్చిన మూడు కొత్త స్కాముల గురించి మనం తెలుసుకుందాం.

2004-2009 మధ్య జరిగిన బొగ్గు గనుల కేటాయింపులపై 2012 ఆగస్టు 17న కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఒక నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. బొగ్గుతో పాటు ఢిల్లీ విమానాశ్రయం, రిలయన్స్ పవర్‌లపైన కూడ నివేదిక ఇచ్చింది.

మొదటిది 2జిని తలదన్నిన భారీ బొగ్గు కుంభకోణంలో 1 లక్షా 86 వేల కోట్ల రూ॥ ప్రభుత్వ ఖజానాకు నష్టం. మరొకటి జిఎంఆర్‌కు లబ్ధి చేకూర్చిన 1 లక్షా 64 వేల కోట్ల రూ॥ కుంభకోణం. అంబానీలకు అంటే రిలయన్స్ పవర్‌కు వరప్రసాదంగా 29 వేల కోట్ల రూ॥ లాభం చేకూర్చినది మూడో కుంభకోణం. ఒక్కోదాన్ని వివరంగా చూద్దాం.

## భారీ బొగ్గు కుంభకోణం

2004-2009ల మధ్య దేశవ్యాపితంగా జరిగిన బొగ్గు గనుల కేటాయింపులలో అవలంబించిన తప్పుడు విధానాలతో ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూరిందని, దీని వలన 25 బడా కంపెనీలు లాభపడ్డాయని కాగ్ వెల్లడించింది. ఆ నివేదికలో ఎస్సార్ పవర్, హిండాల్కో, టాటా స్టీల్, టాటా పవర్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, అదానీ అర్సెలార్, మిట్టల్, ఉషా మార్టిన్, డిబి పవర్ లిమిటెడ్, హిమాచల్ ఇఎంటిఎ, జెఎస్‌డబ్ల్యు లిమిటెడ్ లాంటి ప్రైవేటు సంస్థలకు లాభం చేకూర్చినట్లు బయటపెట్టింది.

2004లోనే వేలం పద్ధతిని ప్రవేశపెట్టినా, 7 సం॥ తర్వాత గాని భారత పాలకవర్గాలు అమలులోకి తేలేదు. ఈ ఆలస్యం కావాలనే చేశారు. పాలకుల దళారీ స్వభావానికి అనుగుణంగా 155 బొగ్గు బ్లాకులకు వేలం వేయకుండా పాత పద్ధతిలోనే నామినేటెడ్ కేటాయింపులు కొనసాగించి ప్రభుత్వ ఖజానాకు 1 లక్షా 86 వేల రూపాయల నష్టం కలిగించారు. ఇది '2జి' స్కాం కన్నా పెద్దదని కాగ్ స్పష్టం చేసింది. ఇలా ప్రజాధనాన్ని పంచుకుతినడంలో ఆరితేరిన అవినీతి పాలకులు చేసిన మరో రెండు స్కాములను కూడా కాగ్ నివేదికలో పేర్కొన్నది. ఈ మూడు స్కాముల మొత్తం 3 లక్షల 6 వేల కోట్ల రూపాయలు.

2011 నాటికి మొత్తం 194 కోల్ బ్లాకులను నామినేటెడ్ పద్ధతిలో కొనసాగించారని చెబుతున్న కాగ్ నివేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు ఎంత తప్పుగా ఉన్నాయో వివరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోల్ కంపెనీలతో కూడిన స్క్రీనింగ్ కమిటీలు కలిసి నిమిషాల్లోనే ప్రైవేట్ కంపెనీలకు బొగ్గు బ్లాకులను కేటాయించాయి. ఎలాంటి మినిట్స్ గాని, రికార్డులు గాని లేవు. అంటే ముందుగానే బేరసారాలు పకడ్బందీగా జరుపుకుని ఖజానాకు చిల్లు పెట్టారు అని అర్థం చేసుకోవచ్చు.

'వినియోగదారులకు తక్కువ ధరకు బొగ్గు అందించేందుకు బొగ్గు బ్లాకులపై తప్పనిసరిగా కఠిన నియంత్రణ, పర్యవేక్షణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి' అని కాగ్ తన నివేదికలో ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ రెండూ ఉంటే ఖజానాకు నష్టం రాదని "కాగ్" నమ్మకం కావచ్చు. పాలకులే దొంగలయితే పర్యవేక్షణ, నియంత్రణ సాధ్యమా?

## దోపిడి పాలకులు బొగ్గు బ్లాకుల్లో అవినీతి గొయ్యి తవ్విన విధం

2004కు ముందు బొగ్గు గనులు ప్రధానంగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)కే కేటాయించారు. యుపిఏ-1 ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మార్చి 2006లో ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. గనుల కేటాయింపులో వేలం పాట పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆ బిల్లులో ఉంది. అయితే ఈ బిల్లు 2010 ఆగస్టులో గాని చట్టంగా రూపుదాల్చలేదు.

ఆ బిల్లు చట్టంగా రూపుదాల్చక ముందే కేంద్ర ప్రభుత్వం నామమాత్ర ధరలకే, నామినేటెడ్ పద్ధతిలోనే ప్రైవేటు కంపెనీలకు బొగ్గు గనులు కేటాయించడంతో మొత్తంగా 10 లక్షల 67 వేల కోట్ల రూ॥ నష్టం జరిగిందని కాగ్ తయారు చేసిన ముసాయిదా నివేదికలో రాసినట్లు ఈ సం॥ మార్చి 22న ఒక ఆంగ్ల పత్రికలో వచ్చింది. తుది నివేదిక అంచనాలు తగ్గినా కుంభకోణం లోతు, విస్తృతి చాలానే ఉందనేది తేటతెల్లం.

కొద్దిగా చరిత్రను తడిమితే - 1973లో ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో బొగ్గు గనుల జాతీయాకరణ చట్టం తీసుకువచ్చారు. దేశంలోని బొగ్గు బ్లాకులపై కోల్ ఇండియా ప్రభుత్వ సంస్థకు పూర్తి హక్కులు లభించాయి. మళ్లీ ఇప్పుడు ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. పైగా దానిని అభివృద్ధి అంటున్నారు. ఈ చట్టంలో క్రమంగా 1976, 1993, 1996లలో సవరణలు తెచ్చారు. వీటి ఫలితంగా తమ స్వంత అవసరాలకు వినియోగించే కరెంటు

వుత్పత్తికి అవసరమైన బొగ్గు తవ్వుకోవడానికి ప్రైవేట్ పరిశ్రమలకు అనుమతి ఇచ్చారు. 2004లో యుపిఏ-1 అధికారంలోకి వచ్చి బొగ్గు అమ్మకానికి అనుమతి ఇచ్చింది. వీటన్నింటిని పరిశీలించిన 'కాగ్' ప్రభుత్వ విధానాలు సరిగా లేకపోవడం వలన కోల్ ఇండియాకు - ప్రభుత్వ రంగ సంస్థకు - 11.6 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టం జరిగిందని తన నివేదికలో తెలిపింది.

## యదేచ్ఛగా దోపిడి

నిజానికి బొగ్గు బ్లాకుల నష్టాన్ని కాగ్ 1.86 లక్షల కోట్లుగా చెప్పింది కాని వాటి వలన జరిగిన నష్టం 2.50 లక్షల కోట్ల రూ॥ కన్నా ఎక్కువే. 155 బొగ్గు బ్లాకుల గురించే కాగ్ చెప్పింది కాని నిజానికి 194 బ్లాకులు కేటాయించారు. ఇందులో సకాలంలో ప్రారంభించలేదని 39 బ్లాకులు రద్దు చేశారు. 155 బ్లాకులకు బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ పరిపాలనా కాలం - 2002 - నుండి యూపీఏ పరిపాలన కాలం - 2009 - వరకు మాత్రమే లీజు వుంది. గడువు గడిచి రెండు సం॥లు పూర్తయినా అవి ప్రభుత్వ స్వాధీనం కాలేదు. వాళ్లు ఆ గనులను సబ్ లీజులకు ఇచ్చి మరిన్ని లాభాలు గడిస్తున్నారు. ఇవన్నీ కలిస్తే ఖజానాకు జరిగిన నష్టం కాగ్ నివేదికలో చెప్పిన దాని కన్నా ఎక్కువే.

కుంభకోణాలకు తోడు దిగుమతుల్లో అవకతవకలు కలిసి ప్రజలపై మరింత భారం మోపుతున్నాయి. దేశవ్యాపితంగా 780 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం వుంది. సిఐఎల్ 435 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తుంది. సింగరేణితో కలుపుకుంటే 580 మిలియన్ టన్నుల ఉత్పిత్తి జరుగుతోంది. ఉత్పత్తి అయిన మేరకు బొగ్గుపై ప్రైవేటు కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వ నియంత్రణ కొరవడి బొగ్గు ఉత్పత్తి సక్రమంగా జరగడం లేదు. చాలా పెద్ద మొత్తంలో దొంగ రవాణా జరుగుతోంది. బొగ్గుకు కృత్రిమ కొరత సృష్టించి దిగుమతుల మీద ఆధారపడేలా చేస్తున్నారు. ఈ దిగుమతులకు చెల్లిస్తున్న ధర మన బొగ్గుకు చెల్లిస్తున్న ధర కన్నా మూడు రెట్లు ఉన్నది. ఇండోనేషియా, ఆస్ట్రేలియాల నుండి 100 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతి చేసుకుంటున్నారు. దిగుమతుల్లోని అవినీతి, అవకతవకలు చెప్పలేనన్ని వుంటున్నాయి.

మన దేశంలో విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా బొగ్గు మీదనే ఆధారపడి (74 శాతం) జరుగుతుంది. విద్యుత్ అవసరాలు పెరిగే కొద్దీ దిగుమతుల అవసరం పెరగడం, బొగ్గు ధర, విద్యుత్, సిమెంట్ ధరలు పెరగడం సాధారణ విషయంగా మారిపోతోంది. ఆగస్టులో రెండు రోజుల పాటు దేశంలో అత్యధిక భాగం అంధకారంలో మగ్గిపోయిన సంగతి గుర్తుంచుకుంటే పవర్ కొరత - బొగ్గు సమస్య లోతు అర్థమవుతుంది.

బొగ్గు గనుల్లో అవినీతి వలన బొగ్గు బావుల్లో పనిచేస్తున్న రెండున్నర లక్షల పర్మినెంట్ కార్మికులు, రెండున్నర లక్షల కాంట్రాక్టు కార్మికులకు ప్రత్యక్షంగా నష్టం జరుగుతోంది. ప్రైవేటుపరం అయ్యే కొద్దీ సమాన వేతనాలు, సంక్షేమం కూడా అందకుండా పోతాయి. బొగ్గు మసి రాసుకున్న కార్మికుల బతుకులు కష్టాల్లో మునిగి తేలుతుంటే, అవినీతి నలుపు గల పాలకులు కోట్ల రూపాయలు తిని కుషీగా బతికేస్తున్నారు. పాలకులు దళారులై ప్రైవేటు సంస్థలకు ప్రజా సంపదను కారుచౌకగా ఇచ్చి లంచాలు మేసి, ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారు.

## ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుంభకోణం

జిఎంఆర్ వంటి బడా సంస్థకు, ఏడాదికి 100 రూ॥ అద్దె చెల్లించే విధంగా 60 సం॥ పాటు 190 ఎకరాల భూమిని కేటాయించడం వలన ప్రభుత్వం 1 లక్ష 63 వేల 557 కోట్ల రూపాయల ఆదాయాన్ని నష్టపోయిందని కాగ్ నివేదిక పేర్కొన్నది. దీని ప్రకారం జిఎంఆర్ 88,337 కోట్ల రూ॥ లబ్ధి పొందింది. డెయిల్ (ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్)లో జిఎంఆర్‌దే ప్రధాన వాటా. ప్రభుత్వ స్థలాన్ని మన పాలకులు ప్రైవేటు సంస్థలకు ఇచ్చి వారి ఆస్తులను పెంచుతూ ప్రభుత్వ ఆదాయాన్ని నష్టపరుస్తూ జాతి సంపదను పంచుకుతింటున్నారు.

ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన 4,608 ఎకరాలు ఉండగా ఈ 190 ఎకరాలు అదనం. దీని లీజు (100 రూ॥) నామమాత్రం. బహిరంగ మార్కెట్ ప్రకారం దీని విలువ 24 వేల కోట్ల రూ॥ పైగా వుంది. 60 సం॥ పాటు ఈ భూమిలో జరిగే వ్యాపార కార్యకలాపాల నుండి 1 లక్షా 63 వేల కోట్ల రూ॥ సంపాదించే అవకాశం జిఎంఆర్‌కు ఉంది. ఈ అక్రమాల గురించి పౌర విమానయాన శాఖకు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రభుత్వ శాఖలకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాగ్ నివేదిక పేర్కొన్నది. ఇవన్నీ తెలిసీ, కూడబలుక్కుని చేసినవే.

ఈ లాభాలు చాలవన్నట్లు ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణీకుల నుండి అభివృద్ధి పన్నుల పేరుతో యూజర్ చార్జీలు రెండింతలుగా వసూలు చేయడానికి జిఎంఆర్‌కు పౌర విమానయాన శాఖ అనుమతినివ్వడాన్ని బిడ్డింగ్ విధాన స్ఫూర్తిని నీరుగార్చడంగా కాగ్ పేర్కొన్నది. ఈ పన్నుల వసూలులో జిఎంఆర్ ఆధ్వర్యంలోని డెయిల్‌కు సుమారుగా 3,415 కోట్ల రూ॥ లాభం వచ్చింది. రెండు చేతులా దోచి పెట్టడం అంటే ఇదే.

## రిలయెన్స్ పవర్ లిమిటెడ్ (ఆర్‌పిఎల్)కు 28,033 కోట్ల రూ॥ లబ్ధి

నిబంధనలకు భిన్నంగా ప్రభుత్వం ఆర్‌పిఎల్ సంస్థకు రాయితీలు కల్పించడాన్ని కాగ్ తప్పు పట్టింది. ఆర్‌పిఎల్ సంస్థకు ఎంపిలో చిత్రాంగి పవర్ ప్రాజెక్టు ఉంది. దాని కోసం మూడు బొగ్గు గనులు కేటాయించారు. ఇందులో అదనపు బొగ్గును వాళ్లదే మరో ప్రాజెక్టు (ససాన్ అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టు)కు తరలించేందుకు నిబంధనలకు భిన్నంగా మంత్రుల బృందం అనుమతినిచ్చింది.

దీని వలన అనిల్ అంబానీ సంస్థకు 29,033 కోట్ల రూ॥ లాభం చేకూరింది. నిజానికి 3వ గని (ఛత్రశాల గని)ని ఎన్‌టిపిసి (ప్రభుత్వ రంగ సంస్థ) నుండి లాక్కుని మరీ కేటాయించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని కాగ్ సూచించింది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్లక్ష్యం చేయడం, బాగా నడుస్తున్న వాటిని నడవకుండా చేయడం, వాటి అభివృద్ధిని ఆటంకపరచడం మన పాలకుల విధానంగా మారింది.

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడుస్తూ బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సి)లకు అనుకూలంగా భారత ఆర్థిక విధానాలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ పాలకులు భారత బడా దళారీ బూర్జువా వర్గానికి అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలకు రెండు చేతులా ప్రజల సంపదను దోచిపెడుతున్నారు. ఆ మేరకు తమ వాటాకు కూడా భంగం రాకుండా చూసుకుంటున్నారు.

గతంలో 2జి స్పెక్ట్రమ్ స్కాములో ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్ అనుసరించిన విధానంపై, విధానపరంగా నిష్క్రియాపరత్వం చూపించినందుకు విమర్శలొచ్చాయి. అవినీతిని కాపాడడాన్ని, కొనసాగించడాన్ని అన్ని వైపుల నుండి వేలెత్తి చూపించారు. ఇప్పుడు ప్రధాని స్వయంగా బాధ్యత వహించిన (2004 నుండి 2009 వరకు) బొగ్గు శాఖలో భారీ కుంభకోణం వెలుగు చూసింది. స్కాములలో ఇది రికార్డ్ బ్రేక్.

ఇదే సందర్భంగా స్విస్ బ్యాంకుల్లో మన పాలకులు, బ్యూరాక్రాట్లు దాచిపెట్టిన నల్లడబ్బు లెక్కలు గుర్తు చేసుకుంటే బాగుంటుంది. 2006లో స్విస్ బ్యాంకింగ్ సంఘం ఇచ్చిన లెక్కల ప్రకారం ఒక లక్షా నలభై ఐదు వేల కోట్ల డాలర్లు, మన రూపాయల్లో అరవై ఆరు లక్షల కోట్ల రూపాయలు. ఈ ఐదారు సంవత్సరాలు కూడబెట్టి దాచిన నల్లధనం కూడా కలిపితే అది రెండింతలు కావచ్చు. ఇదంతా ప్రజా ధనమే. అది జాతి సంపద. దీన్ని కొల్లగొట్టడం, దారి మళ్లించడం, విదేశీ బ్యాంకుల్లో దాచుకోవడం ప్రజాద్రోహం, దేశ ద్రోహం కూడా. 127 సంవత్సరాల 'ఘన' చరిత్ర గల కాంగ్రెస్ దళారీ పాలకుల అవినీతి వటవృక్షపు స్కాముల (శాఖల) జాబితా పెరిగిపోతున్నది. ఈ మధ్య కాలంలో 2జి, కామన్‌వెల్త్, ఆదర్శ్ కుంభకోణాలు ఒక కుదుపు కుదిపాయి. ఇప్పుడు బొగ్గు, ఎంఆర్‌పి, రిలయెన్స్ కుంభకోణాలు సందడి చేస్తున్నాయి. రాజా, కల్మాడి, షిండే, షీలా దీక్షిత్, మన్‌మోహన్ సింగ్, చిదంబరం, ఎస్‌ఎం కృష్ణ, కపిల్ సిబ్బల్, ప్రఫుల్ పటేల్ ఇలా ఎందరో స్కాముల్లో వున్నవారే. 34 మంది కేంద్ర మంత్రుల్లో 15 మంది వివిధ కుంభకోణాలలో ఉన్నవాళ్లే. వారందరి అవినీతి గురించి పత్రికలు, కోర్టులు బహిరంగంగానే చర్చిస్తున్నాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో, వీధుల్లో రోజూ అలజడి చెలరేగుతూనే ఉంది. నిరసనగా ఆందోళనలు జరుగుతున్నాయి. బంద్‌లు జరుగుతున్నాయి.

పార్లమెంటు అట్టుడికిపోయి రోజూ వాయిదాలు వేస్తున్నా, దేశం నలుమూలలా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నా, రాజ్యాంగ సంస్థ వేలెత్తి చూపించినా, మరి కొన్ని ఆక్షేపణలున్నా మన్‌మోహన్ సింగ్ 'సచ్చీలుడే'! ఇంకా నాకేమీ తెలియదనే బుకాయిస్తున్నాడు. బొగ్గు కేటాయింపుల్లో పారదర్శకత లేదనేది తేలిపోయిన విషయం. అందుకే చిదంబరం 'బొగ్గు తవ్వలేదు, నష్టం లేదు' అని లాయర్ లాజిక్ ప్రదర్శించి అందరి చేత చీవాట్లు తిన్నాడు. అవినీతి జరిగిపోయాక ఖజానాకు నష్టం కాకుండా ఎలా వుంటుంది? ప్రజా ధనం కొల్లగొట్టారు. పంచుకుతినేశారు. ఏమి చేసినా ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమా వారికుంది.

కాంగ్రెస్ పాలకులు తమ తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి 'కాగ్' లెక్కలు తప్పన్నారు. కాగ్‌కు ఆ అధికారం లేదన్నారు. దానికి పరిమితులున్నాయన్నారు. కాగ్ అన్నీ లీక్ చేస్తుందన్నారు. బిజెపికి కాగ్‌కు సంబంధాలున్నాయన్నారు. ఇలా ఎన్ని పక్క మాటలు మాట్లాడినా, అసలు అవినీతి జరగలేదని దబాయించినా ఎవ్వరూ కాంగ్రెస్ వాదనలు వినలేదు. సుప్రీంకోర్టు కూడా కాగ్‌కున్న సాధికారతను స్పష్టం చేసింది. రాజ్యాంగంలో 147 నుండి 151 వరకు ఉన్న అధికరణాలు కాగ్ అధికారాల్ని స్పష్టంగా నిర్వచించాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమాన హోదా గల ఆడిటర్ జనరల్ విషయంలో బాధ్యతారహితంగా మాట్లాడకూడదని పలువురు హితవు చెప్పారు.

కాంగ్రెస్ పాలకులు సిగ్గు విడిచారు. నవ్విపోతారన్న దిగులులేదు. ఈ పబ్బం గడిస్తే ఎన్నికల వరకు ఏదోలా మోసం, మాయతో దబాయించేసి నెట్టుకు వస్తే చాలు. ఏదో ఒక కలయికతో, నూతన ఎత్తుగడలతో అధికారాన్ని నిలుపుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారు. ఇదీ వారి విధానం. ఇదే కాంగ్రెస్ నైజం.

బిజెపి పార్లమెంటు, రాజ్యసభల్లో ఎంత గోల చేసినా మిగిలిన ప్రతిపక్షాల్ని కలుపుకు రాగల స్థితిలో లేదు. చివరికి ఒంటరిగానన్నా పోరాడి కాంగ్రెస్‌ను దించి అధికారంలోకి రావాలని కోరిక ఉన్నా దానికా శక్తి లేదు. ప్రజల్లో దానిపైన విశ్వాసం లేదు. బిజెపి అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇవే కుంభకోణాలు, అవినీతి జరిగాయి. వామపక్షాలు, మిగిలిన ప్రతిపక్షాలు ఒక్కటిగా నిలబడి ఐక్య పోరాటాలు చేయడానికి ప్రజాందోళన నిర్మించడానికి సిద్ధంగా లేవు.

వామ పక్షాలు ఇప్పటి వరకు చెప్పుకుంటున్న పశ్చిమ బెంగాల్‌లో సీపీఎమ్ అధికారం ఇప్పుడు ప్రజల వ్యతిరేకతతో కుప్పకూలింది. వామపక్షాలు ముఖ్యంగా సీపీఎమ్ అవినీతి, అణచివేత విధానాలను ప్రజలు తిప్పికొట్టారు. ఎన్నికల ద్వారా రివిజనిస్టులు తెచ్చే 'సోషలిజం' బండారం బట్టబయలైంది. దోపిడీ వర్గాలతో అంటకాగడం కోసం పాలక పక్షాలలో ఏదో ఒక పక్షంతో జతకట్టే వర్గ సంకర రాజకీయాలు గల రివిజనిస్టు పార్టీలు ఇవి. అవినీతి, దోపిడీలకు, విదేశీ జోక్యందారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నడపాలనే ఎజెండా వీరికి ఉండదు. వామపక్షాలతో పాటు పార్లమెంటరీ పార్టీలన్నింటికి స్వార్థ సంకుచిత

ప్రయోజనాలున్నాయి. ఆ మేరకు వాళ్లలో చీలికలున్నాయి. ఆ చీలికల్ని కాంగ్రెస్ సరిగానే వినియోగించుకుంటున్నది. పార్లమెంటు సరిగా జరగని కారణం చూపి అనేక ప్రజా వ్యతిరేక బిల్లులు, పద్దులను ప్రతిపక్షాలు లేకుండా ఆమోదింపజేసుకుంటున్నారు. ఇది కాంగ్రెస్‌కు లాభంగానే పరిణమిస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎంత బూటకమో రోజు రోజుకూ మరింతగా వెల్లడవుతున్నది.

ఈ దళారీ పాలకవర్గ పార్టీలను పక్కనబెట్టి ప్రజలు ఐక్యకార్యాచరణతో అన్ని చోట్ల విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్మించి, మిలిటెంట్‌గా అవినీతిని ఎదుర్కోవాల్సి ఉంది. కేంద్రంలో కాంగ్రెస్ పాల్పడిన పెద్ద కుంభకోణాల్లో ఛత్తీస్‌గఢ్ బొగ్గు గనుల లీజులో బీజేపీ అవినీతి, ఒడిశాలోని బిజెడి పార్టీ పాల్పడిన బొగ్గు కుంభకోణాలు కూడా భాగమే. బొగ్గు కుంభకోణాలపై కేంద్రంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒక పోరాటం నడుస్తున్నప్పుడే సెప్టెంబర్ 6న ఒడిశా అసెంబ్లీలో బిజెడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఒక మిలిటెంట్ పోరాటం చేసింది. స్పీకర్ పైకి ఎంఎల్‌ఏలు కుర్చీలు విసిరారు. 30 వేల మంది బారికేడ్లు దాటి అసెంబ్లీలోకి ప్రవేశించారు. లాఠీచార్జ్, రాళ్ల వర్షంతో అక్కడ ఒక యుద్ధ వాతావరణం ఏర్పడి పోలీసులు జల ఫిరంగులు వినియోగించారు. భువనేశ్వర్ పోలీసు డిజిపి, కాంగ్రెస్ ఒడిశా అధ్యక్షుడితో సహా చాలా మందికి గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇదే బొగ్గు గనుల అక్రమ అమ్మకాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకత్వంలో రెండు సార్లు రాష్ట్రమంతా పెద్ద ఆందోళనలు జరిగాయి. ఒకవైపు కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుంభకోణాలకు పాల్పడుతుండగా, మరో వైపు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల్లో జరుగుతున్న కుంభకోణాలకు వ్యతిరేకంగా వీరంగం సృష్టిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ లాంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోను ఈ రకమైన కుంభకోణాలు ఎన్నో నడుస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ ద్వంద్వ స్వభావానికి, అవకాశవాద అధికార రాజకీయాలకు నిదర్శనమీ విధానాలు.

'కాంగ్రెస్ గద్దె దిగాలన్న బిజెపి, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్‌పై ఎందుకు పోరాడదు, రమణ్‌సింగ్‌ను ఎందుకు గద్దె దింపదు' అని కాంగ్రెస్ నిలదీస్తోంది. ఏ స్థాయికాస్థాయిలో అందరికీ అవినీతి కుంభకోణాల్లో వాటాలున్నాయి. గతం, వర్తమానం ఇదే చెబుతోంది. భవిష్యత్‌కు ఇదే పునాది. అసలు అవినీతి, కుంభకోణాలకు దోపిడీ వర్గాల వ్యవస్థే మూలం. ఆ మూలాన్ని ఛేదించకుండా, ఆ పాలకుల్ని తరిమికొట్టకుండా, దోపిడి పాలనను అంతం చేయకుండా అవినీతి పోదు. కుంభకోణాలు ఆగవు.

భారతదేశం సిరి గల దేశం. అనేక రకాల సంపదలున్నాయి. ఖనిజ సంపదకు కొదువ లేదు. అనేక బొగ్గు నిక్షేపాలున్నాయి. అవన్నీ ప్రజలకు చెందాలి. కానీ భారత పాలకులు విదేశీయులతో కుమ్మక్కై భూగర్భంలోకి జొరబడి మింగేస్తున్నారు.

కాబట్టి ఎన్ని సంపదలున్నా భారత ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారు. గతంలో కారణాలు చెప్పడానికి, వివరించడానికి కొద్దిగా కష్టపడాల్సి వచ్చేది. ఇప్పుడు కళ్లకు కట్టినట్లు రోజువారీ అవినీతి, కుంభకోణాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఈనాడు అందరికీ కారణాలు తెలుస్తూనే ఉన్నాయి. సంపద ఎవరి దగ్గర ఉందో, అది అధికారం ఎలా చెలాయిస్తుందో, అది రాజ్యాన్ని ఎంత పాశవికంగా తయారు చేస్తుందో, ప్రజలపై గ్రీన్‌హంట్ వంటి దాడులను చేస్తుందో అందరికి విదితమే. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎంత బూటకమో స్పష్టమైపోతోంది. ఈ దోపిడి పాలకవర్గాలు వున్నది వాటాల పంపకానికి, అధికారం కోసం కొట్లాడుకోవడానికే గాని ప్రజా ధనాన్ని కాపాడడానికి, ప్రజలకు రక్షణ కల్పించడానికి, ప్రజా సంక్షేమానికి పాటుపడడానికి కాదని అర్థమైపోతోంది. పార్లమెంటరీ వ్యవస్థ కుళ్లిపోయింది. దానిని నాశనం చేయాల్సిందే.

అన్నా హజారే, బాబా రామ్‌దేవ్‌ల అవినీతి వ్యతిరేక పోరాటాలకు పార్లమెంటరీ పార్టీల వెనకదన్ను వుండడం, ఎన్నికల ప్రణాళిక వుండడం, మరీ ముఖ్యంగా చిత్తశుద్ధి, నిజాయితీ కొరవడడం కారణంగా ప్రజా పునాది లేని పోరాటాలుగానే మిగిలిపోయాయి. ప్రపంచ బ్యాంకు మద్దతు, ప్రోత్సాహం గల 'అవినీతి వ్యతిరేక పోరాటం' తాత్కాలికంగా మధ్య తరగతిని గెలుచుకున్నప్పటికి కూడా అది 'కొయ్య గుర్రాల స్వారీనే' అని అతి తక్కువ కాలంలోనే అందరికి అర్థమైంది. కుయుక్తులు, కుట్రలతో ప్రజల్ని ఎక్కువ కాలం మోసగించలేరని కుహనా పోరాటాలు నడపలేరని అందరికీ తెలిసిన విషయమే.

ప్రజలు ఎక్కడికక్కడ సంఘటితమై ఐక్యకార్యాచరణ ద్వారా సంఘటిత, మిలిటెంట్ పోరాటాలు చేయాలి. విప్లవకర నాయకత్వంలో దోపిడి వర్గాల దుర్మార్గాలను ఎండగట్టాలి. దోపిడి పీడన లేని, అవినీతి లేని ప్రజా రాజ్య నిర్మాణం కోసం కృషి చేయాలి. అన్ని సెక్షన్ల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, పీడిత ప్రజల పక్షాన నిలిచి అవినీతిమయమైన నిరంకుశ పాలనను మట్టుబెట్టాలి. ప్రజా రాజ్య నిర్మాణంకై సంఘటితపడాలి. నాలుగు వర్గాల ఐక్య కార్యాచరణతో అర్ధ వలస, అర్ధ భూస్వామ్యాన్ని ఓడించే జనతా ప్రజాస్వామిక విప్లవానికి నడుం కట్టి పోరాడాలి.

★

## గమనిక

**ఇప్పుడు 'క్రాంతి' bannedthought.netలో కూడా లభిస్తుంది. 2006 నుండి అన్ని సంచికలు ఇందులో అందుబాటులో వున్నాయి.**

**- సంపాదకులు**

# జీవ వైవిధ్య సదస్సు సాధించింది శూన్యం

ప్రకృతి సహజ సిద్ధం. జీవజాలం అంతా పదార్థమయం. పరస్పర ఆధారంతో చలించే ప్రకృతి, చలన నియమాలకు అనుగుణంగా పరిణామం చెందుతుంది. పుట్టడం, గిట్టడం రెండూ విరుద్ధశక్తుల ఐక్యతా ఘర్షణల ఫలితమే. నిర్జీవం నుండి 500 కోట్ల సంవత్సరాల క్రితమే పదార్థ వైవిధ్యం కారణంగా, సంఘర్షణ ఫలితంగా జీవం పుట్టింది. ఈ 500 కోట్ల సంవత్సరాల చరిత్రను జీవ వైవిధ్య చరిత్రగా చెప్పవచ్చు. అనేక కోట్ల రకాల జీవజాతులు ఆవిర్భవించాయి. ఈ వైవిధ్యం లేకుండా ప్రకృతి పరిణామాలను, మానవ సమాజ మనుగడను, పురోగమనాన్ని అర్థం చేసుకోవడం కష్టం. వందల కోట్ల సంవత్సరాల ప్రకృతి ప్రసాదితమైన జీవ వైవిధ్య సంపదను మానవులు స్వార్థ చింతనతో, సామ్రాజ్యవాద దేశాల కుతంత్రాలతో విచ్ఛిన్నం చేస్తున్నారు. ప్రకృతి వినాశనానికి పరుగులు తీస్తున్నారు. ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని గుర్తించి, కాపాడడానికి వుపయోగపడవలసిన అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులు సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల వాణిజ్యాన్ని పెంచే వేదికలుగా మారుతున్నాయి. ప్రజా వ్యతిరేక, ప్రకృతి వినాశకర నిర్ణయాలు చేస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1992లో బ్రెజిల్‌లోని రియోలో 120 దేశాలు పాల్గొన్న ధరిత్రి సదస్సు జరిగింది. అక్కడ యుఎన్ఒ ఆధ్వర్యంలో ఒక జీవ వైవిధ్య పరిరక్షణ సంస్థ ఏర్పడింది. అది ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సు నిర్వహిస్తున్నది. 2010లో జపాన్‌లోని నగోయాలో 10వ అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సు జరిగింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ నగరంలో అక్టోబర్ 1 నుండి 19 వరకు 11వ అంతర్జాతీయ సదస్సు జరిగింది.

యుఎన్ఒలో 193 సభ్య దేశాలున్నాయి. 11వ సదస్సుకు 180 దేశాలు హాజరయ్యాయి. 2,500 మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 14,400 మంది ఈ వేదికను సందర్శించారు. 80 కోట్ల రూపాయల ఖర్చుతో భారీ బందోబస్తుతో అట్టహాసంగా జరిగిన సదస్సులో 32 అంశాలు చర్చకు వచ్చాయి. 29 అంశాలు ఆమోదించినట్లు చెబుతున్నా, ముఖ్యమైన విషయాల పట్ల అంగీకారం కుదరక పోవడంతో ఒక వుమ్మడి ప్రకటన చేయడంలో సదస్సు విఫలమయ్యింది. జీవవైవిధ్య రక్షణకు అవసరమైన నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పరచడంలో ఏకాభిప్రాయం సాధించలేదు. కాప్–10 నగోయా సదస్సులో ప్రకటించిన లక్ష్య సాధన ప్రకటనపై ఇంతవరకూ సంతకాల కార్యక్రమం పూర్తి కాలేదు. ఆ లక్ష్య సాధనకు 450 బిలియన్ డాలర్ల నిధులు అవసరమని అంచనా వేసినా అవి సమకూరే పరిస్థితి కానరావడం లేదు. అమెరికా మొదటి సదస్సు నుండి ఇప్పటి వరకూ ఏ ఒప్పందంపై కూడా అసలు సంతకం చేయడానికే అంగీకరించలేదు. 'అనేక జీవ జాతులు – ఒకే భూమి, ఒకే భవిష్యత్' అనే నినాదం ప్రచారంలో పెట్టిన హైదరాబాద్ సదస్సు (కాప్–11) జరిగిన విధానం, దాని నుండి వచ్చిన ఫలితం చూస్తే నిరాశే కలుగుతుంది.

"జీవ వైవిధ్యాన్ని రక్షించడం, సుస్థిరంగా వినియోగించడంలో స్థానిక సమూహాల జ్ఞానాన్ని, సృజనాత్మకతను గౌరవించి కాపాడి నిలబెట్టడానికి కట్టుబడి వుండాలని" అధికరణం జె8 ప్రకటించింది. 193 దేశాలు పాల్గొన్న మొదటి అంతర్జాతీయ సదస్సులో – కన్వెన్షన్ ఆన్ బయోడైవర్సిటీ (సిబిడి)పై సంతకాలు చేసారు. అమెరికా అగ్రరాజ్యం సిబిడిపై ఇంత వరకు సంతకం చేయలేదు. అది అభివృద్ధి చెందిన దేశాల జీవ వైవిధ్య సంపదను కొల్లగొడుతుంది. జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో ఎటువంటి జవాబుదారితనం చూపడం లేదు. గత 20 సంవత్సరాలుగా జరిగిన సదస్సులు సాధించింది ఏమీలేదు. మొక్కుబడి చర్చలు జరపడం, ఒప్పందాలను, తీర్మానాలను అమలు చేయకపోవడం వాటి విధానం. వాటి మెడలు వంచి ఒప్పందంపై సంతకం పెట్టించగలిగే పరిస్థితి కానరావడంలేదు.

జీవ వైవిధ్యాన్ని నాశనం చేయడం, పర్యావరణ వినాశనంతో పెద్ద ఎత్తున వాతావరణ మార్పులకు కారణం కావడం అమెరికన్ అగ్రరాజ్యంతో పాటు సామ్రాజ్యవాద దేశాల విధానంగా వుంది. గత పది సదస్సులు, నేటి 11వ సదస్సు సామ్రాజ్యవాద దేశాల పారిశ్రామికీకరణకు, వాణిజ్యీకరణకు వేదికలుగా మారాయి. దీనికి తోడు సామ్రాజ్యవాద దేశాల కనుసన్నలలో నడిచే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ), ప్రపంచ మేధో సంపత్తి సంస్థలు అంతర్జాతీయ ఒప్పందాలను అభివృద్ధి చెందుతున్న దేశాలపైన ఆర్థిక నియంత్రణకు వినియోగిస్తున్నాయి. జీవ వైవిధ్య వనరులను, జ్ఞానాన్ని, హక్కులను కాజేస్తున్నాయి. ఆ దేశాల జాతీయ విధానాలను శాసిస్తున్నాయి. బహుళ జాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా ఆ దేశ ప్రభుత్వాలు కొత్త చట్టాలు రూపొందించేలా ఒత్తిడి చేస్తున్నాయి. గత 10 సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం అనేక రకాల చట్టాలు రూపొందించింది. విత్తన చట్టం, పేటెంట్ చట్టం, వృక్ష జాతుల రైతుల హక్కుల పరిరక్షణ చట్టం, జాతీయ వ్యవసాయ విధానం, జీవ వైవిధ్య చట్టం లాంటివి తెచ్చింది. ఇవన్నీ కూడా జీవ రూపాలపై పేటెంట్ హక్కులను, మేధో సంపత్తి హక్కులను బయటివారికి (ఎమ్ఎన్‌సిలకు) కట్టబెట్టే వ్యవస్థలను సమర్థించి వారికి తలుపులు బార్లా తెరవడానికి అనుమతినిచ్చేందుకే వుపయోగపడ్డాయి.

2002లో ప్రవేశపెట్టిన జీవ వైవిధ్య చట్టం పేటెంట్ వ్యవస్థను

*ప్రకృతిలో జీవవైవిధ్య సంపద ఒక అద్భుతం. కాపాడుకోవడం మన బాధ్యత.*

*భూమిపైన, ఎత్తైన పర్వత శిఖరాలలో, లోతైన సముద్ర గర్భాల్లో, మంచు ధృవ ప్రాంతాల్లో, అడవుల్లో మొత్తం పర్యావరణంలో వంద మిలియన్ రకాల వివిధ జీవ జాతులు విస్తరించి వున్నాయి.*

*అనంత వైవిధ్యంగల జీవ సంపదలోని కొద్ది శాతం మాత్రమే మన పూర్వీకులు, శాస్త్రజ్ఞులు గుర్తించి పేర్లు పెట్టారు. అందులో కూడా అతి కొద్ది భాగం సుమారుగా 40 వేల రకాల వృక్ష, జంతు సంబంధ పదార్థాలను ఆహారం, ఔషధం అవసరాలకు వుపయోగిస్తున్నారు.*

*జీవ శాస్త్రజ్ఞుల ఒక అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతీ గంటకు మూడు జీవ జాతులు అంతరిస్తున్నాయి. మరో అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం 27 వేల జాతులు అంతరించిపోతున్నాయి.*

ఆమోదించింది. మన దేశ స్థానిక సమూహాల, ఆదివాసుల, రైతుల హక్కులకు ఎటువంటి రక్షణ లేకుండా చేసింది. పేటెంట్స్ ప్రజల జ్ఞానాన్ని, సంపదను ప్రైవేటీకరించి అందరికీ అందుబాటులో లేకుండా చేస్తాయి. ప్రజల జీవ వైవిధ్య సంపద, జ్ఞానం మొత్తం ఇప్పుడు బహుళజాతి సంస్థల చేతుల్లోకి చేరిపోయింది. ఆ జ్ఞానాన్ని, ఆ రూపాలను ఏవైనాగాని భారత దేశ ప్రజలు వారు చెప్పిన ధర చెల్లించి తిరిగి కొనుక్కోవాలి. ఇది సిబిడి ఒప్పందం జె8 అధికరణానికి పూర్తిగా వ్యతిరేకమైనది. ఏవి కాపాడబడాలో ఆ హక్కులన్నీ వోనపూరితంగా తరలించుకుపోయే చట్టాలు రూపొందించారు భారత పాలకులు. ఇదంతా సామ్రాజ్యవాదులు, బహుళజాతి సంస్థల కుతంత్రం, ఆ సదస్సులలో జరిగిన చర్చల ఫలితాలు ఇలా రూపం దాల్చుతున్నాయి కనుకనే సామాజిక కార్యకర్తలు వీటిని వ్యతిరేకిస్తున్నారు.

ఇక్కడ జన్యుమార్పిడి జీవాలు (లివింగ్ మాడిఫైడ్ ఆర్గానిజమ్) గురించి విస్తృతంగా చర్చలు జరిగాయి. రెండు భిన్న ప్రయోజనాల మధ్య వాగ్వివాదాలు జరిగాయి. బహుళజాతి సంస్థల వ్యాపార ప్రయోజనాల కోసం జన్యు మార్పిడి లాభదాయకం అని కొందరు చర్చించారు. జీవ భద్రత, జీవ వైవిధ్య పరిరక్షణకు జన్యు మార్పిడి నష్టదాయకం, భవిష్యత్ వినాశనానికి దారితీస్తుందని సామాజిక కార్యకర్తలు వాదించారు. ఒకే జాతి మొక్కలు, పక్షులు, జంతువుల మధ్య జన్యు మార్పిడి అరుదుగా జరుగుతుంది. ప్రకృతికి విరుద్ధంగా భిన్న జాతుల మధ్య సంకరం వినాశనానికి దారితీస్తుంది.

బిటి పత్తి రైతాంగానికి, పర్యావరణానికి కలిగించిన నష్టం అందరికీ తెలిసినదే. జన్యుమార్పిడి పంటల్లో దిగుబడులను పెంచే జన్యుకణం లేదు. పైర్ల దిగుబడి పెరగదు. శనగపచ్చ పురుగును నిరోధించే శక్తి వుందని మొదటిలో జరిగిన ప్రచారం కూడా నిజం కాదని తేలిపోయింది. వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకొనే సామర్థ్యం దానికి లేదు. ఆర్థికంగా లాభదాయకం కాదు. రైతులు నష్టాలకు గురయ్యి ఆత్మహత్యలకు పాల్పడడం నిత్యం జరుగుతున్న సత్యం. బిటి పత్తి 95 – 98 శాతం సాగులో వుంది. బిటి పత్తి వచ్చి వందల పత్తి రకాలన్నీ నాశనమయ్యాయి. జీవవైవిధ్యాన్ని నాశనం చేయడంతో పాటు జన్యు కాలుష్యాన్ని పర్యావరణ అసమతుల్యాన్ని కల్గిస్తుంది. ముఖ్యంగా నేల, నీరు, గాలిని కాలుష్యం బారిన పడేసింది. బీటీ విత్తనాలను నియంత్రించే విధానం వుండాలని ఎనిమిది సంవత్సరాల క్రితం స్వామినాధన్ సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

జన్యుమార్పిడి, జీవాల బదిలీ, నిర్వహణ, గుర్తింపు, వీటి వలన వచ్చే ముప్పు, నష్టాలు సంభవిస్తే ఇవ్వాల్సిన పరిహారం, వివాదాల పరిష్కారం, సామాజిక ఆర్థిక అంశాలు, జీవవైవిధ్యం, ప్రకృతి వనరులు, పర్యావరణంపై పడే ప్రభావం మొదలైన విషయాలపై చర్చించాలని వర్ధమాన దేశాల ప్రతినిధులు పట్టుబట్టినా ప్రయోజనం లేకపోయింది. బిటి విత్తనాల వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు? విత్తన తయారీ సంస్థలా? విక్రయ సంస్థలా? అనుమతి ఇచ్చిన ప్రభుత్వమా? ప్రజలకు నష్టం కలిగించిన ఇటువంటి అంశాలను చర్చించడానికి ఈ సదస్సులో అవకాశాలు లేవు. ప్రకృతి వనరులు దోపిడీకి గురవుతున్నాయి. పర్యావరణం క్షీణించి జీవ వైవిధ్యం విధ్వంసం అవుతుంది. జీవ వైవిధ్యంపై ప్రత్యక్ష ప్రభావం పడుతున్న ఈ అంశాల గురించి సదస్సు చర్చించలేదు.

నిజానికి జీవ భద్రత, జీవ వైవిధ్య రక్షణ పైన నియమ నిబంధనలను (ప్రోటోకాల్స్‌ను) గతంలో జరిగిన నగోయా, కోలాలంపూర్ సదస్సుల్లోనే రూపొందించారు. వాటిని సామ్రాజ్యవాద దేశాలు వ్యతిరేకించాయి. అమెరికా సంతకం కూడా పెట్టలేదు. కేవలం 40 దేశాలు మాత్రమే సంతకం పెట్టాయి. భారత్‌తో సహా ఏ దేశం కూడా ఈ నియమ నిబంధనల్ని అమలు చేయలేదు. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. సామ్రాజ్యవాద దేశాలు ఆమోదించకుండా ఇది సాధ్యం కాదు. జీవ భద్రత లేకుంటే జీవ వైవిధ్య వినాశనమే జరుగుతుంది. ఈ జీవ వైవిధ్య అంతర్జాతీయ సదస్సులు ఏం సాధిస్తున్నాయో, ఎవరి ప్రయోజనాలకు పనిచేస్తున్నాయో, ఈ సదస్సుల్లో ఎవరి భవిష్యత్ ప్రయోజనాలు ప్రధానమో స్పష్టమే. బహుళజాతి సంస్థలకు ప్రత్యేక ఎజెండా వుంది. గుత్త సంస్థలు తయారు చేసే జన్యుమార్పిడి

విత్తనాలను మాత్రమే విక్రయించేలా చేయడం, జీవవ్యాపారాన్ని సజావుగా సాగించడం వారి అసలు అంతర్యం. ఆధునిక సాంకేతిక ప్రయోజనాలకు, జీవ వైవిధ్య భద్రతకు మధ్య ఈ వైరుధ్యం సామ్రాజ్యవాదం సృష్టించినదే. మన వనరులను సాంకేతిక పరిజ్ఞానాన్ని బహుళజాతి సంస్థలకు గుత్తగా అప్పగించడం సరైనదేనా? అని సదస్సు చర్చించాల్సి వుంది. ఇటువంటి చర్చకు వేదిక అయితే బాగుండేది. ప్రకృతిలోని జీవవైవిధ్యాన్ని కాపాడడం అభివృద్ధి చెందిన జీవులుగా మానవుల నైతిక బాధ్యత. సదస్సు ఆ బాధ్యతను విస్మరించింది.

వ్యవసాయాభివృద్ధికి, జీవ వైవిధ్యానికి అవినాభావ సంబంధం వుంది. మన దేశంలో అనేక పైర్లున్నాయి. వాటిల్లో అనేక రకాలున్నాయి. ఉదాహరణకు వరిలో 65 వేల రకాలు, కందిలో 40 వేల రకాలు, వంకాయలో మూడు వేల రకాలు, మామిడిలో రెండు వేల రకాలు వుండేవి. అవన్నీ ఇప్పుడు తరిగి పోయాయి. మానవాళికి వుపయోగపడే పక్షిజాతులు, వన్య ప్రాణులు, పురుగులు, సూక్ష్మ క్రిములు నశించిపోయాయి. అడవులు, భూములు, జలసంపదలు నశించిపోయాయి. ఊరపిచ్చుకల వంటి రైతు బాంధవులు కానరావడం లేదు. మన జాతీయ పక్షి నెమలి కాప్ లోగోలో సైతం కానరాలేదు. మన ఒంగోలు గిత్త, మన ఇంటి ముందటి వేప చెట్టు కూడా కనుమరుగైపోతున్నాయి.

జీవ వైవిధ్య సదస్సు మానవాళికి జరుగుతున్న ప్రమాదాలపై మౌనం వహిస్తుంది. జీవ వైవిధ్య సంపద పుష్కలంగా వున్న భారతదేశం లాంటి వర్ధమాన దేశాల్లోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అభివృద్ధి పేరిట భారత ప్రభుత్వం అనుమతిని ఇవ్వడంతో కార్పొరేటు సంస్థలు ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టడం, గనులు తవ్వడం, అడవుల్ని నరికి వేయడం, నదీజలాలను తరలించుకు పోవడంతో భూములు, జలాలు, వాతావరణం కలుషితమై పోతున్నాయి. పంటలు దెబ్బ తింటున్నాయి. అనారోగ్య సమస్యలు పెరిగి ఆకలి, అనారోగ్యం రోజు వారీ సమస్యలుగా మారిపోయాయి. ప్రకృతి సంపదలతో పాటు జీవ వైవిధ్య సంపదకు ఎటువంటి భద్రత లేని పరిస్థితి ఏర్పడింది. మధ్య భారతంలో ఇప్పుడు ఆదివాసులను ఖాళీ చేయించడానికి సైన్యాన్ని దించి భారత ప్రభుత్వం 'గ్రీన్‌హంట్' పేరుతో ప్రజలపై యుద్ధం చేస్తున్నది. సామ్రాజ్యవాదులకు భారతదేశంలోని జీవ వైవిధ్య సంపత్తి మీద కన్నుబడింది. అందుకే ఇక్కడ ఈ సదస్సు జరిపారు.

వ్యవసాయ జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం జరుగుతున్నది. ప్రకృతి నుండి వేరుపడిపోయిన వ్యవసాయ భవిష్యత్ అంధకారం అవుతుంది. ప్రకృతిలో వున్న వివిధ రకాల ఆహారం నేడు దొరకకుండా అడవులు, నీరు, గాలి కలుషితం అయ్యాయి. చాలా వరకు ప్రకృతి సంపద నాశనం అయ్యింది. మనం కొన్ని రకాల ఆహారాలకే పరిమితమైపోయాం. కృత్రిమ వుత్పత్తులకే అలవాటు పడిపోయాం. దోపిడీ పాలక వర్గాల వలన ప్రకృతిలో జీవ వైవిధ్యం నాశనమయితే రేపు భవిష్యత్‌లో జన్యు మార్పిడి జరగని జీవరాశి దొరకకుండా పోతుంది. పారిశ్రామిక వ్యవసాయం రసాయన ఎరువులను, క్రిమి సంహారక మందులను విచ్చలవిడిగా వుపయోగించి భూమి మీద, భూగర్భంలోను వుండే జీవరాశుల్ని నాశనం చేయడంతో వ్యవసాయానికి మానవ మనుగడకు వుపకరించే ఎన్నో జీవులు లేకుండా పోయాయి. ప్రకృతి సహజమైన సమతులనం దెబ్బతింటున్నది. ఉదాహరణకు మన ఆరోగ్య రక్షణకు వుపకరించే ఔషధ మొక్కలు నాశనం అవుతున్నాయి. మరోవైపు కప్పలు, కీటకాలు పెద్ద మొత్తంలో చనిపోవడంతో రోగ కారకమైన దోమలు పెరిగి మలేరియాతో పాటు అనేక రకాల కొత్త రకాల అంటు వ్యాధులు వ్యాపించి ప్రతీ సంవత్సరం లక్షల మంది మరణాలకు కారణం అవుతున్నది.

మానవాళి నేడు వాతావరణ మార్పుల వలన కలుగుతున్న విపరిణామాలను అనుభవిస్తున్నది. వాటి నుండి సరైన పరిష్కారాలు దొరకక గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. పర్యావరణ సదస్సులో కర్బన వుద్గారాలు తగ్గించాలని, ఓజోన్ పొరకు వచ్చిన ప్రమాదం నుండి రక్షణ ఏర్పాట్లు చేయాలని, వాతావరణ వుష్ణోగ్రతలు క్రమంగా తగ్గించాలని చేసుకున్న అంతర్జాతీయ ఒప్పందాలను సామ్రాజ్యవాద దేశాలు లక్ష్య పెట్టడం లేదు. దానితో వాతావరణంలో విపరీత ధోరణులు చోటు చేసుకుంటున్నాయి. కరువు కాటకాలు, భూకంపాలు, సునామీలు సంభవిస్తున్నాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే జీవవైవిధ్యాన్ని కాపాడాలి. జీవవైవిధ్య రక్షణలో ప్రజల బాధ్యత ప్రధానమైనది. సామ్రాజ్యవాద యుగంలో పాలకుల విధ్వంసకర పాత్రను ప్రజలు చైతన్యయుతంగా పోరాడి ఓడించకుండా ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోలేం.

జీవకోటికి ప్రాణాధారాలు గాలి, నీరు, పర్యావరణం. అవి కలుషితమైతే జీవకోటికి సంకటమే. వృక్షజాతులు, జంతుజాలం, అవి జలచరాలు, కీటకాలు, సూక్ష్మజీవులు ఏవైనాగాని పర్యావరణ విచ్ఛిత్తితో పాటు నాశనం కావడమే. మానవ సమాజ మనుగడకు ప్రమాదంగా జరుగుతున్న పరిణామాలు అవాంఛనీయం. మానవ నైతికతకు ఒప్పుదల కానిది. అభివృద్ధికి అర్థం ప్రకృతి వినాశనం కాదు. వనరుల దోపిడీ కాదు. కాలుష్యం సృష్టించడం కాదు. ప్రకృతి పరిణామాలను నియమానుసారం కొనసాగించే విధంగా, జీవ వైవిధ్యాన్ని రక్షించడం. అప్పుడే జీవ భద్రత, వ్యవసాయోత్పత్తులు, మానవ ఆరోగ్యం సంరక్షణ, జీవన ప్రమాణాల మెరుగుదల,సకల జీవరాశుల, జాతుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం.

ధరిత్రి సదస్సు (1992) నుండి రెండు దశాబ్దాల కాలంలో జరిగిన విపరిణామాల కారణంగా కర్బన వుద్గారాలు 48 శాతం పెరిగాయి. 74 కోట్ల హెక్టార్ల అడవులు నాశనమయ్యాయి. సార హీన భూములు 15 నుండి 25శాతంకు పెరిగాయి. వుష్ణోగ్రత 3శాతం పెరిగింది. బొగ్గుపులుసు వాయువు 10శాతం పెరిగింది.

చమురు వాడకం విపరీతంగా పెరిగింది. నీటి కొరత పెరిగి పోయింది. నీరు, ఇంధనం కోసం భవిష్యత్‌లో మరిన్ని యుద్ధాలు జరుగుతాయి. ప్రతీ ఆరుగురిలో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఇంకో వందేళ్లలో మనిషితో పాటు ఎన్నో రకాల జీవరాశులు అంతర్ధానమవుతాయి అని ఫ్రాంక్ పెన్నార్‌లాంటి శాస్త్రజ్ఞులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవ వైవిధ్య రక్షణకు 28 చట్టాలున్నాయి. జాతీయ, అంతర్జాతీయ చట్టాలున్నాయి. అనేక రకాల ఒప్పందాలున్నాయి. వాటిని మన ప్రభుత్వాలు లక్ష్య పెట్టడం లేదు. ప్రజా ఆందోళనలు కొన్ని భవిష్యత్ విపరిణామాలను తాత్కాలికంగా ఆపగలిగినా, దోపిడీ పాలకులు అమలుచేసే అణచివేత, దుర్మార్గం, కుట్రల ముందు కొనసాగడం లేదు.

భారతదేశంలో 1960-70ల కాలంలో వచ్చిన హరిత విప్లవం ప్రజల ఆకలిని తీర్చలేదు. ఆహార భద్రతా చట్టం వచ్చినా ఆ చట్టం ఆకలి తీర్చలేదు సరికదా కునారిల్లుతున్న ప్రజల జీవన స్థితిగతుల్ని అంచనాలు కట్టడంలోనే కాలయాపన చేస్తున్నది. ప్రజల ఆకలి ఆక్రందనలను ప్రభుత్వ 'హరిత విప్లవాలు, చట్టాలు' పెంచాయి.

జీవ సాంకేతిక పరిజ్ఞానం (బిటి) తెచ్చిన టెర్మినేట్ విత్తనాలు చీడలు పోగొట్టలేదు. దిగుబడులు పెరగలేదు. రైతు ఖర్చులు పెరిగాయి. అప్పుల సుడిగుండంలో పడిన ఆ రైతు పురుగుమందులే తిని ఆత్మహత్య చేసుకున్నాడు. భారత దేశంలో 2 లక్షల 70 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ పంటలు తిని కొత్త రోగాలొచ్చాయి. కోట్ల మంది ప్రజలు అనారోగ్యం పాలయ్యారు.

ప్రపంచంలో 400 మిలియన్ల తీర ప్రాంత జనాభా వుంది. భారతదేశంలో 64 మిలియన్ల ప్రజలు తీర ప్రాంతాల్లో జీవిస్తున్నారు. పోర్ట్‌లు, షిప్ యార్డ్‌లు సముద్ర తీరాల్లో పెరగడంతో జాలర్ల జీవనానికి, సముద్ర జీవరాశుల రక్షణకు ప్రమాదం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పేరుతో కృష్ణపట్నంలోను, నెల్లూరు జిల్లాలోను అనేక రకాల ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. 15 జిల్లాలలో 70 సెజ్‌ల నిర్మాణంతో పాటు అనేక పవర్ ప్రాజెక్టులు నిర్మాణం అవుతున్నాయి. థర్మల్ ప్రాజెక్టుల వలన సముద్రాల్లోకి పెద్ద ఎత్తున కాలుష్యం చేరుతున్నది. సముద్రగర్భంలో ఆల్గే అడవులు నశిస్తున్నాయి. జీవరాశులు కోట్ల సంఖ్యలో నాశనం అవుతున్నాయి. ఇసుక మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం స్పందనలేదు. దేశంలో 500 అభయారణ్యాలు క్రమంగా తరిగిపోతున్నాయి. అక్కడ జీవించే తెగలు 75 శాతం లేకుండా పోయాయి. నాలుగు సంవత్సరాలకు ఒక జీవజాతి అంతరించిపోతున్నది. అతి తక్కువ కాలంలోనే భారతదేశంలో 2.9 శాతం జీవజాతులు (1,721) నశించాయి.

ఉదాహరణకు బొగ్గు గనుల తవ్వకాలు, గ్రానైట్ కొండలు తొలగించేయడం, బాక్సైట్, ఇనుము లాంటి ఖనిజాల కోసం, చమురు కోసం చేసే తవ్వకాలు, ఇసుక మాఫియా పెద్ద ప్రాజెక్టుల, కోసం అడవులు నరికి వేయడం, హైదరాబాద్‌లాంటి పెద్ద పెద్ద నగరాల నిర్మాణం కోసం చేసిన విధ్వంసం కారణంగా నేల, నీరు, గాలి కలుషితం కావడం, జీవజాతులు అంతరించడం బాగా పెరిగింది.

11వ అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులో భాగంగా అనేక రకాల ప్రత్యేక సమావేశాలు జరిగాయి. ప్రపంచ దేశాల నుండి వివిధ రకాల శాఖల మంత్రులు, అధికారులు, అనేక నగరాల మేయర్లు (400 మంది), వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు వచ్చి పాల్గొని వారి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కొన్ని పుస్తకాలు ఆవిష్కరించారు. మన దేశ ప్రధాని, పర్యావరణ, అటవీశాఖ మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ ఇలా ఎంతో మంది ఇందులో భాగం పంచుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎంతో జీవ వైవిధ్యం వుందని గొప్పలు చెప్పారు. జీవ వైవిధ్య రక్షణకు బాధ్యతను ప్రకటించలేకపోయారు.

ఇదే సందర్భంగా మరో వైపున పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణకు స్వచ్ఛందంగా కృషి చేసే సంస్థలు, ఉద్యమకారులు పోటీ సదస్సులు, అనేక కార్యక్రమాలు చేపట్టారు. బహుళజాతి సంస్థల కుతంత్రాలను, జీవ వైవిధ్యానికి జరుగుతున్న నష్టాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసారు. సాంప్రదాయ వైద్య విధానాన్ని, పశు సంపదను కాపాడుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రకృతి సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడాన్ని, పర్యావరణాన్ని దెబ్బ తీయడం వలన వ్యవసాయంపై పడే ప్రభావాన్ని చెప్పారు. పక్షుల ఆవాస కేంద్రాలు, చిత్తడి నేలలు ఇలా ఎన్నో రకాల జీవ వైవిధ్య సంపదలు కాపాడుకోవాలన్నారు. ప్రజా ఉద్యమ జాతీయ వేదిక, ఆంధ్రప్రదేశ్ వృత్తికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజల ఆహార సార్వభౌమత్వం, భూమి-జీవ వైవిధ్యం'పై చర్చా గోష్టిలో ప్రముఖ సామాజిక వుద్యమకారుడు సందీప్ పాండే పాల్గొన్నాడు. సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని, కాంట్రాక్టు వ్యవసాయం వచ్చి రైతుల్ని కంపెనీలకు బానిసలుగా మార్చివేసిందని, ఆదివాసీ హక్కుల వుల్లంఘన, వన్య పాణి వినాశనం జరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. అక్టోబర్ 13న కెఆర్ చౌదరి అధ్యక్షతన నిర్వాసిత జన చైతన్య ఉద్యమం 'విధ్వంస వ్యతిరేక సభ' నిర్వహించింది. అక్టోబర్ 14, 15 తేదీలలో 20 స్వచ్ఛంద సంస్థలు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వెయ్యి మందితో ప్రజా వైవిధ్య సదస్సు (పోటీ సదస్సు) నిర్వహించారు.

నగోయా కాప్ - 10 సదస్సు జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా ఇంజనీరింగ్ పరిశోధనలపై నిషేధం విధించింది. అయినా కొన్ని ఎమ్ఎన్‌సిలు పరిశోధనలు చేస్తూనే వున్నాయి. వ్యాపార ప్రయోజనాలకు అవి అర్రులు చాస్తూనే వున్నాయి.

మానవులు ప్రకృతిలో భాగం. ఒంటరులు కాదు. స్వతంత్రులు కాదు. ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించడంలోనే మానవులకు స్వేచ్ఛ వుంది. ప్రకృతి సమతులనం దెబ్బతింటే జరిగే

విపరిణామాలకు మానవజాతి మూల్యం చెల్లించకతప్పదు. దేశ సరిహద్దుల్ని తుడిచివేస్తుందని చెబుతున్న ద్రవ్యపెట్టుబడి లాభ దాహంతో ప్రకృతి వినాశనానికి పరుగులు తీస్తున్నది. ద్రవ్య పెట్టుబడి అరాచకాలను అరికట్టకపోతే, సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించకపోతే జీవ వైవిధ్య పరిరక్షణ సాధ్యం కాదు. ఇది ప్రజల సమిష్టి బాధ్యత, నైతిక కర్తవ్యం.

తరతరాలుగా ప్రజలు కాపాడి తమ తర్వాతి తరాలను అందించిన జీవ వైవిధ్య సంపదను కాపాడాలి. ప్రకృతి వనరులను ప్రజల వుమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి. ప్రకృతి జ్ఞానం, సంస్కృతి, జీవనోపాధి సమిష్టి భాగస్వామ్యంతో పెంపొందాయి.

2014లో దక్షిణ కొరియాలో కాప్-12వ సదస్సు జరపాలని నిర్ణయం జరిగింది. 2020 నాటికి జీవవైవిధ్య రక్షణకు అవసరమనుకున్న లక్ష్య ప్రకటన సాధ్యాసాధ్యాలు ఇక్కడ (కాప్-11) ఒక కొలిక్కి రాలేదు. నిధులు లేవు. వుమ్మడి అంగీకారం లేదు. మళ్లీ ఏవో అంచనాలు, లెక్కలు, వర్గీకరణలు, వ్యూహాలు-ప్రతి వ్యూహాల గురించిన చర్చలే మిగిలాయి. ఏ ప్రయోజనం చేకూర్చని, ఫలితాలనివ్వని, భవిష్యత్ ఆశల్ని కల్పించని ఈ సదస్సులు వందల కోట్ల రూపాయల ఖర్చుతో చేసిన జాతరలే తప్ప మరొకటి కాదు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలిగితే మానవ మనుగడకు గ్యారంటీనిచ్చే విధంగా ఎన్నో వృక్ష, జంతు జాతుల రక్షణ సమకూరుతుంది. ఈ బాధ్యత మనదే. ఇది వ్యక్తిగత స్థాయిలో నిర్వహించేదికాదు. మానవ సమూహాలు గతంలో గణనీయమైన పాత్ర నిర్వహించాయి. వుత్పత్తి చేయడం ద్వారా మానవుడు ప్రకృతిపై వేసిన ముద్ర కొనసాగించడం, కాపాడడం మనందరి సమిష్టి బాధ్యత. నేటి సామాజిక ఆర్థిక రాజకీయాలలోని స్వార్థ సంకుచిత లాభాల కోసం ద్రవ్య పెట్టుబడి సృష్టిస్తున్న మార్కెట్ భావజాలాన్నీ, సామ్రాజ్యవాద వ్యవస్థ చట్రాన్నీ బద్దలు కొట్టి, సమసమాజ ఆర్థిక రాజకీయాలు విజయం సాధించినపుడు మాత్రమే సమస్త మానవాళి మనుగడకు, ప్రకృతి పర్యావరణాల విస్తృతాభివృద్ధికి, వికాసానికి, ముఖ్యంగా జీవ వైవిధ్య సమతుల్యతకు రక్షణ, జీవ భద్రతకు గ్యారంటీ ఏర్పడుతుంది.

సమాజానికి, ప్రకృతికి మధ్య సయోధ్యను సాధించడం ద్వారానే సమతులనాన్ని కాపాడగలం. వైవిధ్య రక్షణ రహస్యం అందులోనే దాగి వుంది. భారతదేశంలో దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా చేసే అన్ని రకాల ప్రకృతి విధ్వంస, జీవ వైవిధ్య వినాశన కార్యకలాపాలకు వ్యతిరేకంగా అన్ని సెక్షన్ల ప్రజలు ఐక్యంగా తక్షణం పోరాడాల్సిన అవసరం వుంది. ★

# విజ్ఞప్తి

*ప్రియమైన కామ్రేడ్స్,*

*'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.*

*అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినదీ; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.*

*అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.*

# విప్లవం ఆగలేదు; అది నిదానంగానో, వేగంగానో అభివృద్ధి చెందుతూనే వుంది

## (సి.పి.ఎన్.) మావోయిస్టు ఛైర్మన్ కామ్రేడ్ కిరణ్‌తో ఇంటర్వ్యూ)

**అంతర్జాతీయం.**

***1. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితి గురించి మీ అంచనా ఏమిటి?***

కొన్ని దశాబ్దాలుగా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలు ప్రముఖంగా అభివృద్ధి చెందాయి. ఉత్పత్తి శక్తుల రంగంలో ఇది గుణాత్మకమార్పు. ఈ రంగంపై సామ్రాజ్యవాద గుత్తాధిపత్యం వుంది. దీన్ని ఆధారం చేసుకొని తన ఆధిపత్యంలో ఏకధృవ ప్రపంచ వ్యవస్థను నిలబెట్టాలని అమెరికా సామ్రాజ్యవాదం కలలు కంటున్నది. కాని, 2008 సంవత్సరాంతంలో వేగంగా పెరిగిన ఆర్థిక సంక్షోభానికి అమెరికా సహా అనేక యూరప్ దేశాలు గురయ్యాయి. ద్రవ్యపెట్టుబడిని వుత్పత్తిరంగంలో తగ్గించి, అనుత్పాదక రంగమైన మిలిటరీ రంగంలో పెట్టిన దాని పర్యవసానమే ఈ ఆర్థిక సంక్షోభం.

ఈ సంక్షోభానికి నిజమైన పరిష్కారం సామ్రాజ్యవాదం వద్ద లేదు. అమెరికా, ఇంకా ఇతర దేశాల్లో ఈ సంక్షోభం వేగంగా పెరుగుతూ, అభివృద్ధి చెందుతుండటం వల్ల ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సోషలిజం వైపు ఆకర్షితులవుతుండడం, మరొకవైపు సామ్రాజ్యవాదం పట్ల విసిగిపోవడంతో, మొత్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో బలమైన కార్మిక పోరాటాలు పెల్లుబికే అవకాశం వుంది. అమెరికా సామ్రాజ్యవాదానికి పోటీగా ఇతర పోటీ కూటములు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పరిస్థితిలో ఏకధృవ ప్రపంచ వ్యవస్థ అనే అమెరికా కల సాకారమయ్యే అవకాశం లేదు.

అమెరికా సామ్రాజ్యవాదం, దాని కూటమి శక్తులు ఈ సంక్షోభం నుండి బయటపడడానికి అరబ్ దేశాలతో సహా మధ్య ఆసియాలోని చమురు వనరులను చేజిక్కించుకోబూనుకున్నాయి. అందులో భాగంగానే తమ జోక్యందారీ చర్యల్ని లిబియా నుండి ఇప్పుడు సిరియాపై త్వరితం చేశాయి. ఇదే మార్గంలో అవి ప్రదక్షిణలు చేస్తున్నాయి.

ప్రస్తుతం, ప్రపంచంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు, పెట్టుబడిదారీ వర్గానికి, శ్రామిక వర్గానికి మధ్యనున్న వైరుధ్యాలు కొంతకాలం నిదానంగా, మరికొంత కాలం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికీ కూడా సామ్రాజ్యవాదానికి, పీడిత దేశాలకు మధ్యనున్న వైరుధ్యాలే ప్రధానమైనవి. ఇందులో మార్పు లేదు. ఈ నాటికి కూడా విప్లవమే ప్రపంచపు ప్రధాన ధోరణిగా వుంది.

మొత్తంగా చూస్తే, వస్తుగత (భౌతిక) పరిస్థితి విప్లవానికి అనుకూలంగా వుంది. దీనితో పోల్చినప్పుడు స్వీయాత్మక (విప్లవశక్తుల) స్థితి బలహీనంగా వుంది. పెరూలో విప్లవం వెనుకపట్టు పట్టడం, నేపాల్‌లో లొంగుబాటు విధానం, మితవాద అవకాశవాదం తలెత్తడం విచారించాల్సిన విషయాలు. కాని ప్రపంచంలో కొన్ని దేశాల్లో గట్టి విప్లవ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో సి.పి.ఐ. (మావోయిస్టు) గట్టి కృషి చేస్తున్నది. ఈ సమయంలో స్వీయాత్మక పరిస్థితిని బలోపేతం చేసుకొని సామ్రాజ్యవాదానికి, ప్రతిఘాతుకశక్తులకు వ్యతిరేకంగా పోరాటంపై కేంద్రీకరించి విప్లవానికి సన్నద్ధం కావడం అనేది ప్రపంచంలోని విప్లవకర కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం.

విప్లవం ఆగలేదు, నిదానంగానో, వేగంగానో అది అభివృద్ధి చెందుతూనే వుంది. క్షయం, ప్రవహించటం అనే వాటికి సంబంధించిన గతితార్కిక నియమాలపైన ఆధారపడి విప్లవ చరిత్ర వుంటుంది. అన్ని రకాల సామ్రాజ్యవాదం, ప్రతిఘాతుకత్వాల ఓటమి, శాస్త్రీయ సోషలిజపు విజయం తప్పదు. అంతిమంగా చరిత్ర పురోగామి అభివృద్ధిని, విప్లవ వేగాన్ని ఎవరూ అపలేరు.

***2. మావో మరణం తర్వాత నుండి ఇప్పటివరకు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రయాణం గురించి క్లుప్తంగా వివరించగలరా?***

కామ్రేడ్ మావో మరణానంతరం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం బలంగా తలెత్తే పరిస్థితి ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా మితవాద రివిజనిజం విప్లవానికి ప్రధాన ప్రమాదమైంది. ఈరోజు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం రెండుగా చీలిపోయింది. విప్లవపంథాకు, అవకాశవాద పంథాకు మధ్య చావు బతుకుల పోరాటం సాగుతోంది. మితవాద అవకాశవాదంపై దృఢంగా పోరాడుతూ విప్లవకర కమ్యూనిస్టులు ముందుకు వెళుతున్నారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు అరుణపతాకను, కమ్యూనిజాన్ని, నూతన శిఖరాలకు ఎత్తిపట్టారు.

***3. ప్రస్తుతం విప్లవకర అంతర్జాతీయ వుద్యమం (రిమ్) పరిస్థితి ఎలావుంది? దాని భవిష్యత్ పట్ల నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దృక్పథం ఏమిటి?***

ఇప్పుడు రిమ్ కొంత బలహీనపడింది. సరైన నియంత్రణ (నిర్వహణ) లేదు. ప్రస్తుత పరిస్థితిలో అది ముందుకు పోలేదు. నూతన మార్గంలో సంఘటితం చేయాలి. సంబంధిత (భాగస్వామ్య) పార్టీలు, సంస్థలు దానిపట్ల మరింత శ్రద్ధ వహించాలి. అంతిమంగా,

దాని భవిష్యత్ తేజోవంతంగా కనిపిస్తున్నది.

***4. కామ్రేడ్ ఛైర్మన్! ఇప్పుడు సైద్ధాంతిక పరమైన ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను. ప్రస్తుతం సామ్రాజ్యవాద స్థితి, దాని అభివృద్ధి గురించిన విశ్లేషణపై నయా మార్క్సిస్టులకు, బూర్జువా మేధావులకు మధ్య కొన్ని విభేధాలున్నాయి. దీనిపై సి.పి.ఎన్. (మావోయిస్టు) విశ్లేషణ ఏమిటి?***

లెనిన్ సామ్రాజ్యవాదాన్ని గుత్త పెట్టుబడిదారీ విధానంగా నిర్వచించారు. సారాంశంలో అది ఈనాటికి కూడా లెనిన్ విశ్లేషించినట్లుగానే వుంది. కాని దాని రూపంలో, అభివృద్ధిలో కొద్దిపాటి మార్పు వుంది. సామ్రాజ్యవాదం ప్రపంచీకరణ చెందినప్పటికీ, ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విస్తృతంగా అభివృద్ధి చెంది, దాన్ని సామ్రాజ్యవాదం చేజిక్కించుకోవటం వల్ల సామ్రాజ్యవాదం గతం కంటే విస్తృతంగా ప్రపంచీకరణ చెందింది.

లెనిన్ కాలంలో కూడ పెట్టుబడిదారీ మేధావులు, రివిజనిస్టు శక్తులు సామ్రాజ్యవాదాన్ని ఎత్తిపట్టటంలో చురుగ్గా పనిచేశారు. సామ్రాజ్యవాదాన్ని ఎత్తిపట్టే మేధావులు, శక్తులు ఈ రోజు కూడ తలెత్తారు. ఇది కొత్తదీ, ఇంతకు ముందు జరగనిదేమి కాదు. రూపంలో కొద్ది మార్పు వుంది తప్ప, సారాంశంలో కాదు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ. అది గుత్తపెట్టుబడిదారీ విధానం.

***5. బూర్జువా మేధావులు, నయా మార్క్సిస్టులే కాదు, యు.సి.పి.ఎన్. (మావోయిస్టు) కూడా సామ్రాజ్యవాదానికి సంబంధించిన లెనిన్, మావోలు చేసిన అనేక విశ్లేషణలు నేటి పరిస్థితికి సరిపోవని చున్-బాంగ్ మీటింగ్ ద్వారా వాటి ప్రాముఖ్యతను తగ్గించి వేసింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన సి.పి.ఎన్. (మావోయిస్టు)లో వున్న కామ్రేడ్స్ దాదాపుగా అందరూ చున్‌బాంగ్ మీటింగ్‌లో వున్నవారేగదా! ఈ నిర్ణయాన్ని మీ సి.పి.ఎన్. (మావోయిస్టు) ఏ విధంగా సమీక్షిస్తున్నది?***

చున్ బాంగ్ మీటింగ్ ప్రతిపాదించిన సామ్రాజ్యవాదానికి సంబంధించిన విశ్లేషణ పెస్సిమిజం, నిరాశావాదం, లిక్విడేషనిజం, జాతీయ లొంగుబాటు విధానంల పునాదిపై ఆధారపడి చేసినది. సామ్రాజ్యవాదానికి సంబంధించిన లెనిన్ విశ్లేషణ, మావో సూత్రీకరణలకు ఈ ప్రతిపాదన వ్యతిరేకమైనది. సామ్రాజ్యవాదం గురించి అటువంటి విశ్లేషణ జరిగిన తర్వాత లెనిన్, మావోలు అభివృద్ధి చేసిన పార్టీ పంథా, ఎత్తుగడలు ప్రస్తుత పరిస్థితికి సరిపోవని చెప్పి, చున్‌బాంగ్ మీటింగ్ ప్రతిపాదన మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. సామ్రాజ్యవాదానికి సంబంధించిన ఈ విశ్లేషణ నయా రివిజనిజపు ప్రధాన లక్షణాల్లో ఒకదాని ప్రతిబింబమే. మార్క్సిజానికి సంబంధించిన విప్లవకర సారాంశాన్ని కిందికి నెట్టి ఈ విశ్లేషణను పైన కూర్చోబెట్టారు.

***6. ద్రవ్యపెట్టుబడి, అమెరికన్ సామ్రాజ్యవాదపు మితిమీరిన ఆధిపత్యం సామ్రాజ్యవాదానికి సంబంధించిన రెండు కొత్త లక్షణాలు అని ఫాలుంగ్‌తార్ విస్తృత సమావేశంలో బాబూరామ్ విశ్లేషించాడు. సోషలిస్టు విప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవాలకు సంబంధించి లెనిన్, స్టాలిన్, మావోలు అభివృద్ధి చేసిన పార్టీ పంథా, ఎత్తుగడ, విప్లవకర, అంతర్జాతీయతావాద ఉద్యమాలు తమ విలువను కోల్పోయాయని నూతన పార్టీ పంథా అవసరమని అన్నాడు. దీని పట్ల మీ పార్టీ దృక్పథం (వైఖరి) ఏమిటి?***

సామ్రాజ్యవాదానికి సంబంధించిన భట్టారాయ్ విశ్లేషణ చున్‌బాంగ్ మీటింగ్‌లో ఇచ్చిన వివరణ కొనసాగింపే. ఈ వివరణ లెనిన్ విశ్లేషణ కంటే చాలా ముందు నుంచి వున్నదే. ఈ ప్రతిపాదన సామ్రాజ్యవాదాన్ని ఎత్తుగడల రీత్యా నిజమైన పులిగా చూడాలనే మావో విశ్లేషణను కాదని, వ్యూహాత్మకంగా సామ్రాజ్యవాదాన్ని నిజమైన పులిగా అంగీకరించేందుకు అనుకూలమైనది. ఈ విశ్లేషణతో వారు వ్యూహం ఎత్తుగడల అభివృద్ధి పేరున, నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపన నుంచి వైదొలగి, లోక్ తాంత్రిక్ గణతంత్ర (ప్రజాస్వామిక రిపబ్లిక్)కు సంబంధించిన అవకాశవాద పంథా, ఎత్తుగడలను చేపట్టారు.

***7. ప్రస్తుతం ప్రపంచంలో వలసవాదం ఏ రూప, సారాల్లో వునికిలో వుంది?***

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదం వలస పీడన స్థానంలో కొత్త రూపాన్ని తీసుకొచ్చింది. కాని, సారాంశంలో ఇది వలస పీడనే. ఇటువంటి నూతన పీడనా రూపాన్ని నయా వలసవాదం అంటున్నాం. ఈ నయా వలసవాదాన్ని అమలు చేసే క్రమంలో సంబంధిత దేశంలో తమ ఏజెంట్ (బంటు)ను సృష్టించి, ఆ బంటు ద్వారా కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచి, ఆ ప్రభుత్వం ద్వారా సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, వ్యూహాత్మక ప్రయోజనాలను నెరవేర్చుకుంటారు. ఈ పద్ధతి ప్రత్యక్ష సైనిక జోక్యానికి భిన్నమైనది. అవసరమైతే వారు ఆ దేశంలో ప్రత్యక్ష సైనిక జోక్యాన్ని ఉపయోగించడమో, మరొక పద్ధతితో కలిపి వుపయోగించటమో చేస్తారు. నయా వలసవాదం పాత వలసవాదం కంటే మరింత ప్రమాదకరమైనది.

***8. సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పీడిత రాజ్యాలు పోరాడటం అసాధ్యమంటున్న బాబురామ్ భట్టారాయ్ దృక్పథం పట్ల మీరెలా స్పందిస్తారు?***

ప్రస్తుతం ప్రపంచంలో సామ్రాజ్యవాదానికి, పీడిత దేశాలకు మధ్య నున్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం. ఈనాటికి కూడ పీడిత దేశాలను ప్రధానంగా పీడిస్తున్నది అమెరికన్ సామ్రాజ్యవాదమే. ఈ వాస్తవాన్ని బాబురామ్ భట్టారాయ్ మరుగుపరచి, మట్టిలో కలపాలని చూస్తున్నాడు. ఇది సామ్రాజ్యవాదానికి ఏజెంటుగా పనిచేస్తూ, దాన్ని నిస్సిగ్గుగా రక్షించ బూనుకోవటం తప్ప మరొకటి కాదు.

***9. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ప్రత్యేకించి 1970 తర్వాత బూర్జువా ఆర్థికవేత్తలు, నయా ట్రాట్స్కైట్లు, నయా మార్క్సిస్టులు***

***సామ్రాజ్యవాదపు ప్రపంచీకరణ రూపం అభివృద్ధిపై తమదైన మార్గంలో వివిధ పరిశోధనలు చేశారు. దీని ద్వారా సామ్రాజ్యవాదానికి సంబంధించిన లెనిన్ విశ్లేషణ ఇప్పుడు వుపయోగం లేనిదని రుజువు చేయడానికి ప్రయత్నించారు. కాని, మార్క్సిస్టులు-లెనినిస్టులు పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదంల అభివృద్ధి గురించి వస్తుగతం (నిర్దిష్టం)గా అధ్యయనం, పరిశోధనలు చేయలేదు. ఈ పరిస్థితిని మీ పార్టీ ఎలా పరిశీలిస్తుంది? ఈ ఖాళీని పూరించడానికి మీకేమైనా ప్రణాళిక వుందా?***

సామ్రాజ్యవాదానికి సంబంధించి అభివృద్ధి చెందుతున్న లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా బూర్జువా ఆర్థికవేత్తలు ట్రాట్స్కెట్లు సృష్టించిన భ్రమల్ని తొలగించడానికి, పార్టీ పంథా, ఎత్తుగడలను అభివృద్ధి చేయడానికి అధ్యయన ప్రక్రియ పురోగమించాల్సిన అవసరం వుంది.

## దేశీయం

***10. ఇటీవల యు.సి.పి.ఎన్. (మావోయిస్టు) నుంచి విడిపోయి సి.పి.ఎన్. (మావోయిస్టు) పార్టీగా ఏర్పడటం తప్పనిసరైన ఆవశ్యకత అని మీరెలా నిరూపించగలరు?***

ఏ విప్లవకర కమ్యూనిస్టు పార్టీ అయినా ఐక్యంగా వుండటానికి మౌలిక సూత్రం, పార్టీ పంథా, ప్రధాన వ్యూహం, ఎత్తుగడల పట్ల ఏకీభావం అవసరం. కాని, మా మధ్య అది లేదు.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని పార్టీ మార్గదర్శక సూత్రంగా ఆమోదించడం జరిగింది. కాని, ప్రచండ-బాబురామ్ గ్రూపు అనుసరిస్తున్న కదంబవాదం (కలగూరగంపవాదం) మావోయిజాన్ని, మావో ఆలోచనా విధానాన్ని సమాంతరంగా చూపుతున్నది. నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపనకు తగిన రాజకీయ పంథా, ఎత్తుగడల బదులు, వ్యతిరేక పంథా, ఎత్తుగడ, సంస్కరణవాద వ్యూహం, పార్లమెంటరీవాదాన్ని చేపట్టారు. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, విస్తరణవాదానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులతో ఐక్యసంఘటన ఏర్పరిచే బదులు, వ్యతిరేక శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరిచే విధానాన్ని చేపట్టారు. పార్టీని శ్రామిక వర్గానికి అగ్రగామిగా నిలిపి, వర్గశత్రు వ్యతిరేక వైఖరి తీసుకోవలసిన అవసరం వుంది. కాని, వారు వర్గ సామరస్య విధానం, జాతీయ లొంగుబాటు విధానం అవలంబించారు. అవకాశవాదంతో తెగదెంపులు చేసుకోవటం తప్ప మరో మార్గం లేదు. నూతన పార్టీ ఏర్పాటు ప్రకటన తప్పనిసరి అవసరం.

***11. ఈ సంవత్సరం జూన్ 16-18 తేదీలలో మీ పార్టీ నిర్వహించిన జాతీయ సదస్సు ప్రచండ-బాబురామ్ గ్రూపును నయా రివిజనిస్టులుగా ప్రకటించింది. మీరు నయా రివిజనిస్టులంటున్న వారు, ఏయే అంశాల్లో పాత (సంప్రదాయ), ఆధునిక రివిజనిస్టుల కంటే భిన్నమైనవారు?***

అవును, 2012 జూన్ 16-18 తేదీలలో జరిగిన మా పార్టీ, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జాతీయ సదస్సు ప్రచండ-బాబురామ్ గ్రూపును నయా రివిజనిస్టు గ్రూపుగా ప్రకటించింది. సంప్రదాయ, ఆధునిక, నయా రివిజనిజాల మధ్య సారాంశంలో సారూప్యత వున్నప్పటికీ రూపంలో తేడా వుంది. మార్క్సిజానికి సంబంధించిన మౌలిక సూత్రాలైన గతితార్కిక చారిత్రక భౌతికవాదం, వర్గపోరాటం, సాయుధ పోరాటం, శ్రామికవర్గ నియంతృత్వం మొదలైన వాటిని సాంప్రదాయ రివిజనిజం బహిరంగంగా, బహిర్గతంగా వ్యతిరేకించి, నిరాకరిస్తుంది. ఆధునిక రివిజనిజం మార్క్సిజం ముసుగులో మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తుంది. కాని, నయా రివిజనిజం పిడివాదాన్ని (డాగ్మాటిజాన్ని) వ్యతిరేకించి, మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయించే పేరుతో మార్క్సిజం సూత్రాలను ఆమోదించినట్లు కన్పిస్తూనే మార్క్సిజంపై దాడి చేస్తుంది.

సంప్రదాయ (పాత) రివిజనిజపు మితవాద, మధ్యేవాద ధోరణి, కదంబవాదపు ఆలోచనా విధానాన్ని నయా రివిజనిజం స్వీకరిస్తుంది. అది మార్క్సిజం ముసుగు కింద ఆధునిక రివిజనిజపు ప్రమాణాలను కూడా ఉపయోగిస్తుంది. ఇంకా, అది (పిడివాదాన్ని వ్యతిరేకించడం అనే పేరిట) సృజనాత్మక అన్వయింపు మార్క్సిజపు విశిష్ట సుగుణమని చెబుతూ మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తుంది. ఇన్ని రకాల నయా రివిజనిజాన్ని మితవాద విచ్ఛిన్నవాద, వర్గ సామరస్య విధానాన్ని, జాతీయ లొంగుబాటు విధానాన్ని మొత్తం సారంగా అర్థం చేసుకోవాలి. అది విప్లవకర సిద్ధాంతాన్ని, రాజకీయాలను, సంఘటితీకరణను, శ్రామికవర్గ వైఖరి మొదలైన వాటిని నీరుగార్చి, నిరాకరిస్తుంది. సంప్రదాయ (పాత), ఆధునిక మరియు అన్ని రకాల నయా రివిజనిజాన్ని పెట్టుబడిదారీ భావజాల (ఆలోచనా) రూపంగానే అర్థం చేసుకోవాలి.

***12. 2004లో జరిగిన పూర్తి స్థాయి కేంద్రకమిటీ సమావేశం ద్వారా ప్రచండ- బాబురామ్‌లు '21వ శతాబ్దంలో ప్రజాస్వామ్యపు అభివృద్ధి' అనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఇది మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోలు చెప్పిన శ్రామికవర్గ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఉన్నత అభివృద్ధికర ఆలోచన అని చెప్పారు. మీ పార్టీ దీన్ని ఎలా తీసుకుంటుంది?***

2004 ఏప్రిల్‌లో జరిగిన పూర్తి స్థాయి కేంద్రకమిటీ సమావేశంలో '21వ శతాబ్దంలో ప్రజాస్వామ్యపు అభివృద్ధి' అనే ప్రతిపాదన ఆమోదం పొందింది. ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడానికి పరస్పర సహకారమే గాక, స్నేహపూర్వక పార్టీలతో సైతం పోటీపడాలి అని ఈ ప్రతిపాదన పేర్కొంది. కాని, శాంతి ప్రక్రియను ఆమోదించిన తర్వాత, స్నేహపూర్వక పార్టీల కంటే ఎక్కువగా ఇతర పార్టీలతో పోటీ ప్రారంభమైనప్పుడు, వారు పాత (సంప్రదాయ) పెట్టుబడిదారీ ప్రమాణాలతో బహుళపార్టీల పోటీకి ప్రణాళిక తయారుచేశారు. ప్రజాస్వామ్యం ప్రకారం, ఆ సమయంలో,

ఆ ప్రతిపాదన వర్గ పోరాటానికి, శ్రామికవర్గ నియంతృత్వానికి వ్యతిరేకమైనది. ఆ విధంగా ఈ ప్రతిపాదన వాస్తవంలో ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడానికి కాదని, బూర్జువా పార్లమెంటు వ్యవస్థలోకి దూకడానికి పునాది తయారు చేసుకొనే లక్ష్యంతో చేసినదని, ఆ ప్రతిపాదనను మేము వ్యతిరేకించాము.

***13. సి.పి.ఎన్. (మావోయిస్టు) నిర్వహించిన ప్రసిద్ధ చున్‌బాంగ్ సమావేశాన్ని, అది ఆమోదించిన పార్టీ పంథాను మీరు ఎలా చూస్తారు?***

2006 సెప్టెంబర్– అక్టోబర్‌లో కేంద్రకమిటీ నిర్వహించిన చున్‌బాంగ్ సమావేశం ఆమోదించిన పార్టీ రాజకీయ పంథా ప్రధానంగా మితవాద అవకాశవాద పంథా. విముక్తి ప్రాంతాలు స్థాపించబడి, ప్రజా ప్రభుత్వాల (ప్రజా కమ్యూన్ల) నిర్మాణం వేగంగా అభివృద్ధి చెందిన స్థితిలో, లోక్‌తాంత్రిక్ గణతంత్ర (ప్రజాస్వామిక రిపబ్లిక్) స్థాపన పునాదిపై ఐక్యసంఘటన తయారు చేయడం అంటూ ముందుకు తెచ్చిన విధానం, వ్యూహాత్మక దాడికి సంబంధించి తయారు చేసిన పథకం వాస్తవంలో వైరుధ్యపూరితమైనవి.

***14. నేపాల్ దేశ పరిస్థితుల్లో బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్ దశను దాటకుండా నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపన సాధ్యం కాదని ప్రచండ–బాబ్‌రామ్‌లు అనడాన్ని మీరు అంగీకరిస్తారా?***

బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్ అనే నినాదం భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన పాత పెట్టుబడిదారీ విప్లవానికి సంబంధించినది. భూస్వామ్యాన్ని వ్యతిరేకించి, ప్రజాస్వామిక రిపబ్లిక్ నినాదంతో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేసిన ఫ్రాన్స్ ప్రపంచంలో మనకొక నమూనాగా కన్పిస్తుంది. కాని ప్రపంచం చాలా మారింది. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద రూపం తీసుకుంది. పెట్టుబడిదారీ వర్గం పురోగామి (అభివృద్ధికర) లక్షణాన్ని కోల్పోయింది. ప్రపంచంలో అత్యంత పురోగామి, విప్లవాత్మక వర్గంగా శ్రామికవర్గం ఉదయించి, అభివృద్ధి చెందింది. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. రష్యాలో శ్రామికవర్గ నాయకత్వంలో సోషలిస్టు విప్లవం పూర్తయి, అనేక దేశాలు అదే మార్గంలో ప్రయాణిస్తున్న చరిత్ర మనకుంది. ఈ నేపథ్యంలో ఏ అర్థభూస్వామ్య, అర్థవలస దేశంలోనయినా బూర్జువా ప్రజాస్వామిక విప్లవం పాత పద్ధతిలో జరగదు. అది తప్పక నూతన పద్ధతిలో వుంటుంది. అది భూస్వామ్యానికి వ్యతిరేకంగానే కాక, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడ జరిగే నూతన రూపం. నేపాల్ పరిస్థితిలో కూడ ఇదే వాస్తవం.

ఇదంతా గమనిస్తూ, నేపాల్ పరిస్థితులలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం భిన్నంగా వుంటుందని మాట్లాడడమంటే, అది ఒక వైపు విప్లవమార్గం నుండి వెనక్కు మరలి, మరొకవైపు సామ్రాజ్యవాదాన్ని, విస్తరణవాదాన్ని పూజించటమే.

***15. ఇటీవల ముగిసిన జాతీయ మహాసభలో మీరు మౌలిక, ప్రధాన వైరుధ్యాలపై భ్రమలు కల్పించారనే ఆరోపణ వుంది. దీనిపై మీరేమంటారు?***

పార్టీ వేరుపడక ముందు మా పార్టీ పంథాను స్పష్టం చేయలేదని, మా పార్టీ మౌలికంగా ప్రచండ–బాబురామ్ గ్రూపుకంటే భిన్నంగా కన్పించడం లేదని అనటం వాస్తవం కాదు. ప్రచండ–బాబురామ్ గ్రూపును మేము నయా రివిజనిస్టు గ్రూపుగా ప్రకటించాము. సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణాల మధ్య మొదలైన అంశాల పరంగా పార్టీ పంథాలో మా పార్టీ సి.పి.ఎన్. (మావోయిస్టు)కు నయా రివిజనిస్టు గ్రూపుకు మధ్య తేడా వుంది. అది ఏ విధంగా అంటే..

**మొదటిది;** మార్గదర్శక సూత్రం సమస్య. ఇందులో రెండు పార్శ్వాలున్నాయి. ఇందులో ఒకటి మావోయిజం, మావో ఆలోచనా విధానం అనే రెండు పదాలను ఉపయోగించడానికి సంబంధించినది. మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని మా పార్టీ మార్గదర్శక (గైడ్‌లైన్) సూత్రంగా మేము ఆమోదించాము. నయా రివిజనిస్టు గ్రూపు మార్క్సిజం–లెనినిజం–మావోయిజం/మావో ఆలోచనా విధానంను విశ్వసిస్తున్నది. మావోయిజం, మావో ఆలోచనా విధానం అనే రెండు పదాలను సమాంతరంగా మేము ఉపయోగించేది లేదని చెపుతూ ప్రారంభం నుండి పోరాటం చేస్తున్నాం. ఇటీవల ముగిసిన జాతీయ మహాసభ నుండి, మావోయిజం పదాన్ని మాత్రమే ఉపయోగించాలని మేము నిర్ణయించాం. కాని నయా రివిజనిస్టు గ్రూపు రెండు పదాలను వుపయోగిస్తున్నది.

పార్టీ మార్గదర్శక సూత్రం సమస్యకు సంబంధించి, సూత్రాన్ని సరిగా అర్థం చేసుకున్నామా లేక లోపంగా తప్పుగా నిర్వచిస్తున్నామా అనే దాంట్లో మా పార్టీకీ, నయా రివిజనిస్టు గ్రూపుకు విభేదం వుంది. ఈ సందర్భంలో బాబురామ్ బట్టారాయ్ రాసిన "నేటి మార్క్సిజం" (రాటా ఝిల్కో త్రైమాసిక పత్రిక సంపుటి –1, సంచిక –1, జూలై–సెప్టెంబర్ 2009) అనే వ్యాసాన్ని దృష్టిలో వుంచుకోవాలి. అతడు "మార్క్సిజం పునఃస్థాపన, పునర్నిర్వచనం ఆవిష్కరించబడుతుందా?" అన్నాడు. ఇది మార్క్సిజంపై తీవ్రమైన ప్రశ్న. ఇప్పటికే ఆమోదించిన వర్గపోరాటం, బలప్రయోగం, శ్రామికవర్గ నియంతృత్వం వంటి మార్క్సిజం సూత్రాలను, సారాంశాన్ని ఈ వ్యాసంలో అతడు తప్పుగా వివరించాడు. దీనితోపాటు, నేటి ప్రపంచం స్టాలిన్ చెప్పిన దానికంటే ఒకింత ఎక్కువగా, ట్రాట్స్కీట్లు చెప్పినట్లుగానే వుందనే వాస్తవాన్ని ఈనాడు ప్రపంచంలోని మార్క్సిస్టులందరూ ఆలోచించాలి అని కూడ రాశాడు. ఈ వ్యాసం నయా రివిజనిస్టు గ్రూపు పునాది నుండి రాసిందనే విషయాన్ని గమనించాలి.

**రెండవది:** సామ్రాజ్యవాద విశ్లేషణ సమస్య. సామ్రాజ్యవాదాన్ని గుత్తపెట్టుబడిదారీ విధానమని లెనిన్ వివరించగా, మావో కూడా

మౌలికంగా అదే విశ్లేషణను ఉపయోగించాడు. ఈ విశ్లేషణ ప్రకారం వారు శ్రామికవర్గ వ్యూహం, ఎత్తుగడలను రూపొందించారు. లెనిన్, మావోలు రూపొందించిన సామ్రాజ్యవాద విశ్లేషణ, విధానాలు ఈ నాటికి కూడా సరైనవని ప్రధానంగా ఈ విశ్లేషణపై ఆధారపడే చూస్తాము. కాని, నయా రివిజనిస్టు గ్రూపు లెనిన్, మావోల విశ్లేషణకు కాలం చెల్లిందని చెప్పి, సామ్రాజ్యవాదాన్ని శాశ్వతమైనదిగా చిత్రించి, దానికి వ్యతిరేకంగా పోరాడలేమని అంటున్నారు. ఇటువంటి విశ్లేషణ చేసిన తర్వాత వారు నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమాన్ని, విధానాన్ని ఇచ్చి, తాంత్రిక్ గణతంత్ర (ప్రజాస్వామిక రిపబ్లిక్) విధానాన్ని అన్వయించారు.

**మూడవది:** మౌలిక కార్యక్రమం సమస్య. అర్ధవలస, అర్ధ భూస్వామ్య, నయావలస పరిస్థితులు గల నేపాల్‌లో మౌలిక కార్యక్రమంగా నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్ కార్యక్రమాన్ని మేము ఆమోదించాం. కాని, నయా రివిజనిస్టు గ్రూపు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని దాదాపు ముగిసిపోయిన కార్యక్రమంగా చెబుతూ, మిగిలిన విప్లవ కర్తవ్యాన్ని, దానికదే సోషలిస్టు విప్లవ వ్యూహంతో జోడించి, సోషలిస్టు విప్లవాన్ని పూర్తి చేయాల్సిన ప్లాను తయారు చేసింది. ఒకవైపు కదంబవాదంగా ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలను మిళితం చేసి, మరోవైపు ప్రజాస్వామిక విప్లవంగా ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపనను చూపిస్తున్నారు. ఇది నూతన ప్రజాస్వామిక కార్యక్రమాన్ని, విధానాన్ని నిరాకరించడమేనని అర్థం చేసుకోవాలి.

**నాలుగవది:** దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకొనే సమస్య. మేము దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకొనే సమస్యపై ప్రత్యేకంగా కేంద్రీకరించి, భారత విస్తరణవాద జోక్యానికి వ్యతిరేకంగా పోరాడాలని మాట్లాడుతున్నాం. కాని, నయా రివిజనిస్టు గ్రూపు దేశ సార్వభౌమత్వ సమస్యను గాలికి వదిలేసి, జాతీయ సామరస్యవాద రొంపిలో మునుగుతున్నారు.

**ఐదవది:** ప్రధాన వైరుధ్య సమస్య. భారత విస్తరణవాదంతో మిలాఖతైన జాతీయ దళారీ పెట్టుబడిదారీ, నిరంకుశ పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలకు నేపాల్ ప్రజలకు మధ్యనున్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యమని మేము నిర్ధారించాం. ఇప్పటికీ అదే చెపుతున్నాం. కాని, నయా రివిజనిస్టులు ప్రధాన వైరుధ్యం సమస్యపై గతంలో ఆమోదించిన నిర్ణయం నుంచి వైదొలగి అస్థిర, అస్పష్ట, అనిర్దిష్ట వైఖరులను ముందుకు తెస్తున్నారు. ఒక్కమాటలో, వారు భారత విస్తరణవాదానికి బంటులా సేవచేసే విధానాన్ని చేపట్టారు.

**ఆరవది:** విప్లవకర కమ్యూనిస్టు పార్టీ సమస్య. నేపాలీ శ్రామిక వర్గానికి రాజకీయంగా నేతృత్వం వహించే అగ్రగామిగా ఒక కొత్త విప్లవకర కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేయాలని మేము కోరాము. కాని, నయా రివిజనిస్టు గ్రూపు దీన్ని వ్యతిరేకించి, విప్లవకర కమ్యూనిస్టు పార్టీ రంగు మార్చి, దాన్ని అవకాశవాద పార్టీగా మార్చివేశారు. సామ్రాజ్యవాదానికి, రివిజనిజానికి మధ్య వుండే దగ్గరి సంబంధం గురించి, సామ్రాజ్యవాదాన్ని రక్షిస్తూ, దానికి మద్దతునిస్తూ రివిజనిజం ఎదగడం గురించి లెనిన్ వివరించాడు. నయా రివిజనిస్టు గ్రూపుకూ ఇది వర్తిస్తుంది. నయా రివిజనిస్టు గ్రూపు విప్లవకర కమ్యూనిస్టు పార్టీని బూర్జువా పార్టీగా మార్చింది. అందువల్ల ఈ అవకాశవాదంతో మేము తెగదెంపులు చేసుకొన్నాము.

***16. మీరు యు.సి.పి.ఎన్. (మావోయిస్టు)లో వున్నప్పుడు పార్టీ పంథాపై మీ వైఖరిని స్పష్టం చేయలేదని, సి.పి.ఎన్. (మావోయిస్టు)గా ఏర్పడిన తర్వాత కూడ మీ పార్టీ పంథా ప్రచండ-బాబురామ్‌ల పంథాకు భిన్నంగా ఏమీ లేదనే ఆరోపణ వుంది. దీన్ని గురించి మీరేమంటారు?***

ప్రధాన వైరుధ్యంపై మా జాతీయ మహాసభ చేసిన నిర్ణయం సైద్ధాంతికంగా, వస్తుగతంగా సరైనది. ఏ అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశంలోనైనా శత్రు బలగం ఒకే పంథాపై నిలబడినప్పుడు, ఆ దేశ సార్వభౌమత్వ పరిరక్షణ, ప్రజాస్వామ్య స్థాపనకు సంబంధించిన రెండు ప్రధాన వైరుధ్యాలు మిళితమై ఒకే ప్రధాన వైరుధ్యంగా మారుతుందని కామ్రేడ్ మావో తన 'వైరుధ్యాలు' పుస్తకంలో సైద్ధాంతికంగా, స్పష్టంగా పేర్కొన్నాడు. ప్రస్తుత నేపాల్‌కు సంబంధించిన ఆచరణాత్మక, నిర్దిష్ట వస్తుగత పరిస్థితిని అధ్యయనం చేసే విషయంలో ప్రధాన వైరుధ్యంపై మేము ప్రత్యేక శ్రద్ధ వహిస్తాము. ఉదాహరణకు, నేపాల్‌లో ఇప్పుడు నయా వలస పరిస్థితే కాక, అర్ధ వలస- అర్ధ భూస్వామ్య పరిస్థితి కూడా వుంది. నేపాల్‌లో దళారీ పెట్టుబడిదారీ వర్గం భారత్‌కు అనుకూలమైన, దాని ప్రయోజనాలు నెరవేర్చే సాధనంగా కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ వర్గానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తిని భారత విస్తరణవాదం నియంత్రిస్తున్నది. నేపాల్ ప్రజాస్వామిక విప్లవాన్ని అడ్డుకొనే శక్తిగా భారత విస్తరణవాదం ముందుకొస్తున్నది. అందువల్ల మౌలిక, ప్రధాన వైరుధ్యం గురించి మా దృక్పథం (దృక్కోణం) సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా సరైనది. శాస్త్రీయమైనది.

***17. యు.సి.పి.ఎన్. (మావోయిస్టు) ఈ స్థితికి దిగజారడంలో, రెండు పంథాల పోరాటంలో మీ గ్రూపు యొక్క అస్పష్ట, రాజీ వైఖరి బాధ్యత వుందనే దానికి మీరేమంటారు?***

అవును, మేము కొన్ని లోపాలు, తప్పులు చేశాం. కొన్ని బలహీనతలు పొడసూపాయి. మా అధిభౌతిక, సనాతన ఆలోచన (ఫీడిజం), ఉదారవాద బలహీనతలు, అంశాల గురించి స్వీయ విమర్శ చేసుకొన్నాం. రెండు పంథాల పోరాట క్రమంలో కూడా మా తప్పు గురించి మేము విస్మరించలేము. ఆ తప్పు నుంచి గుణపాఠం నేర్చుకోవలసిన అవసరం వుంది.

***18. చీలిక తర్వాత రెండు మావోయిస్టు పార్టీలు కూడా మత సమూహాల (జాతుల) మద్దతు సంపాదించడానికి పోటీ***

***పడుతున్నాయి. దీన్ని గమనిస్తున్న ప్రజలు, నూతనంగా ఏర్పడిన మావోయిస్టు పార్టీ కూడా మత (జాతుల) సమస్యకు సరైన పరిష్కారం ఇవ్వటం ద్వారా, వర్గపోరాటం ద్వారా నేపాల్ ప్రజల సమస్యలను సరిగా ముందుకు తీసుకు రావటంలో గట్టి శ్రద్ధ పెట్టడం లేదని అంటున్నారు కదా!***

మత (జాతుల) సమస్యల మీద ఎటువంటి పోటీలేదు. మత (జాతుల) సమస్య నేపాలీల నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యనే. మేము వర్గ సమస్యపై ప్రధానంగా కేంద్రీకరించాము. అలాగని మత (జాతుల) సమస్యను వదిలేశామని కాదు. మత (జాతుల) సమస్యకు ప్రత్యేక గుర్తింపు, ప్రాముఖ్యత వుంది. దాని ప్రకారం ఈ సమస్యకు పరిష్కారం కనుగొంటాము. ఏమైనప్పటికీ, మత (జాతుల) సమస్య అంతిమంగా వర్గసమస్యనే.

***19. పౌరసత్వ సమస్య పెద్ద సమస్యగా తయారై మళ్లీ మళ్లీ ముందుకు వచ్చే అవకాశం వుంది. దీన్ని మీరు ఎంత సీరియస్‌గా చేపడతారు?***

అవును, పౌరసత్వ సమస్య నేపాల్‌లో దేశ సార్వభౌమత్వంతో గట్టి సంబంధంలో వున్నటువంటిది. ఈ సమస్యకు రెండు పార్శ్వాలున్నాయి. మొదటిది, మధేశ్/తరాయి ప్రాంతంలో పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు ఇప్పటికీ పౌరసత్వం సులభంగా లభించడం లేదు. రెండవది, అనేక మంది భారత పౌరులకు సులభంగా పౌరసత్వం లభిస్తున్నది. ఈ పరిస్థితిని మేము సీరియస్‌గా తీసుకుంటాము.

***20. నేపాల్ ప్రజలు ఉద్యమాల్లో, పోరాటాల్లో, ప్రజాయుద్ధంలో చేసిన త్యాగాలకు ప్రతిఫలం లభించిందని మీరు సంతృప్తి చెందుతున్నారా?***

సంతృప్తి అనే ప్రశ్నే లేదు. యావత్తు నేపాల్ విప్లవంలో, మహోన్నత ప్రజాయుద్ధ క్రమంలో ప్రజలు త్యాగాలు, ధైర్యసాహసాలు, సహాయ సహకారాలలో రికార్డులు నెలకొల్పారు. రిపబ్లిక్, లౌకికవాదం లక్ష్యంతోనే మేము పరిమితులు విధించుకోలేదు. మేము ప్రజా యుద్ధం ప్రారంభించినప్పుడు మా దేశం అర్ధ వలస, అర్ధ భూస్వామ్య స్థితిలో వున్నట్లే, ఇప్పటికీ అదే స్థితిలో వుంది. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య, నయా వలస స్థితి నుంచి దేశాన్ని విముక్తి చేసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడమే ప్రధాన లక్ష్యం.

***21. మునుపటి సి.పి.ఎన్. (మావోయిస్టు) లెనినిస్టు నిర్మాణ చట్రంతో విభేదించింది. ప్రస్తుత సందర్భంలో మీరు పార్టీ నాయకత్వాన్ని చేపట్టారు. దీనిపై మీ ప్రణాళిక ఏమిటి?***

అవును, పార్టీ బహిర్గతం అయినప్పటి నుండి సరైన నిర్మాణం (నిర్వహణ) లేదు. ఈ పరిస్థితిపట్ల మేము సీరియస్‌గా వున్నాము. అవకాశవాదంతో తెగదెంపులు చేసుకొని, నూతన పార్టీగా ఏర్పడిన చర్య, నూతన తరహా క్రమశిక్షణ గల విప్లవకర పార్టీగా తయారు కావడానికి ముఖ్యమైన పునాదిని కల్పిస్తుంది. పార్టీని శ్రామికవర్గ అగ్రగామిగా తయారు చేసేందుకు మేము గట్టిగా కృషి చేస్తాము. ప్రస్తుత పరిస్థితికి తగిన ప్రవర్తనా నియమావళిని తయారు చేయాలని నిర్ణయించాము. త్వరలో పార్టీ సాధారణ కాంగ్రెస్ (మహాసభ) నిర్వహించబోతున్నాము. విప్లవకర పార్టీగా తయారు కావడానికి ఒకవైపు విప్లవకర సైద్ధాంతిక, వ్యూహాత్మక పంథా ముఖ్యమైన పాత్ర పోషిస్తే, మరోవైపు అవసరమైనప్పుడు దిద్దుబాటు ఉద్యమం కూడ నిర్వహించాలి. ఈ అంశాల పట్ల కూడా మేము సీరియస్‌గా వున్నాము.

***22. సమకాలీన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను పరిష్కరించడానికి నూతనంగా ఏర్పడిన సి.పి.ఎన్. (మావోయిస్టు) వద్ద ఏ విధమైన ప్రణాళిక, కార్యక్రమాలు వున్నాయి?***

పార్టీ విధానం ఉనికిలో వున్న రాజకీయ, ఆర్థిక సమస్యలు; దేశ ప్రజాస్వామ్యం, బతుకుదెరువులకు సంబంధించిన ప్రస్తుత సమస్యలను తీసుకొని పోరాడడానికి సంబంధించినది. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి సంబంధించిన సమస్యపై పోరాటం నడిపించడం గురించి పార్టీ సీరియస్‌గా ఆలోచిస్తున్నది. దీనితో పాటు ద్రవ్యోల్బణం (నిత్యావసర సరుకుల ధరల తీవ్ర పెరుగుదల), ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల మొదలైన సమస్యలపై పోరాటం మొదలు పెట్టాలని నిర్ణయించాం. అలాగే అవినీతిపరులపై చర్యలు తీసుకొని, వారిని ప్రజల ముందు నిలబెట్టడం ద్వారా అవినీతి వ్యతిరేక పోరాటం చేస్తాం.

***23. మునుపటి పార్టీ నాయకత్వం విప్లవకర కమ్యూన్లను, విముక్తి ప్రాంతాలను, ప్రజా విముక్తి సైన్యాన్నీ ఇప్పటికే నిర్వీర్యం చేసింది. ఈ పరిస్థితిలో ప్రజాయుద్ధ ప్రారంభ దినాల్లో మీరు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి మీకు ఎటువంటి ప్రణాళికలు, కార్యక్రమాలున్నాయి?***

ప్రజల ముందు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడంపై మేము ఇప్పటికీ దృఢంగానే వున్నాం. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి (విజయవంతం) చేయడానికి సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, పోరాటాలతో సంబంధం వున్న సన్నాహక కర్తవ్యాన్ని చురుకుగా ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించాం.

***24. చివరిగా, మార్క్సిస్టు తత్వశాస్త్రంపై ఒక ప్రశ్న. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల తర్వాత అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించి తత్వశాస్త్ర రంగంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఏదీ మా దృష్టికి రాలేదు. కాని, సైన్స్ గమనించదగినంతగా, ఇంకా ఎక్కువగా కూడ అభివృద్ధి చెందింది. సైన్స్‌లో నూతన శాఖలు ఉనికిలోకి వచ్చాయి. ప్రకృతి శాస్త్రం, జీవశాస్త్రం, సైనిక శాస్త్రం, రసాయన శాస్త్రం మొదలైనవి మార్క్సిస్టు ప్రమాణాలను, విలువలను వెనక్కు నెట్టిన అనేక అంశాలను ఆవిష్కరించాయని బూర్జువా తత్వవేత్తలు అంటున్నారు. ఈ పరిస్థితిలో మార్క్సిస్టుకు మంచి మార్గమేదని మీరనుకుంటున్నారు?***

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తత్వశాస్త్ర రంగంలో మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల తర్వాత మావో అనేక చేర్పులు చేసాడు.

# డిసెంబర్ 6 చీకటి ఘట్టానికి ఇరవయ్యేండ్లు!

*మన దేశంలో జరిగిన అత్యంత లజ్జాకరమైన సంఘటనల్లో బాబ్రీ మసీదు కూల్చివేత ఒకటి. చరిత్ర పుటల్లో చీకటి అధ్యాయంగా చోటు చేసుకున్న ఈ ఘటన జరిగింది 1992 డిసెంబర్ 6న. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో 1528-29లో ఈ చారిత్రక కట్టడాన్ని మొఘల్ సామ్రాజ్య వ్యవస్థాపకుడు బాబర్ కట్టించాడు. అయోధ్య నగరం రాముడి జన్మ స్థలమనీ, బాబ్రీ మసీదు వున్న ప్రదేశంలో రాముడి గుడి వుండేదనీ, దాన్ని కూలగొట్టి బాబ్రీ మసీదును నిర్మించారనే ఒక వివాదాన్ని 80వ దశకం ప్రారంభం నుంచీ సంఘ్ పరివార్ ముందుకు తెచ్చింది. రాముడికి సంబంధించిన చారిత్రక ఆధారాలే లేనప్పుడు అయోధ్యను రాముడి జన్మభూమి అనడంలో అర్థమే లేదన్న విషయాన్ని ప్రస్తుతం పక్కన పెట్టేసినా, రాముడి గుడిని కూల్చి మసీదును కట్టారనడానికి ఏ మాత్రం చారిత్రక ఆధారాలు లేవు. చారిత్రక ఆధారాలు లేని ఒక అంశాన్ని పుక్కిటి పురాణాలను ఆధారం చేసుకొని వివాదాస్పదం చేయడం వెనుక, దేశంలోని మెజారిటీ హిందువుల మనోభావాలను రెచ్చగొట్టి ఓటు బ్యాంకుగా మలచుకోవాలనే రాజకీయ కుట్ర తప్ప మరేమీ లేదు. 1984లో సంఘ్ పరివార్ వివాదస్పద స్థలంలో రాముడి గుడి కట్టించాలనే డిమాండ్‌తో రామ జన్మభూమి వుద్యమాన్ని ప్రారంభించింది. 1989లో శిలాన్యాస్ (గుడి కట్టడానికి శంకుస్థాపన) జరిగింది. 1990లో గుడి కట్టడం కోసం కరసేవకులను అయోధ్యకు రావాల్సిందిగా పిలుపునిచ్చింది. అక్టోబర్ 30 నాటికి 40 వేల మంది కరసేవకులు అయోధ్యను ముట్టడించగా పోలీసు కాల్పులు జరిగాయి. అప్పటికి ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసిన రామ జన్మభూమి నేతలు 1992లో మళ్లీ మొదలుపెట్టి డిసెంబర్ 6న బాబ్రీని కూల్చివేశారు. ఈ కూల్చివేతకు అద్వానీ, బాల్ థాకరే, మురళీ మనోహర్ జోషి సహా మరెందరో హిందూ మతోన్మాద పార్టీల నేతలు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు.*

*ఇక ఈ విధ్వంసాన్ని ఆపడానికి అన్ని అవకాశాలు వుండీ ఆపలేక పోయిన పి.వి. నరసింహారావు నాయకత్వంలోని నాటి కేంద్ర సర్కారూ, కళ్యాణ్ సింగ్ నాయకత్వంలోని ఉత్తర ప్రదేశ్ సర్కారూ, కాంగ్రెస్ పార్టీలకు కూడా ఈ విధ్వంసంలో సమాన బాధ్యత వుంది.*

*ఈ సంఘటనపై విచారణకు గాను ప్రభుత్వం లిబర్హాన్ కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు పదిహేడేళ్ల పాటు విచారణ జరిపిన ఈ కమిషన్ వాజ్‌పేయ్, అద్వానీ, మనోహర్ జోషి, ప్రమోద్ మహాజన్, బాల్‌థాకరే, ప్రవీణ్ తొగాడియా, ఉమా భారతి, సాధ్వి రితంబర, అశోక్ సింఘాల్, కళ్యాణ్ సింగ్ సహా 68 మందిని దోషులుగా తేల్చింది. కాని ఏ ఒక్కరికీ శిక్షలు పడలేదు సరికదా, ఎవరినీ అరెస్టు కూడా చేయలేదు.*

*ఇక బాబ్రీ మసీదు స్థల వివాదంపై అలహాబాద్ హైకోర్టు పద్దెనిమిది ఏండ్ల తర్వాత 2010 సెప్టెంబర్ 30న ఒక అన్యాయమైన తీర్పు వెలువరించింది. ఈ స్థలంలో 2/3 వంతు భాగం హిందువులకే చెందుతుందని చెప్పి ఈ తీర్పు హిందూ మతోన్మాదానికి వత్తాసు పలికింది. అసలు ఈ స్థలం మొత్తం హిందువులకే చెందిందని ముస్లింలకు వుదారంగా మూడవ వంతు భూమిని కట్టబెడుతున్నట్టుగా హైకోర్టు ప్రకటించింది.*

*బాబ్రీ మసీదు విధ్వంసం, దానిపై వెలువడిన తీర్పులు, ఈ విధ్వంసం తర్వాత దోషులు అధికారంలోకి కూడా రావడం... ఇవన్నీ రాజ్యానికున్న హిందూ మతోన్మాద వైఖరిని చాటిచెబుతున్నాయి. దేశంలోని లౌకికవాదులూ, ప్రజాస్వామిక వాదులూ ఈ వైఖరికి వ్యతిరేకంగా ధృఢంగా నిలబడి, విశాలమైన ప్రజా వుద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది.*

మావో తత్వశాస్త్రాన్ని గుణాత్మక దశకు చేర్చాడు. మనం ఈ కృషిని మరువకూడదు.

అవును, సైన్స్‌కు సంబంధించిన వివిధ శాఖల్లో చెప్పుకోదగిన అభివృద్ధి జరిగింది. సైన్స్‌లో నూతన ఆవిష్కరణతో మార్క్సిస్టు తత్వశాస్త్రానికి కాలం చెల్లిందని బూర్జువా మేధావులు అంటున్న విషయం ప్రపంచానికంతటికీ తెలుసు. ఈ సందర్భంలో మేము రెండు విషయాలపై కేంద్రీకరిస్తాము. మొదటిది, నేటి బూర్జువా తత్వశాస్త్రం పోస్ట్ మోడర్నిస్టు (ఆధునికానంతరవాద) తత్వశాస్త్రం. అది యావత్తు వస్తుగత (భౌతిక) వాస్తవాన్ని, చరిత్రను, వర్గ విముక్తిని, సైన్స్‌ను వ్యతిరేకిస్తుంది. మార్క్సిస్టులు తార్కికంగా దీన్ని ఖండిస్తారు. అలాగే ఖండిస్తున్నారు. రెండవది, సైన్స్‌లో జరిగిన అభివృద్ధి, నూతన ఆలోచనల పునాదిపై గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని సంపద్వంతం చేసి, అభివృద్ధి చేయాల్సిన అవసరం వుంది. కాని, సైన్స్‌లోని వివిధ శాఖల్లో జరిగిన పురోగతి, అభివృద్ధి పెట్టుబడిదారీ తత్వశాస్త్రాన్ని తిరస్కరిస్తూ, మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని స్పష్టంగా పరిరక్షిస్తున్నదని మేము భావిస్తాము. ★

*బోల్షివిక్ పార్టీ చరిత్ర నుండి...*

# స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో బోల్షివిక్కులు స్వతంత్ర మార్క్సిస్టు

## 3

**స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక (రియాక్షన్) దినాల్లో బోల్షివిక్కులు, మెన్షివిక్కులు, ఆట్జోవిస్ట్‌లతోనూ, లిక్విడేటర్లతోనూ బోల్షివిక్కుల పోరాటం.**

విప్లవాభివృద్ధి కాలంలో కంటే, అభివృద్ధి నిరోధక కాలంలో పార్టీ సంస్థలలో పని ఎక్కువ కష్టతరమైనది. పార్టీ సభ్యత్వం బాగా పడిపోయింది. పార్టీ తోటి ప్రయాణీకులైన మధ్య తరగతిలో చాలామంది, ముఖ్యంగా మేధావులు, జారు ప్రభుత్వ నిర్బంధానికి భయపడి పార్టీని విడిచిపెట్టిపోయారు.

ఇలాంటి సమయాల్లో విప్లవ పార్టీలు తమ విజ్ఞానాన్ని పరిపూర్ణం జేసుకోవాలని లెనిన్ పేర్కొన్నాడు. విప్లవం ముందుకు వెళ్లే కాలంలో విప్లవ పార్టీలు ఎలా ముందుకు వెళ్లాలో నేర్చుకున్నాయి. అభివృద్ధి నిరోధక కాలంలో అవి ఎలా తగు రీతిని వెనుదిరిగిపోవాలో ఎలా రహస్య జీవితం ప్రారంభించాలో (అండర్ గ్రౌండ్‌కు వెళ్ళాలో) రహస్య పార్టీని బలపరచి కాపాడుకోవాలో నేర్చుకోవాలి. ప్రజా బాహుళ్యంతో తమ సంబంధాలను బలీయం చేసుకునేందుకు గాను, బహిరంగంగా వున్న సంస్థలను, ముఖ్యంగా ప్రజా సంస్థలను, బహిరంగ అవకాశాలను ఎలా వుపయోగించుకోవాలో అవి నేర్చుకోవాలి.

మెన్షివిక్కులు విప్లవ తరంగం మరొకసారి లేచుట సాధ్యమనే విషయాన్ని నమ్మలేదు. అందుచే వారు గాభరాతో తిరోగమించారు. పార్టీ విప్లవ నినాదాలను, విప్లవ కార్యక్రమ కోర్కెలను సిగ్గులేకుండా పరిత్యజించారు. శ్రామిక వర్గ విప్లవ రహస్య పార్టీని రద్దుచేసి, స్వస్తి (లిక్విడేట్) చెప్పదలచారు. అందుకనే ఈ రకపు మెన్షివిక్కులకు లిక్విడేటర్లని పేరు వచ్చింది.

మెన్షివిక్కుల వలేగాక కొద్ది సంవత్సరాల్లోనే విప్లవ వెల్లువ వస్తుందనే విశ్వాసం బోల్షివిక్కులకు దృఢంగా వుంది. ఈ విప్లవ తరంగానికి ప్రజా సామాన్యాన్ని తయారు చేయుట పార్టీ విధియని బోల్షివిక్కులు భావించారు. విప్లవ ప్రధాన సమస్యలు పరిష్కరింపబడలేదు. రైతులకు భూస్వాముల భూమి లభించలేదు. కార్మికులకు దినానికి 8 గంటల పని అను షరతు లభించలేదు. ప్రజలచే అసహ్యించుకోబడిన జారు నిరంకుశ ప్రభుత్వం ఇంకా కూలదోయబడలేదు. 1905లో జారు ప్రభుత్వం నుండి ప్రజలు లాక్కున్న స్వల్ప రాజకీయ హక్కులను సైతం ప్రభుత్వం మరలా లాగివేసింది. ఆ విధంగా 1905 విప్లవం తలయెత్తడానికి మూలమైన కారణాలన్నీ అలాగే నిలిచిపోయాయి. అందుచేతనే బోల్షివిక్కులు విప్లవోద్యమం తిరిగి తలయెత్తుతుందని గట్టిగా విశ్వసించారు. అందుకోసం కార్మిక వర్గ శక్తులను సమకూర్చి సన్నాహాలు చేశారు.

1905 విప్లవం, ప్రజా విప్లవ పోరాటం ద్వారా తన హక్కులకై పోరాడాలని తెలియజేసింది. దీన్నిబట్టి కూడా విప్లవ తరంగం మరొకసారి తప్పక తలయెత్తి తీరుతుందని బోల్షివిక్కులు నిర్ణయించారు. పెట్టుబడిదారులు దాడి సాగించిన అభివృద్ధి నిరోధక కాలంలో కార్మికులు 1905 నాటి గుణ పాఠాలను మరచిపోలేకపోయారు. ఫ్యాక్టరీ యజమానులు మళ్లీ తమను ఎలా పీడించి అవమానిస్తున్నారో తెలియజేస్తూ కార్మికులు లెనిన్‌కు వుత్తరాలు రాశారు.

అందులో 'ఆగండి మరొక 1905 వస్తుంది' అని అన్న వాక్యాలను లెనిన్ ఉదహరించాడు.

జారు ప్రభుత్వాన్ని కూలదోయుటా, బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తి గావించుటా, సోషలిస్ట్ విప్లవాన్ని ముందుకు లాగుటా –ఇవీ 1905లో బోల్షివిక్కుల ప్రధాన రాజకీయ ఆశయాలు. ఇవి యింకా ఇలాగే వుండిపోయాయి. ఒక్క క్షణం కూడా బోల్షివిక్కులు ఈ ఆశయాన్ని మరచిపోలేదు. ప్రజాతంత్ర రిపబ్లిక్ భూస్వాములు ఎస్టేట్లను వశపరచుకొనుట, దినానికి 8 గంటల పని మొదలగు ప్రధాన విప్లవ నినాదాలను ప్రజాసామాన్యం ఎదుట బోల్షివిక్కులు పెడుతూనే వచ్చారు.

కాని, 1905లోని విప్లవ తరంగ ఉధృతపు రోజులలోని పార్టీ ఎత్తుగడలే ఈనాడు కూడా వుండజాలవు. ఉదాహరణకు విప్లవోద్యమం క్షీణ దశలో వున్నప్పుడు, కార్మిక వర్గం పూర్తిగా అలసిపోయి వున్నప్పుడు, అభివృద్ధి నిరోధక వర్గాల పరిస్థితి తగినంతగా బలపడి వున్నప్పుడు, వెనువెంటనే సర్వవ్యాపిత రాజకీయ సమ్మెకు లేక సాయుధ తిరుగుబాటుకు ప్రజా సామాన్యాన్ని ఆదేశించడం తప్పవుతుంది. పార్టీ నూతన పరిస్థితికి అనుగుణంగా

# మెన్షివిక్కులు - బోల్షివిక్కులు

# పార్టీగా తయారగుట - 2

**(1908-12)**

అంచనా వేసుకోవాలి. దాడి చేసే (అఫెన్సివ్) ఎత్తుగడలు మాని, సంరక్షించుకునే (డిఫెన్సివ్) ఎత్తుగడలకు పూనుకోవాలి. ఈ ఎత్తుగడలేమంటే సర్వశక్తులను సమకూర్చుకునుట, పార్టీ అనుచరుల (కేడర్)ను రహస్య జీవితానికి (అండర్ గ్రౌండ్‌కు) తిరోగమింపజేయుట, రహస్య జీవితం నుండి పార్టీ రహస్య కార్యకలాపాలను కొనసాగించుట, బహిరంగంగా వున్న కార్మికవర్గ సంస్థల కార్యకలాపాలతో, రహస్య కార్యకలాపాలను మేళవించుట.

దీన్ని తాము నెరవేర్చగలమని బోల్షివిక్కులు నిరూపించారు.

లెనిన్ ఇలా అన్నాడు: "విప్లవ పూర్వ దీర్ఘకాలంలో ఎలా పనిచేయాలో మనకు తెలుసు. మనం పర్వతం వలె దృఢంగా వుంటామని వారు (శత్రువులు) వూరికే చెప్పడం లేదు. సోషల్ డెమోక్రాట్లు ఒక శ్రామికవర్గ పార్టీగా ఏర్పడ్డారు. మొదటి సాయుధ పోరాటం ఓడిపోయినంత మాత్రానా ఈ పార్టీకి గుండె జారిపోదు. బుర్ర చెడిపోదు. వెర్రి సాహస కృత్యాలచే కొట్టుకుపోదు"

(లెనిన్-సెలెక్టెడ్ వర్క్స్-ఇంగ్లీష్ ఎడిషన్-మాస్కో-1947-1వ వాల్యూమ్ 467వ పేజి)

బోల్షివిక్కులు రహస్య పార్టీ సంస్థను బలపరచడానికి, భద్రపరచడానికి కృషి చేశారు. అదే సమయంలో ప్రజా సామాన్యంతోటి సంబంధాలను కొనసాగించడానికి, కాపాడడానికి గాను, ప్రతి బహిరంగ అవకాశాన్ని ఏ మాత్రం సందు వున్నా వుపయోగించుకొనుట, ఆ విధంగా పార్టీని బలపరచుట అవసరమని బోల్షివిక్కులు భావించారు.

"జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగ విప్లవ పోరాటానికి బదులు మన పార్టీ డొంక తిరుగుడు పోరాట పద్ధతులను అవలంబించిన సమయమయ్యింది. ఈ సమయలో ప్రతి ఒక్క బహిరంగ అవకాశాన్ని వుపయోగించుకుంది. పరస్పర సహాయ సంఘాలు మొదలుకొని డ్యూమా వేదిక సైతం పార్టీ వుపయోగించుకుంది. 1905 విప్లవంలో ఓడింపబడిన తర్వాత మనం తిరోగమిస్తున్న కాలమిది. మన శక్తులను సమకూర్చుకుని జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగ విప్లవ పోరాటం తిరిగి సాగించేందుకు గాను కొత్త పోరాట పద్ధతులను నేర్చుకునే బాధ్యత ఈ మార్పు మనపై వేసింది"

(స్టాలిన్ 15వ పార్టీ కాంగ్రెస్ వెర్బాటమ్ రిపోర్టు-రష్యన్ ఎడిషన్-366-367 పేజీలు-1935)

ఇంకా మిగిలి వున్న బహిరంగ (లీగల్) సంస్థలు, పార్టీ రహస్య సంస్థలకు (అండర్ గ్రౌండ్ ఆర్గనైజేషన్స్) తెరగా వుపయోగపడ్డాయి. ప్రజలతో సంబంధాన్ని కొనసాగించే సాధనాలుగా వుపయోగపడ్డాయి. ప్రజా సామాన్యంతో తమ సంబంధాలను కాపాడుకునేందుకు గాను బోల్షివిక్కులు కార్మిక సంఘాలను, ఇతర బహిరంగ పౌర సంస్థలను, రోగగ్రస్తులకు సహాయం చేసే సంఘాలు (సిక్ బెనిఫిట్ సొసైటీస్), కార్మిక సహకార సంఘాలు మొదలైన వాటిని వుపయోగించుకున్నారు. జారు ప్రభుత్వ విధానాన్ని బట్టబయలు చేయడానికి, శాసనబద్ధ ప్రజాతంత్రవాదులను బట్టబయలు చేయడానికి, శ్రామికవర్గానికి రైతుల అండను సంపాదించడానికి, ప్రభుత్వ డ్యూమా వేదికను బోల్షివిక్కులు వుపయోగించుకున్నారు. రహస్య పార్టీ సంస్థను భద్రపరచుకొనుట, దీని ద్వారా ఇతర రాజకీయ కార్యరూపాలన్నింటినీ నడుపుట, పార్టీ సరైన పోకడను అవలంబించేటట్లు చేసింది. విప్లవ వెల్లువలో రాబోయే నూతన వుత్తేజానికి తగిన సన్నాహం చేయ పార్టీ శక్తులను పోగుచేయునట్లు చేసింది.

బోల్షివిక్కులు రెండు రంగాల్లో పోరాడుతూ, తమ విప్లవకరమైన పోకడను కొనసాగించారు. పార్టీ లోపలనే వున్న రెండు రకాల అవకాశవాద ధోరణుల మీద పోరాటం సాగించారు. ఒకటి, పార్టీకి బహిరంగ శత్రువులైన లిక్విడేటర్లపైన రెండవది మరుగున పడివున్న పార్టీ శత్రువులగు ఆట్జోవిస్టులు అనబడే వారి మీద.

లెనిన్, బోల్షివిక్కులు అవకాశవాద ధోరణి అయిన లిక్విడేషనిజం పుట్టిన నాటి నుండీ, నిర్దాక్షిణ్యంగా దానితో పోరాటం సాగించారు. లిక్విడేటర్లు పార్టీలోనే వుండి లిబరల్ బూర్జువాకు ఏజెంట్లుగా పనిచేస్తున్నారని లెనిన్ పేర్కొన్నాడు.

1908 డిసెంబర్‌లో పారిస్‌లో రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ (యావత్ రష్యా) 5వ మహాసభ జరిగింది. లెనిన్ తీర్మానాన్ని అనుసరించి ఈ మహాసభ లిక్విడేషనిజంను ఖండించింది. పార్టీ మేధావుల్లో ఒక భాగం (మెన్షివిక్కులు) "ప్రస్తుతం వున్న రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ సంస్థను రద్దు చేయాలని (లిక్విడేట్) ప్రయత్నిస్తున్నారు. దాని స్థానే పార్టీ

సంప్రదాయాలను ఎత్తుగడలను కార్యక్రమాన్ని ఒక్కుమ్మడిగా పరిత్యజించైనా సరే, ఎంత కష్టమైనా సరే బహిరంగంగా నడిచే సంఘటనా రహితమైన సంస్థను నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే లిక్విడేషనిజం" (సోవియట్ యూనియన్ కమ్యూనిస్ట్ బోల్షివిక్కు పార్టీ తీర్మానాలు, రష్యన్ ఎడిషన్-1వ భాగం 128వ పేజీ).

లిక్విడేటర్ల ప్రయత్నాలకు వ్యతిరేకంగా నిశ్చిత పోరాటాన్ని సాగించాల్సినదిగా పార్టీ సంస్థలను అన్నింటినీ ఈ మహాసభ ఆదేశించింది.

కాని, మెన్షివిక్కులు ఈ మహాసభ నిర్ణయాలకు బద్ధులై వుండలేదు. మరింతగా లిక్విడేషనిజం అనే ఊబిలో దిగిపోయారు. విప్లవానికి ద్రోహం చేశారు. శాసనబద్ధ ప్రజాతంత్రవాదులతో చేతులు కలిపారు. ప్రజాతంత్ర రిపబ్లిక్, దినానికి 8 గంటల పని, ఎస్టేట్ల భూమిని పశపరచుకొనుట మొదలగు కోర్కెలను, శ్రామికవర్గ పార్టీ విప్లవ కార్యక్రమాన్ని, మెన్షివిక్కులు రానురాను మరింత బహిరంగంగా పరిత్యజించడం మొదలెట్టారు. పార్టీ కార్యక్రమాన్ని, ఎత్తుగడలను పరిత్యజించుట ద్వారా నామమాత్రపు బహిరంగ చట్టబద్ధ కార్మిక పార్టీ వునికిని జారు ప్రభుత్వ సమ్మతిని పొందవచ్చునని వారు ఆశించారు. స్టోలీపిన్ ప్రభుత్వంతో రాజీపడడానికి దానికి అనుగుణంగా ప్రవర్తించడానికి వీరు తయారయ్యారు. అందుకనే ఈ లిక్విడేటర్లను "స్టోలీపిన్ లేబర్ పార్టీ" అని కూడా పిలిచేవారు.

డాన్, ఆక్జిల్ రాడ్, పాట్రెన్సోన్ మొదలగు వారి నాయకత్వాన ఉన్నట్టి, మార్టోవ్, ట్రాట్స్కీ ఇంకా తదితర మెన్షివిక్కుల సహాయం కలిగినట్టి లిక్విడేటర్లతో- పార్టీ బహిరంగ శత్రువులతో -పోరాడడమే కాక దాగి ఉన్న లిక్విడేటర్లపై కూడా బోల్షివిక్కులు నిర్ణయాత్మకమైన పోరాటాన్ని కొనసాగించారు. వీరు ఆట్జోవిస్ట్లు. "అతివాద" పదజాలంతో తమ అవకాశవాదాన్ని కప్పిపుచ్చుకునేవారు. బహిరంగంగా వున్న సంఘాలలోని పనిని పూర్తిగా కట్టిపెట్టాలని, ప్రభుత్వ డ్యూమా నుండి కార్మిక ప్రతినిధులను పిలిపించి వేయాలని కొందరు మాజీ బోల్షివిక్కులు కోరారు. రష్యన్ భాషలో ఆట్జివ్ అనగా పిలిపించి వేయుట. అందుచే వీరికి ఆట్జోవిస్టులని పేరు వచ్చింది.

1905లో కొందరు బోల్షివిక్కులు ప్రభుత్వ డ్యూమా నుండి సోషల్ డెమొక్రాటిక్ ప్రతినిధులను పిలిపించివేయాలని కోరారు. ఆట్జోవిస్టులు తమ స్వంత ముఠాను ఏర్పరచుకున్నారు. (బొగ్దనోవ్ లూనా చెర్స్కీ, ఎలెగెన్స్కీ, పోక్ర విస్కీ, బొబ్నావ్ మొదలగు వారు) లెనిన్‌కు, లెనిన్ పోకడకు వ్యతిరేకంగా వీరు పోరాటం సాగించారు. ఆట్జోవిస్టులు కార్మిక సంఘాలలోనూ, ఇంకా బహిరంగంగా వున్న ఇతర సంఘాలలోనూ పనిచేయడానికి మొండిగా తిరస్కరించారు. అలా చేయుట ద్వారా కార్మిక ఆశయానికి వారు చాలా హాని చేశారు. ఆట్జోవిస్టులు, పార్టీకి కార్మిక వర్గానికి మధ్య ఒక అఘాతాన్ని కల్పిస్తున్నారు. పార్టీకి చెందని ప్రజా సామాన్యంతో పార్టీకి సంబంధాలు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. తాము రహస్య సంస్థల్లో (అండర్ గ్రౌండ్ ఆర్గనైజేషనల్) గూడుకట్టుకుని కూర్చోవాలనుకున్నారు. కాని చట్టబద్ధమైన ముసుగు (లీగల్ కవర్)ను వుపయోగించుకునే అవకాశాన్ని నిరాకరించి, వారు, ఈ రహస్య సంస్థలకు సైతం ఆపాయం తెచ్చి పెట్టారు. ప్రభుత్వ డ్యూమాలో వుండి, ఆ డ్యూమా ద్వారానే బోల్షివిక్కులు రైతాంగాన్ని తమ పలుకుబడిలోకి లాక్కోవచ్చునని ఆట్జోవిస్టులు గ్రహించలేదు. రైతాంగాన్ని మోసం చేసి వారి అండను సంపాదింప ప్రయత్నిస్తున్న శాసనబద్ధ ప్రజాతంత్రవాదుల పాలసీని, జారు ప్రభుత్వాన్ని డ్యూమా ద్వారానే బట్టబయలు చేయవచ్చునని కూడా వీరు గ్రహించలేదు. విప్లవం మరో అడుగు ముందుకు వేయడానికి కావాల్సిన శక్తులను సమకూర్చడాన్ని ఆట్జోవిస్టులు ఆటంకపరచారు. అందుచేత ఆట్జోవిస్టులు 'సంపూర్ణంగా లిక్విడేటర్లే'. వీరు బహిరంగంగా వుండే సంస్థలను వుపయోగించుకొనే అవకాశాన్ని నాశనం చేయడానికి ప్రయత్నించారు. పార్టీ సభ్యులు కాని ప్రజా బాహుళ్యానికి శ్రామికవర్గం నాయకత్వం వహించాలనుటను వీరు పరిత్యజించారు. వాస్తవానికి విప్లవ కార్యకలాపాలనే వీరు పరిత్యజించారు.

1909లో ఆట్జోవిస్టుల ప్రవర్తనను చర్చించడానికై బోల్షివిక్కు వార్తా పత్రిక 'ప్రొలిటరీ' విస్తృత సంపాదక వర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశం ఆట్జోవిస్టులను ఖండించింది. బోల్షివిక్కులు ఆట్జోవిస్టులతో తమకెట్టి సంబంధం లేదని ప్రకటించి బోల్షివిక్కు సంస్థల నుండి వారిని వెళ్లగొట్టారు.

లిక్విడేటర్లు, ఆట్జోవిస్టులు, శ్రామిక వర్గం యొక్క శ్రామిక వర్గ పార్టీ యొక్క పెటీ బూర్జువా తోటి ప్రయాణీకులు తప్ప మరేమీ కాదు. శ్రామిక వర్గానికి కష్ట దినాలు సంప్రాప్తించినప్పుడు లిక్విడేటర్లు, ఆట్జోవిస్టుల నిజ స్వభావం ప్రత్యేకమైన విస్పష్టతతో బయటపడింది.

# 4

## ట్రాట్స్కీజానికి వ్యతిరేకంగా బోల్షివిక్కుల పోరాటం-పార్టీ వ్యతిరేక ఆగస్టు కూటమి

లిక్విడేటర్లకు, ఆట్జోవిస్టులకు వ్యతిరేకంగా రెండు రంగాల్లో నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని బోల్షివిక్కులు సాగిస్తున్న సమయంలో, శ్రామిక వర్గ పార్టీ యొక్క ఖచ్చితమైన పోకడను బోల్షివిక్కులు సమర్థిస్తున్న సమయంలో, మెన్షివిక్కు లిక్విడేటర్లను ట్రాట్స్కీ సమర్థించాడు. ఈ రోజులలోనే ట్రాట్స్కీని లెనిన్ "జూడాస్ ట్రాట్స్కీ" (క్రీస్తుకు ద్రోహం చేసిన శిష్యుని పేరు జూడాస్. నమ్మకద్రోహి అని అర్థం-అనువాదకుడు) అని పేరు పెట్టాడు. ట్రాట్స్కీ వియన్నాలో (ఆస్ట్రియా) కొందరు రచయితలతో ఒక ముఠాను ఏర్పరచాడు. ఏ చీలికకూ చెందని పత్రిక అని చెప్పుకుంటూ వాస్తవానికి మెన్షివిక్కు వార్తా పత్రికను ఒకదాన్ని ప్రకటించసాగాడు. "ట్రాట్స్కీ తుచ్ఛమైన పదవీ వ్యామోహపరుడు, ముఠాతత్వవాది (ఫ్యాక్షనలిస్ట్), పార్టీకి

నామమాత్ర సానుభూతి అతను ప్రకటిస్తాడు గానీ, ఏ ఇతర ముఠా తత్వవాది కంటే కూడా నీచంగా ప్రవర్తిస్తాడు" అని ఆ కాలంలో లెనిన్ రాశాడు.

1912లో ట్రాట్స్కీ ఆగస్టు కూటమిని సంఘటితపరచాడు. లెనిన్‌కు, బోల్షివిక్కు పార్టీకి వ్యతిరేకమైన అన్ని బోల్షివిక్కు వ్యతిరేక ముఠాలు, ధోరణులు ఈ ఆగస్టు కూటమిలో వున్నాయి. ఈ బోల్షివిక్కు-వ్యతిరేక కూటమిలో లిక్విడేటర్లు, ఆట్జోవిస్టులు ఐక్యమయ్యారు. ఆ విధంగా తమ బంధుత్వాన్ని చాటుతున్నారు. అన్ని ప్రధాన విషయాలలోనూ ట్రాట్స్కీ, ట్రాట్స్కీ అనుచరులు, లిక్విడేషనిస్టుల వైఖరిని అవలంబించారు. కాని ట్రాట్స్కీ తన లిక్విడేషనిజమ్‌కు 'సెంట్రిజమ్' అనే ముసుగు వేశాడు. దీని అర్థం సమాధాన విధానమన్నమాట. తాను బోల్షివిక్‌లకు గాని, మెన్షివిక్‌లకుగాని చెందననీ, వారిద్దరినీ సమాధానపరచ ప్రయత్నిస్తున్నాననీ చెప్పాడు. ఇదే సెంట్రిజం. ఈ సందర్భంలో లెనిన్ ఇలా అన్నాడు. "ట్రాట్స్కీ బహిరంగ లిక్విడేటర్ల కంటే తుచ్ఛమైనవాడు. ప్రమాదకారి, ఎందువల్లనంటే తాను 'ఏ పక్షానికి చెందని వాడినని' అతడు కార్మికులను మోసగించ ప్రయత్నిస్తున్నాడు. కాని వాస్తవంలో మెన్షివిక్ లిక్విడేటర్లను అతడు పూర్తిగా బలపరుస్తున్నాడు. సెంట్రిజమ్‌ను పోషించిన ప్రధాన ముఠా ట్రాట్స్కీయిస్టులే"

కామ్రేడ్ స్టాలిన్ ఇలా రాశాడు:

"సెంట్రిజం ఒక రాజకీయ అభిప్రాయం. అందరికీ వుమ్మడియైన పార్టీలో, పెటీబూర్జువా ప్రయోజనాలకు శ్రామికవర్గ ప్రయోజనాలను లోకువచేసి సరిపెట్టుకొని పోయే సిద్ధాంతమే అది. ఈ సిద్ధాంతం లెనినిజానికి విముఖమైనది. గర్హింపదగినది." (స్టాలిన్-ప్రాబ్లమ్స్ ఆఫ్ లెనినిజం 9 రష్యన్ ఎడిషన్, 379వ పేజీ)

ఈ కాలంలో కామెనివ్, జినోవీవ్, రైకాన్‌లు ట్రాట్స్కీకి నిజానికి రహస్య ఏజంట్లు. లెనిన్‌కు వ్యతిరేకంగా వారు తరచూ ట్రాట్స్కీకి సహాయపడ్డారు. జినోవీవ్, కామెనివ్, రైకావ్, ఇంకా ట్రాట్స్కీ యొక్క ఇతర రహస్య సహచరులతో లెనిన్ కోర్కెలకు వ్యతిరేకంగా 1910 జనవరిలో సెంట్రల్ కమిటీ ప్లీనమ్ (విస్తృత) సమావేశపరచబడింది. సమావేశంలో అనేక మంది బోల్షివిక్కులు అరెస్టు కావడం వల్ల సెంట్రల్ కమిటీ అంగ నిర్మాణంలో మార్పు వచ్చింది. ఊగిసలాడే వ్యక్తులు లెనినిస్టు వ్యతిరేక నిర్ణయాలను చేయించగలిగారు. ఈ ప్లీనంలో బోల్షివిక్కు వార్తా పత్రిక "ప్రొలిటరీ"ని మూసివేయడానికి నిశ్చయించారు. వియన్నాలో ప్రచురింపబడుతున్న ట్రాట్స్కీ పత్రిక "ప్రావ్దా"కు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించబడింది. ట్రాట్స్కీ వార్తాపత్రిక సంపాదక వర్గంలో కామెనివ్ చేరాడు. జినోవీవ్‌తో కలిసి అతడు దానిని సెంట్రల్ కమిటీ పత్రికగా చేయడానికి కృషి చేశాడు.

సెంట్రల్ కమిటీ జనవరి ప్లీనంలో లెనిన్ ఒత్తిడి వల్ల లిక్విడేషనిజమ్‌ను,ఆట్జోవిజమ్‌ను ఖండిస్తూ ఒక తీర్మానాన్ని చేసింది. కాని ఇక్కడ కూడా లిక్విడేటర్లను ఆ పేరున పిలవరాదని ట్రాట్స్కీ చేసిన తీర్మానాన్ని జినోవీవ్, కామెనివ్‌లు బలపరచారు.

లెనిన్ ముందుగా గ్రహించి హెచ్చరిక చేసినట్లుగానే అన్నీ జరిగాయి. సెంట్రల్ కమిటీ ప్లీనం తీర్మానాన్ని బోల్షివిక్కులు మాత్రం అమలుపరచారు. తమ పత్రిక "ప్రొలిటరీ"ని మూసివేశారు. కాని మెన్షివిక్కులు, చీలికలు కలిగించే (ఫాక్షనలిస్టు) తమ లిక్విడేషనిస్టు వార్తాపత్రిక "గోలోస్ సోషల్-డెమాక్రేటా"ను (వాయిస్ ఆఫ్ సోషల్ డెమొక్రాట్స్ - సోషల్ డెమొక్రాట్స్ వాణి) ప్రచురిస్తూనే వచ్చారు.

"సోషల్ డెమొక్రాట్" 11వ సంచికలో కామ్రేడ్ స్టాలిన్ ఒక ప్రత్యేక వ్యాసాన్ని ప్రకటించాడు. అందులో లెనిన్ వాదాన్ని పూర్తిగా సమర్థించాడు. అందులో ట్రాట్స్కీజం యొక్క తోడుదొంగల ప్రవర్తనను ఖండించాడు. కామెనివ్, జినోవీవ్, రైకాన్‌ల ద్రోహ ప్రవర్తన ఫలితంగా బోల్షివిక్కు గ్రూపులో ఏర్పడిన అసాధారణ పరిస్థితిని తుదముట్టించవలసిన ఆవశ్యకతను గురించి కామ్రేడ్ స్టాలిన్ రాశాడు. తక్షణ కర్తవ్యాలను గురించి కూడా ఆ వ్యాసం తెలియజేసింది. తర్వాత ఈ కర్తవ్యాలను ప్రాగ్ పార్టీ సభ (కాన్ఫరెన్సు) ఆచరణలో పెట్టింది. అవి ఏమనగా: పార్టీ సర్వసభ్య సమావేశం జరుపుట, పార్టీ ఒక వార్తాపత్రికను బహిరంగంగా ప్రకటించుట, రష్యాలో రహస్య దైనందిన కార్యాచరణను నడిపే పార్టీ కేంద్రాన్ని ఏర్పరుచుట. కామ్రేడ్ స్టాలిన్ వ్యాసం బాకూ కమిటీ తీర్మానాలను ఆధారం చేసుకొని రాయబడింది. బాకూ కమిటీ లెనిన్‌ను పూర్తిగా సమర్థించింది.

ట్రాట్స్కీ యొక్క పార్టీ వ్యతిరేక ఆగస్టు కూటమిలో పార్టీ వ్యతిరేక వ్యక్తులే పూర్తిగా వున్నారు. లిక్విడేటర్లు మొదలుకొని, ట్రాట్స్కీయిస్టులు, ఆట్జోవిస్టులు, భగవన్నిర్మాతల వరకు వున్నారు. ఈ కూటమిని ప్రతిఘటించుటకుగాను ఒక పార్టీ కూటమి ఏర్పడింది. రహస్య శ్రామికవర్గ పార్టీని కాపాడి బలపరచాలనేవారు ఇందులో వున్నారు. ఈ కూటమిలో లెనిన్ నాయకత్వాన బోల్షివిక్కులూ, ప్లెఖనావ్ నాయకత్వాన పార్టీ అనుకూల మెన్షివిక్కులు కొద్దిమంది వున్నారు. ప్లెఖనావ్, అతని ముఠా అయిన పార్టీ అనుకూల మెన్షివిక్కులూ అనేక సమస్యలపై మెన్షివిక్కు వాదననే సాగించేవారు. కాని ఆగస్టు కూటమితోను, లిక్విడేటర్లతోను పూర్తిగా సంబంధం తెంచుకొని, బోల్షివిక్కులతో ఒడంబడికకు చేయిజాపారు. లెనిన్ ప్లెఖనావ్ సూచనను అంగీకరించి, పార్టీ వ్యతిరేక వ్యక్తులకు ప్రతికూలంగా, తాత్కాలికమైన ఒక కూటమిని ఏర్పరచడానికి అంగీకరించాడు. ఈ కూటమి పార్టీకి లాభకరంగాను, లిక్విడేటర్లకు వినాశకరంగాను వుంటుందని, లెనిన్ పై సూచనకు అంగీకరించాడు.

కామ్రేడ్ స్టాలిన్ ఈ కూటమిని పూర్తిగా సమర్థించాడు. ఆ సమయంలో స్టాలిన్ ప్రవాసంలో వుండి, అక్కడి నుంచి లెనిన్‌కు ఒక వుత్తరం రాశాడు. అందులో కామ్రేడ్ స్టాలిన్ ఇలా అన్నాడు.

"నా అభిప్రాయంలో ఈ (లెనిన్, ప్లెఖనావ్‌ల) కూటమి యొక్క

పోకడ ఒకటే సరియైనది: 1. ఈ పోకడయే, ఇదొక్కటే రష్యాలో నిజమైన కార్య ప్రయోజనాలకు అనుగుణంగా వుంటుంది. నిజమైన పార్టీ వ్యక్తులందరూ ఐక్యమై ఈ కూటమి చుట్టూ చేరాలని ఈ పోకడ కోరుతుంది. 2. లిక్విడేటర్లకు మెక్ (మెన్షివిక్కు) వర్కర్లకు మధ్య అఘాతాన్ని తవ్వి, లిక్విడేటర్లను చెదరగొట్టి వదిలించుకొంటుంది. తద్వారా లిక్విడేటర్ల పెత్తనం నుండి బహిరంగ సంస్థలను విముక్తి చేసే మార్గాన్ని ఈ పోకడయే - ఈ పోకడయే ఒక్కటే, సుకరం చేస్తుంది." (లెనిన్-స్టాలిన్-రష్యన్ ఎడిషన్-1వ వాల్యూమ్, 529-30 పేజీలు)

కార్యకలాపంతో కార్యకలాపాన్ని చాకచక్యంగా, కలుపడం ద్వారా బోల్షివిక్కులు బహిరంగ కార్మిక సంస్థలలో ఒక బలమైనశక్తి కాగలిగారు. ఆ కాలంలో జరిగిన నాలుగు బహిరంగ కాంగ్రెసులలో-ప్రజా యూనివర్సిటీల కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఫ్యాక్టరీ వైద్యుల కాంగ్రెస్, మద్యపాన నిషేధ కాంగ్రెస్‌లలో (టెంపరెన్స్) - బోల్షివిక్కులకు కార్మిక గ్రూపులపైగల పలుకుబడి యాదృచ్ఛికంగా బయటపడింది. ఈ కాంగ్రెస్‌లలో (మహాసభలలో) బోల్షివిక్కుల వుపన్యాసాలు రాజకీయంగా చాలా విలువైనవి. దేశమంతా ఇవి చైతన్యాన్ని రేకెత్తించాయి. ఉదాహరణకు ప్రజా యూనివర్సిటీల కాంగ్రెస్‌లో సంస్కృతీ కార్యకలాపాలను అన్నింటినీ గొంతు పిసికివేస్తున్న జారు ప్రభుత్వ వైఖరిని బోల్షివిక్కు కార్మిక ప్రతినిధులు బట్టబయలు చేశారు. జారు ప్రభుత్వాన్ని రద్దుచేసే వరకు నిజమైన సాంస్కృతిక అభివృద్ధి కలుగదని వాదించారు. ఎంతటి అనారోగ్య పరిస్థితులలో జీవించవలసి వుంటున్నదో, పని చేయాల్సి వుంటున్నదో, ఫ్యాక్టరీ వైద్యుల కాంగ్రెస్‌లో కార్మిక ప్రతినిధులు తెలియజేశారు. జారు ప్రభుత్వాన్ని కూలదోసేంత వరకు ఫ్యాక్టరీ పనివాళ్లకు సరైన ఆరోగ్యం సమకూరదని తేల్చిచెప్పారు.

ఇంకా లీగల్‌గా వున్న వివిధ సంఘాల నుండి లిక్విడేటర్లను బోల్షివిక్కులు నెమ్మదిగా తుడిచిపెట్టారు. 'పార్టీ అనుకూలురైన ప్లెఖనావ్ గ్రూపుతో ఏర్పరచుకున్న విలక్షణమైన సంయుక్త సంఘటన ఎత్తుగడలు, అనేక మెన్షివిక్కు కార్మిక సంస్థలను (వైబార్గ్, ఎకాటరీనోక్లావ్ మొదలగు జిల్లాల) బోల్షివిక్కులు తమ వైపుకు తిప్పుకొనేటట్లు చేశాయి.

ఈ క్లిష్ట సమయంలో బహిరంగ కార్యకలాపంతో రహస్య కార్యకలాపం ఎలా కల్పాలో బోల్షివిక్కులు ఉదాహరణతో సహా రుజువు చేశారు. మెన్షివిక్కులతో తెగతెంపులు చేసుకున్న తర్వాత, అన్నిటికన్నా ముఖ్యంగా కొత్త పార్టీని, కొత్త రకపు పార్టీని, పశ్చిమ దేశాలలో సాధారణంగా వున్న సోషల్ డెమొక్రాటిక్ పార్టీల కంటే విభిన్నమైన పార్టీని, అవకాశవాద వ్యక్తులు లేనటువంటి పార్టీని, అధికార కైవశంకై జరిగే పోరాటంలో శ్రామిక వర్గాన్ని నడుప శక్తిగల పార్టీని ఏర్పరచాలి.

బోల్షివిక్కులతో పోరాడుటలో అన్ని రకాల మెన్షివిక్కులూ-ఆక్సెల్ రాడ్, మార్టినోవ్ మొదలుకొని మార్గావ్, ట్రాట్స్కీల వరకు పశ్చిమ యూరోపియన్ సోషల్ డెమొక్రాట్ల ఆయుధాగారం నుండి అప్పుతెచ్చుకున్న ఆయుధాలను తు.చ. తప్పకుండా వుపయోగించారు. (అంటే పశ్చిమ యూరోపియన్ సోషలిస్టుల తప్పుడు సిద్ధాంతాలను వల్లించారు-అనువాదకుడు) జర్మన్ లేక ఫ్రెంచి సోషల్ డెమొక్రాటిక్ పార్టీ వంటి పార్టీ రష్యాలో కూడా వుండాలని వారు కోరారు. ఏదో కొత్తది, ఏదో అసాధారణమైనది, పశ్చిమ సోషల్ డెమొక్రాట్స్‌కు విభిన్నమైనటువంటిది ఏదో బోల్షివిక్కులలో వున్నదని వారు పసికట్టారు. అందుచేతనే బోల్షివిక్కులతో వారు పోరాడారు. ఆ రోజులలో పశ్చిమసోషల్ డెమొక్రాటిక్ పార్టీలు ఎవరికి ప్రాతినిధ్యం వహించేవి? మార్క్సిస్టులూ, అవకాశవాద వ్యక్తులు కలిసిన - విప్లవమిత్రులూ శత్రువులూ కలిసిన - పార్టీ సిద్ధాంతాలను సమర్థించినవారూ, ప్రతికూలించినవారూ కలిసిన కలగూర గంపలే ఆ పార్టీలు. పార్టీ సిద్ధాంతాలను సమర్థించినవారు, ఆ సిద్ధాంతాలను ఎదిరించిన వారితో సిద్ధాంతరీత్యా క్రమక్రమంగా సమాధానపడి, చిట్టచివరకు వారికి పూర్తిగా లొంగిపోయారు. బోల్షివిక్కులు, పశ్చిమ యూరోపియన్ సోషల్ డెమొక్రాట్లను 'అవకాశవాదులతోనూ, విప్లవ ద్రోహులతోనూ సమాధాన మార్గం దేనికి?' అని ప్రశ్నించారు. దీనికి వారిలా జవాబిచ్చారు. "పార్టీలో శాంతి" కోసం "ఐక్యత" కోసం. ఐక్యత ఎవరితో? అవకాశవాదులతోనా? ఔను! అవకాశవాదులతోనే, అని వారు జవాబు ఇచ్చారు. ఇలాంటి పార్టీలు విప్లవ పార్టీలు కాజాలవని విస్పష్టమే.

ఏంగెల్స్ మరణానంతరం, పశ్చిమ యూరోపియన్ సోషల్ డెమొక్రాటిక్ పార్టీలు, సామాజిక విప్లవపార్టీ స్థాయి నుండి 'సంఘ సంస్కరణల' పార్టీలుగా పతనమొందసాగాయి. ఈ పార్టీలన్నీ నిర్మాణరీత్యా, నాయకత్వం వహించే పరిస్థితి నుండి తమ పార్లమెంటు ముఠాకు తోకగా తయారయ్యే స్థితికి మారాయి. ఈ విషయాన్ని గ్రహించకుండా బోల్షివిక్కులు కన్నుమూసుకోలేరు.

అలాంటి పార్టీ శ్రామికవర్గానికి ఎలాంటి మంచినీ తెచ్చిపెట్టదనీ, శ్రామికవర్గాన్ని విప్లవానికి నడిపించగల సామర్థ్యం కలిగి వుండదనీ, బోల్షివిక్కులు గ్రహించకుండా వుండలేరు. శ్రామికవర్గానికి కావలసింది అలాంటి పార్టీ కాదు. మరో రకపు పార్టీ. అది నిజమైన మార్క్సిస్టు పార్టీ. కొత్తపార్టీ. అవకాశవాదులపట్ల రాజీ లేనిదీ, బూర్జువాల పట్ల విప్లవకరంగాను వుండాలి. బిగువైన అల్లిక గలిగి, ఏకశిలాఖండంలాంటి దృఢమైన పార్టీగా వుంటుంది. అది సామాజిక విప్లవపార్టీ. శ్రామికవర్గ నియంతృత్వ పార్టీ. ఇలాంటి పార్టీయే శ్రామికవర్గానికి అవసరమనే విషయాన్ని బోల్షివిక్కులు గ్రహించకుండా వుండలేకపోయారు.

బోల్షివిక్కులు కోరింది ఇలాంటి కొత్తరకపు పార్టీనే, ఇలాంటి పార్టీని నిర్మించడానికి బోల్షివిక్కులు కృషిచేశారు కూడా.

# 5

## 1912లో ప్రాగ్‌లో పార్టీ కాంగ్రెస్ – బోల్షివిక్కుల స్వతంత్ర మార్క్సిస్టు పార్టీగా ఏర్పడుట.

లిక్విడేటర్లతోను, ఆట్జోవిస్టులతోను, ట్రాట్స్కీవాదులతోను సాగించే పోరాటంలో, బోల్షివిక్కులనందరినీ ఐక్యపరచి స్వతంత్ర బోల్షివిక్కు పార్టీని ఏర్పరచే అత్యవసర కర్తవ్యం వారిని ఎదుర్కొంది. కార్మికవర్గాన్ని చీల్చుతున్న పార్టీలో అవకాశవాద ధోరణులను తుదముట్టించడానికి ఇది అత్యవసరం. ఇంతేగాక, కార్మికవర్గ శక్తులను సమకూర్చుట పూర్తిచేసి, ఆ కార్మిక శక్తిని నూతన విప్లవోత్తేజానికి సన్నద్ధపరచేందుకు కూడా ఇది చాలా అవసరం.

కాని ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాలంటే ముందు అవకాశవాదులను, మెన్షివిక్కులను పార్టీ వదిలించుకోవాలి.

మెన్షివిక్కులతో కలిసి బోల్షివిక్కులు ఒకే పార్టీలో వుండడాన్ని గురించి ఆలోచించవలసిన పనేలేదు. ఈ విషయంలో ఏ బోల్షివిక్కుకు, ఎట్టి సందేహమూ లేదు. స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో మెన్షివిక్కుల ద్రోహ ప్రవర్తన, శ్రామికవర్గ పార్టీని రద్దుపరచి ఒక కొత్త సంస్కరణవాద (రిఫార్మిస్టు) పార్టీని ఏర్పరచటానికి వారి ప్రయత్నాలు, వారితో తెగతెంపులు చేసుకొనుటను తప్పనిసరి చేశాయి. మెన్షివిక్కులతో కలసి బోల్షివిక్కులు ఒకే పార్టీలో వుండడం వల్ల మెన్షివిక్కుల ప్రవర్తనకు నైతిక బాధ్యతను, ఏదో విధంగా బోల్షివిక్కులు అంగీకరించినట్లే అయింది. కాని మెన్షివిక్కుల బహిరంగ ద్రోహానికి బోల్షివిక్కులు నైతిక బాధ్యతను అంగీకరించటం ఊహించరానిది. పార్టీకి, కార్మిక వర్గానికీ తామే ద్రోహులు కాదలిచితే తప్ప అలాంటి నైతిక బాధ్యతను తాము అంగీకరించలేరు. ఒకే పార్టీలో మెన్షివిక్కులతో కలిసి వుండడమంటే కార్మికవర్గానికీ, పార్టీకి ద్రోహం చేసే స్వభావాన్ని సహించుటే. అందుచేతే మెన్షివిక్కులతో వాస్తవంగా తెగతెంపులు పూర్తి చేయాలంటే నిర్మాణరీత్యా తెగతెంపులు చేసుకోవాలి. పార్టీ నుండి మెన్షివిక్కులను వెళ్లగొట్టాలి.

ఈ మార్గం ద్వారానే ఒకే కార్యక్రమమూ, ఎత్తుగడలూ కల్గిన వర్గ సంస్థగా శ్రామికవర్గ విప్లవ పార్టీని పునరుద్ధరించుట సాధ్యమవుతుంది.

మెన్షివిక్కులు నాశనం గావించిన పార్టీ ఐక్యతను వాస్తవంగా (నామకః కాదు) పునరుద్ధరించాలంటే ఈ ఒక్క మార్గం ద్వారానే సాధ్యం అవుతుంది. ఈ కర్తవ్యాన్ని పార్టీ ఆరవ మహాసభ పూర్తి చేయవలసివుంది. ఈ మహాసభకై బోల్షివిక్కులు సన్నాహాలు గావిస్తున్నారు.

కాని కర్తవ్య నిర్వహణలో ఇది ఒక భాగం మాత్రమే. మెన్షివిక్కులతో వాస్తవంగా విడిపోవుటా, బోల్షివిక్కులు ప్రత్యేక పార్టీని స్థాపించుట చాలా ముఖ్యమైన రాజకీయ కర్తవ్యం. నిజమైన విప్లవ మార్క్సిస్టు పార్టీని కోరేవారందరికీ నమూనాగా పనికివచ్చే ఒక కొత్తరకపు బోల్షివిక్ పార్టీని బోల్షివిక్‌లు నిర్మించదలచారు. పాత ఇస్క్రా కాలం నుండి అలాంటి పార్టీని నిర్మించడానికి బోల్షివిక్‌లు పనిచేస్తూనే వున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా నిరంతరం దానికోసం పట్టుదలతో పనిచేస్తూనే వచ్చారు. 'ఏమిచెయ్యాలి?' – 'రెండు ఎత్తుగడలు' అన్న లెనిన్ గ్రంథాలు ఈ కార్యకలాపంలో ప్రధాన నిశ్చిత పాత్రను వహించాయి. అలాంటి సిద్ధాంత సన్నాహాన్ని (ఐడియాలాజికల్ ప్రిపరేషన్) 'ఏమి చేయాలి' అనే గ్రంథం చేసింది. అలాంటి పార్టీకి నిర్మాణ సన్నాహాన్ని (ఆర్గనైజేషనల్ ప్రిపరేషన్) 'ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి' అనే లెనిన్ గ్రంథం చేసింది. అలాంటి పార్టీకి రాజకీయ సన్నాహాన్ని (పొలిటికల్ ప్రిపరేషన్) 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమాక్రసీ అవలంబించవలసిన రెండు ఎత్తుగడలు' అనే లెనిన్ గ్రంథం చేసింది. అలాంటి పార్టీకి తాత్విక సన్నాహాన్ని (థీరిటికల్ ప్రిపరేషన్) 'భౌతికవాదము, అనుభవవాద – విమర్శ' అనే లెనిన్ గ్రంథం చేసింది.

చరిత్రలో ఇదివరకెన్నడూ ఏ రాజకీయ గ్రూపు కూడా తానొక పార్టీగా ఏర్పడుటకు, బోల్షివిక్ గ్రూపులాగ అంత సాకల్యంగా సన్నాహమైన గ్రూపు ఏదీ లేదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

అందుచేత బోల్షివిక్కులు తామొక పార్టీగా కట్టుబాటు చేసుకోవడానికి పరిస్థితులు పూర్తిగా పరిపక్వమై సిద్ధంగా వున్నాయి.

మెన్షివిక్కులను వెళ్లగొట్టి కొత్తదైన బోల్షివిక్ పార్టీని వాస్తవంగా ఏర్పరుచుటద్వారా పనిని పూర్తిచేయవలసిన కర్తవ్యం పార్టీ ఆరవ కాన్ఫరెన్స్‌పై బడింది.

అఖిల రష్యన్ ఆరవసభ (కాన్ఫరెన్సు) 1912 జనవరిలో ప్రాగ్‌లో (జెకోస్లోవేకియాలో) జరిగింది. 20 పార్టీ సంస్థలకు (ఆర్గనైజేషన్స్) పైగా ప్రతినిధులను పంపాయి. అందుచేత ఈ సభకు సక్రమమైన పార్టీ మహాసభకు (కాంగ్రెస్‌కు) వున్న ప్రాముఖ్యత వుంది.

ఈ సభ (కాన్ఫరెన్సు) ఇలా ప్రకటించింది: "తుత్తునియలైన పార్టీ కేంద్ర యంత్రం పునరుద్ధరించబడింది. కేంద్ర కమిటీ తిరిగి నెలకొల్పబడింది. రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఒక నిశ్చిత నిర్మాణ రూపం పొందిన తర్వాత, దాని అనుభవంలో అభివృద్ధి నిరోధక కాలమే దానికి చాలా గడ్డుకాలమని తెలియజేయబడింది. పార్టీపైన ఎంత నిర్బంధ విధానం కొనసాగించినా, ఎన్ని గట్టి దెబ్బలు కొట్టినా, పార్టీ లోపలి అవకాశవాదులు ఎంత ద్రోహం చేసినా, ఎంత ఊగిసలాడినా, శ్రామికవర్గ పార్టీ నిర్మాణాన్ని (ఆర్గనైజేషన్), తన పతాకను యధాతథంగా కాపాడుకోగలిగింది."

ఆ సభ (కాన్ఫరెన్సు) ప్రకటన ఇలా వుంది: "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ పతాకమూ, కార్యక్రమమూ, విప్లవ సాంప్రదాయాలు మాత్రమే గాక, దాని నిర్మాణం (ఆర్గనైజేషన్) కూడా నిలువగల్గాయి. ఆ నిర్మాణాన్ని నిర్బంధ విధానం కుంటుపరచి బలహీనపరచి యుండవచ్చు. కాని పూర్తిగా నాశనం చేయలేకపోయింది."

రష్యాలో కార్మికవర్గ విజయంలో నూతన వెల్లువ ప్రథమ చిహ్నాలను ఈ సభ గమనించింది. పార్టీ పనిలో పునరుద్ధరణను గమనించి స్థానిక సంస్థలు ఇచ్చిన రిపోర్టుల మీద తీర్మానం చేస్తూ, సభ ఇలా అన్నది. "స్థానిక రహస్య సోషల్ డెమొక్రాటిక్ సంస్థలనూ, గ్రూపులను బలపరచే వుద్దేశంతో సోషల్ డెమొక్రాటిక్ వర్కర్లలో ప్రతిచోటా శక్తివంతమైన కృషి జరుగుతోంది."

తిరోగమన కాలాలలో బోల్షివిక్ ఎత్తుగడలలోని అత్యంత ప్రధానమైన నియమాన్ని – అనగా బహిరంగంగా వున్న కార్మిక సంఘాలలోను, సొసైటీలలోను బహిరంగ కార్యకలాపంతో రహస్య కార్యకలాపాన్ని మేళవింపజేయుట – అన్ని స్థలాల్లోనూ అమలుపరచబడుతుందని ఈ సభ గుర్తించింది.

ప్రాగ్ మహాసభ బోల్షివిక్ సెంట్రల్ కమిటీని ఎన్నుకొంది. అందులో లెనిన్, స్టాలిన్, ఆర్జోనికిట్జ్, స్వెర్డలావ్, స్పాండరియాన్ మొదలగు వారున్నారు. కామ్రేడ్ స్టాలిన్, స్వెర్డలావ్, ఆ కాలంలో ప్రవాసంలో వుండడంవల్ల వారు సభకు హాజరు కాలేదు. అయినా వారిని సెంట్రల్ కమిటీకి ఎన్నుకొన్నారు. సెంట్రల్ కమిటీ ప్రత్యామ్నాయ సభ్యులలో (ఆల్టర్నేటివ్ సభ్యులలో) కామ్రేడ్ కాలినిన్ ఒకడు.

రష్యాలో విప్లవ కార్యకలాపాలను నడుపుటకు ఆచరణలో నడిపే కేంద్రాన్ని (ప్రాక్టికల్ సెంటర్ – రష్యన్ సెంట్రల్ కమిటీ బ్యూరో) నెలకొల్పారు. దానికి కామ్రేడ్ స్టాలిన్ అధ్యక్షుడు. కామ్రేడ్స్ వై. స్వెర్డలావ్, ఎస్. స్పాండరియాన్, ఎస్. ఆర్జోనికిట్జ్, ఎం. కాలినిన్ మొదలగువారు ఆ బ్యూరోలో సభ్యులు.

అవకాశవాదంతో బోల్షివిక్కులు ఇదివరలో సాగించిన పోరాటాన్ని ప్రాగ్ సభ సింహావలోకనం చేసి, పార్టీ నుండి మెన్షివిక్కులను వెళ్లగొట్టడానికి నిశ్చయించింది.

పార్టీ నుండి మెన్షివిక్కులను వెళ్లగొట్టుట ద్వారా ప్రాగ్ సభ బోల్షివిక్ పార్టీ స్వతంత్ర వునికిని వాస్తవంగా ప్రారంభించింది. మెన్షివిక్కులను సిద్ధాంతరీత్యా, నిర్మాణరీత్యా ఓడించిన పిదప, పార్టీ నుంచి వారిని వెళ్లగొట్టిన పిదప, రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ లేబర్ పార్టీ పూర్వ ప్రతిష్టను బోల్షివిక్కులు కాపాడారు. అందుచేతనే 1918 వరకు బోల్షివిక్ పార్టీ, రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ లేబర్ పార్టీ అని బ్రాకెట్లలో 'బోల్షివిక్' అనే పదాన్ని చేర్చి పిలువబడేది.

1912లో ప్రాగ్ సభ ఫలితాలను గురించి గోర్కికి జాబు వ్రాస్తూ, లెనిన్ ఇలా అన్నాడు:

"లిక్విడేటర్ల మురికి వదిలించుకుని పార్టీని, పార్టీ సెంట్రల్ కమిటీని పునరుద్ధరించుటలో చిట్టచివరకు జయప్రదమయ్యాం. ఈ విషయం విని మీరు మాతో పాటు సంతోషిస్తారని ఆశిస్తాను." (లెనిన్: కలెక్టడ్ వర్క్స్ – రష్యన్ ఎడిషన్–వాల్యూమ్ 29–19వ పేజి)

ప్రాగ్ సభ ప్రాముఖ్యతను గురించి మాట్లాడుతూ, కామ్రేడ్ స్టాలిన్ ఇలా అన్నాడు:

"ఈ సభ మన పార్టీ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమైనది. ఎందువల్లనంటే బోల్షివిక్కులకు మెన్షివిక్కులకు మధ్య అది ఒక స్పష్టమైన గీత గీచింది. దేశమంతటా వున్న బోల్షివిక్ సంస్థలను (ఆర్గనైజేషన్స్) ఒక ఐక్య బోల్షివిక్ పార్టీగా సంయుక్తపరచింది." (సో.యూ. క.(బో) పార్టీ యొక్క 15వ కాంగ్రెస్ వెర్బాటిమ్ రిపోర్టు నుండి–రష్యన్ ఎడిషన్–361–62 పేజీలు)

మెన్షివిక్కులను వెళ్లగొట్టి, బోల్షివిక్కులు ఒక స్వతంత్ర పార్టీని ఏర్పరచిన తర్వాత, బోల్షివిక్ పార్టీ మరింత గట్టిపడి బలపడింది. రెండవ ఇంటర్నేషనల్ యొక్క సోషల్ డెమొక్రాటిక్ పార్టీలకు పూర్తిగా విభిన్నమైన కొత్తరకపు పార్టీ బోల్షివిక్ పార్టీ. అవకాశవాద వ్యక్తులను తమలో నుండి తరుముటవల్లనే (పర్జు చేయుటవల్లనే) పార్టీ బలపడుతుంది – అన్నది ఈ బోల్షివిక్ పార్టీ సూత్రాలలో ఒకటి. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన పార్టీలు, తాము మార్క్సిస్టు పార్టీలేనని పిలుచుకున్నప్పటికీ, వాస్తవంలో అవి వాటి అనుచరులలో వున్న బహిరంగ అవకాశవాదులను మార్క్సిజానికి శత్రువులను సహించాయి. ఆ విధంగా రెండవ ఇంటర్నేషనల్‌ను వారు కల్మషమొనర్చి, నాశనం చేయడానికి అవకాశమిచ్చాయి. బోల్షివిక్కులు దానికి విరుద్ధంగా అవకాశవాదులతో విరామం లేకుండా పోరాటాన్ని సాగించారు. శ్రామికవర్గ పార్టీ నుండి అవకాశవాదమనే చెత్తను తుడిచివేశారు. కొత్తరకపు పార్టీని, లెనినిస్టు పార్టీని, తర్వాత శ్రామికవర్గ పార్టీ అనుయాయులలో అవకాశవాదులు మిగిలివుంటే బోల్షివిక్ పార్టీ నడివీధిలోకి వచ్చి, శ్రామికవర్గాన్ని నడపగలిగి వుండేది కాదు. అధికారాన్ని కైవశం చేసుకొని, శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పగలిగి వుండేదికాదు. అంతర్యుద్ధం నుండి విజయవంతంగా బయటపడి, సోషలిజాన్ని నిర్మించగలిగి వుండేది కాదు.

కనీస కార్యక్రమంలో ఉదహరించిన ఈ కింది కోర్కెలను ప్రజాతంత్ర రిపబ్లిక్, దినానికి 8 గంటల పని, ఎస్టేటు భూములన్నిటినీ వశపర్చుకొనుట అనే కోర్కెలను–పార్టీ తక్షణ ముఖ్య రాజకీయ నినాదాలుగా ప్రకటించుటకు ప్రాగ్‌సభ నిర్ణయించింది.

ఈ విప్లవ నినాదాలతో, ప్రభుత్వ నాల్గవ డ్యూమా ఎన్నికల సందర్భంలో బోల్షివిక్కులు తమ ప్రచారాన్ని కొనసాగించారు. 1912–14 సంవత్సరాలలో కార్మిక వర్గ జనసామాన్య విప్లవోద్యమంలో నూతన వుత్తేజానికి ఈ నినాదాలే దోహదమిచ్చాయి.

### క్లుప్త సారాంశం

1908–12 మధ్య కాలం విప్లవ కార్యకలాపానికి చాలా కష్టమైన కాలం. విప్లవం ఓడిపోయిన తర్వాత, విప్లవోద్యమం క్షీణదశలో వున్నప్పుడు, ప్రజలు అలసిపోయి వున్నప్పుడు బోల్షివిక్కులు తమ ఎత్తుగడలను మార్చారు. జారు ప్రభుత్వంతో ముఖాముఖి పోరాటం మాని, వంకరటింకర పోరాటం ప్రారంభించారు. స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలంలోని

కష్టపరిస్థితులలో బోల్షివిక్కులు ఏ మాత్రపు బహిరంగ అవకాశం దొరికినా, దానిని ప్రజా సామాన్యంతో తమ సంబంధాలను కొనసాగించేందుకు వుపయోగించుకున్నారు. (వైద్య సహాయక సంఘాలు, కార్మిక సంఘాలు మొదలుకొని డ్యూమా వేదిక వరకు వుపయోగించుకున్నారు. విప్లవోద్యమం తిరిగి తలెత్తడానికి సర్వశక్తులను సమకూర్చేందుకై బోల్షివిక్కులు విసుగూ విరామం లేకుండా పనిచేశారు.)

విప్లవ ఓటమి ఫలితంగా అనేక పరిస్థితులు ఏర్పడ్డాయి. జార్ ప్రతిపక్షధోరణులు శిధిలమయ్యాయి. విప్లవమంటే ఆశాభంగం కలిగింది. పార్టీని వదిలి పెట్టిన మేధావులు (బోగ్దనోవ్, బాజరోవ్ మొదలైనవారు) సిద్ధాంత పునాదులను కుసంస్కరించాలని తిరిగి తిరిగి ప్రయత్నించారు. ఈ పరిస్థితులలో పార్టీ పతాకను దించకుండా, పార్టీ కార్యక్రమానికి విశ్వాసంతో కట్టుబడి, మార్క్సిస్టు సిద్ధాంత 'విమర్శకుల' దాడులను ఎదుర్కొన్నది పార్టీలోని బోల్షివిక్కు గ్రూపు ఒక్కటే (లెనిన్ "భౌతికవాదం – అనుభవవాద విమర్శ" అనే గ్రంథం.) పార్టీని, పార్టీ విప్లవ సూత్రాలను రక్షించడానికి లెనిన్ చుట్టూ సమీకరించబడిన బోల్షివిక్కుల ముఖ్య నాయకత్వానికి సహాయపడినది ఏమిటి? ఈ ముఖ్య మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతంలో కాకలుతీరిన విప్లవ భవితవ్యాలను గ్రహించగలిగారు. ఈ సందర్భంలోనే లెనిన్ బోల్షివిక్కులను గురించి చెబుతూ, "మనం పర్వతంలాగా దృఢంగా వున్నామని వారు వూరికే చెప్పలేదు" అని అన్నాడు.

ఆ కాలంలో విప్లవాన్నుండి మెన్షివిక్కులు అంతకంతకూ దూరమైపోతున్నారు. రహస్య శ్రామికవర్గ విప్లవ పార్టీని రద్దుచేసి, దానికి స్వస్తి చెప్పాలని వీరన్నారు. అందుచే వీరికి లిక్విడేటర్లని పేరు వచ్చింది. వీరు అంతకంతకూ బహిరంగంగా పార్టీ కార్యక్రమాన్ని, విప్లవ ధ్యేయాలనూ, పార్టీ నినాదాలనూ పరిత్యజించారు. తాము సొంతంగా ఒక సంస్కరణవాద పార్టీని సంఘటితపరచడానికి ప్రయత్నించారు. ఈ పార్టీకే కార్మికులు "స్టోలోపిన్ లేబర్ పార్టీ" అని పేరు పెట్టారు. "పార్టీ ఐక్యత" అనే నినాదాన్ని కపటభక్తితో వల్లిస్తూ, దాన్ని ముసుగుగా వుపయోగించుతూ ట్రాట్స్కీ, లిక్విడేటర్లను సపోర్టు చేశాడు. వాస్తవంలో పార్టీలో ఐక్యత అంటే అతని వుద్దేశం లిక్విడేటర్లతో ఐక్యత అనే.

మరొక పక్క జారు ప్రభుత్వంపై పోరాటంలో కొత్త పద్ధతులను, డొంక తిరుగుడు పద్ధతులను అవలంబించవలసిన ఆవశ్యకతను అర్థం చేసుకోలేని కొందరు బోల్షివిక్కులు బహిరంగ అవకాశాలను వుపయోగించుకోరాదని అన్నారు. ప్రభుత్వ డ్యూమాలోని కార్మిక ప్రతినిధులను ప్రభుత్వ డ్యూమా నుండి పిలిపించి వేయాలని కోరారు. ఈ ఆట్జోవిస్టులు ప్రజా సామాన్యంతో తెగతెంపులు చేసుకోవడానికి పార్టీని ముందుకు నెడుతున్నారు. విప్లవం తిరిగి తలయెత్తడానికై సర్వశక్తులను సమీకరించడాన్ని కుంటుపరుస్తున్నారు. లిక్విడేటర్లులాగానే ఆట్జోవిస్టులు కూడా "అతివాద" పదజాలాన్ని వుపయోగిస్తూ, ఆచరణలో విప్లవ పోరాటాన్ని పరిత్యజిస్తున్నారు.

లిక్విడేటర్లు, ఆట్జోవిస్టులు లెనిన్‌కు వ్యతిరేకంగా ఆగస్టు బ్లాక్ అనే పేరుతో ఒక ముఠా ఏర్పరచారు. దీనిని ట్రాట్స్కీ సంఘటితపరచాడు. లిక్విడేటర్లతో, ఆట్జోవిస్టులతో సాగించిన పోరాటంలో బోల్షివిక్కులదే పైచేయి అయింది. వారు శ్రామికవర్గ రహస్య పార్టీని రక్షించుటలో జయం పొందారు.

ఈ కాలంలో జరిగిన ప్రముఖమైన ఘటన ఏమంటే, రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ లేబర్ పార్టీ ప్రాగ్‌సభ (కాన్ఫరెన్స్ 1912, జనవరి). ఈ సభలో పార్టీ నుండి మెన్షివిక్కులు వెళ్లగొట్టబడ్డారు. పార్టీలో మెన్షివిక్కులతో బోల్షివిక్కులకున్న నామమాత్రపు ఐక్యత శాశ్వతంగా అంతమయింది.

ఒక రాజకీయ గ్రూపుగా వుంటున్న బోల్షివిక్కులు తామొక స్వతంత్ర పార్టీగా రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ లేబరుపార్టీ (బోల్షివిక్)గా వాస్తవంగా ఏర్పడ్డారు. ప్రాగ్‌సభ ఒక కొత్తరకపు పార్టీని, లెనినిస్టు పార్టీని, బోల్షివిక్ పార్టీని ప్రారంభించింది.

ప్రాగ్‌సభలో శ్రామికవర్గ పార్టీ అనుయాయుల నుండి అవకాశవాదులను, మెన్షివిక్కులను తొలగించుట (పర్జ్‌చేయుట), ఆ తర్వాత పార్టీ అభివృద్ధిపైన, విప్లవాభివృద్ధిపైన ముఖ్యమైన, నిశ్చితమైన ప్రభావాన్ని కలిగించింది. కార్మిక ఆశయానికి ద్రోహులైన వారిని మెన్షివిక్ రాజీ బేరగాండ్లను పార్టీ నుండి బోల్షివిక్కులు వెళ్లగొట్టి వుండకపోయినట్లయితే, శ్రామికవర్గ పార్టీ 1917లో శ్రామికవర్గ నియంతృత్వానికై జరిగే పోరాటానికి ప్రజాసామాన్యాన్ని వుత్తేజపరచగలిగి వుండేదికాదు.

★

ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం భారత్‌లో దాదాపు 3 కోట్ల మంది మహిళలు, బాలికలు వేశ్యావృత్తిలో మగ్గుతున్నారు. వీరిలో 60 శాతం మంది అట్టడుగు వర్గాల వారే వున్నారు. ఇందులో 30 శాతం మంది 18 ఏళ్ల లోపు వారే. వీరందరిలో 40 శాతం మంది నిర్బంధంగా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు.

# బస్తర్ పోరాట వారసత్వాన్ని ఎత్తిపట్టిన యోధుడు

# కామ్రేడ్ విజయ్ అమర్ రహే!

బస్తర్ విప్లవోద్యమంలో ఉద్భవించిన స్థానిక తొలితరం పోరాటకారులలో ఒకరైన కామ్రేడ్ విజయ్ (మడకం హిడ్మాల్) జూలై 15న మరణించాడు. జూలై 14న కామ్రేడ్ విజయ్ నడుపుతుండిన ట్రాక్టర్ ఒక చెట్టుకు ఢీకొనడం వలన ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు ఆయనను బతికించుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయి మరుసటి రోజు ఆయన కన్నుమూశాడు. 47 సంవత్సరాల తన జీవిత కాలంలో అర్ధ బాగానికి మించి విప్లవోద్యమానికే వెచ్చించిన ఈ బస్తర్ మట్టిబిడ్డ దండకారణ్య విప్లవోద్యమంలో ఒక ప్రముఖ నాయకుడిగా ఎదిగాడు. మరణించే నాటికి ఆయన దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శిగానూ, దక్షిణ రీజినల్ కమిటీ సభ్యుడుగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. నేడు దండకారణ్య విప్లవోద్యమం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను అధిగమించడంలో కీలకపాత్రను పోషిస్తున్న నాయకత్వ టీంలో ఒకరైన కామ్రేడ్ విజయ్‌ను కోల్పోవడం అక్కడి వుద్యమానికి ఎంతో నష్టదాయకం.



పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అమరుడైన కామ్రేడ్ విజయ్‌కు వినమ్ర నివాళి అర్పిస్తూ ఆయన చరిత్రను మననం చేసుకుందాం.

కామ్రేడ్ విజయ్ 1965లో దంతెవాడ జిల్లా కువ్వకుండ బ్లాకు నీలవరం గ్రామంలో ఒక మధ్యతరగతి మురియా ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. తల్లిదండ్రులకున్న ఆరుగురి సంతానంలో కామ్రేడ్ విజయ్ నాల్గవవాడు. బైలాడిల్లా ఇనుప గనుల ప్రారంభ దినాల్లో అక్కడి ఆదివాసీలను నిర్వాసితులను చేస్తూ, రైల్వే లైన్లు వేయడం, గ్రామాలను బలవంతంగా ఇతర ప్రాంతాలకు తరలించడం లేదా ఆదివాసీలే పారిపోయేలా చేయడం జరిగింది. అలా నిర్వాసిత ప్రభావానికి గురైన గ్రామాల్లో నీలవరం ఒకటి. ఒకవైపు నిర్వాసితత్వం, మరోవైపు సరిపడా భూములు లేకపోవడంతో కువ్వకొండ బ్లాకులోని వివిధ గ్రామాలకు చెందిన అనేక కుటుంబాలు సుక్మా జిల్లా, కోంట బ్లాక్‌లోని జేగురుగొండ ప్రాంతానికి వలస వెళ్లాయి. అలా వలస వెళ్లిన కుటుంబాలలో కామ్రేడ్ విజయ్ కుటుంబం కూడా ఒకటి. 1975లో వీళ్ల కుటుంబం నీలవరం గ్రామం వదిలి కరుంగడ్ గ్రామానికి చేరుకొని అక్కడే స్థిరపడింది. అప్పటికి కామ్రేడ్ విజయ్ వయస్సు పది సంవత్సరాలు మాత్రమే. అక్కడి దొర్ల ఆదివాసీ ప్రజలతో కలిసి అటవీ భూములు నరికి సాగుచేస్తూ వీళ్ల కుటుంబం జీవనం సాగించింది.

ఫారెస్టు వాళ్ల వేధింపులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, మరోవైపు రెవెన్యూ విభాగపు అక్రమ వసూళ్లు, పట్టాల పేరుతో డబ్బులు గుంజడం తదితర పీడన విపరీతంగా సాగుతుండిన రోజులవి. ఎంతో శ్రమకోర్చి సేకరించిన ఇప్పపువ్వు, ఇప్పబద్దలు, బంక, ఉసిరికాయ, చింతపండు, మామిడి ఒరుగు తదితర అటవీ ఉత్పత్తులను అమ్మబోయినా, నిత్యావసర వస్తువులను కొనబోయినా సంతల్లో షావుకార్ల మోసాలు ఇష్టారాజ్యంగా సాగిన రోజులవి.

ఇలాంటి గడ్డుకాలంలో కామ్రేడ్ విజయ్ పెరిగి పెద్దవాడవుతున్న క్రమంలో 1980లో అప్పటి సి.పి.ఐ. (ఎం.ఎల్.) పీపుల్స్‌వార్ నాయకత్వంలో గెరిల్లా దళాలు బస్తర్‌లో ప్రవేశించాయి.

1984 ప్రారంభం నుండి బాసగూడెం దళం పేరుతో ఒక గెరిల్లా దళం పామేడ్, జేగురుగొండ, బాసగూడెం, ఊసురు ప్రాంత గ్రామాల ప్రజలను సంఘటితం చేసే కృషి ప్రారంభించింది. 1985-86లో ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ (ఏకేఎంఎస్) నిర్మాణాలు గ్రామ గ్రామాన ప్రారంభమయ్యాయి. ప్రారంభం నుండి దళంతో చురుకైన సంబంధాలు కల్గి వుండిన కామ్రేడ్ విజయ్ తమ గ్రామంలో ఏర్పడిన సంఘానికి కార్యవర్గ సభ్యుడయ్యాడు.

సంఘం కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటూ, బొడికెల్, చింతల్‌నార్ సంతల్లో షావుకార్ల తప్పుడు తూకాలకు, అక్రమాలకు

వ్యతిరేకంగా 1986లో చేపట్టిన పోరాటంలో తన గ్రామ ప్రజల్ని దృఢంగా నిలబెట్టాడు. తునికాకు కూలీ రేట్ల పెంపుదల పోరాటంలో గ్రామాన్ని ఏకతాటిపై నిలిపాడు. ఇలా పోరాటాలకు చురుకైన నాయకత్వం అందిస్తూ 1988 ప్రారంభంలో ఏకేఎంఎస్ రేంజ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. రేంజ్ కమిటీ సభ్యుడిగా జేగురుగొండ ప్రాంతం అంతటా సంఘాన్ని విస్తరింపజేయడంలోనూ, బలోపేతం చేయడంలోనూ కృషి చేశాడు. రేంజ్ వ్యాప్తంగా చేపట్టిన అటవీ భూముల ఆక్రమణ పోరాటాలకు, క్రూరమైన తెగ పెత్తందార్లకు వ్యతిరేకంగా చేపట్టిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించడంలో ముందున్నాడు.

ఇలా పోరాటాల్లో చురుకైన పాత్ర వహిస్తున్న కామ్రేడ్ విజయ్‌ను1988 అక్టోబర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. జగ్దల్‌పూర్ సెంట్రల్ జైలులో తొమ్మిది నెలలు గడిపి జమానత్‌పై విడుదలైన వెంటనే సంఘ కార్యకలాపాల్లో తిరిగి పాల్గొనడం ప్రారంభించి అరెస్టులు, చిత్రహింసలు విప్లవాన్ని అడ్డుకోలేవని చాటాడు. 1990 మేలో వరంగల్‌లో జరిగిన చారిత్రాత్మక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుకూలీ మహాసభలకు హాజరై, అక్కడ ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించి, లక్షలాది ప్రజలను ఆకట్టుకున్నాడు. ఆ వెంటనే 1990 జూన్‌లో పూర్తికాలం కార్యకర్తగా కోంట గెరిల్లా దళంలో సభ్యుడిగా చేరాడు.

1990 ఆగస్టు-సెప్టెంబర్‌లో మొదటి జనజాగరణ్ అభియాన్ కుట్రు ప్రాంతంలో ప్రారంభమై పశ్చిమ, దక్షిణ్ బస్తర్ ప్రాంతంలో భయానకంగా, పాశవికంగా కొనసాగింది. వందలాది ప్రజలు అరెస్టులు, చిత్రహింసలకు గురయ్యారు. డజన్‌కు పైగా ప్రజలు అత్యంత కౄరంగా హతమయ్యారు. ఈ దాడిని ఓడించడం కోసం డివిజన్ కమిటీ నాయకత్వంలో ఏర్పడిన ప్రత్యేక గెరిల్లా ప్లాటూన్ నాలుగు నెలల పాటు ప్రతిఘటనా కార్యక్రమాలు తీవ్రతరం చేసింది. ఈ ప్రతిఘటనలో కామ్రేడ్ విజయ్ కూడా పాల్గొని జన జాగరణ్‌ను ఓడించడంలో తన వంతు పాత్ర పోషించాడు.

ఏరియా స్థాయి కమిటీల నిర్మాణం చేపట్టాలని 1992లో దండకారణ్య ఫారెస్టు కమిటీ నిర్ణయం చేసింది. ఈ నిర్ణయం ప్రకారం 1992లో కోంట ప్రాంతంలో ఏర్పడిన ఏరియా స్థాయి (సాక్) కమిటీలోకి కామ్రేడ్ విజయ్ ఎన్నికయ్యాడు. ఆ తర్వాత ఆ ఏరియా ఉద్యమ అభివృద్ధిలో, విస్తృతిలో అతని పాత్ర విడదీయరానిదైపోయింది. పార్టీ, ప్రజా సంఘాలను నిర్మించడంలో మంచి అనుభవం గడించాడు. భూస్వాములకు వ్యతిరేకంగా భూస్వాధీన పోరాటాల్లోకి ప్రజలను కదిలించి వందలాది పేద కుటుంబాలకు భూములు కల్పించి పార్టీకి బలమైన మద్దతు కూడగట్టి ప్రజల హృదయాల్లో ముద్రించుకుపోయాడు.

1995లో మునుపటి సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీ అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో గ్రామ రాజ్య కమిటీ (జీఆర్‌సీ)ల నిర్మాణం తీసుకోవాలని చేసిన నిర్ణయం వెలుగులో, దండకారణ్య పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్, కోంట ఏరియా పరిధిలోనే జీఆర్‌సీల నిర్మాణం మొదట చేపట్టింది. అనేక గ్రామాల్లో జీఆర్‌సీలు నిర్మించి ప్రజలకు రాజ్యాధికారాన్ని, పార్టీకి అనుభవాన్ని అందించిన మొదటి కామ్రేడులలో కామ్రేడ్ విజయ్ ఒకరు. జీఆర్‌సీల నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలోనూ, ప్రజలకు వైద్యం అందించడంలోనూ, ప్రజలతో శుభ్రతను పాటింపజేయడంలోనూ కామ్రేడ్ విజయ్ ప్రముఖ పాత్ర పోషించాడు. ముఖ్యంగా సహకార సంఘాలు స్థాపించి వ్యవసాయ విధానంలో మార్పు తీసుకురావడానికి తీవ్రంగా కృషిచేశాడు. ఆదివాసీ సంస్కృతిలో వ్యవసాయ పనులకు ఆటంకంగా వున్న అంశాల గురించి ప్రజలతో విస్తృతంగా చర్చించి వాటిని ప్రజల ఆమోదంతోనే మార్చే ప్రయత్నాలు చేశాడు.

2000లో కామ్రేడ్ విజయ్ దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. అప్పటి నుండి అమరత్వం చెందే వరకూ డివిజన్ కమిటీ సభ్యుడిగా, కార్యదర్శిగా తను పోషించిన పాత్ర చాలా ముఖ్యమైనది. మునుపటి సి.పి.ఐ.(ఎంఎల్) పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్‌లో తీసుకున్న నిర్ణయాల వెలుగులో డివిజన్‌లో జీఆర్‌సీల స్థానంలో విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పీసీ)ల నిర్మాణం ప్రారంభమయింది. ఇందులో భాగంగా ఆర్‌పీసీలను విస్తృతంగా నిర్మించి సమర్థవంతమైన నాయకత్వ శక్తులతో ప్రజలకు విప్లవ ప్రజా ప్రభుత్వ పాలన అందించడంలో కామ్రేడ్ విజయ్ పాత్ర చురుకైనది. ప్రజా మిలీషియాను బలోపేతం చేయకుండా, ప్రజా ప్రభుత్వాలను నిలబెట్టుకోవడం సాధ్యం కాదనే విషయాన్ని లోతుగా అర్థం చేసుకొని, మిలీషియా ప్లాటూన్లు నిర్మించి, వాటి దన్నుతో ఆర్‌పీసీల కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించాడు. క్రమంగా దక్షిణ బస్తర్ డివిజన్‌లో ఏరియా స్థాయి, డివిజన్ స్థాయి జనతన సర్కార్లు ఏర్పడ్డాయి. ఈ క్రమమంతటిలోనూ కామ్రేడ్ విజయ్ పాత్ర విడదీయలేనిది.

2005 జూన్ నెలలో అప్పటి దంతెవాడ జిల్లా (ఇప్పటి బీజాపూర్ జిల్లా) కుట్రు ప్రాంతంలో మొదలైన సల్వాజుడుం 2006 జనవరి నాటికి దక్షిణం వైపు కోంట తాలుకాకు విస్తరించింది. హత్యలూ, అత్యాచారాలూ, గృహ దహనాలు, విధ్వంసాలతో ఈ ప్రాంతమంతటా బీభత్స, భయానక వాతావరణం నెలకొంది. అనేక గ్రామాలను ఖాళీ చేయించి వేలాది మంది ప్రజలను దోర్నపాల్, కోంట, వింజరం, పోలంపల్లి తదితర గ్రామాల్లో ఏర్పర్చిన నిర్బంధ శిబిరాల్లో బంధించారు. ఈ సల్వాజుడుం బీభత్సాన్ని అడ్డుకునేందుకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రత్యేక ప్రతిఘటన క్యాంపెయిన్ చేపట్టింది. ఇందులో భాగంగా కోంట ప్రాంతంలో జరిగిన పలు ప్రతిఘటనా చర్యలకు కామ్రేడ్ విజయ్ ప్రత్యక్షంగా నాయకత్వం అందించాడు. మరి కొన్ని చర్యలకు పథక రచనలో భాగస్వామి

అయ్యాడు. ప్రతిఘటనలో ప్రజల పాత్ర పెంచడానికి విశేషంగా కృషి చేశాడు. దీనితో పాటు 50 గ్రామాల ప్రజలను లోతట్టు ప్రాంతాలకు తరలించి రక్షణ కల్పించి, వారికి అండగా నిలబడి, వారిని శత్రువు వైపుకు వెళ్లకుండా విప్లవోద్యమం వైపు దృఢంగా నిలబెట్టాడు. బలవంతంగానో, భయం వల్లనో, భ్రమల వల్లనో శిబిరాల్లో బందీలుగా మారిన వారికి విప్లవ రాజకీయలను అందజేసి, శత్రు కుట్రలను విడమర్చి చెప్పి తిరిగి వారు గ్రామాలకు చేరుకునేలా ఎంతో ఓపికతో కృషి చేశాడు.

ఇలా దక్షిణ ప్రాంతంలో విస్తరించకుండా సల్వాజుడుంను నిరోధించడంలోనూ, ఓడించడంలోనూ కామ్రేడ్ విజయ్ తనవంతు పాత్ర పోషించాడు.

2007లో ప్రారంభమైన గ్రీన్‌హంట్ దాడిని ఎదుర్కోవడంలోనూ కామ్రేడ్ విజయ్ చురుకైన పాత్ర పోషించాడు. పునాది బలగాలను సమీకరించి శత్రువును దెబ్బ తీసే పలు పథకాలను రచించాడు. చారిత్రాత్మక ముకరం-తాడిమెట్ల దాడి పథక రచనలో భాగమయ్యాడు. కొన్ని సందర్భాల్లో పీఎల్‌జీఏ బలగాలతో వుంటూ దాడులు విజయవంతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. చింతల్‌నార్ హత్యాకాండను బహిర్గతపర్చడంలో ముందున్నాడు. సార్కిన్‌గూడ నరసంహారం జరిగిన తీరుతెన్నులను బయటి ప్రపంచానికి బహిర్గతపర్చి వాస్తవాలను ప్రజల ముందుంచాడు.

ఇలా కామ్రేడ్ విజయ్ రాజకీయ ప్రచారాందోళనలో సైతం క్రియాశీలకంగా వుండేవాడు. ప్రత్యేక బస్తర్ డిమాండ్‌ను సమర్థించాలని పార్టీ ఇచ్చిన పిలుపును అందుకొని రెండు వందల గ్రామాల ప్రజలను సమీకరించి కోంట పట్టణంలో 35 వేల మంది ప్రజలతో ఒక భారీ ర్యాలీ నిర్వహించి బస్తర్ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటాడు. బస్తర్‌లో 6వ షెడ్యూల్‌ను అమలుచేయాలని 1996లో బస్తర్ వ్యాప్తంగా జరిగిన ఆందోళనలో భాగంగా కోంట, సుక్మా ప్రాంతంలో ప్రజలను కదిలించడంలో కామ్రేడ్ విజయ్ ముఖ్యమైన పాత్ర పోషించాడు. సల్వాజుడుంను ఎండగట్టడానికి దాని రంగును బయటపెట్టడానికి దంతెవాడ, జగ్దల్‌పూర్, చర్ల (ఖమ్మం జిల్లా)లలో వేలాది ప్రజలతో భారీ ప్రదర్శనలు నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషించాడు.

2011లోనూ, 2012లోనూ విప్లవోద్యమం చేపట్టిన భూమి చదును కార్యక్రమాన్ని దక్షిణ బస్తర్ డివిజన్‌లో విజయవంతం చేయడానికి కీలకపాత్ర వహించాడు. ప్రజలను, పార్టీ శ్రేణులను ఈ క్యాంపెయిన్‌లో విస్తృతంగా కదిలించాడు. ఆ కార్యక్రమాన్ని వీడియో తీసి ప్రచారం చేశాడు.

సుక్మా జిల్లా కలెక్టర్ అలెక్స్‌పాల్ మీనన్‌ను ఈ సంవత్సరం ఏప్రిల్‌లో పీఎల్‌జీఏ బందీగా పట్టుకున్న సమయంలో మధ్యవర్తులతో, ప్రజలతో, మీడియాతో మాట్లాడడంలో ముఖ్యపాత్ర పోషించాడు.

మెజారిటీ ఆదివాసీ కామ్రేడ్స్ వలెనే కామ్రేడ్ విజయ్ పార్టీలో చేరాకే చదువు నేర్చుకున్నాడు. ఎంతో శ్రద్ధగా పార్టీ సాహిత్యాన్ని చదువుతూ, తాను ఎదగడమే కాక, తాను బాధ్యత వహిస్తున్న కమిటీల పరిధిలో రాజకీయ తరగతులు నిర్వహించి క్యాడర్ ఎదుగుదలకు తోడ్పాటునందించాడు. టెక్నికల్ విషయాలను నేర్చుకోవడం పట్ల కూడా కామ్రేడ్ విజయ్ ఎంతో ఆసక్తిని ప్రదర్శించేవాడు.

కామ్రేడ్ విజయ్‌కు ఇంటి దగ్గర వుండగానే పెళ్లయింది. ఒక కూతురు కూడా వుంది. తన సహచరికి కూడా విప్లవ రాజకీయాలను అందించి వుద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా తీసుకురావడానికి కృషిచేశాడు. ఆమెతో ప్రజాస్వామిక సంబంధాలను కలిగి వుంటూ, ఆమె వుద్యమ పథంలో ముందుకు సాగడానికి తోడ్పాటును అందించేవాడు.

మృదుభాషి అయిన కామ్రేడ్ విజయ్ ప్రజలతోనూ, కామ్రేడ్స్‌తోనూ ప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

ఇలా కామ్రేడ్ విజయ్ గత రెండున్నర దశాబ్దాలకు పైగా పీడిత-తాడిత విముక్తి కోసం పోరాడుతూ ఒక ఆదర్శవంతమైన నాయకుడిగా ప్రజల, పార్టీ శ్రేణుల హృదయాల్లో చెరిగిపోని ముద్రవేశాడు. నేడు కామ్రేడ్ విజయ్ భౌతికంగా మన నడుమ లేనప్పటికీ ఉత్తేజభరితమైన ఆయన సుదీర్ఘ విప్లవ జీవితం ప్రజలకు, పార్టీ శ్రేణులకు నిరంతరం ప్రేరణనిస్తూ అంతిమ విజయం దిశగా దృఢంగా నడిపిస్తుంది.

అమర్ రహే కామ్రేడ్ విజయ్!

★

*పోలీసు శాఖ జరిపిన అధ్యయనం ప్రకారం రోజుకు 111 రోడ్డు ప్రమాదాలు, గంటకు ఇద్దరు చొప్పున రోజుకు 48 మంది మృత్యువాత పడుతున్నారు. ఇక గాయాల పాలయ్యే వారి సంఖ్య ఏడాదికి యాభై వేల పైమాటే. 2011లో 39,324 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా వాటిలో 43 శాతం మద్యం మత్తు కారణంగానే జరిగినట్లు నిర్ధారణైంది.*

# విజ్ఞాన శాస్త్రాన్ని ప్రజలకు చేరువ చేసిన అరుదైన శాస్త్రవేత్త కొడవటిగంటి రోహిణీ ప్రసాద్



2012 సెప్టెంబర్ 8న మూత్ర పిండాల వ్యాధితో కన్నుమూసిన అణు శాస్త్రవేత్త కొడవటిగంటి రోహిణీ ప్రసాద్‌కు 'క్రాంతి పత్రిక' వినమ్ర నివాళిని అర్పిస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకూ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నది.

కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ తెలుగు సమాజం నుండి ఉద్భవించిన ఒక అద్భుతమైన శాస్త్రవేత్త, సాహితీరంగం పట్ల అనురక్తిని కలిగివున్నవాడు, సంగీత విద్వాంసుడు, హేతువాది కూడా. ఒక శాస్త్రవేత్తకు సాహితీ, సంగీతాల పట్ల మక్కువ, ప్రవేశం వుండనక్కర్లేకపోవచ్చు. కాని హేతుబద్ధత తప్పనిసరిగా వుండి తీరాలి.  కాని దురదృష్టవశాత్తు ప్రపంచం మాటేమో గాని భారత దేశంలో చాలా మంది శాస్త్రవేత్తలకు ఇది లోపిస్తున్నది. ముహుర్తాలు చూసి, కొబ్బరి కాయలు కొట్టి రాకెట్ ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు వున్న కాలంలో, రోహిణీ ప్రసాద్‌లోని హేతుబద్ధత కూడా విశేషంగా పేర్కొనే విషయమే. అలా ఒక శాస్త్రవేత్తగా రోహిణీ ప్రసాద్ తన వృత్తికీ, సమాజానికీ నిబద్ధుడిగా వున్నారు. వీటిన్నింటితో పాటు ఆయన సమాజ శ్రేయస్సుకు తపించిన ప్రగతిశీలవాది. దేశానికి అత్యంత ప్రమాదకరంగా పాలకవర్గాలు అభివర్ణిస్తున్న సీపీఐ (మావోయిస్టు)కు శ్రేయోభిలాషి.

వరూధిని, తెలుగు సాహితీ రంగంలో ఒక బలమైన ముద్ర వేసిన కొడవటిగంటి కుటుంబరావులు రోహిణీ ప్రసాద్ తల్లిదండ్రులు. 1949 సెప్టెంబర్ 14న పుట్టిన ఆయన డిగ్రీ వరకూ మద్రాసులో చదువుకున్నారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అణు భౌతిక శాస్త్రంలో ఎంఎస్సీ చేసి, ముంబైలోని భాభా అణు పరిశోధనా కేంద్రం (బార్క్)లో శాస్త్రవేత్తగా చేరారు. అణు ధార్మికత అన్వేషణ సాధనాల గురించి చేసిన పరిశోధనకు గాను బొంబాయి విశ్వ విద్యాలయం నుండి పిహెచ్‌డి పొందారు. 2005లో బార్క్‌లో పదవీ విరమణ చేసి అమెరికాలో అణు భౌతిక రంగంలో పరిశోధనలు చేశారు. 2010లో మన దేశానికి తిరిగి వచ్చి హైదరాబాద్‌లో ఇ.సి.ఐ.ఎల్. సంస్థకు కన్సల్టెంట్‌గా పనిచేశారు.

ఒక శాస్త్రవేత్తగా పరిశోధనలకే పరిమితం కాకుండా, శాస్త్ర జ్ఞానాన్ని ప్రజలకు అందించాలనే నిబద్ధతతో ఆయన ఎన్నో రచనలు చేశారు. శాస్త్ర జ్ఞానం మేధావులకు మాత్రమే అర్థమయ్యే భాషలో కాకుండా సాధారణ ప్రజలకు సైతం సులువుగా అర్థమయ్యేలా వుండేదాయన రచనా శైలి. పదవీ విరమణ అనంతరం ఆయన రచనా వ్యాసంగం మరింత విస్తృతమయింది. ప్రజాసాహితి, అరుణతార, వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలతో పాటు ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి వంటి పత్రికలలో ఆయన అసంఖ్యాక పాపులర్ సైన్స్ వ్యాసాలు రాశారు. గత ఆరేళ్లుగా ఏపీ డాట్‌కామ్‌కు వారం వారం క్రమం తప్పకుండా వ్యాసాలు రాస్తూ వచ్చారు. ప్రాణహిత, ప్రజాకళా వంటి వెబిసైట్లకు గత అయిదేళ్ల కాలంలో అయిదు వందల వ్యాసాలు రాశారు. తెలుగులోనూ, ఇంగ్లీష్‌లోనూ ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. ఆయన రచనలు 'జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం', 'విశ్వాంతరాళం', 'మానవ పరిణామం', 'జీవకణాలూ నాడీ కణాలూ', 'ప్రకృతి – పర్యావరణం' 'అణువుల శక్తి', 'మనుషులు చేసిన దేవుళ్లు' తదితర పుస్తకాలుగా వెలువడ్డాయి. ఇంకా యాభై పుస్తకాలు రాయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పేవారు. విజ్ఞాన శాస్త్ర రచనలతో పాటు శాస్త్రీయ సంగీతం, సినీ సంగీతం, సంస్కృతి, విశిష్ట వ్యక్తులు వంటి పలు అంశాలపై ఆయన అసంఖ్యాక రచనలు చేశారు.

ఆయన పలు అనువాదాలు సైతం చేశారు. గతితార్కిక భౌతికవాదంపై ప్రముఖ అమెరికన్ రచయిత చేసిన రచనను ఆయన తెలుగులోకి అనువదించి సీరియల్‌గా ప్రచురించారు. ఎన్నో చందమామ కథలను ఇంగ్లీష్‌లోకి అనువదించారు.

శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఆయన కృషి కేవలం రచనలకే పరిమితం కాలేదు. సమాజంలో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఆయన తన ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి విస్తృతంగా తిరుగుతూ వందల ప్రసంగాలు చేశారు. విద్యార్థుల స్థాయి నుంచే వుపన్యాసాలు వినే ఏర్పాటు చేయాలనీ, తాను ఎక్కడికి పిలిచినా వస్తానని ఆయన పదే పదే చెబుతూ వుండేవారు.

చిన్నప్పటి నుండి శాస్త్రీయ సంగీతం పట్ల వున్న ఆసక్తిరీత్యా బార్క్‌లో పనిచేస్తున్న కాలంలోనే ఉస్తాద్ ఇమ్రత్ ఖాన్‌కు శిష్యుడిగా మారి సితార వాయిద్యంలో ప్రావీణ్యతను పొందారు. దేశ విదేశాల్లో ప్రదర్శనిలిచ్చి ఎన్నో ప్రశంసలను పొందారు. కర్నాటక జుగల్ బందీ కార్యక్రమాలను అద్భుతరీతిలో నిర్వహించారు. ఎన్నో టెలివిజన్ కార్యక్రమాలకు, సినిమాలకు, స్టేజ్ షోలకు సితార వాయిద్యం అందించారు. అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటించి కళా ప్రదర్శనలు కూడా ఇచ్చారు.

ఇలా బహుముఖ ప్రజ్ఞతో సమాజంపై ఒక బలమైన ముద్రను వేసిన, సమాజ హితం కోసం నిరంతరం తపించిన రోహిణీ ప్రసాద్ మరణం సమాజానికి తీరని నష్టం.

★

'చైనాలో స్త్రీ విముక్తి' గురించి తెలుసుకుందాం -2

# ఇంటిపనిని సామాజికం చెయ్యడం

స్త్రీలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొనడం అనేది స్త్రీ విముక్తికి మొదటి షరతుగా ఉంటుంది. అయితే స్త్రీలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొనడానికి ఇంటిపని ప్రధాన ఆటంకంగా ఉంటుంది. కనుక ఇంటిపనిని పరిష్కరించుకోకుండా స్త్రీలు సామాజిక కార్యకలాపాల్లో తమ వంతు పాత్రను పోషించలేరు. ఈ విధంగా ఇంటిపని స్త్రీల సమస్యకు సంబంధించి చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది.

దీనికి సంబంధించి ఎంగెల్స్ ఇలా అంటారు "కేవలం ఆధునిక భారీ పరిశ్రమ మాత్రమే స్త్రీలకు, అదీ కేవలం శ్రామిక స్త్రీలకు మాత్రమే – సామాజిక ఉత్పత్తి మార్గాలు తెరిచింది. కానీ ఆమె తన కుటుంబం లోపల విధులు నెరవేర్చేటప్పుడు సామాజిక ఉత్పత్తిలో పాల్గొనజాలదు. అందువల్ల ఆమెకు ఆదాయం ఉండదు. అట్లాగే సామాజిక ఉత్పత్తిలో పాల్గొని తన జీవికను స్వతంత్రంగా సంపాదించ దలిచినట్లయితే కుటుంబ బాధ్యతలు నెరవేర్చలేదు.... స్త్రీల విముక్తికి మొట్ట మొదటి షరతు యావత్తు స్త్రీ జాతిని సామాజిక ఉత్పత్తి రంగంలోకి తిరిగి ప్రవేశపెట్టటం. అట్లాగే.... ఇది సాధించాలంటే సమాజపు ఆర్థిక యూనిట్‌గా విడి కుటుంబాలకు ఉన్న స్వభావాన్ని రద్దు చేయాలి."

బట్టలుతికే, పిండి రుబ్బే మిషన్లు, ఇండ్లు శుభ్రం చేసే వాక్యూం క్లీనర్లు, కుక్కర్లు, స్టౌలు, రకరకాల సబ్బులు స్త్రీలను ఇంటిపని నుండి విముక్తి చేస్తాయని పెట్టుబడిదారీ సమాజం ప్రచారం చేస్తుంది. కానీ ఈ విషయాన్ని క్లాడీ బ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. నాలుగైదు తరాల క్రితం గృహిణుల బాధ్యతగానే వున్న బట్టలు కుట్టడం, నిలువ వుండే తిండి పదార్థాలను తయారు చేయడం వంటి పనుల నుండి పెట్టుబడిదారీ సమాజం దయ వల్ల స్త్రీలు విముక్తి అయ్యారు. ఈరోజు అటువంటివి కొనుక్కోగలుగుతున్నారు. బట్టలుతికే యంత్రాల వంటి గృహోపకరణ వస్తువుల వల్ల కొన్ని రకాల ఇంటి పనుల నుండి స్త్రీలు బైటపడ్డారు. అయితే వారి శ్రమ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు స్త్రీలు వేరు వేరు పద్ధతుల్లో పని చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే మరింత నికృష్ట పద్ధతుల్లో చేస్తున్నారు. ఇప్పుడు స్త్రీలు చాకిరేవులకు వెళ్లి చేతుల్తో బట్టలను ఉతకనవసరం లేదు. కానీ భర్త షిఫ్టుల పని దినానికి అనుగుణంగా పిల్లల స్కూలు వేళలకు అనుగుణంగా తమ రోజువారీ పనిని నిర్వహించడం స్త్రీలకు చాలా కష్టసాధ్యం అవుతోంది. ఇటువంటి కష్టాన్ని మన ముత్తవ్వలు పడలేదు అంటుందామె.

"కొన్ని సంవత్సరాల క్రితం ఇంట్లో రోజంతా నీళ్లు వచ్చే సౌకర్యం ఉండకపోవచ్చు. కానీ స్త్రీలు ఊళ్లోని చాకిరేవుకు వెళ్లినప్పుడు కనీసం మిగితా స్త్రీలను కలిసేవారు. తమకూ గ్రామానికి మొత్తంగానూ ముఖ్యమని భావించిన విషయాల్ని చర్చించే అవకాశం వారికి వుండేది. ఇంట్లో రోజంతా నీరు రావడం అనేది ఒక చాకిరిని తప్పించి ఉండొచ్చు కానీ అదే సమయంలో స్త్రీల మధ్య ఉండే ఒక సామాజిక సంబంధాన్ని అది తెంపేసింది" అని అంటుందామె.

అంతేకాదు రకరకాల యంత్రాలను వినియోగిస్తుండడం వల్ల వాటిని రిపేర్ చేయించడం అనే అదనపు శ్రమ కూడా స్త్రీలపై పడుతున్నది అంటుందామె. అందుకే 'శ్రమను తగ్గించే పరికరాలన్నింటినీ సమర్థవంతంగా వినియోగించడం జరిగేది సమిష్టిగా వాడినప్పుడే. ఏ ఒక్క కుటుంబం పైనా అంటే ఒక్క స్త్రీ పైనా వాటి వినియోగం, రిపేర్ వంటి కొత్త పనుల బాధ్యత పూర్తిగా వుండకూడదు' అంటుందామె.

## ముందు సమిష్టీకరణ, తర్వాతే యాంత్రీకరణ

ఇదీ విప్లవానంతర చైనా అవలంభించిన మార్గం. మహిళలు ఎవరి యిండ్లల్లో వాళ్లు చేసుకునే ఎంతో విసుగుపుట్టించే పనులను సమిష్టి బృందం నిర్వహించిన ఒక దృశ్యాన్ని క్లాడీ ఇలా మన కండ్ల ముందుంచుతుంది "అది డిసెంబర్‌లో ఒక గురువారం రోజు. వాతావరణం చాలా చల్లగా ఉండింది. చీపుర్లు, చేటలూ పట్టుకొని అన్ని వయసుల పిల్లలు ఊడుస్తున్నారు. కార్మికులు చెత్త ఏరుతున్నారు. (నిజానికి చెత్త చాలా తక్కువగా ఉంది. ఎందుకంటే చైనా ప్రజలు ఇప్పుడు సామాజిక బాధ్యతల్ని ఎరిగిన వారు.) రెండు రిటైరయిన కార్మికుల బృందాలు మెట్లను కడుగుతున్నాయి. మిగతా వారు కిటికీలను తుడుస్తున్నారు. పాడైపోయిన తలుపుల్ని బాగు చేస్తూనూ, కారిపోతున్న కుళాయిల్ని బాగు చేస్తూనూ, ఇంకా కొందరు చిన్న గుంపులుగా తిరుగుతున్నారు. మొత్తం దృశ్యం అసాధారణమైన జీవంతో తొణికిసలాడుతున్నది. కొంత మంది ఈ పరిస్థితిని వుపయోగించుకొని తమ పక్క వాళ్లతో చర్చలు కొనసాగిస్తున్నారు. లేదా ఒకరికొకరు కొత్త పాటలు నేర్పుకుంటున్నారు. ఇదంతా జీతం లేని పని; దాన్ని స్వచ్ఛందంగా సమిష్టిగా చేస్తారు. దాంట్లో పాల్గొనడానికి నిరాకరిస్తే వారిని కోర్టుకి తీసుకుపోరు. అయితే ఎవరైనా కావాలని ఈ పనిని ఎగ్గొడుతున్నా లేదా 'చెయ్యాలి కాబట్టి అన్నట్టు గబగబా ఎలాగో చేసేసినా', వాళ్లు ఒక యువ బృందాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. వీళ్లు స్వచ్ఛందమైన సమిష్టి పని ప్రాముఖ్యతను వాళ్లతో గుర్తింప చేసే దాకా వాదిస్తారు, విమర్శిస్తారు."

విప్లవం విజయవంతం కాగానే ప్రజల ఇండ్ల (నివాస) సమస్యను పరిష్కరించడానికి చైనా సహజంగానే తీవ్రంగా కృషి చేసింది. అదే విధంగా ఈ యిండ్లను కట్టిన తీరులో ఇంటిపనిని సమిష్టీకరించడం అనే అంశాన్ని గుర్తుంచుకుంది. సాధారణంగా ఈ యిండ్లను రెండు మూడు కుటుంబాలు  కల్సి ఒకే చోట వుండగలిగే విధంగా నిర్మించేవారు. ఈ యిండ్లలో అన్ని కుటుంబాలూ సమిష్టిగా వాడుకోవడానికి కొన్ని గదులూ, సొంతంగా వాడుకోవడానికి కొన్ని

గదులు వుండేవి. ముఖ్యంగా వంట గది సమిష్టిగా వుండేది. వంట కూడా సమిష్టిగానే వుండేది. వంతుల వారీగా ఒకరిద్దరు అన్ని కుటుంబాలకూ వంట చేసేవారు. ఆ ఒకరిద్దరు స్త్రీలు, పురుషులూ ఎవరైనా కావచ్చు.

క్సియావో వాంగ్ అనే ఇటువంటి ప్రజా కమ్యూన్‌కు వెళ్లినపుడు క్లాడీ బృందం తమ ప్రశ్నలను ఇంటి పని సమస్యను ఎలా పరిష్కరించుకుంటున్నారనే అంశంపైనే ఎక్కుపెట్టింది. ఇక్కడ ఒక యువతి ఈ బృందంతో ఇలా చెప్పింది. "మనం ఇంటి పనుల రంగంలో యాంత్రీకరణను అభివృద్ధి చెయ్యాలి. ఈ జిల్లాలోని రైతులు అందుకు కృషి చేస్తున్నారు. కానీ స్త్రీలను వారి సాంప్రదాయక విధుల నుండి విముక్తి చెయ్యడానికి యాంత్రీకరణ కోసం మనం వేచి వుండకూడదు. 15 ఏళ్ల క్రితం వరకు విద్యుచ్ఛక్తి లేదు. గృహోపకరణాలు లేవు, శిశు సంరక్షణా కేంద్రాలు లేవు. వ్యవసాయ సహకార సంఘాల్ని ఏర్పర్చడానికి వనరులు లేని లోటును పూడ్చడానికి, రైతులు మార్గాలు కనుగొన్నారు. చిన్న పిల్లల్ని పొలానికి తీసుకుపోయేవారు. పెద్ద పిల్లలు అక్షరాలు దిద్దుకుంటూనే వీరిని చూసుకునేవారు. వృద్ధులు గ్రామానికి సంబంధించిన సమిష్టి పనుల బాధ్యత తీసుకునేవారు. వుదాహరణకు చిరిగిపోయిన బట్టలు కుట్టడం, ఉతకడం లాంటి పనులు. కోతల కాలంలో అందరికీ సమిష్టిగా వంట చేస్తారు. ఈ ఆచారం ఇవ్వాల్టికీ ఉంది. ఇప్పటికీ ఏదైనా పెద్ద పని చెయ్యాలంటే సమిష్టిగా వంట చేస్తారు.

కుటుంబంలో సభ్యులందరూ ఇంటిపనిని సమానంగా పంచుకుంటారు. అందువల్ల ప్రతి ఒక్కరూ - భర్త, భార్య, వారి తల్లిదండ్రులు, వారి పిల్లలు - ఇంటి నిర్వహణలో పాలుపంచుకుంటారు. ఒక పురుషుడు బట్టలుతకడమే కాక, వంట చెయ్యడం, ఇల్లు తుడవడం, బట్టలను కుట్టడం, పిల్లల దెబ్బలకు కట్లు కట్టడం వంటివి చేస్తుంటే, అది కూడా కేవలం ఆదివారాలే కాక ప్రతిరోజూ చేస్తూంటే, అతను ఇక ఎంత మాత్రం మామూలుగా వాడుకలో ఉన్న అర్థంలో భర్తగా వుండడు.

గ్రామీణ మహిళల హోదాలో హఠాత్తుగా వచ్చిన మార్పుకు మూలం భూమి సామాజికీకరణకై జరిగిన పోరాటంలో ఉంది. మనం ముందు చూసినట్లుగా, ఈ పోరాట క్రమంలోనే స్త్రీలు ఒక రాజకీయ శక్తిగా గుర్తింపు పొందారు. కుటుంబ పరిధి తప్ప బైట ప్రపంచంలో ఏ విధమైన అనుభవం లేని, అణకువగా, మౌనంగా ఉండే భార్యతో సేవలు చేయించుకోవడం చాలా సులభం. నీ భార్య గ్రామస్తులందరి ముందు మాట్లాడాకో, ధనిక రైతులకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం చేసాకో, రైతుల్ని సమీకరించడానికి పోరాటం చేసాకో, పొలానికి నీరు పెట్టడంలో సహకరించడానికి స్త్రీల బృందాలను సంఘటితం చేసాకో, ఆమె ముందు ఇల్లు తుడవనని అని చూడు! నీ భార్యకు మొత్తం గ్రామం మద్దతుగా వున్నప్పుడు, వారందరూ ఆమెను మెచ్చుకున్నప్పుడు ఇల్లు తుడవననడం పూర్తిగా వేరేగా వుంటుంది.

ఒక రాజకీయ శక్తిగా స్త్రీలు ముందుకు రావడం అనే పరిణామం ఇళ్లలో వారి హోదాలో కూడా మార్పు తీసుకువచ్చింది. ఈ మార్పు వచ్చిందని అంగీకరించకుండా మొండికేసే వ్యక్తిని ఒప్పించడానికి క్సియావో వాంగ్ స్త్రీలకు కొన్ని పద్ధతులు ఉన్నాయి. మొదటి మెట్టుగా అతని భార్య, భర్తతో సమస్యల్ని చర్చిస్తూ అతన్ని మార్చడానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నం విఫలమైతే, ఆమె వెంటనే మొత్తం కుటుంబం సహాయాన్ని కోరుతుంది. అది కూడా దగ్గరికి వెళ్లి మర్యాద పూర్వకంగానే అయినా దృఢంగా భూస్వామ్యానికీ, సామ్యవాదానికీ తేడాని గుర్తు పెట్టుకోవాలని చెప్తుంది. అప్పటికీ వినకుండా ఆ అరుదైన మొండి ఘటం పాత భావాలనే పట్టుకుని వేలాడితే మొత్తం గ్రామం అతన్ని విమర్శించే క్యాంపెయిన్ ద్వారా ఆమెకు మద్దతునిస్తుంది. ఆఖరి చర్యగా ఆమె అతనికి ఏ క్షణంలోనైనా విడాకులివ్వగలదు.

మేం ప్రధానంగా వర్గ పోరాటంలో పాల్గొనడం వల్లనే మా అణచివేతకు మూలాల్ని అర్థం చేసుకోగలిగాం. స్త్రీలుగా మా పరిస్థితులను మార్చుకోగలిగాం."

సమిష్టీకరించాల్సిన ఇంటి పనుల్లో మొదటిది సాధారణంగా వంటపనే. కనుక చైనాలో సమిష్టి భోజనశాలలకు చాలా ప్రాధాన్యత నిచ్చారు. సాధారణంగా అన్ని కర్మాగారాల్లో సమిష్టి భోజనశాలలుండేవి. ఈ భోజనశాలల్లో కార్మికులూ, వారి కుటుంబాలూ, వారి స్నేహితులు తినవచ్చు. ఈ భోజనశాలల్లో కార్మిక కుటుంబానికి చెందిన చిన్న పిల్లలు తల్లిదండ్రుల సహాయం లేకుండా, స్వతంత్రంగా వచ్చి తినిపోయేవారు. అయితే ఈ పిల్లలకు మిగతా పెద్దలు ఎవరో ఒకరు సహాయపడేవారు. పెద్దలెవరైనా ఈ పిల్లలను తమ పిల్లలే అన్నట్లుగా ఒక కంట కనిపెట్టేవారు. అట్లా పిల్లల ఆలనాపాలన బాధ్యత తల్లులదే ఇక ఎంతమాత్రమూ కాకుండా పోయింది. భోజనశాలలు వంటింటి ప్రాధాన్యతను గణనీయంగా తగ్గించాయి.

వంట పనే కాక స్త్రీలు ఇండ్లలో చేసే అనేక ఇతర పనులు ఇక్కడ సమిష్టికరించబడ్డాయి. ఇండ్ల సముదాయాల మధ్య సమిష్టి సేవలను అందించే కొన్ని కేంద్రాలు ఉండేవి. ఇందులో పని చేసే కార్మికులు ఉదయాన్నే ఇంటింటికీ తిరిగి చిరిగిన చొక్కాలు, సాక్సులు, కుట్లు, గుండీలు ఊడిన దుస్తులు సేకరించి ఈ కేంద్రాల్లో వాటిని కుట్టేవారు. వాటిని తిరిగి అదే రోజుగానీ మరుసటి రోజుగానీ ఇచ్చేసేవారు. ఇలా కుట్టినందుకు వాళ్లు గుండీల, దారాల ధరకన్నా పెద్ద ఎక్కువగా ఏమీ తీసుకునేవారు కాదు. బట్టలు వుతకడానికి ఇస్త్రీ చేయడానికి సమిష్టి లాండ్రీలు కూడా ఉండేవి. ఇటువంటి సేవలను అందించే కేంద్రాలను సాధారణంగా మహిళలే నడిపేవారు. "ఇంటి పనులకున్న వ్యక్తిగత, కుటుంబ పార్శ్వాలను నాశనం చెయ్యాలనే పట్టుదలే దీనికి కారణం" అంటుంది క్లాడీ.

## వైద్యాన్ని సామాజికీకరిస్తే .....

సాధారణంగా ఇంట్లో ఎవరికి జబ్బు చేసినా గృహిణికి చచ్చేంత పనవుతుంది. ఎందుకంటే జబ్బు చేసిన వారికి సేవలు చేయడం, వారి కోసం ప్రత్యేకమైన ఆహారాన్ని తయారు చేయడం, వేళకు

మందులు తినిపించడం వంటి సంరక్షణా బాధ్యత గృహిణులకు సంబంధించిందిగానే ప్రస్తుత సమాజంలో వుంది. అంతేకాదు కుటుంబ సభ్యులు వ్యాధుల బారిన పడకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం కూడా గృహిణుల బాధ్యతగానే వుంది. మొత్తంగా కుటుంబ ఆరోగ్య పరిరక్షణ బాధ్యత స్త్రీలదే.

ఈ ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను సామాజికీకరిస్తే స్త్రీలకు తగ్గే భారం అంతా యింతా కాదు. చైనాలో ఇదే జరిగింది. ఇక్కడ వుద్యోగ స్థలాలన్నింటిలో డాక్టర్లు లేదా కార్మిక డాక్టర్లు (డాక్టర్ల దగ్గర శిక్షణ పొందిన కార్మికులు) ప్రథమ చికిత్స బాధ్యతను చేపట్టేవారు. అంతకంటే ముఖ్యంగా ముందుజాగ్రత్తలు తీసుకునేవారు. పాఠశాలల్లో పిల్లలకు వైద్యానికీ, నర్సింగ్‌కీ సంబంధించిన సూత్రాలను నేర్పించేవారు. వేసవి కాలంలో పిల్లలు బృందాలుగా ఏర్పడి ఈగలూ, దోమలూ వంటి వ్యాధికారక కీటకాలపై యుద్ధం ప్రకటించేవారు. జలుబు చేసిన వారిని రక్షణ దుస్తులు లేకుండా బైటకు పోవద్దని చెప్పేవారు. వాళ్లకు ఒకరికొకరికి ఎలా వైద్యం చేసుకోవాలో తెలిసే వుండేది. జలుబు, టాన్సిలైటిస్, కడుపు నొప్పుల్లాంటి సులభమైన రోగ నిర్ధారణలు కూడా వారు చేయగలిగేవారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేయటం కూడా వారికి తెలిసే వుండేది.

అంతేకాదు ప్రతి గృహ సముదాయంలో ఒక మెడికల్ యూనిట్ వుండేది. అక్కడ నివసించే వారిలో ఇద్దరు ముగ్గురికి డాక్టర్లు ప్రామాణికమైన రోగ నిర్ధారణా, చికిత్సల్లో శిక్షణనిచ్చేవారు. ఇలా శిక్షణ పొందేవారు సాధారణంగా మాజీ గృహిణులై వుండేవారు. వీరు డాక్టర్లతో నిరంతర సంబంధాల్ని కలిగి వుంటూ ఆస్పత్రిలో చేరేంత అవసరం లేని రోగుల్ని, కోలుకుంటున్న రోగుల్ని చూసుకునే వారు. రోగులకు స్నానం చేయించడం, వారికి భోజనం తీసుకురావడం, వారు విశ్రాంతి పొందేలా చూసుకోవడం వంటి బాధ్యతలన్నీ వీరివే. అంతేకాదు 'ఫలానా కామ్రేడ్‌కు కాలు విరిగింది కాబట్టి మీరు ఆమెను చూడ్డానికి రండి, ఆమెకు చదువుకోవడానికి ఏమైనా తీసుకురండి' అంటూ వీరు వివిధ జిల్లా కమిటీలకు తెలియజేసేవారు. జబ్బుబారిన పడినవారిని వంటరిగా వదిలేయడం అనేది వుండేది కాదు.

ఇలా వైద్యాన్ని సామాజికీకరించడం వల్ల స్త్రీలు మోస్తున్న అనవసరపు భారం ఎంతో తగ్గింది.

### టాచింగ్ మహిళలు సాధించిన అద్భుతం

పెట్టుబడిదారీ సమాజం దాని స్వప్రయోజనాల కోసం స్త్రీలను సామాజిక ఉత్పత్తిలోకి తీసుకువచ్చింది. అదే సమయంలో అది ఇంటి పని నుండి స్త్రీలను విముక్తి చేయలేదు. ఎందుకంటే స్త్రీలు ఇంటిపనిని కొనసాగించడం అనేది దానికి అవసరం. అది స్త్రీలను ప్రస్తుత శ్రమశక్తి పరిరక్షణ బాధ్యతలు చూసేవారుగానూ, భవిష్యత్‌లో అవసరమయ్యే శ్రమశక్తిని కని, పెంచేవారిగానూ చూస్తుంది. కనుక స్త్రీలు ఇంటిపనిని చేయడం దానికి అవసరం. అందుకే ఇంటిపని వేగంగా చేయడం కోసం కొన్ని యంత్రాలను తయారు చేసింది. అంతేకాదు ఇంటిపని చేస్తూనే సామాజిక వుత్పత్తిలో పాల్గొనే విధంగా షిఫ్ట్‌లను రూపొందించింది. దానితో పాటు ఇంట్లో వుంటూనే ఇంటిపనికి ఏమాత్రం ఆటంకం రాకుండా ఉత్పత్తిలో పాల్గొనే విధంగానూ 'అవకాశం' కల్పిస్తున్నది. వీటన్నింటికి తోడు ఇంటి పని స్త్రీలదే అనే భావజాలాన్ని పెంచి పోషిస్తున్నది. ఫలానా మెషీన్‌ను, ఫలానా సబ్బును, ఫలానా కాఫీ పౌడర్‌ను వాడి కుటుంబ సభ్యులకు సమర్థవంతమైన సేవలనందించడమే స్త్రీ జీవితానికున్న సార్థకతగా ప్రచారం చేయడం ఇటువంటి భావజాలాన్ని పెంచడంలో భాగమే. (ఈ వస్తువులన్నీ తయారు చేయడంలో పెట్టుబడిదారీ వ్యవస్థకున్న లాభాపేక్షను ఇక్కడ ప్రస్తావించడం లేదు)

దీనికి పూర్తిగా భిన్నంగా చైనాలో ఇంటిపని నుండి విముక్తమవుతూ సామాజిక ఉత్పత్తిలో పాల్గొన్న స్త్రీలు, సామాజిక ఉత్పత్తిలో అద్భుతాలు సృష్టించారు. అదే సమయంలో సామాజిక ఉత్పత్తి క్రమంలో సంతరించుకున్న చైతన్యంతో ఇంటిపని నుండి తమల్ని తాము మరింతగా విముక్తి చేసుకున్నారు.

ఈ విషయం మనం టాచింగ్ ఉదాహరణలో చూడవచ్చు. టాచింగ్ అనేది చైనాలోని అతి పెద్ద చమురు క్షేత్రం. దాదాపు 40 వేల మంది కార్మికులు, సాంకేతిక నిపుణులు, వారి కుటుంబాలు ఇక్కడ నివసించేవి. చమురు బావులు, పైప్‌లైన్లు, శుద్ధి కార్మాగారాలు కొంత స్థలాన్ని ఆక్రమించగా మిగిలిన ప్రాంతమంతా పచ్చిక బయళ్లతో నిండి వుండేది. 1962లో ప్రకృతి వైపరీత్యాల వల్ల చైనా అంతటా సరిగా పంటలు పండలేదు. దానితో ధాన్యానికి కోటా పెట్టవల్సి వచ్చింది. అందువల్ల ఈ ప్రాంతంలోని కార్మికుల 'భార్యలు' తమ ఆహార స్థితిని కొంత మెరుగుపరుచుకోవడానికి పారలూ, పలుగులూ పట్టాలని నిశ్చయించుకున్నారు. ఇండ్ల దగ్గర కూరగాయల తోటలు పెంచుకోవడానికి భూమిని దున్నడం మొదలుపెట్టారు.

కానీ షుయి అమ్మ అంతటితో సంతృప్తి పడదల్చుకోలేదు. అది కేవలం తాత్కాలిక సమస్యకు తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని ఆమె భావించింది. పారిశ్రామిక ప్రాంతమైన టాచింగ్‌ను పారిశ్రామిక వ్యవసాయ సముదాయంగా మార్చాలనీ, అందుకోసం బంజరు భూములపై యుద్ధం ప్రకటించాలని ఆమె భావించింది. తన ఆలోచన సరైందేనని ఆమె పొరుగున వున్న నల్గురు స్త్రీలను ఒప్పించింది.

స్థానిక రైతుల సలహా తీసుకొని ఈ అయిదుగురు స్త్రీలూ కొంత బంజరు భూమిని ఎన్నుకున్నారు. అయితే వాళ్లు ఒక తక్షణ సమస్యను అధిగమించవల్సి వచ్చింది. వాళ్లందరికీ చిన్న పిల్లలున్నారు. ఆనాటికి అక్కడ శిశు సంరక్షణ కేంద్రాలు లేవు. కాబట్టి పిల్లలను తమతో తీసికెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఒకరోజు ఉదయాన్నే ఐదు గడ్డపారలనూ, తిండి సామాగ్రినీ, వంట పాత్రలను, ఒక గుడారాన్ని, పిల్లలను, విత్తనాలనూ తీసుకొని ఈ మహిళలు ఆ భూముల్లోకి వెళ్లారు. అక్కడ గుడారం వేసి తమ పని

ప్రారంభించారు. మొదటి రోజు సాయంత్రమే ఒక భయంకరమైన గాలి దుమారం రావడంతో ఆ రాత్రంతా వాళ్లు గుడారాన్ని పట్టుకొని వేళ్లాడారు. అయినప్పటికీ మరుసటిరోజు ఉదయం భూమిని తవ్వడం మొదలుపెట్టారు. అలా మూడు రోజులు వాళ్లు తవ్వుతూనే వున్నారు. నాలుగో రోజు ఉదయం ఒక ఇరవై మంది మహిళలు, పదమూడు మంది పిల్లలు వారి దగ్గరికి వచ్చారు. వాళ్లు షుయి అమ్మతో "ఆ గాలి దుమారం వచ్చిన రోజు రాత్రి మీ గురించి మేం చాలా ఆందోళన పడ్డాం. 'సమాజం మంచి కోసం ఆ స్త్రీలూ, పిల్లలూ, చలినీ, గాలినీ ఎదిరిస్తుంటే మనమేమో వెచ్చగా మంచం మీద పడుకున్నాం. వాళ్లు ప్రపంచాన్ని మారుస్తున్నారు. వాళ్లు చేస్తున్న ఆ పనిని మనమూ చెయ్యగలం' అని ఆలోచించాం. అందుకే వచ్చేశాం" అన్నారు. ఇక వారంతా కల్సి మరింత భూమిని తవ్వారు. పిల్లల సంరక్షణ బాధ్యత సమిష్టిదైపోయింది. ఒకరు పిల్లలందరినీ చూసుకుంటే మిగితా వాళ్లంతా పని చేసేవారు. అలా ఆ సంవత్సరం వారు దాదాపు వెయ్యి కిలోల బీన్స్ పండించారు.

మరుసటి సంవత్సరం షుయి అమ్మ మరో వంద మంది స్త్రీలను తీసుకొని మరికొంత భూమిని సాగులోకి తేవడానికి బయల్దేరింది. ఈసారి వారు తమను తాము సంఘటితం చేసుకోవడానికి కొంత సమయం తీసుకున్నారు. వారు తమ కోసమూ, తమ తర్వాత రాబోయే కుటుంబాల కోసమూ తాము పని చేసే ప్రాంతంలో రెండు వందల మట్టి ఇండ్లను నిర్మించారు. ఒక శిశు సంరక్షణ కేంద్రాన్నీ, ఒక పాఠశాలనూ ఏర్పర్చుకున్నారు. శిశు సంరక్షణ కేంద్రం సమస్యను సులభంగానే పరిష్కరించారు. ఒక ఇంట్లో తొట్టెల్ని, మంచాల్ని పోగు చేసి ఒక అందమైన తోటను పెంచి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన తాతల, అమ్మమ్మల సంరక్షణలో పిల్లల్ని ఉంచారు. వీరు నెలకొల్పిన పాఠశాలలో అబ్బాయిలకూ, అమ్మాయిలకూ కూడా సమిష్టి ఇంటి పనుల విషయంలో ప్రాథమికమైన శిక్షణ ఉండాలని, స్త్రీలు పట్టు పట్టారు. కుట్టు శిక్షణ, చెప్పుల రిపేరు క్లాసులు కూడా నిర్వహించేవారు. ఆ సంవత్సరం మొదటి పంటను నూటయాభై హెక్టార్లలో పండించారు.

ఈ స్త్రీల సృజనాత్మకత అంతటితో ఆగలేదు. వాళ్లు ఒక ప్రజా భోజనశాలనూ, ఇంటి పనులు చెయ్యడానికి సమిష్టి వర్క్‌షాపులనూ, కొత్తగా వచ్చిన డాక్టర్లతో ఒక విస్తృతమైన ఆరోగ్య సేవా వ్యవస్థను ఏర్పరిచారు. ఆ తర్వాత కాలంలో రేడియోలు, చెప్పులు, గిన్నెలూ, ఫర్నిచరూ, విడి భాగాల నుండి ధాన్యం మార్పిడి యంత్రాల వరకు వివిధ రకాల ఉపయోగకరమైన వస్తువుల్ని వుత్పత్తి చేసే చిన్న ఫ్యాక్టరీలను సైతం నిర్మించారు. ఇలా ఆహార ఉత్పత్తితో మొదలుపెట్టిన వీళ్ల కృషి క్రమంగా అన్ని రంగాల్లోకీ విస్తరించింది. ఈ ప్రాంతంలోని రోగగ్రస్తులు తప్ప ప్రజలందరూ ఈ మహిళల కృషిలో భాగస్వాములయ్యారు.

టాచింగ్‌లో జుట్టు కత్తిరించడం, వంట, సినిమాలు, రవాణా వంటి సమిష్టి సేవలన్నీ దాదాపు ఉచితంగానే ఉండేవి. బట్టల దుకాణాలు, చెప్పులు తయారు చేసేవాళ్లు తయారీకి వుపయోగించిన వస్తువుల (గుడ్డ, దారం, గుండీలు) ఖరీదు తీసుకునేవారు. కానీ శ్రమ మాత్రం ఉచితం. ఇవన్నీ ఉచితంగా ఉండడానికి ఈ స్త్రీలే ప్రధాన కారణం. ఇలా ఏ పనిలోనూ ప్రతిఫలాన్ని ఆశించకపోవడం చూసి "స్త్రీలు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఉద్యోగాలకు పోలేదు. తమ ప్రత్యేక పరిస్థితిని మార్చడం ద్వారా ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే సమిష్టి ఆర్థిక, రాజకీయ పాత్రను నిర్వహించడానికే వారు ఉద్యోగాలు చేశారు" అంటుంది క్లాడీ.

## ఇంటిపనిని ఉత్పత్తిగా మార్చడం

దోపిడీ సమాజం ఇంటిపనిని ఉత్పత్తిగా పరిగణించదు. అందుకే దానికి గుర్తింపు లేకపోగా, ఆ పని చేయడమన్నా, చేసేవాళ్లన్నా సమాజంలో చిన్నచూపు ఏర్పడింది. కానీ విప్లవానంతర చైనా ఈ పరిస్థితిని మార్చింది. ఇంటిపనిని సమిష్టీకరించడం వల్ల సమాజానికి ఉపయోగపడే శ్రమగా దానికి గుర్తింపు వచ్చింది. స్త్రీలు నాలుగు గోడల మధ్య చేసినపుడు చిన్న చూపుకు గురైన ఆ పనులు సమిష్టి వర్క్ షాపుల్లో జరిగినపుడు, ఆ పనుల పట్ల దృక్పథమే మారిపోయింది. చచ్చేంత విసుగుతో తమ యిండ్లల్లో చిరిగిన సాక్సులను కుట్టిన స్త్రీలు, అదే పనిని ఒక యువతీ యువకుల బృందంతో కల్సి చేస్తున్నప్పుడు వారికి ఎటువంటి విసుగూ వుండేది కాదు. తామిప్పుడు సామాజిక ఉత్పత్తిలో పాల్గొంటున్నామన్న సంతృప్తే వారిలో ఉండేది.

'ఇంటిపని' పట్ల చిన్న చూపు పోవడంతో చైనా యువతీ యువకులు ఇంటిపనిని మునుపటిలా ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చేసేవారు కాదు. దాని ప్రాముఖ్యతను గుర్తించి ఈ వర్క్ షాపుల్లో జరిగే 'ఇంటిపనుల్లో' ఖాళీ సమయాల్లో స్వచ్ఛందంగా పాల్గొనేవారు.

మొత్తంగా ఇంటిపనుల సమిష్టీకరణ వల్ల స్త్రీ, పురుషుల మధ్య, స్త్రీల మధ్య సంబంధాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇది మాజీ గృహిణుల జీవితాల్ని సుసంపన్నం చేసింది.

ఇతర ఉత్పత్తి యూనిట్లలాగే 'ఇంటిపనుల'ను చేసే ఈ వర్క్ షాపులు కూడా రాజకీయ జీవితంలోని ప్రతి రంగంలో పూర్తిగా పాల్గొనేవి.

ఇంటిపని నుండి విముక్తి అయిన స్త్రీలు సామాజిక ఉత్పత్తిలోనే కాదు, సాంస్కృతిక రంగంలోనూ చురుకైన పాత్ర పోషించారు. మాజీ గృహిణులు అనేక నాటక బృందాలను స్థాపించడం దీనికి నిదర్శనం.

## కుటుంబంలో సహకారం

సామాజికీకరించడం సాధ్యం కాని ఇంటిపనులను కుటుంబ సభ్యులందరూ పంచుకోవడం ద్వారా పరిష్కరించుకున్నారు. పాత సమాజంలో స్త్రీలు, భర్తకూ, పిల్లలకు ఎన్నో రకాల సేవలు చేయవల్సి వచ్చేది. కానీ ఈ నూతన సమాజంలో భార్య తనకు సేవలు చేయాలని ఏ పురుషుడూ అనుకునేవాడు కాదు. తమ పనులు తాము చేసుకోవడానికి ఎటువంటి నామోషీ వుండేది కాదు

# 'సంక్షేమ' పథకాలు అవినీతికి సోపానాలు

**(గత సంచిక తరువాయి భాగం)**

## రాజీవ్ ఆరోగ్యశ్రీ

పేదలకు కూడా ఇక మీదట కార్పొరేట్ వైద్యం అంటూ 2007లో వై.ఎస్.ఆర్. ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకానికి అయిదేళ్లు నిండాయి. తెల్ల రేషన్ కార్డులున్న ప్రజలందరూ ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులు. వీరికి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులను జారీ చేస్తుంది. ఈ పథకం పరిధిలోకి ప్రస్తుతం 347 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, 938 రకాల వ్యాధులు వస్తాయి. అంటే ఆరోగ్యశ్రీ కార్డులు పొందిన వారు ఈ 347 ఆస్పత్రులలోనే, 938 రకాల వ్యాధులకు మాత్రమే చికిత్స చేయించుకోగలరు. రాష్ట్రంలో వున్న 2.66 కోట్ల కుటుంబాలకు గాను ప్రభుత్వ లెక్కల ప్రకారం 2.33 కోట్ల కుటుంబాలకు అంటే 88 శాతం కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులున్నాయి. కనుక వీళ్లందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఈ అయిదేళ్లలో ఈ పథకం కింద ప్రభుత్వం 3,500 కోట్లు ఖర్చు చేసింది.

పేదలకు వైద్యం అందించే విషయంలో మన దేశం చాలా ఘోరమైన పరిస్థితిలో వుంది. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు విషయంలో 175 దేశాలను పరిశీలించగా మన దేశం 171వ స్థానంలో వుంది. స్థూల జాతీయోత్పత్తిలో 1.2 శాతం మాత్రమే ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం ఖర్చు పెడుతున్నది. 5.1 శాతం ఖర్చు చేస్తూ నేపాల్, 4.29 శాతం ఖర్చు చేస్తూ శ్రీలంక, ఆఖరుకు 5.5 శాతం ఖర్చు చేస్తూ మాల్దీవులు కూడా మన కంటే మెరుగ్గా వున్నాయి. దేశవ్యాప్తంగా వైద్య సేవలకు అవుతున్న ఖర్చులో 70 శాతాన్ని, ప్రజలు తమ జేబుల నుంచే భరించాల్సి వస్తున్నదని గణాంకాలు సూచిస్తున్నాయి. భారతీయ గ్రామీణులను పీల్చి పిప్పి చేస్తున్న రుణభారంలో సుమారు 40 శాతం వైద్య ఖర్చులకే అని కూడా అధ్యయనాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఏమీలేదు. ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో కనీస వైద్య సేవలు అందని జనాభా 5 కోట్ల 63 లక్షలని తేలింది. అంటే మొత్తం రాష్ట్ర జనాభాలో 66 శాతానికి పైగా ప్రజలకు ఎటువంటి వైద్యం అందడం లేదు. ఇక మరోవైపు 'నేషనల్ హెల్త్ అకౌంట్' లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రజలు వైద్యం కోసం సంవత్సరానికి 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఇందులో ప్రభుత్వం 18 శాతం మాత్రమే భరిస్తుండగా, 82 శాతం భారాన్ని ప్రజలే భరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో పేదలకు వుచిత వైద్యాన్ని అందించే పథకం ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది. ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఆరోగ్యశ్రీ ట్రస్టు టెండర్ల ద్వారా ప్రైవేట్ బీమా కంపెనీల చేతుల్లో ఈ పథకాన్ని పెడుతున్నది. ఒక్కో కార్డుదారు పేరిట బీమా ప్రీమియాన్ని నిర్దేశించి తక్కువ ప్రీమియం కోట్ చేసే కంపెనీలకు దీని బాధ్యతను అప్పగిస్తుంది. ప్రస్తుతం స్టార్ హెల్త్ అండ్ ఎలీడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ బాధ్యతను చేపట్టింది. ఒక్కో కార్డుదారు పేరిట ప్రీమియాన్ని ఆరోగ్య శ్రీ ట్రస్టు ఈ బీమా కంపెనీకి అప్పజెప్పుంది. రోగులకు చేసిన వైద్యానికి గాను ఆయా ఆస్పత్రులకు ఈ బీమా కంపెనీ బిల్లులు చెల్లిస్తుంది. గత అయిదేళ్లలో ఆరోగ్యశ్రీకి ఖర్చు చేసిన నిధులు వైద్య ఆరోగ్యశాఖ ఏడాది బడ్జెట్‌ను మించిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి పెద్దపీట వేస్తూ ప్రాథమిక వైద్య వ్యవస్థను విస్మరిస్తున్నదని విమర్శలు కూడా వచ్చాయి. ఆరోగ్యశ్రీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడం అనేది నిజమైతే, అది పేద ప్రజలపైన ప్రేమతోనే అని అనుకోవచ్చా?

ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి వచ్చే 347 ఆస్పత్రుల్లో 86 మాత్రమే సర్కారువి. మిగతావన్నీ ప్రైవేటువే. పేదలు సాధారణంగా కార్పొరేటు ఆస్పత్రులకు వెళ్లలేరు. కాబట్టి పేదల అనారోగ్యాలను సొమ్ము చేసుకునే అవకాశం ఈ ఆస్పత్రులకు తక్కువగా వుంటుంది. ఇప్పుడు ప్రభుత్వం ఈ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు అటువంటి అవకాశాలను కల్పిస్తున్నది. ఈ పథకం పరిధిలో 86 సర్కార్ దవాఖానలు వున్నప్పటికీ దేన్నయినా ఎంచుకునే అవకాశాలు వున్నప్పుడు, సాధారణంగా ఎవరైనా ప్రైవేటు దవాఖానలనే ఎంచుకుంటారు. అది వారి తప్పు కాదు. సర్కారు నిర్వాకం. అందుకే

---

వారికి. అంతేకాదు జీవిత సహచరులూ, పిల్లలు అందరూ పనుల్లో భాగస్వామ్యం పంచుకోవడం వల్ల కుటుంబంలోనూ, సమాజంలోనూ స్త్రీల స్థానమే మారిపోయింది. వారి స్థానాన్ని కొత్తగా నిర్వచించుకోవాల్సి వచ్చింది.

ఇంటిపనిని సామాజికీకరించడం వల్ల మొత్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు ఎంతగానో ప్రభావితం అయ్యాయని, అవి గణనీయంగ అభివృద్ధిని సాధించాయని తెలుస్తోంది. దీన్ని బట్టి స్త్రీలు ఇంటిపనిలో కూరుకుపోవడం అనేది స్త్రీలకే కాక సమాజానికి కూడా ఎంత నష్టదాయకమో చైనా అనుభవం నుంచి మనకు మరింతగా అర్థమవుతుంది.

కనక మన దేశంలోనూ ఇంటిపని సమస్యపై విప్లవ మహిళా సంఘాలు తీవ్రంగా కృషి చేయాలి. ప్రస్తుత పరిస్థితిలోనూ సాధ్యమైనంతగా సామాజికీకరణ కోసం కృషి చేయాలి. అలా సాధ్యం కాని చోట్ల ఇంటిపనిలో కుటుంబ సభ్యులందర్నీ భాగస్వామ్యం చేసే కృషిని చేపట్టాలి.

**(వచ్చే సంచికలో 'మాతృత్వ విధులను సామాజికం చెయ్యడం' గురించి)**

ఈ పథకం కింద 40 శాతం చికిత్సలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరగాలని ప్రభుత్వం చెబుతున్నా 10-15 శాతానికి దాటడం లేదు.

ఆరోగ్యశ్రీ కార్డులు పొందిన వారందరి పేరిట బీమా కంపెనీకి ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రీమియం చెల్లిస్తుంది. అయితే కార్డులు పొందిన వారందరికీ ఈ పథకం పరిధిలోకి వచ్చే వ్యాధులు రాకపోవచ్చు. కాబట్టి కార్డులు పొందినప్పటికీ చాలా మంది ఈ పథకం కింద వైద్యానికి దూరంగానే వుండే అవకాశం వుంది. లేదా ప్రభుత్వం బీమా కంపెనీకి చెల్లించిన ప్రీమియం కంటే తక్కువ ఖర్చులోనే వైద్యం చేయించుకోవచ్చు. అంటే బీమా కంపెనీకి ట్రస్టు చెల్లించే దానికంటే, బీమా కంపెనీ ఆస్పత్రులకు చెల్లించేది తక్కువగా వుండే అవకాశం వుంది. నిబంధనల ప్రకారం 70 శాతం నిధులు ఖర్చు కానట్లయితే అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను మినహాయించుకొని మిగతా సొమ్మును ఆరోగ్యశ్రీ ట్రస్టుకు బీమా కంపెనీ వాపసు చేయాల్సి వుంటుంది. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు. దీనిమూలంగా ఈ పథకం పేరుతో బీమా కంపెనీలు వందల కోట్లు సొమ్ము చేసుకుంటున్నాయి. అంతేకాక సర్వీస్ చార్జీలు, అడ్మినిస్ట్రేటివ్ చార్జీల పేరిట సంవత్సరానికి 150-200 కోట్ల రూపాయలు ఈ సంస్థలకు ప్రభుత్వం ధారపోయాల్సి వుంటుంది. కనుక పేదలకు వైద్యం పేరుతో కార్పొరేటు సంస్థలకు లాభాలు చేకూర్చడమే ఈ పథకం వెనుకనున్న లక్ష్యమని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు.

పోనీ కార్పొరేట్ సంస్థల ఖజానాలు నింపితే నింపింది కాని పేదలకైతే మంచి వైద్యం దొరుకుతుంది కదా అని సరిపెట్టుకుందామా అంటే, గుండె జబ్బులు, కేన్సర్, మూత్రపిండాల వ్యాధులు వంటి వాటికి ఆరోగ్యశ్రీ ఉపకరించవచ్చు కాని రాష్ట్రంలో ఎక్కువ మంది మరణాలకు కారణమవుతున్న డెంగీ, మలేరియా, అతిసారం, బోధకాలు, విష జ్వరాలు, క్షయ, హెచ్ఐవి వంటి వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీని కేవలం ఆపరేషన్లకే పరిమితం చేశారు. డబ్బుల కోసం కార్పొరేట్ ఆస్పత్రులు అవసరం లేని ఆపరేషన్లు చేస్తున్నాయని, మరీ ముఖ్యంగా గర్భకోశాలను తొలగించే హిస్టరెక్టమీ ఆపరేషన్లు ఎక్కువగా జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అవసరం లేని ఆపరేషన్లు చేయడం ఒక ఎత్తయితే ఆస్పత్రులకు గిట్టుబాటు కాదనుకున్నప్పుడు అవసరం అయినప్పటికీ కొన్ని రకాల ఆపరేషన్లు చేయడం లేదు. ఈ పథకం కింద చికిత్స అందించిన తర్వాతే డబ్బు వస్తుంది కనుక కొన్ని ఆస్పత్రులు డబ్బు కడితేనే చికిత్స అందిస్తున్నాయి. ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు సంబంధిత ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ట్రస్టుకు సమాచారం పంపవలసి వుంటుంది. ట్రస్టు, బీమా కంపెనీల నుండి ఆథరైజేషన్ వచ్చిన తర్వాతనే ఆపరేషన్ చేయాల్సి వుంటుంది. తమకు లాభసాటిగా వుండే ఆపరేషన్ల వివరాలను ఆస్పత్రులు ట్రస్టుకు వెంటనే పంపుతున్నాయి. కాని లాభసాటి కానప్పుడు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నాయి. లేదా అరకొర సమాచారం పంపుతున్నాయి. వివరాలు సమగ్రంగా

**ప్రజలందరికీ వుచిత వైద్య సదుపాయం అందించడమే ధ్యేయంగా మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతూ 2010 అక్టోబర్‌లో 15 మందితో ప్రణాళికా సంఘం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అధ్యయనం తర్వాత ఈ కమిటీ ఇచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలు:**

* *కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ తదితర రాష్ట్రాలు సొంత నిధులతో ఆరోగ్య పథకాలను ప్రారంభించాయి. వీటి వుద్దేశం మంచిదే. కానీ, కొన్ని కేసుల్లో ప్రాథమిక, చాలా కేసుల్లో ద్వితీయ స్థాయి వైద్య సేవలు కూడా అందడం లేదు. ఔట్ పేషెంట్లకు వైద్యం చేయడం లేదు. దీర్ఘకాలంగా మందులు ఇవ్వడం లేదు.*
* *మన దేశ ఆరోగ్య సూచి పొరుగు దేశాలతో పోలిస్తే ఏ మాత్రం బాగోలేదు. చిన్నారులకు పూర్తిస్థాయిలో టీకాలు వేయడంలో మనది అట్టడుగు స్థానం. దేశంలో అందరికీ ఆరోగ్యం సమానంగా అందడం లేదు. ఆస్పత్రి పాలవుతున్న 40 శాతం మంది వైద్య బిల్లులు చెల్లించేందుకు అప్పు చేయాల్సి వస్తున్నది. 35 శాతం మంది వైద్య ఖర్చుల కారణంగా పేదలవుతున్నారు.*
* *రోగులకు ప్రభుత్వం వుచితంగా సరఫరా చేస్తున్న మందులు తగ్గిపోతూ వస్తున్నాయి. 1980ల్లో రోగులకు మూడొంతుల మందులు ప్రభుత్వమే వుచితంగా సరఫరా చేయగా, 2004 నాటికి ఇవి 9 శాతానికి పడిపోయాయి. ఔట్ పేషెంట్ల విభాగంలో వుచిత మందుల సరఫరా 18 నుంచి 5 శాతానికి పడిపోయింది. సొంత డబ్బులతో మందులు కొనేవారి శాతం 41 నుంచి 72 శాతం పెరిగింది.*
* *దేశంలోని ప్రతి ఒక్కరికీ సార్వత్రిక బీమా అందించేందుకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలి. రోగులందరికీ వుచితంగా మందులు అందించాలి. 70 శాతం నిధులు ప్రాథమిక ఆరోగ్యం కోసం కేటాయించాలి. నిధుల సమీకరణకు ఆదాయపు పన్ను పెంచాలి.*
* *బీమా పథకాలు ఆరోగ్య వ్యవస్థను నాశనం చేస్తున్నాయి. కాబట్టి, వీటిని పక్కన పెట్టాలి. ఆరోగ్య బీమా పథకాలు అవసరమైన అన్ని సేవలను, అదీ మొత్తం జనాభాకు అందించడం లేదు.*
* *కింది స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో యూజర్ చార్జీలను వసూలు చేయొద్దు. దాంతో వైద్యం అవసరమైన వారు కూడా కేంద్రాలకు వెళ్లడం లేదు. నిధుల సమీకరణకు యూజర్ చార్జీలు సరికాదు.*
* *సార్వత్రిక ఆరోగ్య బీమా (యూహెచ్‌సీ) పథకంలో భాగంగా దేశంలోని పౌరులు అందరికీ వుచితంగా అన్ని రకాల వైద్య సేవలూ అందాలి. ఇందులో భాగం కానివారు, ప్రైవేటు ఆస్పత్రుల సేవలు వినియోగించుకోవాలనుకునే వారికి నేరుగా డబ్బు చెల్లించాలి.*

లేకపోవడం వల్ల కొన్నిసార్లు, ట్రస్టు నిర్లక్ష్యం వల్ల మరి కొన్నిసార్లు అనుమతులు ఆలస్యం అవుతున్నాయి. ఈలోగా రోగుల పరిస్థితి విషమించి పోతున్నది. ఇదే అదనుగా ఆస్పత్రులు "వెంటనే ఆపరేషన్ చేయాలి. లేకపోతే ప్రాణాలకు ముప్పు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయడానికి అనుమతి రావాలంటే చాలా ఆలస్యమవుతుంది. దానిని నమ్ముకోవద్దు. డబ్బు కట్టండి. ఆపరేషన్ చేయించుకోండి" అని రోగుల కుటుంబీకులను భయపెట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. వ్యాధి నిర్ధారణ వంటి ఖర్చులు కూడా ఈ పథకంలోకి వస్తున్నప్పటికీ కొన్ని ఆస్పత్రులు వీటిని వసూలు చేస్తున్నాయి. ఇక ఆపరేషన్ల తర్వాత అన్ని ఖర్చులను రోగులే భరించాల్సి వస్తున్నది. మందులు వారే కొనుక్కోవాల్సి వస్తున్నది.

ప్రజలందరికీ వుచిత వైద్య సదుపాయాలు అందించడమే ధ్యేయంగా మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతూ 2010 అక్టోబర్‌లో 15 మందితో ప్రణాళికా సంఘం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆరోగ్యశ్రీని సైతం అధ్యయనం చేసిన ఈ కమిటీ ఈ పథకం వల్ల ప్రభుత్వానువత్రులకు నిధుల కొరత ఎదురయిందనీ, ప్రాథమిక వైద్యం నిర్లక్ష్యానికి గురయిందనీ... ఇంకా పలు రకాలుగా విమర్శించింది.

నిజానికి ప్రభుత్వానికి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా ఆరోగ్యశాఖను పటిష్టపరిచి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచడం, వాటి సంఖ్య పెంచడం చేయాలి. కానీ ఆరోగ్యశ్రీ వలన ప్రభుత్వ వైద్య రంగం మరింత బలహీనపడుతుండగా కార్పొరేటు వైద్య రంగం మరింత బలం పుంజుకుంటున్నది. దీన్నిబట్టి ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రజల ఆరోగ్యం పట్ల కాదనీ కార్పొరేట్ రంగానికి సేవ చేయడం పట్లనే అని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

## ఇందిరమ్మ

రాష్ట్రంలో 2009 నాటికి అందరికీ ఇండ్లు, గుడిసెలు లేని రాష్ట్రావిష్కరణ అని ప్రకటించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2006 మే 7న రంగారెడ్డి జిల్లా బోడంపహాడ్ గ్రామంలో ఇందిరమ్మ (ఇంటిగ్రేటెడ్ నావల్ డెవలప్‌మెంట్ ఇన్ రూరల్ ఏరియాస్ అండ్ మోడల్ మున్సిపల్ ఏరియాస్) పథకం ప్రారంభించాడు.

కూడు, గుడ్డ తర్వాత ప్రజలకు అత్యంత ఆవశ్యకమైనది ఇల్లే. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 46 లక్షల కుటుంబాలకు సొంత ఇండ్లు లేవు. ఇందులో 32.2 లక్షల కుటుంబాలు పక్కా ఇండ్లలో కాకుండా గుడిసెల్లోనో, రోడ్ల పక్కన గోనెబస్తాల డేరాల్లోనో బతుకులు వెళ్లదీస్తున్నారు. కాబట్టి అందరికీ ఇండ్లు అనే పథకం పేద ప్రజల్ని ఎంతగానో ఆకర్షిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పథకమని చెప్పడానికి వీల్లేదు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇందిరా ఆవాస్ యోజన పథకాన్ని అమలుచేస్తున్నది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏటా 2 లక్షల 75 వేల ఇండ్లను మంజూరు చేయాల్సి వుంటుంది. దీని కోసం ఖర్చు పెట్టే నిధులను తమకు ఇస్తే ఇంకా తక్కువ ధరకే ఇండ్లు కట్టిస్తామని అప్పట్లో వైఎస్ ప్రతిపాదించాడు. అట్లా ఇందిరా ఆవాస్ యోజన కింద వచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మరి కొన్ని నిధులను జోడించి రూపొందించినదే ఈ ఇందిరమ్మ పథకం. ప్రభుత్వం పేదలకు ఇల్లు కట్టుకోవడానికి 30,950 రూపాయలను సబ్సిడీగా ఇస్తుంది. దీనికి తోడుగా 20 వేల రూపాయలు అప్పుగా ఇస్తుంది. కానీ ఒక సాధారణమైన ఇంటికి లక్ష నుండి రెండు లక్షల రూపాయలైనా ఖర్చు అవుతుంది. కనుక ప్రభుత్వం ఇచ్చే ఈ సబ్సిడీ, రుణం ఇల్లు కట్టుకోవడానికి పేదలకు ఏ మాత్రం చాలనిదే. అయినప్పటికీ ప్రభుత్వం చేసే సాయానికి తమ రెక్కల కష్టాన్ని కొంత జోడించో, ఇంకింత అప్పో సప్పో చేసో, ఇంకేవో తిప్పలు పడో సొంత ఇల్లు అనే కలను నెరవేర్చుకోవాలనుకున్న బడుగుజీవులు ఎంతో మంది.

అందుకే ఈ పథకం కింద ఇండ్లు పొందడం కోసం ఎందరో పేదలు దరఖాస్తు చేసుకున్నారు. తొలి రచ్చబండ కార్యక్రమంలో దాదాపు 25 లక్షల కుటుంబాలు, మలి రచ్చబండ కార్యక్రమంలో దాదాపు 15 లక్షల కుటుంబాలు ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇలా దరఖాస్తు చేసుకున్న వారిలో 20 లక్షల మందిని అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. వీటితో పాటు రచ్చబండ కార్యక్రమంతో సంబంధం లేకుండా దాదాపు మరో 40 లక్షల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇన్ని లక్షల ప్రజలు ఇండ్ల కోసం ఎదురుచూస్తుండగా 38 లక్షల ఇండ్లు కట్టించినట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే 2011 మార్చిలో వెలువడిన కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం అప్పటికి పూర్తయిన ఇండ్లు కేవలం ఏడు లక్షల 52 వేలు మాత్రమే 31 లక్షల ఇండ్లలో సగం అసలు మొదలే కాలేదు. మిగతా సగం వివిధ దశల్లో వున్నాయి. దీన్ని బట్టి ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతున్నదనేది స్పష్టమవుతున్నది.

కాగా ఈ పథకం కింద ఇండ్లు మంజూరైన పేదలు పడుతున్న తిప్పలు ఎన్నెన్నో. కులం పేరు తప్పు పడిందనో, అకౌంట్‌లో పేరు సరిగా లేదనో, రేషన్ కార్డు డూప్లికేట్ అనో, నిబంధనలను మించి ఇంటి విస్తీర్ణం పెరిగిందనో బిల్లులు చెల్లించకుండా అధికారులు సతాయిస్తున్నారు. దీని మూలంగా కూడా లక్షల సంఖ్యలో ఇండ్లు ఇంకా ప్రారంభం కూడా కాలేదు. గృహ నిర్మాణశాఖా మంత్రి ఉత్తం కుమార్ 17లక్షల 25వేల 024 ఇండ్లు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదని ఒప్పుకున్నాడు. అయితే ఇలా ప్రారంభం కాకపోవడానికి కారణాలను తెల్సుకొని వాటిని పరిష్కరించడానికి బదులు ఇలా ప్రారంభం కాని ఇండ్లను ఇతరులకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా వుంటే కొంతమంది తర్వాత బిల్లు వస్తుందనే ఆశతో అప్పో సప్పో చేసి ఇల్లు కట్టుకుని, ఆ తర్వాత బిల్లు రాక, అప్పు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ పథకాన్ని రంగారెడ్డి జిల్లా బోడంపహాడ్ గ్రామంలో ప్రారంభించినపుడు మొట్టమొదటి పట్టాను కొత్తపల్లి రామచంద్రయ్యకు ఇచ్చారు. ఇల్లు కట్టడానికి బిల్లు కోసం అధికారుల చుట్టూ తిరిగిన రామచంద్రయ్య తర్వాతైనా బిల్లు

వస్తుందనే ఆశతో అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. ఆ తర్వాత బిల్లు రాక, అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందిరమ్మ పథకం తమకో నీడను ఇస్తుందని ఆశపడ్డ పేద కుటుంబాలు ఇలా వున్న అండను కోల్పోతున్నాయి.

ఈ పథకానికి అర్హులైన పేదలు ఇంతలా తిప్పలు పడుతుంటే కాంగ్రెస్ నాయకులకూ, కార్యకర్తలకూ మాత్రం ఈ పథకం కాసుల పంట పండిస్తున్నది. ఇండ్లను మంజూరు చేసే అధికారం జిల్లా ఇంఛార్జి మంత్రికి ప్రభుత్వం అంటగట్టింది. దీనితో కాంగ్రెస్ పార్టీ వారికి లబ్ధి చేకూర్చే పథకంగా మారిందిది. ఫలితంగా ఎంతో మంది అనర్హులు, అర్హులుగా మారి లబ్ధి పొందగా, మరెంతో మంది బోగస్ పేర్లతో ఇండ్లను పొందారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 12.88 లక్షల బోగస్ ఇండ్లు వున్నట్టు తేలిందని నిరుడు మంత్రే ప్రకటించాడు. అయితే ఈ సంఖ్యను తగ్గిస్తూ 2.77 లక్షల బోగస్ ఇండ్లు వున్నట్టు వీటి నిర్మాణం పేర 260 కోట్ల రూపాయలు రాజకీయ నాయకుల, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల, పలుకుబడి కల్గిన వర్గాల జేబుల్లోకి పోయినట్టు ఈ సంవత్సరం జనవరిలో ప్రభుత్వం ప్రకటించింది. ఇకపోతే వెయ్యి కోట్లకు పైగా రూపాయలు వున్నాయో లేవో లెక్కలు చెప్పలేని పరిస్థితిలో అయిదేళ్లుగా అధికారులు వున్నారని ఒక ప్రైవేటు పరిశోధనలో బయటపడింది. ఇందిరమ్మ పథకంలో జరుగుతున్న అవినీతిపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు 'మా రాజ్యం... మా ఇష్టం! మాకు నచ్చిన వాళ్లకే ఇండ్లు ఇచ్చుకుంటాం. ఏం చేస్తారో చేసుకోండి' అని నిస్సిగ్గుగా మంత్రి పార్థసారధి సవాల్ విసిరాడు.

ఇలా అన్ని పథకాల వలెనే పేద ప్రజలకు ఎటువంటి లబ్ధి చేకూర్చని 'ఇందిరమ్మ' పాలకులకు మాత్రం బోలెడు లబ్ధి చేకూర్చుతున్నది. పేదలకు ఎంతో చేసినట్టుగా చెప్పుకోవడానికి ఈ పథకం అవకాశం కల్పిస్తుంది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల భ్రమలు కల్పిస్తుంది. తమ పార్టీ వారికి ఆర్థికంగా ప్రయోజనాలు కల్పించి తమ వెనుక నిలబెట్టుకోవడానికి వుపయోగపడుతుంది.

## రాజీవ్ స్వగృహ

పేద ప్రజలకు ఇండ్లు అంటూ ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టిన వై.ఎస్.ఆర్. మధ్య తరగతి ప్రజల కోసం 2007లో రాజీవ్ స్వగృహ పథకం ప్రవేశపెట్టాడు. స్థానిక ఎన్నికల సందర్భంగా ఎగువ, దిగువ మధ్య తరగతి వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రవేశపెట్టిన పథకమిది. 94 మున్సిపాలిటీల పరిధిలో 17,866 కోట్ల రూపాయల ఖర్చుతో 85,961 ఇండ్లను నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద ఇండ్లను పొందే లబ్ధిదారులకు ఇంటి ధరలో 25 శాతం రాయితీ లభిస్తుంది. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 46 లక్షల కుటుంబాలకు సొంత ఇండ్లు లేవు. ఇందులో ఇందిరమ్మ పథకానికి అర్హులు కాని మధ్య తరగతి కుటుంబాలు అనేకం. 25 శాతం రాయితీ అనేది ఎవరినైనా ఆకర్షించే విషయమే. అందుకే ఈ పథకం కింద ఇండ్లు పొందడం కోసం 1.74 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు మొదటే మూడు నుండి అయిదు వేలు ధరావత్తు కట్టాల్సి వుంటుంది.

ఇండ్లు నిర్మించే బాధ్యతను గృహ నిర్మాణ మండలికి ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట ఒక ప్రత్యేక సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది పలు విమర్శలకు కారణమైంది. గృహ నిర్మాణ మండలికి రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాలలో భూములు వున్నాయి. కనుక దానికి భూములను కొత్తగా సేకరించాల్సిన అవసరం వుండేది కాదు. అంతే కాదు గృహ నిర్మాణ మండలిలో, అనుభవమున్న ఇంజనీర్లు, శిక్షితులైన సిబ్బందీ వుంటారు. ఇవేవీ లేని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌కు భూములు కొనడంతో పాటు సిబ్బందినీ సమకూర్చుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలో రియల్ ఎస్టేట్‌లో బూం వుండడంతో విపరీతమైన ధరలకు భూములు కొనాల్సి వచ్చింది. ఇక్కడ ప్రభుత్వం కూడా భూముల వ్యాపారిగా అవతారం ఎత్తి, విపరీతమైన ధరలకు ఈ సంస్థకు భూములు అమ్మింది. నగరాల శివార్లలో కనీస సౌకర్యాలు లేనిచోట కూడా ఎకరం కోటి నుండి నాలుగు కోట్ల రూపాయలకు పెంచి అమ్మింది. ఈ కారణంగా ఈ పథకం కింద నిర్మించిన ఇండ్లు బాగా ఖరీదయి పోయాయి. 25 శాతం రాయితీ పొందినప్పటికీ కొనుగోలుదారులు బయటి మార్కెట్ ధరల కంటే ఈ ఇండ్లకు ఎక్కువ చెల్లించాల్సి వస్తున్నది. దీనితో ఒక లక్షా 74 వేల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటికి కనీసం 5 వేల మంది కూడా ఈ ఇండ్లను కొనడానికి ముందుకు రాలేదు. అనేక కుటుంబాలు తాము కట్టిన ధరావత్‌ను వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. (ఈ ధరావత్‌ల మూలంగా దాదాపు 90 కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖాతాలో జమయ్యాయి.) దీని మూలంగా తొలుత ప్రారంభించిన 16,663 ఇండ్ల నిర్మాణం పైసల్లేక ముందుకు సాగడం లేదు. అందువల్ల కనీసం 5,034 ఇండ్లను మొదట పూర్తి చేసి వాటిని అమ్మిన తర్వాతనే మిగతా ఇండ్ల జోలికి పోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మధ్య తరగతి ప్రజల ప్రయోజనం కోసం అని ప్రభుత్వం ప్రచారం చేసుకున్నప్పటికీ ఈ పథకం రియల్ ఎస్టేట్ వ్యాపారులకే ఎక్కువగా ప్రయోజనాలను కట్టబెట్టింది. ఒక మున్సిపాలిటీ పరిధిలో సొంత ఇల్లు వున్నప్పటికీ సొంత ఇల్లు లేని మరో మున్సిపాలిటీ పరిధిలో ఈ పథకం ద్వారా ఇల్లు పొందవచ్చనే నిబంధన కూడా ఈ పథకంలో వుంది. దీన్నిబట్టి ఇండ్లు లేని వారికి ఇండ్లు సమకూర్చాలనే లక్ష్యం కంటే ఇండ్ల కొనుగోళ్లను ప్రోత్సహించి పెట్టుబడిదార్లకు, వ్యాపారులకు ప్రయోజనాలు కట్టబెట్టే లక్ష్యమే ముఖ్యమైనది.

ప్రజల సంక్షేమానికి ఏ ప్రభుత్వాలూ, పార్లమెంటరీ పార్టీలు కట్టుబడి లేవన్నది 65 ఏండ్ల 'స్వతంత్ర' భారత చరిత్ర మనకు అర్థం చేయిస్తూనే వుంది. ప్రజల సంక్షేమం పట్ల పాలకవర్గాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా వారి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే ప్రయత్నం చేస్తాయి. కాని మౌలిక సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా, వాటి పరిష్కారం కోసం పోరాడుతున్న ప్రజలపై, వుద్యమాలపై తీవ్ర అణచివేతను ప్రయోగిస్తూ మరోవైపు తమ

# ఎన్‌కౌంటర్లన్నీ బూటకపు హత్యలే!

ప్రజా ఉద్యమాలను, ఆందోళనలను అణచడానికి ప్రభుత్వం మొదటినుండి నిర్బంధాన్ని అమలుచేస్తూ, పోరాటకారులను, ఆందోళనకారులను బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్ హత్యలు చేస్తున్నది. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడానికి బదులు ప్రజా పోరాటాలను అణచివేతతోనే పరిష్కరింపజూస్తున్నది. బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడానికి ముందుకు వచ్చే క్రూరులైన పోలీసు అధికారులకు అనేక రాయితీలు, అవార్డులు, రివార్డులు యిస్తూ ప్రభుత్వం ఎన్‌కౌంటర్లను యధేచ్ఛగా కొనసాగిస్తున్నది.

మహిళలపై యాసిడ్ దాడి చేసీ, చిన్నారులను కిడ్నాప్ చేసి చంపీ, దొంగతనాలూ, హత్యలూ చేసి తీవ్రమైన ప్రజా వ్యతిరేకతకు గురైన కొంత మందిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, తమ హత్యలకు సాధికారత కల్పించుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

అందులో భాగంగానే ప్రస్తుతం గ్రేహౌండ్స్ ఐజీగా వున్న సీతారామాంజనేయులు 2000 సంవత్సరంలో కర్నూల్, గుంటూరు జిల్లాలలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలలకే 19మందిని ఎన్‌కౌంటర్ల పేరిట హతమార్చాడు.

ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కేరళలో (1974-75) జరిగిన కామ్రేడ్ వర్గీస్ బూటకపు ఎన్‌కౌంటరు మొదలుకొని ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లకు, లాకప్పు హత్యలకు, పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, న్యాయవిచారణ జరిపి దోషులను శిక్షించాలనే డిమాండ్ చేస్తున్నారు. ఈ పోరాటాల ఫలితంగానే కేరళలో వర్గీస్‌ను హత్యచేసిన అధికారులకు శిక్ష పడింది. గిరాయిపల్లి బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణకు భార్గవ కమిషన్ ఏర్పడింది. గుజరాత్‌లో శిబుసోరేన్ బూటకపు ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసు అధికారులకు శిక్షపడింది. బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడినవారిపై కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. పోరాటాల వల్లనే పోలీసులు హత్యచేసిన ఎందరో విప్లవకారుల మృతదేహాలకు రీ పోస్టు మార్టమ్ జరిగింది. ఈ పోరాటాలలో కొంతమంది హక్కుల కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు విశేష కృషి చేస్తున్నారు. ఇటువంటి కృషి కారణంగానే కౄరుడైన ఎస్పీ సీతారామాంజనేయులు 2000 సంవత్సరంలో చేసిన 19 బూటకపు ఎన్‌కౌంటర్లలో 16 ఎన్‌కౌంటర్లు బూటకమనీ, వీటిలో హతులైన 16 మంది కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి అయిదు లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని జాతీయ మానవ హక్కుల ఛైర్మన్ (ఎన్ఎచ్ఆర్‌సి) జస్టిస్ బాలకృష్ణన్ తీర్పు చెప్పాడు. మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది బి. చంద్రశేఖర్ జరిపిన న్యాయపోరాటం మూలంగా ఈ తీర్పు వెలువడింది.

అయితే ఇవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లని తేల్చి చెప్పినప్పటికీ నష్ట పరిహారంతోనే సరిపెట్టడం తప్ప దోషి సీతా రామాంజనేయులుకు ఎటువంటి శిక్ష వేయకపోవడం ప్రజలూ, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా వ్యతిరేకించాల్సిన విషయం. ఒక పోలీసు అధికారిని నేరస్తుడని వేలెత్తిచూపడం ప్రస్తుత పరిస్థితిలో విజయమే అయినప్పటికీ అది మాత్రమే సరిపోదు. నేరస్తులైన పోలీసులకు శిక్షలు కూడా పడాలి. అప్పుడే విచ్చలవిడిగా కొనసాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లు కొద్దిశాతమైనా తగ్గుముఖం పట్టే అవకాశం వుంటుంది. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు మరింత పట్టుదలగా పోరాడి సీతారామాంజనేయులు సహా వివిధ బూటకపు ఎన్‌కౌంటర్లకు, లాకప్ హత్యలకు, అత్యాచారాలకు కారణమైన అధికారులకు శిక్షపడేలా ప్రజా ఉద్యమాలను చేపట్టాలి. ★

---

సంస్కరణ పథకంలో భాగంగా రోజుకో సంక్షేమ పథకాన్ని ప్రకటిస్తున్నాయి. తమ దోపిడీ, అణచివేత ముఖానికి ముసుగుగానూ, ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించడానికి, ప్రభుత్వాలపై ప్రజలు కోల్పోతున్న భ్రమలను నిలిపి వుంచడానికి ఈ 'సంక్షేమ' పథకాలను వుపయోగించుకుంటున్నాయి. ఉద్యమ ప్రాంతాల్లో ఎల్ఐసిలో భాగంగా ఈ పథకాల్ని అమలు చేస్తూ, ప్రజల్లో చీలిక తెస్తున్నాయి. అదే సమయంలో పేద ప్రజల సంక్షేమం ముసుగులో, పాలక పార్టీల, కార్పొరేటు సంస్థల ప్రయోజనాలను నెరవేరుస్తున్నాయి. అవినీతిని మరింతగా పెంచిపోషిస్తున్నాయి.

ఇంతకూ ఈ పథకాలకు ప్రభుత్వ9ం కేటాయిస్తున్న నిధులు ఎవరి జేబులో  నుండి వస్తున్నాయి? "రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు 26వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. పన్నులు వేయొద్దంటే ఎలా పన్నులు వేయకుండా పథకాలెలా అమలు చేస్తాం?" అన్నాడీ మధ్య ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి. ఆ పన్నులేవో ధనికులకో, కార్పొరేట్ సంస్థలకో వేస్తారనుకుంటే పొరపాటే. సామాన్య ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై, వినియోగించుకునే సేవలపై విపరీతంగా పన్నులు పెంచి ప్రజల బతుకులను మరింత భారంగా మార్చుతారు. ప్రజల నుండి కొల్లగొట్టిన సొమ్ములోని కొంత భాగాన్ని ఈ పథకాలకు కేటాయిస్తూ ప్రజా సంక్షేమం అంటున్నారు పాలకులు.

కనుక పాలకుల 'సంక్షేమ' పథకాల బూటకత్వాన్ని గ్రహించి, నిజమైన ప్రజా సంక్షేమానికి పాటు పడే ప్రజా రాజ్యాన్ని సాధించుకోవడం కోసం ప్రజలంతా పోరు మార్గం పట్టాల్సి వుంది. ★

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## దండకారణ్యం

### దక్షిణ రీజియన్‌లో ప్రతిఘటన

2012 ఆగస్ట్ - సెప్టెంబర్‌లలో దండకారణ్యంలోని దక్షిణ రీజియన్‌లో కొన్ని ప్రతిఘటనా నిర్బంధ చర్యలు జరిగాయి.

**దక్షిణ బస్తర్ డివిజన్‌లో** ఆగస్టు 7న జేగురుగొండ ఏరియాలో బాసగూడ నుండి సార్కిన్‌గూడ పోలీసు క్యాంపుకు రేషన్ తీసుకువెళున్న కోబ్రా బలగాల మెటాడోర్ వాహనాన్ని పీఎల్‌జీఏ బలగాలు పేల్చి వేశాయి. ఈ పేల్చివేతలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కోబ్రాలు మరణించారు. ఆ తర్వాత వెనుక వస్తున్న కోబ్రా బలగాలకూ పీఎల్‌జీఏ బలగాలకూ నడుమ కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో రెండు స్టెన్ మాగజైన్లు, 60 తూటాలు పీఎల్‌జీఏ బలగాల స్వాధీనమయ్యాయి. ఆగస్టు 14న బాసగూడ క్యాంపు నుండి వచ్చి పూసుబాక గ్రామంపై దాడి చేసి తిరిగి వెళ్తున్న పోలీసు బలగాలపై పీఎల్‌జీఏ దాడి చేసింది. ఈ దాడిలో ఒక కోబ్రా పోలీసు చనిపోయాడు. ఆగస్ట్ 19న కోంట ఏరియాలో ఆసిర్‌గూడ సమీపంలో గొల్లపల్లి సర్పంచ్ మడకం సోమ్డాను పీఎల్‌జీఏ బలగాలు ఖతం చేశాయి. మడకం సోమ్డా సల్వాజుడుంలో చేరి గొల్లపల్లి చుట్టుపక్కలున్న అన్ని గ్రామాలపై జరిగిన దాడులకు నేతృత్వం వహించాడు. అందుకే ఈ ప్రజా శత్రువు మూల్యం చెల్లించుకున్నాడు. సెప్టెంబర్ 19న కోంట ఏరియాలోని గోర్ఖ పోలీసు క్యాంపు సమీపంలోని హెలిపాడ్‌కు రక్షణగా వున్న పోలీసులపై పీఎల్‌జీఏ దాడి చేయగా ఒక జిల్లా పోలీసు మరణించాడు. మరొక పోలీసు గాయపడ్డాడు. సెప్టెంబర్ 25న సుక్‌మా జిల్లా కేంద్రంలో పోలీసులపై పీఎల్‌జీఏ బలగాలు చేసిన దాడిలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక పోలీసు చనిపోగా, మరొక పోలీసు గాయపడ్డాడు. సెప్టెంబర్ 29న తేనెల్‌వాడ ఎస్టీఎఫ్ క్యాంపుకు చెందిన హెలిపాడ్ సమీపంలో గస్తీ తిరుగుతున్న పోలీసులపై పీఎల్‌జీఏ చేసిన దాడిలో ఇద్దరు సీఎఫ్ జవాన్‌లు గాయపడ్డారు.

**దర్భ డివిజన్‌లో** ఆగస్ట్ 6న మలింగేర్ ఏరియా మండేదా సమీపంలో పాల్‌నార్ ఆర్‌పూర్ రోడ్డుపై సీఆర్‌పీఎఫ్ ప్రయాణిస్తున్న ఒక మైన్ ప్రూఫ్ వాహనాన్ని పేల్చివేశారు. తర్వాత కాల్పులు జరుపుతూ పీఎల్‌జీఏ అడ్వాన్స్ అయింది. అడ్వాన్స్ అవుతున్న బలగాలకు, మైన్ ప్రూఫ్ వాహనం వెనకాల మోటార్ సైకిళ్లపై వచ్చిన బలగాలతో అరగంట సేపు తీవ్రంగా కాల్పులు జరిగాయి. ఈ కారణంగా పీఎల్‌జీఏ బలగాలు, పేలుడులో గాయపడిన పోలీసులను చంపి ఆయుధాలను స్వాధీనం చేసుకోకుండా రిట్రీట్ కావల్సి వచ్చింది. ఈ ఘటనలో ఒక సీఆర్‌పీఎఫ్ పోలీసు చనిపోగా, అయిదుగురు పోలీసులు గాయపడ్డారు.

**పశ్చిమ బస్తర్ డివిజన్‌లో** సెప్టెంబర్ 27న మద్దేడ్ ఏరియా ఆవపల్లి వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై పీఎల్‌జీఏ దాడి చేసి ఒక పోలీసును గాయపర్చి, ఆ పోలీసు దగ్గరున్న ఒక ఎస్ఎల్ఆర్‌ను, వైర్‌లెస్ సెట్‌ను స్వాధీనం చేసుకుంది.

### నిర్బంధం

జూన్ 28న సార్కిన్‌గూడలో శత్రు బలగాలు సాగించిన మారణకాండ అందరికీ తెలిసినదే. ఈ మారణకాండను అనేక సెక్షన్ల ప్రజలు తీవ్రంగా ఖండించారు. పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ రమణ్‌సింగ్ సర్కార్ నిర్లజ్జగా జూలై 16న సార్కిన్‌గూడ సమీపంలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 204వ (కోబ్రా) బెటాలియన్ క్యాంపు ఏర్పాటుచేసింది. ఆ వెంటనే సార్కిన్‌గూడ, కొత్తగూడ, రాజుపెంట, పాకేలా గ్రామాలపై మరోసారి దాడి చేసి అనేక మంది ప్రజలను విచక్షణారహితంగా కొట్టారు. పలువురు మహిళలపై అత్యాచారం చేశారు. కొంతమంది ప్రజలను పట్టుకొని బాసగూడ పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టారు. అక్టోబర్ 2న ఈ కోబ్రా బెటాలియన్‌కు చెందిన బలగాలు ఒక గ్రామీణ మహిళలను పట్టుకొని ఆవుట్‌పల్లి గ్రామ సమీపంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. సార్కిన్‌గూడ మారణకాండకు పాల్పడినప్పటి నుండీ నేటి వరకూ బాసగూడ, సార్కిన్‌గూడ సమీప గ్రామాలపై పోలీసుల దాడులు నిరంతరం జరుగుతూనే వున్నాయి. ఈ బీభత్సకాండను తట్టుకోలేక బాసగూడ సమీప గ్రామాల ప్రజలు తమ గ్రామాలను వదిలి వలసపోతున్నారు.

ఆగస్ట్ 12న దర్భ డివిజన్‌లోని కాంగేరఘాటి ఏరియాకు చెందిన పూలే అనే మహిళా కామ్రేడ్ చికిత్స కోసం జగదల్‌పూర్ వెళ్లగా ఇన్‌ఫార్మర్ల సమాచారం మేరకు పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. స్టేషన్‌లో అనేక రకాలుగా చిత్రహింసలు పెట్టి ఆ తర్వాత జైలుకు పంపారు.

ఆగస్ట్ 14న దర్భ డివిజన్ మాచ్‌కోట ఏరియాకు చెందిన మడకం గంగాల్ (కిషోర్), వెట్టి కములు అనే ఇద్దరు ఏరియా స్థాయి కామ్రేడ్స్‌ను ఇన్ఫార్మర్ల సమాచారం మేరకు జగదల్‌పూర్ – జయ్‌పూర్ నేషనల్ హైవేపైనున్న ధన్‌పుంజి గ్రామ సమీపాన పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పోలీసులు దాదాపు నెలా పదిహేను రోజుల పాటు అక్రమంగా నిర్బంధించి, విపరీతమైన చిత్రహింసలకు గురిచేసి అక్టోబర్ 3న జగదల్‌పూర్‌లో లొంగిపోయినట్టుగా చూపించారు.

పార్టీలో కొంతకాలం పనిచేసి ఇంటికి వెళ్లిపోయిన మడకం దేవే అనే మాజీ ప్లటూన్ కమాండర్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని చర్ల సంతలో అగస్ట్ 2న పోలీసులు అరెస్టుచేశారు. అయితే ఆమెను పామేడ్ అడవిలో పట్టుకున్నట్టు అబద్ధాలు చెబుతూ బీజాపూర్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.

సెప్టెంబర్ 12న దర్భ డివిజన్‌లో పోటిలి గ్రామంపై పోలీసులు దాడిచేసి ముగ్గురు గ్రామీణులను పట్టుకెళ్లి జైలులో పెట్టారు.

సెప్టెంబర్ 22న పశ్చిమ బస్తర్ డివిజన్ నేషనల్ పార్క్ ఏరియాలో నెల్లిమడుగు గ్రామ సమీపంలోని అడవిలో గెరిల్లాలకు సంబంధించిన ఒక డంపును పోలీసులు ధ్వంసం చేశారు.

సెప్టెంబర్ 27 నుండి 30 వరకూ గంగలూరు ఏరియాలోని పలు గ్రామాలు పోలీసు దాడులకు గురయ్యాయి. గంగలూరు, పాములవాయ, బీజాపూర్, మురికినార్, ఆవపల్లి పోలీసు స్టేషన్ల నుండి బయల్దేరిన జిల్లా పోలీసు, సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నేంద్ర, పెదకోర్మ, పూసునారు, మురంగ, కోర్సెలి, తోడ్క, అవునారు గ్రామాలు బీభత్సానికి గురయ్యాయి. ఇలా దాడులకు వచ్చిన పోలీసులపై కోర్సెలి, అవునారు గ్రామాల సమీపంలో పీఎల్‌జీఏ బలగాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో పోలీసు బలగాలకు ఎటువంటి నష్టం వాటిల్లకపోగా, పోలీసులు ప్రయోగించిన మోర్టార్ షెల్స్ వలన నలుగురు మిలీషియా సభ్యులు గాయపడ్డారు.

**కోరాపుట్ డివిజన్**

### మద్యపాన నిషేధ వుద్యమం

నారాయణపట్నాలో జరిగిన రైతాంగ పోరాటాన్ని దెబ్బ తీయడానికి ప్రభుత్వం పన్నుతున్న అనేక కుట్రల్లో భాగంగా మద్యాన్ని తిరిగి ప్రవేశపెట్టి ప్రజలను మత్తులో ముంచాలనేది ఒకటి. పోలీసు రక్షణ బలంగా వున్న నారాయణపట్నా, బందుగాం టౌన్లలో ప్రైవేట్ కాంట్రాక్టర్లు బీరు, బ్రాందీలతో పాటు సారా అమ్మకాలు జరుపుతున్నారు. 2009కి ముందు నారాయణపట్నా, బందుగాం కేంద్రాలుగా సారా తయారీ జరిగేది. 2009 జనవరిలో వేలాది మంది ప్రజలు కదిలి సారాబట్టీలను, షాపులను ధ్వంసం చేయడంతో సారా బందయింది. గతంలో లక్షల రూపాయల లాభాలను ఆర్జించిన కాంట్రాక్టర్లు పోలీసుల అండతో 2010 నుండి తిరిగి మద్యం షాపులను ప్రారంభించారు. లకింపూర్, రాయగఢ పట్టణాల నుండి వాహనాల్లో పెద్ద మొత్తంలో తీసుకొచ్చి అమ్ముతున్నారు.

బందుగాం బ్లాక్‌లోని జగ్గూడ, కనగాం, శీలాబడి, బంకిని, సోరిపెల్లి వంటి కొన్ని గ్రామాల్లో నాటు సారా, బీరు, బ్రాందీ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. విప్లవం పేరుతో నడుస్తున్న అర్జున్, పైడమ్మల ముఠాకు చెందిన ఛసి మూలియా సంఘం పని చేస్తున్న గ్రామాలివి. పైడమ్మ మద్దతుతో ఈ గ్రామాల్లోని కాంట్రాక్టర్లు సారా తయారు చేసి అమ్ముతున్నారు. సారా అమ్ముతున్న గ్రామాలను మావోయిస్టు రహిత గ్రామాలుగా పోలీసులు భావిస్తారని, దాడులు జరగవని పైడమ్మ నిస్సిగ్గుగా చెబుతూ సారా అమ్మకాలను ప్రోత్సహిస్తున్నది. దానికి ప్రతిఫలంగా లంచాలు తీసుకుంటున్నది. సారా కాంట్రాక్టర్లయిన సొండి, పైడి తదితర వ్యాపారులు సారా అమ్మకాల ద్వారానే ఆదివాసీల భూములను కాజేశారు.

ఛసి మూలియా ఆదివాసీ సంఘం, విప్లవ ఆదివాసీ మహిళా సంఘం, పోస్టర్లు, బ్యానర్లు, బహిరంగ సభల ద్వారా మద్య నిషేధ పిలుపును తీసుకెళ్లాయి. ఆ పిలుపులో భాగంగా బందుగాం బ్లాక్ కుంబారిపుట్, కొట్రాబెడ్డ పంచాయితీల ప్రజలు ముందు వరసలో నిలబడి సారా పోరాటం ప్రారంభించారు. వారం రోజులు 700 మంది ప్రజలు (400 మహిళలు, 300 పురుషులు), సంఘ సభ్యులు రోజూ వుదయం సమావేశమై, రెండు బృందాలుగా విడిపోయి రోజుకు కనీసం నాలుగు గ్రామాలకు వెళ్లేవారు. ఆ గ్రామాల ప్రజలకు సారా వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, సారా ధ్వంసం చేసి, ప్రజలకే సారా బంద్ పెట్టే బాధ్యతనిచ్చేవారు. రాయగఢ జిల్లా కేంద్రం నుండి వాహనాల ద్వారా జరుగుతున్న బెల్లం సరఫరాను అడ్డుకున్నారు. మూడుసార్లు కాపుకాసి ఒక జీపు, ఒక లారీ, రెండు మోటారు బైక్‌లను, అందులోని బెల్లాన్ని ధ్వంసం చేశారు. సోర్‌పెల్లి గ్రామంలో 500 కిలోల బెల్లాన్ని ధ్వంసం చేశారు. సంతల రోజున జరిగే సారా వ్యాపారాన్ని కూడా అడ్డుకున్నారు.

ప్రజలు ఇంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ బ్లాక్ కేంద్రాలలో లైసెన్స్‌డ్ వ్యాపారులు దర్జాగా అమ్మకాలు సాగిస్తున్నారు. పోలీసుల అండతో ప్రభుత్వమే కొనసాగిస్తున్న లైసెన్స్‌డ్ వ్యాపారాన్ని బందు పెట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సంఘం నిర్ణయించింది. నారాయణపట్నాలో అయిదు వేల మంది, బందుగాంలో ఎనిమిది వేల మందితో ఊరేగింపు జరిపి బీడీఓకు మెమొరాండం ఇచ్చారు. మద్యం తక్షణమే బందు పెట్టాలని మద్యం వ్యాపారులను హెచ్చరించారు.


పెద్ద ప్రభంజనంలా సాగుతున్న సారా పోరాటం ఆదివాసీ కుటుంబాలలో ఎంతో మార్పు తీసుకువచ్చింది. ఇప్పటి వరకు సొంతంగా సారాను వండుకొని తాగడం అలవాటున్న ప్రజలు స్వచ్ఛందంగా సారా మానేయడం వారి చైతన్యానికి ప్రతీక. ఈ పోరాటం, పక్కనే గల ఆంధ్రా ప్రాంతంలోని పార్వతీపురం, మక్కువ మండలాల ప్రజలపై కూడా ప్రభావాన్ని వేసింది. లకింపూర్, రాయగఢ ప్రాంతాలలోని ప్రజలు కూడా ఈ పోరాటాలలో కదులుతున్నారు. తమ హక్కులు, సంస్కృతులను కాపాడుకోవడానికి, తమ నిజమైన అభివృద్ధికి ఆటంకంగా వున్న ప్రభుత్వాన్ని ధ్వంసం చేయడానికి, తాము చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని నారాయణపట్నా ఆదివాసీలు ఆశిస్తున్నారు.

**కె.కె.డబ్ల్యు. డివిజన్**

### భూస్వామి కళ్లెం వెంకటరెడ్డి ఖతం

కె.కె.డబ్ల్యూ డివిజన్ కొత్తగూడెం-నర్సంపేట ఏరియా కమిటీ పరిధిలోని పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్ (రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన భూస్వామి, కళ్లెం వెంకటరెడ్డిని అక్టోబర్ 16న పిఎల్‌జిఎ ఖతం చేసింది.

కళ్లెం వెంకటరెడ్డి (45) తమ గ్రామంలోనూ, పరిసర గ్రామాల్లోనూ ఆదివాసులు సాగుచేసుకుంటున్న దాదాపు 150



## తుమ్మల వేణుగోపాల్‌రావు సంస్మరణ

1970ల నుండి నాలుగు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికి వివిధ రూపాల్లో సహకరించిన మేధావికి 'క్రాంతి' వినమ్రంగా జోహార్లు చెబుతున్నది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నది.

ప్రముఖ విద్యావేత్త, సాహితీప్రియుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ తుమ్మల వేణుగోపాల్‌రావు 2011 సెప్టెంబర్ 21న కన్నుమూశారు. ఆరేళుగా ఆయన అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు.

వేణుగోపాల్ రావు కృష్ణా జిల్లా ఘంటసాలపాలెంలో 1928 ఫిబ్రవరి 29న పుట్టారు. కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎంటెక్ చేసి ఆంధ్రా యూనివర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. తరువాత అమెరికాలో ఎంటెక్ చేసి తిరిగి ఎ.యు.లో చేరి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు సిఆర్ ఇంజనీరింగ్ కళాశాలల వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గాను, కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గానూ వేణుగోపాల్‌రావు వ్యవహరించారు.

వామపక్ష రాజకీయ అభిమానిగా హేతువాదిగా ఆయన ఎన్నో సామాజిక, సాహిత్య కార్యకలాపాలలో భాగం పంచుకున్నారు. తెలుగు సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పిన శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘంలో (1970) కీలక బాధ్యుడిగా వ్యవహరించారు. శ్రీశ్రీ కాళోజీ నారాయణరావు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, చెరబండరాజు తదితరులతో సన్నిహితంగా మెలిగాడు. విప్లవ రచయితల సంఘానికీ, విప్లవ సాహిత్యోద్యమానికీ, విప్లవ ప్రజా సంఘాలకూ అనేక రకాల చేయూతనందించారు. విశాఖ పౌరహక్కుల సంఘం, భారత నాస్తిక సమాజం, విశాఖ ఫిలిం సొసైటీ 'ఛాయ'లకు వెన్నుదన్నుగా వున్నారు. 1975 ఎమర్జెన్సీ తరువాత విజయవాడ కేంద్రంగా పనిచేస్తూ తమ ఇంటి దగ్గర వారం వారం సాహితీమిత్రుల గోష్ఠి నిర్వహించారు. మార్క్సిజం తరపున త్రిపురనేని మధుసూదన రావుకు రాడికల్ హ్యూమనిజం తరపున రావిపూడి వెంకటాద్రికి మధ్య జరిగిన చరిత్రాత్మక చర్చకు మోడరేటర్‌గా వ్యవహరించారు.

ప్రజా సంఘాల ఉమ్మడి వేదికల్లో అధ్యక్షులుగా వ్యవహరించేవారు. రాడికల్ విద్యార్థులతో సన్నిహితంగా, స్నేహంగా వుండేవారు. ఆచార్యులయి వుండి కూడా వినయంగా నేర్చుకునే స్వభావం కలిగి వుండేవారు.

తన భౌతికకాయాన్ని విద్యార్థుల వుపయోగార్థం ఆంధ్ర మెడికల్ కళాశాలకు అందజేయాలని కోరారు.

ఎకరాల భూమిని ఆక్రమించుకొని ఆదివాసులను భూమి నుండి తరిమివేసినాడు. అన్యాయానికి గురైన ఆదివాసులు రైతు కూలీ సంఘంగా ఏర్పడి శాంతియుతంగా పలు రూపాల్లో ఆందోళనలు చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తులు చేసుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం భూస్వామికే మద్దతుగా వుండి, అరెస్టులు, దాడులతో ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. అంతే కాకుండా ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మోరె రవి అనే సంఘ నాయకుడిపై వెంకటరెడ్డి గూండాలు 2011 మే 29న దాడి చేశారు. ఆ దాడిలో అతను స్పృహ కోల్పోగా మరణించాడని భావించి విడిచిపెట్టి వెళ్లిపోయారు.

కొన ఊపిరిలో వున్న రవికి, ప్రజలు వైద్యం అందించి బతికించుకున్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల నుండి శాంతియుతంగా పోరాడినప్పటికీ, భూమి దక్కకపోగా ఆదివాసులే దాడులకు గురైనారు. ప్రభుత్వం వల్లెవేస్తున్న ప్రజాస్వామ్యం, అటవీ హక్కుల చట్టం లాంటివి ఎంత బూటకమో దీని నుండి తేటతెల్లమవుతున్నది. విసిగి వేసారిన ప్రజలు భూస్వామి వెంకటరెడ్డిని ఖతం చెయ్యాలని కోరుకున్నారు. ప్రజల డిమాండ్ మేరకు పిఎల్‌జిఎ భూస్వామి వెంకటరెడ్డిని అక్టోబర్ 16న హతమార్చింది. దీనితో వెంకటరెడ్డి పీడ విరగడయిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

### ఇన్‌ఫార్మర్, మాజీ దళ సభ్యురాలు ఖతం

కొత్తగూడెం-నర్సంపేట ఏరియా కమిటీ పరిధిలోని గుండాల మండలం సాయనపల్లి (కొమ్ముగూడెం) గ్రామానికి చెందిన మాజీ దళ సభ్యురాలు వాగబోయిన అనసూయ (స్వర్ణ)ను పిఎల్‌జిఎ అక్టోబర్ 6న ఖతం చేసింది. 2006 చివరలో దళసభ్యురాలుగా చేరిన అనసూయ అనారోగ్య కారణాలతో 2008లో పోలీసులకు సరెండర్ అయ్యింది. ఆ తర్వాత నుండి పార్టీ సంబంధాలలో వుంటూనే ఇన్ఫార్మర్‌గా మారింది. 2012 ఫిబ్రవరి 20న దళం వాళ్ల యింటికి వస్తున్న విషయం పోలీసులకు సమాచారం అందించింది. ఆమె సమాచారంపై ఆధారపడి పోలీసులు చేసిన మాటు దాడిలో దళకమాండర్ కామ్రేడ్ సింగన్న (ఎసిఎమ్) అమరుడు అయినాడు.

ఈ దాడికి కారణమయిన అనసూయను అక్టోబర్ 6న దళం ఖతం చేసి ఆమె కుటుంబ సభ్యులను హెచ్చరించింది. ఈ చర్య విప్లవ ద్రోహులకు ఒక హెచ్చరిక అయింది.


★

## విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రారంభకుడు, గిరాయిపల్లి అమరవీరుడు

# సూరపనేని జనార్దన్ రావు సంస్మరణ సభ

## "జన హృదయం జనార్దన్" పుస్తకావిష్కరణ

**జూలై 25, 2012 బుధవారం సాయంత్రం 6.00 బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్**



విప్లవ విద్యార్థి ఉద్యమంలో, విప్లవోద్యమంలో ఉజ్వలమైన, అరుణారుణమైన స్మృతి గిరాయిపల్లి మృతవీరులది. ఎమర్జెన్సీ ప్రకటించిన నెలరోజులకు 1975 జూలై 24-25 రాత్రి మెదక్ జిల్లా గిరాయిపల్లి అడవులలో బూటకపు ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎమర్జెన్సీ చీకటిరాత్రి నరహంతక వెంగళరావు ప్రభుత్వ పోలీసులు సూరపనేని జనార్దన్‌రావు, లంకా మురళీమోహన్ రెడ్డి, కొలిశెట్టి ఆనందరావు, వనపర్తి సుధాకర్‌లను చెట్లకు కట్టి కాల్చి చంపారు. జనార్దన్ వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థి. మురళీమోహన్ రెడ్డి, వరంగల్ లాల్ బహదూర్ కాలేజి విద్యార్థి. ఆనందరావు నర్సంపేట జూనియర్ కాలేజి విద్యార్థి. దేశాయిపేటకు చెందిన సుధాకర్ పదో తరగతితో చదువు ఆపి వరంగల్ గ్రెయిన్ మార్కెట్‌లో పని చేస్తుండేవాడు. ఆ నలుగురు మెదక్ జిల్లాలో విప్లవ రైతాంగ వుద్యమ నిర్మాణంలో వుండగా పోలీసులు పట్టుకొని ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపారు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత తార్కుండే కమిటీ కృషి వల్ల గిరాయిపల్లి హత్యాకాండ సవివరంగా, సాక్ష్యాధారాలతో సహా ప్రజలకు తెలిసింది. పెద్ద ఎత్తున సాగిన ప్రజాందోళన వల్ల ప్రభుత్వం జస్టిస్ వశిష్ట భార్గవ నాయకత్వాన న్యాయవిచారణ కమిషన్‌ను నియమించింది. ఆ తర్వాత ప్రభుత్వం కుట్రపూరితంగా కమిషన్ పనిచేయలేని స్థితి కల్పించినప్పటికీ గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ కట్టుకథ అని, అది పోలీసులు వుద్దేశపూర్వకంగా చేసిన హత్యాకాండ అని బయటపడింది. గిరాయిపల్లి అమరుల మీద 'నక్సల్‌బరి బిడ్డల' ఒగ్గుకథ, 'లాల్ సలాం', 'వోలీ వోలీల రంగ వోలి', 'సుక్కల్లాంటి సుక్కల్లో' పాటలు రాష్ట్రవ్యాప్తంగా సుప్రసిద్ధమయ్యాయి. ఎమర్జెన్సీ ఎత్తివేసిన నాటి నుంచి 'ఆట పాట మాట బంద్' మొదలయిన 1985-89 నిర్బంధకాండ దాకా సాగిన విస్తృతమైన ప్రజాసంఘాల కార్యకలాపాలలో, పౌరహక్కుల ఉద్యమంలో గిరాయిపల్లి అమరవీరుల గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గిరాయిపల్లి అమరుల స్ఫూర్తి వేలాది మందికి వుత్తేజాన్ని ప్రేరణనూ అందించింది.

ఆ నలుగురు అమరవీరులలో నాయకుడు సూరపనేని జనార్దన్ (1950-1975) భారత పీడిత ప్రజా ఉద్యమపు విలువైన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న యోధుడు. ఇరవై ఐదేళ్ల వయసుకే వీరోచితమైన చరిత్రను నిర్మించి అమరుడయ్యాడు. రీజనల్ ఇంజనీరింగ్ కాలేజిలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, అభివృద్ధి చేశాడు. రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడడంలో కీలకపాత్ర పోషించాడు. విద్యార్థి రంగం నుంచి రైతాంగ ఉద్యమ నిర్మాణానికి తరలివెళ్లిన మెదక్ జిల్లాలో తొలి విప్లవోద్యమ బీజాలు నాటాడు. దొంగ ఎదురుకాల్పులలో మరణించినా, ఎందరెందరికో ప్రేరణగా నిలిచి చరిత్ర నిర్మాణంలో భాగమయ్యాడు. విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా, గెరిల్లా దళ నాయకుడిగా జనార్దన్ కృషి నాలుగేళ్లలోపే అయినా ఆయన అందించిన స్ఫూర్తి చాల విశాలమైనది. ఎమర్జెన్సీలో హత్యకు గురైన కేరళ కాలికట్ రీజనల్ ఇంజనీరింగ్ విద్యార్థి రాజన్ గాథ, రాజన్ హంతకులకు తగిన శిక్ష పడాలని తండ్రి ఈచర వారియర్ చేసిన ప్రయత్నాలు దేశవ్యాప్తంగా ప్రచారమైనప్పుడు జనార్దన్ గాథ కూడ దానితో సమానంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాడికల్ విద్యార్థి సంఘం నిర్మాణానికి ముందు సాగిన విద్యార్థి వుద్యమ నిర్మాణ కృషిలో జనార్దన్ పాత్ర వల్ల రాడికల్ విద్యార్థి యువజన సంఘాల కార్యకలాపాలలో జనార్దన్ నిత్యం స్మరించుకునే సజీవ స్మృతి అయ్యాడు.

జనార్దన్ జీవితం, కృషి, స్ఫూర్తిని ఈ తరానికి తెలియజేసే లక్ష్యంతో బాల్యం నుంచి బూటకపు ఎన్‌కౌంటర్ దాకా ఆయనతో సన్నిహితంగా మెలిగిన, పరిచితులైన స్నేహితుల నుంచి, ఆయన గురించి సమాచారం అచ్చయిన పుస్తకాల నుంచి, పత్రికల నుంచి

➔

# కామ్రేడ్ చింతల వెంకట స్వామి సంస్మరణ సభ



గుంటూరు జిల్లా వుద్యమం నుండి ఉద్భవించిన కామ్రేడ్ చింతల వెంకట స్వామి (సూర్యం) అంచెలంచెలుగా ఎదుగుతూ నాటి పీపుల్స్‌వార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రెటేరియట్ సభ్యుడయ్యాడు. తిరుపతిలో మహిళా వుద్యమ నిర్మాణ కృషి చేస్తుండిన కేంద్ర ఆర్గనైజర్ కామ్రేడ్ పద్మతో పాటు కామ్రేడ్ చింతల వెంకట స్వామి 1994 సెప్టెంబర్ 24న పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

కామ్రేడ్ చింతల వెంకటస్వామి ఒక పేద కుటుంబంలో పుట్టి, కార్మికుడిగా పని చేస్తూ విప్లవోద్యమంవైపు ఆకర్షించబడ్డాడు. దోపిడీ వర్గాలతో పోరాడుతూ, ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టాడు. ఈ క్రమంలో అరెస్టయి1990 మార్చిలో విడుదలయి తిరిగి వుద్యమంలో మమేకమయ్యాడు. అదే సంవత్సరం మేలో జరిగిన చారిత్రాత్మక వరంగల్ రైతుకూలీ సభల నిర్వహణకై ఐదుగురితో ఏర్పడిన సన్నాహక కమిటీకి కార్యదర్శిగా వుండి సభలను విజయవంతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. ఆ తర్వాత దక్షిణ కోస్తా రీజనల్ కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. వుద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆయన అందరి అభిమానాన్ని విశేషంగా చూరగొని ప్రజల్లోనూ, పార్టీ శ్రేణుల్లోనూ చెరిగిపోని ముద్రవేశాడు.

ఆయన సంస్మరణలో సెప్టెంబర్ 29న గుంటూరులోని అంబేద్కర్ భవన్‌లో సభ జరిగింది. విప్లవాభిమానులు ఎందరో ఈ సభకు హాజరయి ఆయనకు ప్రగాఢ నివాళిని అర్పించారు. ఆయన జ్ఞాపకాలను పంచుకున్నారు. చింతల మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆర్.డి.ఎఫ్ అధ్యక్షులు కామ్రేడ్ వరవరరావు 'నేటి సామాజిక పరిస్థితులు – కార్మికవర్గ రాజ్యాధికారం' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ★

➔

సేకరించిన వివరాలతో "జనహృదయం జనార్దన్" పుస్తకం తయారయింది. జనార్దన్ సహచరులను, మిత్రులను, పరిచయస్తులను కలిసి నాలుగు దశాబ్దాల వెనుకటి జ్ఞాపకాలను తవ్వి తీసి జనార్దన్ జీవితాన్ని, ఆచరణను పునర్నిర్మించడానికి జరిగిన ప్రయత్నం ఈ పుస్తకం. జనార్దన్‌ను వ్యక్తిగతంగా పరిచయం చేయడం మాత్రమే కాదు, ఆయన జీవితాన్నీ, కృషినీ, స్ఫూర్తినీ చారిత్రక, సామాజిక, రాజకీయ నేపథ్యంలో పొందుపరచి ఆ స్మృతిని నిరంతరం కొనసాగించడానికే ఈ పుస్తకం. జనార్దన్ వ్యక్తి కాదనీ, 1970ల తొలిరోజుల్లో విప్లవ రాజకీయాలతో ప్రభావితమైన ఆయన లాంటి వేలాది మంది విద్యార్థి యువజనుల శక్తికి ఆయన ఒక సంకేతమని, మరణానంతరం కూడ ఆయన స్ఫూర్తి ఆరిపోని నిప్పుకణికలా జ్వలిస్తున్నదనీ చూపడానికే ఈ పుస్తకం. జనార్దన్‌ను ప్రజా ఉద్యమంలోకి ఉరికించి, ప్రాణత్యాగం చేయడానికి కూడ ప్రేరేపించినటువంటి సామాజిక, రాజకీయార్థిక పరిస్థితులే, లేదా అంతకన్న దిగజారిన పరిస్థితులే నెలకొని వున్న వర్తమానంలో జనార్దన్ జీవితాన్ని మళ్లీ ఒకసారి గుర్తు చేసి విద్యార్థి యువజనులకు ఆయన స్ఫూర్తిని అందించడం కోసమే ఈ పుస్తకం, ఈ పుస్తకావిష్కరణ, సంస్మరణ సభ. జనార్దన్ జీవిత, పోరాట గాథను అక్షరబద్ధం చేసిన "జన హృదయం జనార్దన్" పుస్తకాన్ని గిరాయిపల్లి స్మృతి దినం సందర్భంగా ఆవిష్కరించుకుందాం రండి. గిరాయిపల్లి అమరవీరులను సంస్మరించుకుందాం రండి. అందరూ ఆహ్వానితులే.

**హైదరాబాద్,**
**జూలై 15, 2012**

**సూరపనేని జనార్దన్ రావు మెమోరియల్ ట్రస్ట్**
**జనార్దన్ మిత్రులు**

*జూలై 25న 'జనార్దన్ మిత్రులు' ఆధ్వర్యంలో కామ్రేడ్ జనార్దన్ సంస్మరణ సభ విజయవంతంగా జరిగింది. ఈ సభలో పలువురు వక్తలు కామ్రేడ్ జనార్దన్‌తో తమ అనుబంధాన్నీ, స్మృతులనూ, ఆయన నెలకొల్పిన ఆదర్శాలనూ, నడిపిన పోరాటాలనూ, నేటికీ కొనసాగుతున్న ఆ పోరాట వారసత్వాన్నీ తలుచుకున్నారు.*

*(వెనుక పేజీ తరువాయి...)*

పోలీసు అధికారి, మరో నలుగురు జవాన్లు గాయపడ్డారు. బీహార్‌లోని గయ జిల్లా బాల్‌థోర్, దుమరియా అడవుల్లో ఒకే రోజు సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలపై పిఎల్‌జిఏ సాగించిన సమరాలలో ముగ్గురు సిఆర్‌పిఎఫ్ పోలీసులు చావగా, 15 మంది గాయపడ్డారు.

ఏఓబిలో డైక్ ట్రీ ఆంబుష్ (చిత్రకొండ-బలిమెల రోడ్డు)లో బిఎస్ఎఫ్ కమాండెంట్, వుప కమాండెంట్, సిఐ, ఎస్ఐలు మరణించగా, ఇద్దరు బిఎస్ఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. అలంగపాడ బూబీట్రాప్ (కోరాపుట్) పేలుడులో ఇద్దరు ఓఎస్ఎఫ్ పోలీసులు మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఒడిశాలో బదరపంగ ఆంబుష్ (కంధమాల్)లో ముగ్గురు పోలీసులు చావగా, ముగ్గురు గాయపడ్డారు. ఉత్తర తెలంగాణలో ఒక నైట్ ఆంబుష్‌లో ఇద్దరు పోలీసులు గాయపడగా, మరో రెండు చర్యలలో ఇద్దరు ముఖ్యమైన ఇన్‌ఫార్మర్లు ఖతమయ్యారు.

వీటితో పాటుగా వివిధ గెరిల్లాజోన్లలో జరిగిన అనేక సింగిల్ యాక్షన్లు, ఇతర యుద్ధచర్యలలో ప్రజాకంటకులైన కృష్ణ చంద్ర రాత్ (ఎస్ఐ, మల్కన్‌గిరి), కృపారాం మాంఝీ (ఏఎస్ఐ, నువాపాడ), దిలీప్ కుమార్ సిన్హా (ఏఎస్ఐ, కాంకేర్), అప్పన్న (ఎస్ఐబి హెడ్ కానిస్టేబుల్, విశాఖ) వంటి పోలీసు అధికారులు, పోలీసులు, అసిస్టెంట్ పోలీసులు(ఎస్‌పిఓ), హోంగార్డులు ఖతమయ్యారు. ఇవేకాక పిఎల్‌జిఏ బలగాలు శత్రువును చికాకుపరిచే అనేక చర్యలకు పాల్పడ్డాయి. ఈ విధంగా మొత్తం ఈ సంవత్సర కాలంలో పిఎల్‌జిఏ నిర్వహించిన దాడుల్లో ఇప్పటి వరకూ వంద మంది (బిజెలో 26 మంది, డికెలో 57 మంది, ఏఓబిలో 11 మంది, ఒడిశాలో నలుగురు) పోలీసులు మరణించగా, 170 మంది (బిజెలో 69 మంది, డికెలో 82 మంది, ఏఓబిలో 11 మంది, ఒడిశాలో ముగ్గురు)కి పైగా గాయపడ్డారు. వారి వద్ద నుంచి 26 ఆయుధాలను పిఎల్‌జిఏ హస్తగతం చేసుకుంది.

ఇతర చర్యలలో బహదూర్‌షా ఆలామ్ (గడ్చిరోలి), అతకంవార్ (గడ్చిరోలి), పవన్ కుమార్ భల్లావి (గడ్చిరోలి), జీవ్‌లాల్ స్వాన్‌సి (పశ్చిమ సింఘ్‌భూం), శశిరామ్ (బొలంగీర్) వంటి రాజకీయ నాయకులు, శిఖా మాంఝీ, రేయం సన్ను, ఏమ్లు లచ్చు, దుంగ సేట్, రాంలాల్, చిన్న గోటాల్ వంటి ప్రజా కంటకులైన సల్వాజుడుం, తంటా ముక్తి సంఘటన్ నాయకులు, గూండాలు, ఇంకా అనేక మంది ఇన్‌ఫార్మర్లు, ప్రజా వ్యతిరేక కాంట్రాక్టర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఇతరులు మట్టిగరిచారు. దండకారణ్యంలో కొండగావ్ జిల్లా కేంద్రంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మంత్రి ఇంటిపై పిఎల్‌జిఏ యాక్షన్ టీం వీరోచితంగా దాడి చేసి ఒక సెక్యూరిటీ గార్డును ఖతం చేసింది. ఏఓబిలో ఎంఎల్ఏ జిన్నా హికాక, దండకారణ్యంలో జిల్లా కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌లను పిఎల్‌జిఏ బలగాలు బందీలుగా పట్టుకోవడం ద్వారా, వందలాది మంది సాధారణ ఆదివాసీలను జైళ్లల్లో కుక్కుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుటిల విధానాల్ని ఎండగట్టాయి.

దేశవ్యాప్తంగా వివిధ గెరిల్లాజోన్లలో నిరంతరాయంగా జరిగిన పిఎల్‌జిఏ గెరిల్లా చర్యల వల్ల శత్రువు మరిన్ని బలగాలను గెరిల్లా జోన్ ప్రాంతాల్లో మోహరించాల్సిన స్థితికి, తన బలగాలను విశాల ప్రాంతాలలో వికేంద్రీకరించాల్సిన స్థితికి నెట్టబడ్డాడు. ఫలితంగా ఒక మేరకు శత్రుదాడిని నిలువరించడంలో పీఎల్‌జీఏ విజయం సాధించింది.

అయితే శత్రు బహుముఖ దాడి మరింతగా పెరుగుతున్నది. దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమాలను, జాతి విముక్తి పోరాటాలను, ప్రజాస్వామిక ఉద్యమాలను, నిర్వాసిత సమస్యపై బద్దలవుతున్న పోరాటాలను అణచడానికి అమెరికా రూపొందించిన ఎల్.ఐ.సి. విధానాన్ని భారత పాలకవర్గాలు అమలు చేస్తున్నాయి. నేడు కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్ హంట్ రెండవ దశలో 2017 నాటికి మావోయిస్టు పార్టీని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ఈ అణచివేత చర్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

ఇందులో భాగంగా ప్రజలను ఊచకోతలు కోయడాన్ని, విప్లవ నాయకులను, కార్యకర్తలను పట్టుకొని అమానవీయంగా చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడాన్ని ఒక విధానంగానే పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి.

ఇటువంటి ఊచకోతలే కాక వుద్యమ అణచివేతకు పాలకవర్గాలు ఎన్నో పథకాలను పన్నుతున్నాయి. మావోయిస్టులను, 'టెర్రరిస్టులను' ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్.సి.టి.సి. (నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్)ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నది. పెద్ద ఎత్తున పోలీసు, సైనిక రిక్రూట్‌మెంట్ల ద్వారా సైనిక శక్తిని పెంచుకుంటున్నాయి. కార్పెట్ సెక్యూరిటి వ్యవస్థను పటిష్టపర్చుకుంటూ విస్తరింపజేస్తున్నాయి. సైన్యాన్ని దింపడం, వాయుసేన దాడులకు అవసరమైన మౌలిక సదుపాయాల్ని ఏర్పాటుచేస్తున్నాయి. విప్లవోద్యమ వ్యూహాత్మక ప్రాంతాలపై, లోతట్టు ప్రాంతాలపై గత సంవత్సరం మధ్య భాగం నుండి దాడుల్ని తీవ్రతరం చేశాయి. ఈ దాడుల్లో బెటాలియన్, బ్రిగేడ్ స్థాయి బలగాలు పాల్గొన్నాయి. ఈ దాడులన్నీ పారామిలటరీ, రాష్ట్ర పోలీసు, కోబ్రా కమాండో, రాష్ట్ర కమాండో బలగాలు, ఎస్‌పిఓ/ సహాయక్ పోలీసులు కలిసి ఉమ్మడిగా చేపట్టిన ఆపరేషన్స్‌లో భాగంగా జరిగాయి. ఈ ఆపరేషన్స్‌లో చాలా మేరకు బలగాల తరలింపు కోసం విస్తృతంగా హెలికాప్టర్లను ఉపయోగించారు. గెరిల్లా బలగాల్ని గుర్తించడం కోసం యుఏవిలను వుపయోగించారు. రాకెట్ లాంచర్లను, ఆండ్రాయిడ్, జిపిఎస్ లాంటి నేవిగేషన్ సిస్టమ్ కలిగిన కమ్యూనికేషన్ పరికరాలను (మొబైల్ ఫోన్స్ వగైరా) వుపయోగించారు. వీటన్నింటి పథక రచనలో, ఫీల్డులో

ఉండి ఆపరేషన్స్‌ను గైడ్ చేయడంలో భారత సైనిక అధికారులు, కేంద్ర, రాష్ట్ర డిజిపి, ఐజి స్థాయి పోలీసు అధికారులు పాల్గొన్నారు. గెరిల్లా యుద్ధ నిర్వహణలో గెరిల్లా బలగాలకు అనేక ఆటంకాలు, ప్రతికూలతలు కల్పించి, వారి పోరాట సామర్థ్యాన్ని దెబ్బతీసి ఓటమి పాల్జేసే లక్ష్యంతో ఈ ఆపరేషన్స్ నడుపుతున్నారు.

డ్రోన్ (యుఏవి) దాడుల కోసం సన్నాహాల్ని వేగవంతం చేస్తూ, ఫీల్డులో ఉన్న నాయకత్వాన్ని నిర్మూలించడంపై కేంద్రీకరిస్తున్నారు. విప్లవ శిబిరాన్ని చీలదీసి, దోపిడి వర్గాల సామాజిక పునాదిని పెంచుకునే సంస్కరణల్ని తీవ్రతరం చేస్తున్నారు. నక్సల్ ప్రభావిత 82 జిల్లాల్లో సమగ్ర కార్యాచరణ పథకం (ఇంటిగ్రేటెడ్ ఆక్షన్ ప్లాన్-ఐఏపి) పేరుతో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మన్‌రేగా), ఇందిరా ఆవాస్ యోజన, అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006), పేసా చట్టం అమలు వంటి వివిధ రకాల 'అభివృద్ధి', సంక్షేమ పథకాల అమలును తీవ్రతరం చేస్తున్నారు. ఈ పథకాలకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక నిధుల్ని కేటాయిస్తున్నది. సరండా ప్రాంతంలో సరండా డెవలప్ అథారిటీని ఏర్పాటు చేశారు. ప్రజల్ని బూటకపు అభివృద్ధి, భద్రత, రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయడం ద్వారా మావోయిస్టులను ఓడించవచ్చునని దీనిని ఒక నమూనాగా చూపుతున్నారు.

అన్ని రకాల పోలీసు, పారామిలటరీ బలగాలు సివిక్ యాక్షన్ ప్రోగ్రాములను, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్‌లను చేపడుతున్నాయి. వేరు వేరు పేర్లతో గ్రామ రక్షణ దళాలను ఏర్పాటు చేస్తున్నారు.

వీటన్నింటి ద్వారా రాజకీయ నాయకుల, అధికారుల, కాంట్రాక్టర్ల, తెగ పెద్దల/పెత్తందార్ల, ధనిక, మధ్యతరగతి రైతాంగంలోని ఒక సెక్షన్‌కు ఆర్థిక లాభాలు చేకూర్చి వారిని తమకు సామాజిక పునాదిగా ఉపయోగించుకుంటున్నారు.

శత్రువు మానసిక యుద్ధాన్ని కూడా తీవ్రతరం చేస్తున్నాడు. సోషలిజం-కమ్యూనిజానికి కాలం చెల్లిందని, అది విజయం సాధించలేదని, ఐదు, లేదంటే పది సంవత్సరాల్లో విప్లవోద్యమాన్ని పూర్తిగా దెబ్బతీస్తామని, పార్టీలో విభేదాలున్నాయని... ఇంకా రకరకాలుగా ప్రచారం చేస్తున్నాడు. పార్టీ, పిఎల్‌జిఏలో ఆదివాసీ-గైరాదివాసీ విభజనను తీసుకరావడానికీ, తెలుగు-కోయ-ఒడియా విభజనను తీసుకరావడానికి, సవ్యసాచి పండా వంటి విచ్ఛిన్నకులను ప్రోత్సహిస్తూ ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో, శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ కుటిల దాడిని ఓడించే లక్ష్యంతో పీఎల్‌జీఏ దృఢంగా ముందుకు సాగాల్సి వుంటుంది.

ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం మరింత లోతుల్లోకి విస్తరిస్తూ ఎడతెగకుండా కొనసాగుతున్నది. సామ్రాజ్యవాద నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా గత సంవత్సర కాలంగా యూరప్‌లోని అనేక దేశాల్లో కార్మికులు, యువతరం, మహిళలు, మధ్యతరగతి ప్రజానీకం ఆందోళనలు చేస్తున్నారు. కార్మికవర్గ పార్టీలు, ప్రగతిశీల ప్రజా సంస్థలు తిరిగి బలం పుంజుకుంటున్నాయి. చైనాలో నిరుద్యోగం, భూమిలేమి, అవినీతికి వ్యతిరేకంగా చైనా దేశ గర్భంలోనే రెక్కవిప్పుతున్న మావోయిస్టు శక్తులు దేశంలో తిరిగి సోషలిస్టు వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఈ అనుకూల పరిస్థితిని ఉపయోగించుకొని 'ప్రజాయుద్ధం ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలి' అనే సందేశాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. నిశ్చయాత్మకమైన రాజకీయ పోరాటాలు సాగించకుండా పీడిత ప్రజలు, జాతులు తమ ప్రయోజనాలు సాధించడం సాధ్యం కాదని చాటిచెప్పాలి. చేతికి అందిన ఆయుధంతో ప్రతిఘటించాలనీ, ప్రతిఘటించకుండా బతకలేమనే చైతన్యాన్ని ప్రజలలో కలిగించాలి. ప్రజా ప్రతిఘటనను లాఠీచార్జిల ద్వారా, కాల్పుల ద్వారా అరికట్టాలనే శత్రువు క్రూరమైన విధానానికి మిలిటెంట్ ప్రజా ప్రతిఘటనే సరియైన జవాబు. మిలిటెంట్‌గా కదులుతున్న ప్రజల నుంచి ప్రజా మిలీషియాను పెద్దయెత్తున సంఘటితం చేసి, పెద్దయెత్తున దాడిచేసే శత్రు మూకలను కందిరీగల్లా వెంటాడి తరిమికొట్టేలా చేయాలి.

ప్రస్తుతం విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు కాలాన్ని అధిగమించడానికీ, పెంపొందుతున్న అనుకూల స్థితిని పూర్తిగా వినియోగించుకోవడానికీ పార్టీ, పిఎల్‌జిఏల్లోని అన్యవర్గ ధోరణులను వదిలించుకోవాలి. ప్రజా సంబంధాల్లోని లోపాలను సరిదిద్దుకుంటూ ప్రజలతో ఆత్మీయ సంబంధాలు పెంచుకుంటూ, బలమైన ప్రజాపునాదిని పెంచుకోవాలి. నాయకత్వ నష్టాలను నివారించుకుంటూ, ప్రజా పునాదిని పెంచుకుంటూ శత్రు దాడిని ఎదిరిస్తూ అజేయంగా పురోగమించడమే నేటి రాజకీయ పరిస్థితుల్లో పార్టీ, పీఎల్‌జీఏల ముందున్న కర్తవ్యం. మొక్కవోని దృఢ సంకల్పంతో, చెక్కుచెదరని ఆత్మ నిబ్బరంతో, అసమాన ధైర్యసాహసాలతో విజయ సాధనకు ముందుకు సాగుదాం. అంతిమ విజయం ప్రజలదే!

★

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# 12వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజా విముక్తి గెరిల్లా సేనకు విప్లవ జేజేలు

ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం, అంతర్జాతీయ కార్మికవర్గ సైన్యానికి చెందిన ఒక విభాగంగా, భారత విప్లవ మహోపాధ్యాయులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ చటర్జీల పథ నిర్దేశంలో కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వ దినమైన డిసెంబర్ 2న, ప్రజా విముక్తి గెరిల్లా సేన (పిఎల్‌జిఏ) ఆవిర్భవించింది. 2012 డిసెంబర్ 2 నాటికి పిఎల్‌జీఏకు పన్నెండేళ్లు నిండాయి.

అత్యంత ప్రతీఘాతుక స్వభావం కలిగిన భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి అండతో, మార్గదర్శకత్వంతో, సహాయ సహకారాలతో కొనసాగిస్తున్న దేశవ్యాప్త బహుముఖ దాడి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశ రోజురోజుకూ మరింత భయానకంగా, బీభత్సకరంగా, ప్రజలకు అత్యంత పీడగా మారుతున్నది. ఈ బహుముఖ సైనికదాడి నుండి ప్రజాయుద్ధ విజయాలను కాపాడుకోవడానికి, పార్టీనీ, పీఎల్‌జీఏను, గెరిల్లాజోన్‌లలో మొలకెత్తిన, నిలదొక్కుకుంటున్న నూతన ప్రజాస్వామిక అధికార అంగాల్నీ, గెరిల్లా బేసులను అభివృద్ధి చేయడానికీ, విస్తరింపజేయడానికీ, నూతన ప్రాంతాలకు గెరిల్లా యుద్ధాన్ని విస్తరింపజేయడానికీ జరుగుతున్న కృషిలో పీఎల్‌జీఏ భాగస్వామ్యం కీలకమైనది. ఈ క్రమంలో ఎందరో పార్టీ, పిఎల్‌జీఏ యోధులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పిస్తూ మన దేశ విప్లవ చరిత్రను మరింత త్యాగభరితం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ అమరవీరులందరికీ వినమ్రంగా నివాళులు అర్పిద్దాం. వారి ఆశయ సాధనలో పీఎల్‌జీఏను మరింతగా పురోగమింపజేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

ఈ సంవత్సరం వివిధ గెరిల్లాజోన్లలో పిఎల్‌జిఏ చేపట్టిన వివిధ ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లు, ప్రతిఘటనా చర్యలలో పాక్షికంగానే విజయం సాధించినప్పటికీ అది నిర్వహించిన చిన్న, మధ్య రకం, రెండు పెద్ద సైనిక చర్యలు రాజకీయంగా మంచి ప్రభావాన్ని వేశాయి.

దండకారణ్యంలోని చింతల్‌నార్ దహనకాండపై జరిగే సిబిఐ విచారణను తారుమారు చేసేందుకు జరుగుతున్న కుట్రల్ని బహిర్గతం చేయడం కోసం, ఆ బూటకపు విచారణను అడ్డుకోవడం కోసం కోయ కమాండో కమాండర్లు కర్తం సూర్య, కిచ్చ నందల వాహనంపై గొర్‌గొండ వద్ద పీఎల్‌జీఏ చేసిన ఆంబుష్ (సుక్మా)ల్లో సూర్య అక్కడే చావగా కిచ్చ నంద, ఏఎస్‌పి మడావిలు తీవ్రంగా గాయపడ్డారు. పుస్‌టోలా వద్ద సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాల కాన్వాయ్‌పై నిర్వహించిన సాహసోపేత భారీ ఆంబుష్ (గడ్చిరోలి)లో 13 మంది కోబ్రా కమాండోలు మరణించగా, 27 మంది గాయపడ్డారు. ఇర్పగుట్ట ఆంబుష్ (కాంకేర్)లో నలుగురు బిఎస్‌ఎఫ్ జవాన్లు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. కిరందుల్ నైట్ ఆంబుష్ (దంతేవాడ)లో ఆరుగురు సిఐఎస్‌ఎఫ్ జవాన్లు మరణించారు. దక్షిణ బస్తర్ డివిజన్‌లో పెద్ద కేడ్వాల్, చిన్న కేడ్వాల్ గ్రామాలను ధ్వంసం చేసే లక్ష్యంతో జరిగిన శత్రు ఏరియల్ ఆపరేషన్‌ను పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా బలగాలు వీరోచిత ప్రతిఘటన ద్వారా విఫలం చేశాయి. బిజెపి ఎంఎల్ఏ మహేష్ గాగ్ర, బీజాపూర్ జిల్లా కలెక్టర్‌ల కాన్వాయ్‌పై చేసిన సాహసోపేతమైన ఆంబుష్, ఐచేలి ఆంబుష్ (దంతెవాడ), కాంగేర్‌ఘాటీ ఆంబుష్ (దంతెవాడ)లు శత్రువును కలవరపరిచాయి.

ఝార్ఖండ్‌లో బరగఢ్ వద్ద మైన్‌ప్రూఫ్ వాహనంపై జరిగిన వీరోచితమైన ఆంబుష్ (గఢవా)లో 13 మంది పోలీసులు మరణించగా, ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఖరంజి టుంగీ ఆంబుష్ (లాతేహార్)లో ఏఎస్‌ఐతో సహా ముగ్గురు పోలీసులు మరణించారు. లభర్ అటవీ ప్రాంతంలో శత్రు హెలికాప్టర్‌పై పిఎల్‌జిఏ సాహసోపేతంగా చేసిన దాడి (లాతేహార్)లో ఇద్దరు కోబ్రా కమాండోలు మరణించారు. ఛమో సాన్యా ఆంబుష్ (గఢవా)లో ఏడుగురు పోలీసులు గాయపడ్డారు తోప్‌చాచి ఆంబుష్ (ధన్‌బాద్)లో మినీ బస్సులో వెళుతున్న ఒక పోలీసు మరణించగా, 12 మంది గాయపడ్డారు. ఎన్‌హెచ్-2పై ఆంబుష్ (లాతేహార్)లో ఒక పోలీసు మరణించగా, 15 మంది గాయపడ్డారు. బొకొబ్ ఆంబుష్ (పశ్చిమ సింఘ్‌భూమ్)లో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లు చావగా, ఒక

***(మిగతాది 54వ పేజీలో...)***